సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16

సంచిక: 20

బుధవారం 12-4-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'



నవ స్వరాలు

తొమ్మిది మంది అమ్మాయిలు.
త్రిపుర నుంచి బ్యాండ్‌గా ఏర్పడ్డారు.
'మేఘబాలిక' పేరుతో
నవ స్వరాలు వినిపిస్తున్నారు.
మీరూ వినండి...

-IIలో


కేశిరాజు విజయ కుమారి

"డిజిటల్ యుగంలో లెక్కలు చేయడం సులువైంది.
స్మార్ట్ ఫోన్ ఉంటే చేతిలో కంప్యూటర్ ఉన్నట్లే.
ఈ విజ్ఞాన పరిణామం ఎటు దారి తీసిందో తెలుసా?
ఏడెనిమిదులు ఎంతో చెప్పలేకపోతున్న తరం తయారైంది.
అవన్నీ గుర్తు పెట్టుకోవడం తన పని కాదనుకుంటోంది మెదడు.
కాలిక్యులేటర్ ఉండగా తనకెందుకు శ్రమ అని విశ్రాంతిలోకి వెళ్తోంది.
కాలిక్యులేటర్ ఉండాల్సింది చేతిలో కాదు... తలలో. నిజమే!
కాలిక్యులేటర్ బుర్రలో ఉండాలి... ఎక్కాలు నాలుక మీద నాట్యం చేయాలి."
అని... పిల్లలకు ఎక్కాలు నేర్పించడానికి ముందుకొచ్చారు కేశిరాజు విజయ కుమారి.

● ఎక్కాల ఉద్యమం!

19 x 7 = ?

పశ్చిమగోదావరి జిల్లాలో ఓ చిన్న గ్రామం కవిటం. థింక్ బిగ్ అని ఏపీజే అబ్దుల్ కలామ్ చెప్పగా ఆమె వినలేదు. కానీ తనకు తానుగా పెద్ద కలనే కన్నారు. ఐఏఎస్ కావాలనే కల నెరవేరకపోవడానికి ఒకటి కాదు రెండు కాదు కుటుంబ రీత్యా అనేక కారణాలు. అడ్డంకులు ఐఏఎస్ కాకుండా ఆపగలిగాయి, కానీ సమాజానికి సేవ చేయడానికి కాదు కదా అనుకున్నారామె. తన ఎదురుగా కనిపించిన ప్రతి సమస్యకూ పరిష్కారాన్ని వెతుకుతూ, పరిష్కరించే వరకు విశ్రమించకుండా శ్రమించారు. బాల్యంలోనే నాన్న పోవడం, పిల్లల పెంపకం బాధ్యతను మోస్తూ అమ్మ భుజాలు అరిగిపోవడం చూస్తూ పెరిగారామె. అంతేకాదు... తొలి ఉద్యోగం ఒక ఎన్‌జీవోలో టీచర్‌గా. దాంతో ఆ తర్వాత కూడా ఆమె అడుగులు సర్వీస్ వైపుగానే సాగాయి. దశాబ్దాలపాటు మహిళల కోసమే సేవలందించారామె. ఈ ప్రయాణంలో ఆమెకో కొత్త సంగతి తెలిసింది. డిగ్రీ చదువుకున్న వాళ్లకు కూడా ఎక్కాలు రావడం లేదు. నేర్చుకుని మర్చిపోయారా అంటే... అదీ కాదు. బడి గడప తొక్కని, అక్షరాలు నేర్వని బాల్యం ఉంటుంది. కానీ బడికి వెళ్లి అక్షరాలు నేర్చుకుని ఎక్కాలు నేర్వని బాల్యం ఉంటుందని ఊహించలేదామె. మరింత క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత తెలిసిందేమిటంటే... నేటి బాల్యానికి ఎక్కాలు నేర్చుకోవడం టైమ్ వేస్ట్ పనిగా ఉంటోందని. కాలిక్యులేటర్ లేకుండా వందలో నాలుగోవంతు ఎంత అంటే చెప్పడం చేతకావడం లేదని. ఇన్ని తెలిసిన తర్వాత ప్రాథమిక పాఠశాలలకు వెళ్లి ఎక్కాల పుస్తకాలు పంచుతున్నారు. ఒకటి రెండు నెలల పాటు వాళ్లకు నేర్చుకునే టైమ్ ఇచ్చి ఆ తర్వాత పోటీలు పెడుతున్నారు. ప్రతి క్లాసులో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు పాల్గొన్న వాళ్లకు కూడా ప్రోత్సాహకాలిస్తున్నారు. రకరకాలుగా సాగిన తన సామాజిక ప్రస్థానాన్ని ఆమె సాక్షితో పంచుకున్నారు.

ఆడపిల్ల పుట్టాలి... చదవాలి!

"మా వారి ఉద్యోగరీత్యా రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో ఎక్కువ కాలం ఉన్నాను. పెళ్లికి ముందు చదువు చెప్పిన అలవాటు ఉండడంతో అక్కడ ఖాళీగా ఉండలేకపోయేదాన్ని. పైగా మేము నార్త్‌లో ఉన్న రోజుల్లో అక్కడి మహిళలు దాదాపుగా నిరక్షరాస్యులే. నేనిక్కడ చదివింది సెకండ్ లాంగ్వేజ్ హిందీ మాత్రమే. కానీ అక్షరాలు, వాక్యాలు నేర్పించడానికి సరిపోయేది. వాళ్లకు నేర్పిస్తూ నేను హిందీ మాట్లాడడం నేర్చుకున్నాను. భాష మీద పట్టు రావడంతో వాళ్లకు కౌన్సెలింగ్ ఇవ్వడం సులువైంది. ఘూంఘట్ చాటున, అత్తింటి నియమాల మాటున జీవించడమే వాళ్లకు తెలిసింది. కడుపులో ఉన్నది ఆడపిల్ల అయితే బిడ్డను కనకూడదని, గర్భస్రావం చేయించుకోవాలని నూరిపోసింది అక్కడి సమాజం. యువతులు కూడా అదే నిజమనే విశ్వాసంతో ఉండేవాళ్లు. స్త్రీ లేని సమాజం ఎలా మనుగడ సాగిస్తుందో చెప్పమని, దక్షిణాదిలో ఆడపిల్ల పుడితే లక్ష్మీదేవి పుట్టినట్లు భావిస్తారని వాళ్లకు నచ్చచెప్తుంటే... 'ఇద్దరు మగపిల్లలున్న తల్లి ఆమె ఏ మాటైనా చెబుతుంది. ఆడపిల్లకు కట్నాలిచ్చేది ఎవరు' అని అక్కడి మగవాళ్లలో నా మీద వ్యతిరేకత పెల్లుబుకుతుండేది. నాది నిశ్శబ్ద ఉద్యమం కాబట్టి నా మీద దాడులు జరగలేదు. ఇంటి ముందు మురుగు కాలువ ఓపెన్ డ్రైనేజ్‌లో పిల్లలు పడుతుంటారు కూడా. పరిశుభ్రత లేమిని, ఇలాంటి సమస్యలను ప్రశ్నిస్తూ, మహిళలను కలుపుకుని స్థానిక మున్సిపల్ ఆఫీసులకు వెళ్లేదాన్ని. రోడ్డు శుభ్రం చేసిన తర్వాత ఆ కాలనీలో నివసించే ఆడవాళ్ల చేత సంతకం చేయించుకునే నియమం పెట్టారు మున్సిపల్ కమిషనర్.

నేర్చుకోవడానికి వయసు పరిమితి ఎందుకు!

నా ఉద్దేశం ఒక్కటే. 'మహిళ కుటుంబ భారాన్ని మోయాల్సి వస్తే... ఆ క్షణంలో బెంబేలెత్తిపోకూడదు. ప్రతి ఒక్కరి చేతిలో ఏదో ఒక పని ఉండాలి. ఆర్థిక స్వావలంబన సాధించాలి'... అని. హైదరాబాద్‌కి వచ్చిన తర్వాత ఇక్కడి మహిళల కోసం స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్ అనేకం చేశాను. గవర్నమెంట్ ప్రోగ్రామ్స్‌లో వయో పరిమితి ఉంటుంది. అందులో ఇమడని వాళ్లు 'మాకూ నేర్చుకోవాలని ఉంది' అంటే ఏమీ చేయలేని నిస్సహాయ స్థితి నాది. అలాంటి వాళ్ల కోసం కేవీఎస్ ఫౌండేషన్ స్థాపించి ఉచితంగా శిక్షణ ఇవ్వడం మొదలుపెట్టాను. శిక్షణ కార్యక్రమాలు, ఎగ్జిబిషన్‌లు 2006 నుంచి నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. శిక్షణ కార్యక్రమాల నుంచి పుట్టుకు వచ్చిన అవసరమే ఈ ఎక్కాల ఉద్యమం" అన్నారు విజయకుమారి.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి
ఫొటోలు : అనిల్ కుమార్ మోర్ల

రెండవ తరగతి... ఇరవై ఎక్కాలు



టైలరింగ్ నేర్పించేటప్పుడు నడుము చుట్టు కొలతలో నాలుగో వంతు మార్క్ చేయమంటే చాలామందికి తెలిసేది కాదు. దాంతో ముందు లెక్కలు నేర్పించాల్సి వచ్చేది. ఏదో సందేహం వచ్చి హైదరాబాద్‌లోని మా అపార్ట్‌మెంట్ పిల్లలను అడిగాను. ఎక్కాలు చదవడం ఏంటన్నట్లు చూశారు. అపార్ట్‌మెంట్‌లో ఎక్కాల పోటీలు పెట్టాను. పాల్గొనడానికే సిగ్గుపడుతున్నారు కొందరు. స్కూళ్లకు వెళ్లాను. ప్రైవేట్ స్కూళ్లు పెద్దగా స్పందించలేదు. ప్రభుత్వ పాఠశాలలు స్వాగతించాయి. సిటీలో ఇప్పటికి మూడువేల ఎక్కాల పుస్తకాలు పంచాను. ఉప్పరపల్లి, ప్రభుత్వ పాఠశాలలో రెండవ తరగతి పిల్లాడు చాలా త్వరగా ఇరవై ఎక్కాలు నేర్చుకున్నాడు. పిల్లలకు చక్కగా నేర్పిస్తే మెరికల్లా తయారవుతారు. ప్రైవేట్ విద్యారంగం పిల్లలను మార్కుల పోటీలోకి నెట్టేస్తూ, లెక్కలకు పునాది వంటి ఎక్కాలను నిర్లక్ష్యం చేస్తోంది. మహిళలకు స్కిల్ డెవలప్‌మెంట్‌తోపాటు పిల్లలకు ఎక్కాలు నేర్పించే మరో నిశ్శబ్ద ఉద్యమాన్ని చేపట్టాను.

– కేశిరాజు విజయకుమారి,
సామాజిక కార్యకర్త, కేవీఎస్ ఫౌండేషన్


ఆల్ గర్ల్స్ బ్యాండ్

నవ స్వరాలు



**తొమ్మిది మంది అమ్మాయిలు.
త్రిపుర నుంచి బ్యాండ్‌గా ఏర్పడ్డారు.
'మేఘబాలిక' పేరుతో
నవ స్వరాలు వినిపిస్తున్నారు.
మీరూ వినండి...**

త్రిపుర రాజధాని అగర్తలాలో ఈ బృందగానం మూన్ సాహాతో మొదలైంది. ఆమె గిటారిస్ట్. చదువు పూర్తి చేసి పార్ట్‌టైమ్‌లో టైలరింగ్ చేస్తూ ఆ వచ్చిన డబ్బుతో గిటార్ నేర్చుకుంది. కాని తండ్రి దానిని గోడకేసి బాది పగులగొట్టాడు. సంగీతం వద్దు ఏం వద్దు అన్నాడు. పెళ్లి చేసుకో అన్నాడు. అది 2017 సంవత్సరం. మూన్ సాహాకు అప్పుడు 26 ఏళ్లు. మూడు నెలల పాటు మూన్ సాహా కుంగిపోయింది. కాని ధైర్యం పుంజుకుంది. 'సంగీతం కోసం తెగించాల్సిందే' అనుకుంది. అయితే తాను ఒక్కతే కాదు.. ఇలా సంగీతం కోసం అడ్డంకులు ఎదుర్కొంటున్నవారు చాలా మంది ఉంటారు... వారితో కలిసి ముందుకు అడుగు వేద్దామనుకుంది. అలా మొదలైంది.

మొదట ఐదుగురితో...

'నేను సోషల్ మీడియాలో నాలా సంగీతం నేర్చుకున్న అమ్మాయిల కోసం వెతికాను. పాడేవాళ్లు, పాటలు రాసేవాళ్లు, వాయిద్యాలు వాయించేవారు... వీరి కోసం వెతికాను. కొందరితో సంభాషణ కుదిరింది. కొందరు భయపడ్డారు. కొందరు ముందుకొచ్చారు. మొత్తం మీద ఐదుగురితో బ్యాండ్ మొదలయ్యింది. మా బ్యాండ్‌కు మేఘబాలిక అని పేరుపెట్టాను. మేఘాలకు హద్దులు లేనట్టే మాకూ ఉండదు అని నా ఉద్దేశం. 2017లో మేము మొదటిసారి స్టేజ్ మీదకు వచ్చాం. త్రిపురలో మాది తొలి ఆల్ గర్ల్ బ్యాండ్' అని తెలిపింది మూన్ సాహా.

అయితే త్రిపురది చాలా సంప్రదాయిక సమాజం. మగవాళ్ల ఆధిపత్యం పూర్తిగా ఉంటుంది. స్త్రీలు ఇలా సంగీత ప్రదర్శనలు, అదీ మ్యూజిక్ బ్యాండ్‌గా మారి ఇవ్వడం అంతగా ఇష్టపడరు. 'అయినా మేము అన్నీ దాటుకుని నిలబడ్డాం' అంటుంది మూన్ సాహా.

కాలేజీ ప్రోగ్రామ్స్

మేఘబాలిక బ్యాండ్‌ను త్రిపురలోని కాలేజీ విద్యార్థులు మొదట ఆదరించారు. వాళ్ల కాలేజీ ఫంక్షన్‌లకు ఆహ్వానించి తృణమో పణమో అప్పజెప్పేవారు. వీళ్ల తపన గమనించిన అగర్తలాలోని ఓఎన్‌జిసి విభాగం వీరికి డ్రమ్స్ కొనిపెట్టింది.

ఆ తర్వాత రేడియో, దూరదర్శన్ నుంచి ఆహ్వానాలు అందాయి. మెల్లమెల్లగా టీమ్ సభ్యులు 9 మంది అయ్యారు. 'ఇవన్నీ చూసి మా కుటుంబాలు కొంత మెత్తబడ్డాయిగాని ఇప్పటికీ బంధుమిత్రులు మా బ్యాండ్‌ను చూసి సూటిపోటి మాటలు అంటూనే ఉన్నారు. ఆడవాళ్లుగా మీరు ఇదంతా ఎలా చేస్తారు అనేదే వారి అభ్యంతరం' అంటుంది మూన్ సాహా.

కుదిరిన స్వరాలు

ఇప్పుడు మేఘబాలికలో 16 నుంచి 32 ఏళ్ల మధ్య వయసున్న సభ్యులు ఉన్నారు. బెంగాలి ఫోక్, రబీంద్ర సంగీతం, సొంత కంపోజిషన్‌లు పాడతారు. డిమాండ్‌ను బట్టి బాలీవుడ్ పాటలు కూడా ఉంటాయి. అనన్య శంకర్ (గాయని), మెమొన్ దేబనాథ్ (ఫ్లూట్), జ్యోతిశ్రీ (కీబోర్డ్), సోనియా (డ్రమ్స్)... ఇలా వీళ్లంతా పాడేవాళ్లు, వాద్యగత్తెలు అయితే అంకితా రాయ్ అనే అమ్మాయి పాటలు రాసి సొంత నంబర్లు కంపోజ్ చేయడానికి సహకరిస్తోంది. 'ఇప్పుడు మాకు మంచి డబ్బే వస్తోంది. మేము ఎక్కడకు వెళ్లినా ఒకే రకం బట్టలు ధరించగలుగుతున్నాం' అంది అంకిత. ఇటీవల వీరంతా ప్రోగ్రామ్ ఇవ్వడానికి బాగ్‌డోరా నుంచి కోల్‌కటా వెళుతుంటే వీరి బట్టలు చూసిన ఇండిగో ఫ్లయిట్‌లో సిబ్బంది వీరిని పాడమన్నారు. ఆకాశంలో వీరంతా పాడుతూ ఉంటే ఆ వీడియో వైరల్ అయ్యింది.

మ్యూజిక్ ఇన్‌స్టిట్యూట్

ఇప్పుడు మేఘబాలిక ఈశాన్య రాష్ట్రాల్లో పాపులర్ అవుతోంది. అయితే పాడటం ఒక్కటే వీరి లక్ష్యం కాదు. 'మేము అగర్తలాలో ఒక మ్యూజిక్ ఇన్‌స్టిట్యూట్ తెరవాలనుకుంటున్నాం. ఎందరో స్త్రీలు డబ్బు లేక, అడ్డంకుల వల్ల సంగీతం నేర్చుకోలేకపోతున్నారు. వారికి అతి తక్కువ ఖర్చులో సంగీతం నేర్పాలని, వారితో ప్రదర్శనలు ఇవ్వాలని మా లక్ష్యం' అంది మూన్ సాహా.

రిచా వాత్సాయన్



శక్తిని అనుకూలంగా మార్చుకోవాలి

అత్తింటి నుంచి కట్టుబట్టలతో, చేతిలో బిడ్డతో బయటకు వచ్చిన బీహార్‌వాసి రిచా వాత్సాయన్ ఐదేళ్లలో మూడు స్టార్టప్‌లకు సీఈవో అయ్యింది. అరటి నారతో శానిటరీ ప్యాడ్స్ తయారుచేస్తుంది. స్నేహితులు ఇచ్చిన పదివేల రూపాయలతో వ్యాపారం మొదలుపెట్టిన రీచా నేడు సంవత్సరానికి యాభై లక్షల టర్నోవర్ సాధిస్తోంది. వందమందికి ఉద్యోగావకాశాలు ఇచ్చేలా కృషి చేస్తోంది. బీహార్ ప్రభుత్వం నుంచి కేంద్ర ప్రభుత్వం వరకు ప్రశంసలు అందుకుంటోంది.

అరటి నారతో శానిటరీ ప్యాడ్‌లను తయారు చేసే 'శానిట్రస్ట్' కంపెనీ నెలకొల్పింది. బీహార్‌లో ఇలాంటి ప్రాజెక్ట్ ఉన్నది ఇది ఒక్కటే. ఆ వివరాలను తెలుసుకుంటే తప్పకుండా ప్రతి ఒక్కరిలోనూ శక్తి ఉంటుందని అర్థమవుతుంది.

'నేను పాట్నాలో పుట్టి పెరిగాను. మా తాత పాట్నాలో చాలా పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటు చేశారు. పట్నంలో ఆడపిల్లల చదువుకు అంతగా వనరులు లేని ఆ రోజుల్లో మహిళా కాలేజీని ప్రారంభించారు. కానీ, ఇంత జరిగినా మా ఇంట్లో ఆడపిల్లల చదువుకు సంబంధించి ఎలాంటి విలువా లేదు. కుటుంబంలో ఆడపిల్లల ఉన్నత చదువులపై ఎవరూ ఆసక్తి చూపలేదు. మేం ముగ్గురం అక్కచెల్లెళ్లం. డిగ్రీ చదువుతున్న రోజుల్లోనే మా ముగ్గురికీ పెళ్లి అయ్యింది.

చెడు రోజుల నుంచి..

పెళ్లి నా జీవితంలో దుఃఖపు రోజులనే చూపించింది. ప్రతి రోజూ ఒక సవాల్‌గా ఉండేది. ఫైనల్ ఇయర్‌లో ఉన్నప్పుడు పెళ్లయితే, ఆ తర్వాత చదువు అత్తమామల ఇష్టప్రకారమే జరగాలన్నారు. పెద్దలు ఇష్టపడ్డారు కదా అని పెళ్లి చేసుకున్నాను. కానీ, నా భర్త నుంచి ప్రేమను ఎప్పుడూ పొందలేకపోయాను. ఆ ఇంట్లో ఉండటమే కష్టంగా అనిపించేది. ఎనిమిదేళ్లలో నేను చేయాల్సిన అన్ని ప్రయత్నాలు చేసి, విసుగనిపించి బయటకు వచ్చేశాను. 2017లో విడాకులు తీసుకున్నాను. ఎలాంటి ఆసరా లేకుండా ఏడాదిన్నర బిడ్డతో విడిగా జీవించడం మొదలుపెట్టాను.

సాయమిచ్చిన స్నేహితులు

ఒంటరిగా కొన్నాళ్లు బిడ్డతో కలకత్తాలో ఉన్నాను. ఆ రోజులు అత్యంత కష్టమైనవి. ఎలా జీవించాలో అర్థం కాని రోజులవి. హోలీ సందర్భంగా మా అమ్మవాళ్లింటికి వచ్చినప్పుడు నా పూర్వపు స్నేహితులు కలిశారు. వారందరితో నా పరిస్థితి చెప్పాను. 'పెద్దగా చదువు లేదు, ఏడాదిన్నర వయసు కొడుకు. ఉద్యోగం వెతుక్కొని, పిల్లవాడిని ఎవరి దగ్గర విడిచి వెళ్లగలను' అని స్నేహితుల వద్ద బాధపడ్డాను. ఇంటి నుండి వ్యాపారం చేసుకుంటే ఎవరి సపోర్ట్ అవసరం లేదని, నన్ను అనునయించి పెట్టుబడిగా వాళ్లే పదివేల రూపాయలు ఇచ్చారు. ఆ డబ్బుతో ఆన్‌లైన్ బొటీక్ ప్రారంభించాను.

2017లో స్టార్టప్ ఇండియా అనే కాన్సెప్ట్ దేశంలోకి వచ్చింది. ఈ యాప్ గురించి పూర్తిగా తెలుసుకున్నాను. దీనికి సంబంధించిన కోర్సు చేశాను. ఆ సమయంలోనే రుతుక్రమ వ్యర్థాలపై ఒక కథనాన్ని చదివాను. అప్పుడే నాకు బయోడిగ్రేడబుల్ పీరియడ్ ప్యాడ్‌ల ఆలోచన వచ్చింది. ఇంట్లో ఉండే ఆరు నెలల్లో అరటి నారతో ప్యాడ్స్ తయారు చేయడం నేర్చుకున్నాను.

అరటి నారతో ప్యాడ్స్

శానిటరీ ప్యాడ్స్ కారణంగా వచ్చే సమస్యలన్నీ తెలుసుకున్నాను. వాటిని నేనూ ఎదుర్కొంటున్నాను. పరిష్కారం కోసం చాలా పరిశోధనలు చేశాను. దీంట్లో భాగంగానే అరటి నారతో ప్యాడ్ కాన్సెప్ట్ బాగా నచ్చింది. అదే సమయంలో ముగ్గురు ఎన్నారైలు కలిసి గుజరాత్‌లో అరటి నారతో 'సాథీ పీరియడ్ ప్యాడ్'ని ప్రారంభించారు. కానీ, అది చాలా ఖరీదైనది. 10 ప్యాడ్స్ ధర 300 రూపాయలు ఉండేది. దీంతో ఇంట్లోనే కూర్చొని ఆరు నెలల్లో ప్యాడ్ అబ్జర్వేషన్ కోర్స్ చేశాను. ఆ తర్వాత 'శానిట్రస్ట్' పేరుతో కంపెనీ ప్రారంభించాను. ఆన్‌లైన్ బొటీక్ ద్వారా కొద్ది కొద్దిగా కొనుగోలు చేసిన బంగారంపై లోన్ తీసుకుని, ఆ డబ్బుతో ప్యాడ్స్ స్టార్టప్ ప్రారంభించాను.

ఏడాదికి 50 లక్షలు

రెండేళ్ల క్రిందట వ్యవసాయం, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ అగ్రి స్టార్టప్ ల కోసం ఓ కార్యక్రమం చేపట్టింది. దాంట్లో 'శానిట్రస్ట్' ప్యాడ్స్ ఆలోచనను కాగితంపై పెట్టి, ఐఐటీ ఖరగ్‌పూర్‌లో ప్రాజెక్ట్‌కు అప్లై చేశాను. దేశవ్యాప్తం గా 40 స్టార్టప్‌లు అప్లై చేసుకోగా అందులో పదిమందివి ఎంపికయ్యాయి. నలుగురికి నిధులు మంజూ రయ్యాయి. ఆ నలుగురిలో నేనొకదాన్ని. దీంట్లో 20 లక్షల నిధులు నాకు మంజూరయ్యాయి. నిధులు వచ్చిన వెంటనే పది మందితో కలిసి ఒక బృందాన్ని ఏర్పాటు చేసి, పని మొదలుపెట్టాను. కేంద్రప్రభుత్వ ప్రశంసలతో దుబాయ్ ఎక్స్‌పోలో ఇండియా పెవిలియన్ కు ప్రాతినిధ్యం వహించే అవకాశం వచ్చింది. అక్కడ 193 దేశాల ప్రజల ముందు నా దేశం నుంచి ప్రాతినిధ్యం వహించాను. అక్కడి నుండి తిరిగి వచ్చినప్పుడు బీహార్ ప్రభుత్వం జీవనోపాధి కోసం తక్కువ ధర పీరియడ్ ప్యాడ్‌లను తయారు చేయమని నన్ను కోరింది. ఏడాది పాటు ప్రభుత్వానికి కన్సల్టెంట్‌గా పని చేశాను. బక్సర్‌లో మొదటిసారి లో కాస్ట్ ప్యాడ్ యూనిట్ ఏర్పడింది. పది వేల రూపాయలతో నా మొదటి వ్యాపారం ప్రారంభమయ్యింది. నాలుగున్నరేళ్లలో మూడు విజయవంతమైన వ్యాపారాలకు యజమానినయ్యాను. వందమందికి పైగా ఉద్యోగావకాశాలను ఇచ్చాను. ఈ రోజు నా ఏడాది సంపాదన యాభై లక్షలు. అందరిలోనూ శక్తి ఉంటుంది. దానిని అనుకూలంగా మార్చుకోవడంలోనే ఉంది మన కృషి'' అంటూ వివరిస్తోంది రిచా.

ఆన్‌లైన్ వ్యాపారం

హోలీ తర్వాత కలకత్తాకు తిరిగి వెళ్లాను. ఒక మాల్‌లో కలిసిన మహిళ ద్వారా ఆన్‌లైన్ బొటిక్ నడపచ్చని తెలిసింది. ఫేస్‌బుక్, వాట్సప్ ద్వారా బొటీక్‌ను నడిపించాను. ఏడాదిన్నరపాటు ఆ వ్యాపారం చేశాను. అక్కడ నుంచి నా జీవితం మెల్లగా మారడం ప్రారంభమైంది. నేను బిజీగా, సంతోషంగా ఉండటం కూడా తెలిసింది. ఒక ఫ్రెండ్ హెర్మెటిక్ టెక్నాలజీ గురించి చెప్పాడు. పురుగు మందులు లేకుండా ధాన్యాలు నిల్వ ఉంచిన సంచి అది.

యూత్ పల్స్

అ ఆ

● అలవోకగా ఆట

వీడియో గేమ్స్ అనే మాట వినబడగానే 'ఇది అబ్బాయిల ఆట మాత్రమే' అనేది ఒకప్పటి మాట.

అయితే గేమింగ్ అనేది 'బాయ్స్ క్లబ్'కు మాత్రమే పరిమితం కాలేదు.

మన దేశంతో సహా ప్రపంచవ్యాప్తంగా యంగ్ ఉమెన్ గేమర్స్ సంఖ్య పెరుగుతోంది.

మరో విశేషం ఏమిటంటే గేమింగ్‌ను కెరీర్ ఆప్షన్‌గా చూస్తున్న వారి సంఖ్య కూడా ఎక్కువగానే ఉంది...

కజిన్ బ్రదర్స్ వీడియోగేమ్స్‌లో తలమునకలవ్వడం చూసి...

'నేను కూడా ఆడతాను. నేర్పించరా' అని అడిగింది పాయల్.

పక్కనే ఏదో బాంబు బ్లాస్ట్ అయినట్లు ఎక్స్‌ప్రెషన్ ఇచ్చిన ఆ బ్రదర్స్ 'మీ నాన్నకు తెలిస్తే మమ్మల్ని తిడతాడు. ఆడపిల్లలు గేమ్స్ ఆడవద్దనే విషయం నీకు తెలియదా!' అని అరిచారు. వారు నేర్పించరు అనే విషయం అర్థమై తనకు తానే నేర్చుకుంది పాయల్.

మధ్యప్రదేశ్‌లోని చింద్వార పట్టణానికి చెందిన పాయల్ ధారే, ఇండియన్ యంగ్ ఉమెన్ గేమింగ్ స్టార్స్‌లో ఒకరిగా పేరు తెచ్చుకుంది. కంటెంట్ క్రియేటర్‌గా తన కెరీర్‌ను ప్రారంభించింది.

'గేమ్స్ ఆడుతున్నప్పటికీ నా దృష్టి కంటెంట్ క్రియేషన్‌పై ఉండేది. యూట్యూబ్‌లో నా ఫస్ట్ వీడియోకు మంచి స్పందన లభించింది. అది నా ఉత్సాహాన్ని రెట్టింపు చేసి ఎంతో శక్తిని ఇచ్చింది' అంటున్న పాయల్‌కు ఫన్‌ప్లేయింగ్ గేమ్స్ అంటే ఇష్టం. ఆ ప్రపంచంలోకి మరింత మందిని తీసుకురావడం అనేది లక్ష్యం.

కౌంటర్ స్ట్రైక్స్ గేమ్స్‌తో ఆట మొదలు పెట్టింది ముంబైకి చెందిన కృతికా వోహ్రా. ఆట మొదలుపెట్టిన కొత్తలోనే ప్రొఫెషనల్స్‌తో ఆడింది. ఎన్నో మెలకువలు అలవోకగా నేర్చుకుంది.

'గేమింగ్ అనేది నీ ప్యాషన్‌గా మాత్రమే ఉండాలి' అని పెద్దలు సలహా ఇచ్చారు. గేమింగ్‌లో పడి కృతిక చదువును ఎప్పుడూ నిర్లక్ష్యం చేయలేదు. అయితే ఆమె ప్యాషనే ప్రొఫెషన్‌గా మారింది.

'ఎన్నో రంగాలలో మహిళలు తమను తాము నిరూపించుకుంటున్నారు. గేమింగ్ ఇండస్ట్రీ దీనికి అతీతమేమీ కాదు. అంకితభావం, ధైర్యం ఉన్న అమ్మాయిలు గేమింగ్ ఇండస్ట్రీలో కచ్చితంగా రాణిస్తారు' అని ధైర్యం ఇస్తోంది కృతిక.

వీడియో గేమింగ్‌కు సంబంధించిన ప్రాథమిక విషయాలను చిన్నప్పుడు సోదరుడి దగ్గర నేర్చుకుంది ముంబైకి చెందిన ఖుష్బీ హిరందానీ. కోవిడ్ సమయంలో స్ట్రీమింగ్‌ను కెరీర్‌గా ఎంచుకొంది. స్ట్రీమింగ్ గురించి చెబుతూ 'మన గురించి మనం నాన్‌స్టాప్‌గా చెప్పుకోవడం కాదు. తక్కువ మాటలతోనైనా ప్రేక్షకులతో ఎక్కువ కనెక్ట్ కావాలి' అంటుంది.

ఫుల్‌టైమ్ గేమింగ్ క్రియేటర్‌గా మారడానికి సింగపూర్‌లో చేస్తున్న ఉద్యోగాన్ని వదులుకుంది.

ప్రొఫెషనల్ ఈస్పోర్ట్స్ అథ్లెట్‌గా మంచి పేరు తెచ్చుకుంది.

'అమ్మాయిలకు ఆడడం రాదు అని బలంగా నమ్మే వాళ్లను చూశాను. గెలిస్తే... అమ్మాయి గెలవడం ఏమిటీ! అని ఆశ్చర్యపడే వాళ్లను చూశాను. అయితే నేను వాటిని ఎప్పుడూ పట్టించుకోలేదు' అంటుంది ఖుష్బీ హిరందానీ.

సెలబ్రిటీల సంగతి సరే, ఔత్సాహిక గేమర్స్ పరిస్థితి ఏమిటి?

పాయల్ మాటల్లో చెప్పాలంటే... 'తొలి అడుగు పడగానే అమ్మాయిలకు గేమ్స్ ఏమిటి! అనే ఆశ్చర్యం కనిపించవచ్చు. ఆటలో గెలిస్తే అమ్మాయిలు గెలవడం ఏమిటి! అని వెక్కిరింపు వినిపించవచ్చు. అంతమాత్రాన అడుగు పడకుండా ఉండదు. ప్రయాణం జరగకుండా ఉండదు. గెలుపు జెండా ఎగరవేయకుండా వెనక్కి తిరిగి చూడడం అంటూ ఉండదు!'


పాయల్


కృతిక


కొత్త గేమ్స్ అండ్ రూల్స్

ఆన్‌లైన్ గేమింగ్‌లో హానికరమైన కంటెంట్ నిరోధానికి భారత ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ మంత్రిత్వశాఖ కొత్త నియమావళిని జారీ చేసింది. సెల్ఫ్-రెగ్యులేటరీ ఆర్గనైజేషన్ (ఎస్ఆర్‌వో)లు అభ్యంతర పెడితే సంబంధిత గేమ్‌లు ఆగిపోతాయి. గ్యాంబ్లింగ్(యాడ్స్‌తో సహా), హానికరమైన కంటెంట్‌కు 'ఎస్ఆర్‌వో'లు అడ్డుకట్ట వేస్తాయి. ఇందులో విద్యావేత్తలు, మానసిక నిపుణులు సభ్యులుగా ఉంటారు. కొత్త మార్గదర్శకాలను గేమింగ్ కంపెనీలు, గేమింగ్ ఇండస్ట్రీ అసోసియేషన్‌లు స్వాగతించాయి.

'కొత్త మార్గదర్శకాలు క్రియేట్ ఇన్ ఇండియా, బ్రాండ్ ఇన్ ఇండియా గేమ్స్‌ను ప్రమోట్ చేస్తాయి. పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతుంది. చట్ట విరుద్ధమైన ఆఫ్ షోర్ గ్యాంబ్లింగ్ సైట్ల విస్తరణ ఆగిపోతుంది' అంటున్నారు 'ఇన్‌మోబి' గ్రూప్ చీఫ్ కార్పోరెట్ ఎఫైర్స్ అండ్ పబ్లిక్ పాలసీ ఆఫీసర్ డా. సుబి చతుర్వేది. గేమింగ్ పరిశ్రమ ప్రతినిధులతో పాటు యూత్‌లో అత్యధికులు గేమింగ్ ఇండస్ట్రీకి ఇది పాజిటివ్ టర్నింగ్ పాయింట్ అంటున్నారు.


ఖుష్బీ హిరందానీ

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 16 సంచిక: 20
బుధవారం 12-4-2023
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'



ముంబై గెలుపు బోణీ...
ఢిల్లీని ఓడించి ఐపీఎల్ టోర్నీలో తొలి విజయం సాధించిన ముంబై -12లో



ఏడో రోజూ ఆగని దూకుడు
60వేల పైకి సెన్సెక్స్.. 17,700 ఎగువకు నిఫ్టీ -13లో



నన్నెవరూ ఆపలేరు
బీజేపీ తనను పదవి నుంచి తొలగించినా వయనాడ్ ప్రజలకు ప్రాతినిథ్యం వహించకుండా అడ్డుకోలేరని రాహుల్ అన్నారు.
వివరాలు 6లో ▸



300కుపైగా సీట్లు మావే
వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో 300పైగా సీట్లు బీజేపీ గెలుచుకుంటుందని అస్సాం పర్యటనలో అమిత్‌షా ధీమా వ్యక్తం చేశారు.
వివరాలు 6లో ▸



రెండు గంటల్లోనే టోఫెల్
'టోఫెల్'పరీక్ష ఇకపై 2 గంటలలోపే ముగియనుంది. ఈ మార్పు జూలై 26 నుంచి అమలు కానుందని ఈటీఎస్ పేర్కొంది.
వివరాలు 6లో ▸



డ్రోన్లతో ఆయుధాల రవాణా
సరిహద్దుల నుంచి డ్రోన్లతో ఆయుధ సరఫరా వల్ల సవాళ్లను ఎదుర్కొంటున్నామని భద్రతా మండలిలో భారత ప్రతినిధి పేర్కొన్నారు.
వివరాలు 6లో ▸

అదిరిపోయే ఎండలు..

- చాప్రాల, జూలూరుపాడుల్లో అత్యధిక పగటి ఉష్ణోగ్రత నమోదు
- రాష్ట్రంలో మొదలైన భానుడి భగభగలు.. వడదెబ్బకు ముగ్గురి మృతి
- చాలా చోట్ల నిలిచిన వరికోతలు..
- ఎండలకు కూలీలు దొరకని పరిస్థితి
- మరో నెలన్నరపాటు ఉష్ణోగ్రతలు పెరుగుతాయన్న వాతావరణ శాఖ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భానుడి భగభగలు మొదలయ్యాయి. తెలంగాణవ్యాప్తంగా 40 డిగ్రీల సెల్సియస్‌పైనే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా చాప్రాల, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడుల్లో అత్యధికంగా 43.8 డిగ్రీల సెల్సియస్ చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా వడదెబ్బకు గురై ముగ్గురు మృతిచెందారు. వారిలో మంచిర్యాల జిల్లాలో ఇద్దరు, నిర్మల్ జిల్లాలో ఒక ఉపాధి కూలీ ఉన్నారు. ఎండల తీవ్రతకు వివిధ పనుల నిమిత్తం బయటకు వచ్చే ప్రజలు విలవిల్లాడుతున్నారు. ఎండ వేడి కారణంగా అనేక చోట్ల వరి కోతలు నిలిచిపోయాయి. కూలీలు దొరకని పరిస్థితి నెలకొంది. వరి కోత యంత్రాలు సైతం అందుబాటులో లేకపోవడంతో ధాన్యం రాలిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు రాబోయే రోజుల్లో ఎండలు తీవ్రంగా ఉంటాయని, మే నెలాఖరు వరకు ఎండల తీవ్రత కొనసాగుతుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. గాలిలో తేమ శాతం తగ్గడం వల్ల

మిగతా 5వ పేజీలో ▶

మామూలుగానే వానలు



ఎల్‌నినో ఉన్నా సాధారణమే

దేశంలో నైరుతి వర్షపాతంపై భారత వాతావరణశాఖ అంచనా

ఎల్ నినో పరిస్థితులున్నా.. ఈ ఏడాది దేశంలో నైరుతి రుతుపవన వర్షపాతం సాధారణస్థాయిలో కొనసాగి వ్యవసాయ రంగానికి మేలుచేకూర్చనుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) సోమవారం అంచనావేసింది. సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశముందని ప్రైవేట్ వాతావరణ అంచనాల సంస్థ స్కైమేట్ ఆదివారం ప్రకటించిన మరుసటి రోజే వాతావరణ శాఖ మరోలా అంచనాలు వెల్లడించడం గమనార్హం.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

'పుడమి సాక్షిగా'కు అవార్డు



పుడమి సంరక్షణ కోసం సాక్షి మీడియా గ్రూప్ చేస్తోన్న 'పుడమి సాక్షిగా'క్యాంపెయిన్‌కు 'కార్పొరేట్ సోషల్ క్రూసేడర్ ఆఫ్ ది ఇయర్' సిల్వర్ అవార్డు దక్కింది. అడ్వర్టైజింగ్ ఇండస్ట్రీ ఆఫ్ ఏషియా (ఏఐఏ) ఆధ్వర్యంలోని ఏఎఫ్ఏఏ.. పుడమి సాక్షిగా కార్యక్రమాన్ని ఈ అవార్డుకు ఎంపిక చేసింది.

- వివరాలు 2లో▶

మే రెండో వారంలో ఇంటర్ ఫలితాలు



వచ్చే నెల రెండో వారంలో ఇంటర్ పరీక్ష ఫలితాలు వెల్లడించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఒకవేళ ఆలస్యమైతే మూడో వారంలో ఫలితాలు ప్రకటించవచ్చని బోర్డ్ అధికారులు తెలిపారు.

- వివరాలు 14లో▶

డేటా దేశం దాటిందా?



తెలంగాణ, ఏపీతో పాటు 24 రాష్ట్రాలకు చెందిన 80 కోట్ల మంది వ్యక్తిగత సమాచారం లీక్ కావడంపై కేంద్ర హోం శాఖ దృష్టి సారించింది. హై ప్రొఫైల్ వ్యక్తుల రహస్య సమాచారమూ మార్కెట్లో విక్రయించడంతో ఆ శాఖ అప్రమత్తమైంది.

- వివరాలు 11లో▶

రూ.328 కోట్ల లాటరీ

అమెరికాలోని అయోవా రాష్ట్రానికి చెందిన మాజీ మెకానిక్ 'లోట్టో అమెరికా'లాటరీలో రూ.328 కోట్ల జాక్‌పాట్ కొట్టాడు.

- వివరాలు 6లో▶

సాదా బైనామాల రాత మారలేదు

క్రమబద్ధీకరణకు దాదాపు రెండున్నరేళ్లుగా ఎదురుచూపులు

- రాష్ట్రంలో అపరిష్కృతంగా వ్యవసాయ భూములకు హక్కుల కల్పన అంశం
- 9.24 లక్షల మంది దరఖాస్తులు పెండింగ్
- 2.24 లక్షల దరఖాస్తుల పరిష్కారానికి హైకోర్టు గ్రీన్ సిగ్నల్
- వీటిపై కూడా దృష్టి సారించని రెవెన్యూ శాఖ
- కోర్టు తీర్పు, కొత్త రెవెన్యూ చట్టం నేపథ్యంలో ముందుకు పడని అడుగులు.. ఆదాయం వచ్చే అంశం కానందునే పట్టించుకోవడం లేదనే విమర్శలు




సాక్షి, హైదరాబాద్: సాదా బైనామాల ద్వారా క్రయ విక్రయాలు జరిగిన గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ భూములకు హక్కులు కల్పించే అంశం పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఎప్పటికప్పుడు నిర్ణయం తీసుకుంటామంటూ ప్రభుత్వం సాదా బైనామా దరఖాస్తుదారులను ఊరిస్తోందే తప్ప అడుగు ముందుకు పడటం లేదు. వీటి విషయంలో ఎలాంటి విధానపరమైన నిర్ణయమూ తీసుకోవడం లేదు. దీంతో సాదా బైనామాల క్రమబద్ధీకరణకు దాదాపు రెండున్నరేళ్లుగా ఎదురుచూస్తున్న 9.24 లక్షల మంది దరఖాస్తుదారులకు ఎదురుచూపులు మాత్రమే మిగులుతున్నాయి. సాదా బైనామాల అంశం ఇప్పటికే కోర్టులో ఉండగా, కోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన దరఖాస్తులను పరిష్కరించే అంశంపై కూడా ప్రభుత్వం దృష్టి సారించకపోవడంపై

మిగతా 2వ పేజీలో ▶

అడ్డంగా దొరికినా అడ్డదారిలోనే!

- ఆర్బీఐ వారించినా రామోజీరావు బుద్ధి వంకరే
- నాడు కేసు విచారణ కొనసాగుతుండగానే నేరపూరిత కుట్రతో 'మార్గదర్శి ఫైనాన్షియర్స్' మూసివేత
- ఇప్పుడు 'మార్గదర్శి చిట్‌ఫండ్స్' ముసుగులో మళ్లీ అక్రమ డిపాజిట్ల దందా.. చట్ట ప్రకారమే చర్యలకు ఉపక్రమించిన రాష్ట్ర ప్రభుత్వం
- ఆ బాధ్యత నిర్వర్తించాల్సింది రాష్ట్ర ప్రభుత్వమేనని నాడే తేల్చేసిన ఆర్బీఐ



- డిపాజిట్‌దారుల ప్రయోజనాల పరిరక్షణే లక్ష్యంగా చర్యలు

10 లో

తెలుగు రాష్ట్రాలకు తీరని అన్యాయం

ప్రధాని మోదీపై మంత్రి కేటీఆర్ ఫైర్

- విశాఖ ఉక్కుకు, బయ్యారానికి బైలదిల్లా ఇనుప ఖనిజం కేటాయించకుండా తన మిత్రుడు అదానీకి కట్టబెట్టారు
- 2014 నుంచి బయ్యారం ప్లాంట్ కోసం అడుగుతున్నాం
- 2018లో నేను ప్రధానిని కలిసి విజ్ఞప్తి చేశా
- మోదీ జాతి సంపదను తన జాతిరత్నాలకు దోచిపెడుతున్నారు.. ప్రధాని, అదాని, అజ్ఞాని.. ఓ డెడ్లీ కాంబినేషన్
- 'విశాఖ'పై అధ్యయనం మాత్రమే చేస్తున్నాం.. అధికారుల నివేదిక వచ్చాక నిర్ణయం


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: తెలుగు రాష్ట్రాలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీరని అన్యాయం చేస్తున్నారని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి కె.తారక రామారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖ ఉక్కు పరిశ్రమకు, తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటు చేస్తామన్న బయ్యారం ఉక్కు కర్మాగారానికి బైలదిల్లా నుంచి ఇనుప ఖనిజం కేటాయించకుండా తన మిత్రుడు అదానీకి కట్టబెట్టారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అదానీకి కట్టబెట్టిన ఆ మైనింగ్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 150 కి.మీ దూరంలోని బయ్యారానికి, 600 కి.మీ దూరంలోని విశాఖ ఉక్కు పరిశ్రమకు బైలదిల్లా నుంచి ఇనుప ఖనిజం లాభసాటి కానప్పుడు..1,800 కి.మీ దూరంలోని

మిగతా 3వ పేజీలో ▶

తెలంగాణకు ఏం సంబంధం: డీకే అరుణ 3 లో

టీఎస్‌పీఎస్సీ లీకేజీ.. రంగంలోకి ఈడీ



సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పరీక్షపత్రాల లీకేజీ వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. సిట్ దర్యాప్తు తుది దశకు చేరుకుంటున్న సమయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగ ప్రవేశం చేసింది. కమిషన్ సహాయ కార్యదర్శి సత్యనారాయణ, కాన్ఫిడెన్షియల్ సెక్షన్ కస్టోడియన్ శంకరలక్ష్మిలకు బుధ, గురువారాల్లో విచారణకు రావాల్సిందిగా

మిగతా 2వ పేజీలో ▶

- కమిషన్ సహాయ కార్యదర్శి, కస్టోడియన్‌లకు నోటీసులు
- కార్యదర్శి, చైర్మన్‌ను కూడా విచారించే అవకాశం
- ప్రశ్నపత్రాల అమ్మకాల్లో మనీ లాండరింగ్‌పై అనుమానాలు
- రాజశేఖర్‌రెడ్డి, ప్రవీణ్‌ల విచారణ కోసం కోర్టుకు..

ఆరోపణలు నిరూపిస్తే ఉద్యోగం వదిలేస్తా

వరంగల్ సీపీ ఏవీ రంగనాథ్



బండి సంజయ్ నాపై చేసిన సెటిల్‌మెంట్లు, అక్రమాస్తుల ఆరోపణలు నిరూపిస్తే ఉద్యోగం వదిలేస్తా.. అని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ సవాల్ విసిరారు. వరంగల్ బీఆర్ఎస్ కార్పొరేటర్లు, కాంగ్రెస్ నేతలు, బీజేపీ నేతలపై కూడా కేసులు నమోదు చేస్తున్నామని, రాజకీయాలకతీతంగా ఉద్యోగ బాధ్యతల్ని నిర్వర్తిస్తున్నానని తెలిపారు.

- వివరాలు 3లో▶

గ్రూప్-1 టాపర్ ఎవరో చెబితే ప్రభుత్వం కూలుతుంది



- కేసీఆర్, కేటీఆర్‌లకు చిత్తశుద్ధి ఉంటే టాపర్లు ఎవరో ప్రకటించాలి
- ఇద్దరు లీకేజీ నిందితులకు 150కి 120 మార్కులు..
- కేసు సూత్రధారులు ప్రభుత్వంలో ఉన్నందునే 'సిట్' అరెస్టు చేయట్లేదు
- నిరుద్యోగ భరోసా దీక్షలో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ వ్యాఖ్యలు

- వివరాలు 2లో▶



క్లుప్తంగా...



ఆ లావాదేవీల వివరాలివ్వండి

ఐటీ శాఖ డైరెక్టర్ విజయకుమార్

సాక్షి, హైదరాబాద్: స్థిరాస్తులకు సంబంధించి రూ.30 లక్షలకు మించిన లావాదేవీల వివరాలను మే 31లోపు తమకు నివేదించాలని ఆదాయపు పన్ను శాఖ కోరింది. ఈ మేరకు మంగళవారం ఐటీ టవర్స్‌లో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారులు, హైదరాబాద్, రంగారెడ్డి, పరిసర జిల్లాల సబ్‌రిజిస్ట్రార్లతో జరిగిన సెమినార్‌లో ఐటీ శాఖ డైరెక్టర్ (ఏపీ, తెలంగాణ) ఎం.విజయ్‌కుమార్ మాట్లాడారు. రూ.30 లక్షలకు మించిన లావాదేవీల వివరాలతో పాటు రూ.లక్షకు మించి స్థిరాస్తి లావాదేవీలు జరిపినవారి పాన్ నంబర్లు, సేకరించిన వివరాలను సకాలంలో దాఖలు చేయాల్సిన బాధ్యత రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులదేనని ఆయన స్పష్టం చేశారు. సెమినార్‌లో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ జాయింట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ వి.శ్రీనివాసులు, అడిషనల్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఎం.వెంకటరాజేశ్, ఐటీ శాఖ అడిషనల్ డైరెక్టర్ వసీం రెహమాన్ పాల్గొన్నా రు. సెమినార్‌లో భాగంగా ఐటీ శాఖ నిబంధనలపై సబ్‌రిజిస్ట్రార్లకు అవగాహన కల్పించారు.

నియామకాల ఆలస్యానికే పేపర్ లీకేజీ



సాక్షి, హైదరాబాద్: ఉద్యోగులకు జీతాలిచ్చే స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం లేనందున ఉద్యోగ నియామక ప్రక్రియ ఆలస్యం చేసేందుకే టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ చేశారని బీజేపీ ఉపాధ్యక్షుడు, నిరుద్యోగ మార్చ్ కమిటీ కన్వీనర్ ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ఆరోపించారు. సిట్ విచారణపై తమకు నమ్మకం లేదని, సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రభాకర్ మంగళవారం మీడియాతో మాట్లాడుతూ పేపర్ లీకేజీతో ఆందోళన చెందుతున్న నిరుద్యోగులకు భరోసా ఇచ్చేందుకే బీజేపీ ఈ నెల 15న వరంగల్‌లో నిరుద్యోగ మార్చ్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పేపర్ లీకేజీతో లక్షల మంది నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్న ప్రధాన సూత్రధారి, పాత్రధారి, లీకువీరుడైన కేటీఆర్‌ను బర్తరఫ్ చేయాలనేది తమ పార్టీ ప్రధాన డిమాండన్నారు. పరీక్ష కోసం ఎంతో శ్రమ పడ్డ, పెద్దమొత్తంలో డబ్బు ఖర్చు కూడా చేసుకున్న నిరుద్యోగ యువతకు రూ.లక్ష చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్‌కు దమ్ముంటే ఉద్యమకారులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించాలని సవాల్ విసిరారు.

టెన్త్ లీకేజీ నిందితులకు బెయిల్

వరంగల్ లీగల్: పదో తరగతి హిందీ పేపర్ లీకేజీ, కాపీ కేసు నిందితులైన బూర ప్రశాంత్ (ఏ2), గుండెబోయిన మహేష్ (ఏ3) మోతం శివగణేష్ (ఏ5)లకు హనుమకొండ నాలుగో మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు ఇన్‌చార్జ్ న్యాయమూర్తి ఆరీఫ్ మంగళవారం బెయిల్ మంజూరు చేశారు. ఈ ముగ్గురు నిందితుల కోసం ప్రాసిక్యూషన్ దాఖలు చేసిన పోలీస్ కస్టడీ పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది. నిందితులకు రూ.20 వేలు, ఇద్దరు జమానత్‌దారుల పూచీకత్తుపై బెయిల్ మంజూరు చేశారు. కేసు విచారణలో పోలీసులకు సహకరించాలని, సాక్షులను బెదిరించకూడదని తదితర షరతులతో బెయిల్ మంజూరు చేశారు.





ముంబైలో ఏఎఫ్‌ఏఏ చైర్మన్ శ్రీనివాసన్ స్వామి, ఐఏఏ ప్రెసిడెంట్ అవినాష్ పాండే, ఆలివ్ క్రౌన్ చైర్మన్ జనక్ సర్ధా చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సాక్షి డైరెక్టర్ రాణి రెడ్డి ● అవార్డు వచ్చిన సందర్భంగా హైదరాబాద్‌లోని సాక్షి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన సినీనటుడు అలీ సాక్షి సంకల్పాన్ని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సాక్షి గ్రూప్ డైరెక్టర్లు, సీఈవో, ఎడిటోరియల్ సిబ్బంది పాల్గొన్నారు.

‘పుడమి సాక్షిగా’ క్యాంపెయిన్‌కు ప్రతిష్టాత్మక

ఏఎఫ్ఏఏ అవార్డు

సాక్షి మీడియా గ్రూపు ఉద్యమానికి అంతర్జాతీయ గౌరవం
- పర్యావరణ పరిరక్షణలో తెలుగు సంకల్పానికి గుర్తింపు

సాక్షి, హైదరాబాద్: పుడమి సంరక్షణ కోసం సాక్షి మీడియా గ్రూప్ చేస్తోన్న ‘పుడమి సాక్షిగా’ క్యాంపెయిన్‌కు అంతర్జాతీయ గౌరవం దక్కింది. అడ్వర్టైజింగ్ ఇండస్ట్రీ ఆఫ్ ఏషియా (ఏఐఏ) ఆధ్వర్యంలోని ఏషియన్ ఫెడరేషన్ ఆఫ్ అడ్వర్టైజింగ్ అసోసియేషన్ (ఏఎఫ్ఏఏ).. పుడమి సాక్షిగా కార్యక్రమాన్ని ఈ అవార్డుకు ఎంపిక చేసింది. ‘కార్పొరేట్ సోషల్ క్రూసేడర్ ఆఫ్ ది ఇయర్’సిల్వర్ అవార్డుతో సత్కరించింది. ముంబై వేదికగా జరిగిన ఈ అవార్డుల కార్యక్రమంలో సాక్షి కార్పొరేట్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ రాణి రెడ్డి ఈ అవార్డును అందుకున్నారు. ఏఎఫ్ఏఏ చైర్మన్ శ్రీనివాసన్ స్వామి, ఏఐఏ ప్రెసిడెంట్ అవినాష్ పాండే, ఆలివ్ క్రౌన్ చైర్మన్ జనక్ సర్ధా ఈ అవార్డును అందజేశారు.

పుడమి‘సాక్షి’గా లక్ష్యాలివే..

ప్రతీ ఏటా జనవరి 26న మెగా టాకథాన్‌గా వస్తోన్న పుడమి సాక్షిగా కార్యక్రమం 2020–21లో ప్రారంభమైంది. ఇప్పటివరకు మూడు ఎడిషన్లు పూర్తి చేసుకుంది. పర్యావరణాన్ని కాపాడడం, కాలుష్యం తగ్గించడం, స్వచ్ఛమైన పుడమిని భవిష్యత్ తరాలకు అందించడం.. పుడమి సాక్షిగా లక్ష్యాలు. ప్రాణకోటికి జీవనాధారమైన ధరిత్రి ప్రమాదంలో పడడానికి మనుషులే ప్రధాన కారణం. ఈ భూమి మళ్లీ పునర్వైభవాన్ని దక్కించుకోవాలంటే.. ప్రతి ఒక్కరూ చేయాల్సిన కృషిని పుడమి సాక్షిగా గుర్తు చేస్తోంది. ప్రతి నెలా ఏదో ఒక రూపంలో పుడమి కార్యక్రమాలు చేపడుతోంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో క్షేత్రస్థాయిలో పర్యావరణంపై అవగాహన కల్పించడంతో పాటు ఇందులో ప్రజలను భాగస్వాములను చేస్తోంది. దీంతోపాటు గణతంత్ర దినోత్సవం రోజున సాక్షి టీవీలో దాదాపు 10 గంటలపాటు మెగా టాకథాన్ రూపంలో ప్రసారం చేస్తోంది. పర్యావరణ పరిరక్షణ కోసం పాటు పడుతున్న పెద్దలు, సినీ, క్రీడా, రాజకీయ ప్రముఖులు ఇందులో పాల్గొంటున్నారు. తమ అనుభవాలను పంచుకుంటూ సమాజానికి స్ఫూర్తి కలిగిస్తున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన సమస్త సమాచారం, స్టోరీలు, వీడియోలు https://www.pudamisakshiga.com/ వెబ్ సైట్‌లో చూడవచ్చు.

గ్రూప్–1 టాపర్ ఎవరో చెబితే

ప్రభుత్వం కూలుతుంది

- కేసీఆర్, కేటీఆర్‌లకు చిత్తశుద్ధి ఉంటే టాపర్లు ఎవరో ప్రకటించాలి
- ఇద్దరు లీకేజీ నిందితులకు 150కి 120 మార్కులు వచ్చాయి
- కేసు సూత్రధారులు ప్రభుత్వంలో ఉన్నందునే ‘సిట్’అరెస్టు చేయట్లేదు
- నిరుద్యోగ భరోసా దీక్షలో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ వ్యాఖ్యలు

చైతన్యపురి: టీఎస్‌పీఎస్సీ గ్రూప్–1 మొదటి ర్యాంకు ఎవరిదో చెబితే బీఆర్ఎస్ ప్రభుత్వం కూలిపోతుందని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ వ్యాఖ్యానించారు. కేసీఆర్, కేటీఆర్‌లకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా గ్రూప్–1 టాపర్లు ఎవరో ప్రకటించాలని డిమాండ్ చేశారు. మంగళవారం బీఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరుద్యోగ భరోసా దీక్షలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ సిబ్బంది, ఈ కేసులో నిందితులైన రాజశేఖర్‌రెడ్డి, దాసరి కిషోర్‌లకు గ్రూప్–1 ప్రిలిమ్స్‌లో 150 మార్కులకుగాను 120 మార్కులు సాధించినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవితకు తెలిసిన వారే టీఎస్‌పీఎస్సీ సభ్యులుగా ఉన్నారని, అందువల్ల ఆ కమిషన్‌ను వెంటనే రద్దు చేయాలన్నారు. ఏ నిరుద్యోగ బిడ్డల త్యాగం వల్ల తెలంగాణ వచ్చిందో, ఆ తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాలను కేసీఆర్ ప్రభుత్వం రూ. 10 లక్షల నుంచి రూ. కోటి వరకు అమ్ముకుంటోందని ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు.



విద్యార్థి నిరుద్యోగ భరోసా దీక్షలో ప్రసంగిస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

‘టెన్త్’లో అలా.. టీఎస్‌పీఎస్సీలో ఇలా..

టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ విషయంలో ‘సిట్’విచారణ నత్తనడకన సాగుతోందని... నిందితులను బాధితులుగా చూపే ప్రయత్నం జరుగుతోందని దుయ్యబట్టారు. టెన్త్ పేపర్ లీకేజీ కేసులో పోలీసులు 48 గంటల్లోనే పాత్రదారులు, సూత్రదారులను అరెస్ట్ చేశారని... కానీ టీఎస్‌పీఎస్సీ కేసులో సూత్రదారులు తెలంగాణ ప్రభుత్వంలో ఉన్నందునే ఇప్పటివరకు అరెస్టు చేయలేదని ఆరోపించారు. ఈ కేసుపై స్పందించకుండా ముఖ్యమంత్రి మౌనం వహిస్తున్నారంటే తప్పు చేసినట్లు అంగీకరిస్తున్నట్లేనని ఆయన వ్యాఖ్యానించారు. అందుకే ముఖ్యమంత్రి గద్దె దిగాలని తాము డిమాండ్ చేస్తున్నామన్నారు. సీఎం కేసీఆర్‌కు దమ్ముంటే అమరవీరుల స్థూపం వద్దకు రావాలని, తాము పేపర్ లీక్‌కు సంబంధించి ఆధారాలతో వస్తామని ఆయన సవాల్ చేశారు.

18న నిరసన దీక్ష...

టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కేసులో నిరుద్యోగులకు న్యాయం చేసేలా ప్రతిపక్ష పార్టీలంతా ఏకతాటిపైకి రావాలని ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. అలాగే కొత్త కమిషన్ వేశాకే పరీక్షలు నిర్వహించాలనే డిమాండ్‌తో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. అన్ని పార్టీల నాయకులు, విద్యార్థి సంఘాలతో ఈ నెల 18న ఇందిరాపార్కు వద్ద నిరసన దీక్ష చేయనున్నట్లు ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

సీఎంకు 25 ప్రశ్నలు

సాక్షి, హైదరాబాద్: రాజకీయ ప్రయోజనాల కోసమే సీఎం కేసీఆర్ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరు వాడుకుంటున్నారని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ విమర్శించారు. మంగళవారం బీఎస్పీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలను ఓటుబ్యాంకుగా చూడటమే తప్ప చిత్తశుద్ధి లేదని విమర్శించారు. 2016లో ఇచ్చిన హామీ మేరకు ఇప్పటికైనా 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని... కానీ గతంలో దళిత, బహుజనులకు ఇచ్చిన హామీల సంగతేంటని ప్రశ్నించారు. ఈ సందర్భంగా 25 ప్రశ్నలతో సీఎంకు రాసిన బహిరంగ లేఖను విడుదల చేశారు.

టీఎస్‌పీఎస్సీ లీకేజీ.. రంగంలోకి ఈడీ

▶ మొదటి పేజీ తరువాయి

నోటీసులు జారీ చేసింది. వీరిద్దరి స్టేట్‌మెంట్‌లను రికార్డు చేసిన తర్వాత కమిషన్ కార్యదర్శిని, చైర్మన్‌ను కూడా విచారించే అవకాశం ఉన్నట్లు సమాచారం. బేగంబజార్ పోలీసు స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్ ఆధారంగా విచారణ ప్రారంభించింది. పేపర్ లీకేజీతో చేతులు మారిన డబ్బు, కొనుగోలు చేసిన ఆస్తులను ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ చట్టం(పీఎమ్ఎల్ఏ) కింద ఈడీ జప్తు చేయనుంది.

వారి విచారణకు అనుమతించండి..

చంచల్‌గూడ జైలులో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న నిందితులు ప్రవీణ్, రాజశేఖర్‌రెడ్డిలను విచారించేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ నాంపల్లిలోని 12వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో ఈడీ అసిస్టెంట్ డైరెక్టర్ సుమిత్ గోయల్ పిటిషన్ దాఖలు చేశారు. ల్యాప్‌టాప్, ప్రింటర్, నిందితుల విచారణకు అవసరమైన ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకువెళ్లేందుకు వీలుగా జైలు సూపరింటెండెంట్‌కు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ పిటిషన్‌పై కోర్టు బుధవారం తీర్పు ఇవ్వనుంది. కాగా ప్రశ్నపత్రాల లీకేజీపై మీడియా కథనాలు, పబ్లిక్ డొమైన్‌లో ఉన్న సమాచారం, నిఘా విభాగాల ద్వారా వచ్చిన ప్రాథమిక సమాచారం ఆధారంగా ఈసీఐఆర్ నమోదు చేసినట్లు ఈడీ వెల్లడించింది. ప్రశ్నపత్రాల అమ్మకాల్లో మనీలాండరింగ్ జరిగిందని అనుమానిస్తున్నట్లు తెలిపింది. ఈ క్రమంలో గత నెల 23న సీసీఎస్ ఏసీపీకి రాసిన లెటర్‌ను పిటిషన్‌కు అటాచ్ చేసింది.

రూ.40 లక్షలపై ఆరా

ఈ కేసులో సిట్ ఇప్పటివరకు రూ.40 లక్షలు సీజ్ చేసింది. వీటి వివరాలను ఈడీ సేకరించనుంది. ప్రధాన నిందితులు ప్రవీణ్, రాజశేఖర్ రెడ్డిల బ్యాంక్ లావాదేవీలు ఆధారంగా మనీలాండరింగ్‌పై సమాచారం సేకరించింది. న్యూజిలాండ్‌లోని రాజశేఖర్‌రెడ్డి బావకు ఎనీడెస్క్ యాప్ ద్వారా గ్రూప్–1 పేపర్ పంపడం తెలిసిందే. దీంతో ప్రశాంత్‌రెడ్డి ద్వారా విదేశాల్లో ఎవరికైనా పేపర్ షేర్ అయ్యిందా అనే కోణంలో ఈడీ దర్యాప్తు చేస్తోంది. వారి నుంచి ప్రవీణ్, రాజశేఖర్‌రెడ్డి ఖాతాలకు లేదా ఇతరులకు మనీలాండరింగ్ జరిగిందా అనే వివరాలను రాబట్టనుంది. నిందితుల ఖాతాల్లో డిపాజిట్లకు సంబంధించి బ్యాంకులకు లేఖలు రాయనుంది.

‘సిట్’కు చిక్కరాదని

మొక్కుకున్నారు!

- డీఏఓ పేపర్ లీక్ కేసులో అరెస్టయిన ఖమ్మం జంట తీరు
- మార్చి 12న లీకేజీ వెలుగులోకి రావడంతో మొదలైన గుబులు
- తిరుపతి, షిర్డీ సహా అనేక పుణ్యక్షేత్రాలకు యాత్రలు
- రూ. 6 లక్షల సొమ్ము ఆన్‌లైన్ బదిలీతో పోలీసులకు చిక్కిన వైనం

సాక్షి, హైదరాబాద్: గ్రూప్–1 ప్రిలిమ్స్ ఓఎంఆర్ షీట్‌లో చేసిన తప్పుల సవరణ కోసం వెళ్తే బేరం కుదిరి డివిజినల్ అకౌంట్స్ ఆఫీసర్ (డీఏఓ) పరీక్ష పేపర్ దక్కింది... ఇక జాబ్ గ్యారంటీ అంటూ ఆనందంలో మునిగితేలుతున్న వేళ పేపర్ లీకేజీ వ్యవహారం వెలుగులోకి వచ్చి అరెస్టులు మొదలవడంతో వారిలో వణుకు పుట్టింది... దాదాపు 25 రోజులు నిద్రలేని రాత్రులు గడుపుతూ.. పుణ్యక్షేత్రాల చుట్టూ తిరుగుతూ తప్పును కాయాలని మొక్కుకున్నా చివరకు నేరం బట్టబయలైంది. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కేసులో ‘సిట్’పోలీసులు ఇటీవల అరెస్టు చేసిన ఖమ్మం జంట సాయి సుస్మిత, సాయి లౌకిక్‌ల వ్యవహారమిది.

సాఫ్ట్‌వేర్ జాబ్ వదులుకొని...

కార్ల వ్యాపారి అయిన లౌకిక్ భార్య సుస్మిత వృత్తి రీత్యా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. అయితే టీఎస్‌పీఎస్సీ గ్రూప్–1 నోటిఫికేషన్ జారీ చేయడంతో ఆమె దరఖాస్తు చేసుకుంది. ఆ పరీక్షలకు సిద్ధం కావడానికి ఉద్యోగాన్ని వదిలేసింది. గతేడాది అక్టోబర్‌లో గ్రూప్–1 ప్రిలిమ్స్ రాసినప్పటికీ ఓఎంఆర్ షీట్‌లో రాంగ్ బబ్లింగ్ (ఒకే కాలమ్‌లో రెండు చోట్ల మార్కింగ్ చేయడంతో) ఆమె ఫలితం ఆగిపోయింది. ఈ సమస్యను పరిష్కరించుకోవడానికి పలుమార్లు టీఎస్‌పీఎస్సీ కార్యాలయానికి వచ్చి వెళ్లే క్రమంలో కమిషన్ కార్యదర్శి అనితా రామచంద్రన్ వద్ద వ్యక్తిగత సహాయకుడిగా పని చేసిన పేపర్ లీకేజీ కేసు ప్రధాన నిందితుడు పులిదిండి ప్రవీణ్ కుమార్‌తో పరిచయం ఏర్పడింది. అప్పటికే పలు పరీక్షల ప్రశ్నపత్రాల విక్రయాలు మొదలెట్టిన అతను సుస్మిత డీఏఓ పరీక్షకు సైతం సిద్ధమవుతున్నట్లు తెలుసుకొని బేరం పెట్టాడు. దీంతో లౌకిక్ రూ. 6 లక్షలు చెల్లించి ఫిబ్రవరి 23న డీఏఓ పరీక్ష మాస్టర్ పేపర్ తీసుకొని భార్యకు అందించాడు. దీని ఆధారంగా రెండ్రోజులపాటు పరీక్షకు సిద్ధమైన సుస్మిత... అదే నెల 26న పరీక్ష రాసింది. తన చేతికి వచ్చిన పేపర్‌లోని ప్రశ్నలే కావడంతో దాదాపు అన్ని ప్రశ్నలకు సమాధానాలు మార్క్ చేసింది. ఒకవేళ గ్రూప్–1 పరీక్ష ఫలితం తేలకపోయినా డీఏఓ పోస్టు తప్పకుండా వస్తుందని భార్యాభర్తలు భావించారు.

లీకేజీ బయటపడటంతో గుబులు...

మార్చి 11 వరకు ఆనందంగా గడిపిన దంపతులు... టీఎస్‌పీఎస్సీలో పరీక్ష పేపర్ల లీకేజీ అంశం మార్చి 12న వెలుగులోకి రావడం, పోలీసులు ప్రవీణ్‌కుమార్‌తోపాటు ఇతర నిందితులను అరెస్టు చేయడంతో ఆందోళనకు లోనయ్యారు. డీఏఓ పేపర్ లీకేజీ వ్యవహారం బయటకు రాకూడదని, తాము ఈ కేసులో ఇరుక్కోకూడదని ప్రార్థనలు మొదలెట్టారు. నిద్రలేని రాత్రులు గడిపిన ఈ జంట... ఆ ఒత్తిడిని జయించడానికి తిరుపతి, షిర్డీ సహా అనేక పుణ్యక్షేత్రాలకు వెళ్లింది. అయితే ప్రవీణ్‌కు రూ. 6 లక్షల సొమ్మును లౌకిక్ ఆన్‌లైన్‌లో బదిలీ చేయడంతో ఈ క్లూ ఆధారంగా ‘సిట్’పోలీసులు వారిని ఈ నెల 7న అరెస్టు చేశారు.

సాదా బైనామాల రాత మారలేదు

▶ మొదటి పేజీ తరువాయి

విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

2.24 లక్షల దరఖాస్తులకు కోర్టు ఓకే

తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లో సాదా బైనామాల (రిజిస్ట్రేషన్ లేకుండా కేవలం కాగితాలపై రాసుకోవడం) ద్వారా వ్యవసాయ భూముల క్రయవిక్రయాలు కొన్ని దశాబ్దాలుగా జరుగుతున్నాయి. అయితే ఇలా అమ్మిన, కొన్న భూములపై క్షేత్రస్థాయిలో హక్కులే తప్ప చట్టబద్ధమైన హక్కులు లభించవు. ఈ చట్టబద్ధమైన హక్కుల కల్పన (క్రమబద్ధీకరణ) కోసం 2020లో ప్రభుత్వం రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. అయితే 2020 అక్టోబర్ 30 నుంచి కొత్త రెవెన్యూ చట్టం అమల్లోకి వచ్చినందున దరఖాస్తు ప్రక్రియను ఆ ఏడాది నవంబర్ 10 వరకు పొడిగించింది. అయితే అక్టోబర్ 29లోపు 2.24 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా, అక్టోబర్ 30 నుంచి నవంబర్ 10 వరకు అంటే 12 రోజుల్లో మరో 7 లక్షల దరఖాస్తుల వరకు వచ్చాయి. కానీ ఈ దరఖాస్తులను పరిష్కరించే క్రమంలో కొందరు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో కొత్త రెవెన్యూ చట్టం అమల్లోకి రాక ముందు అంటే 2020 అక్టోబర్ 29 వరకు వచ్చిన దరఖాస్తులనే పరిశీలించి హక్కులు కల్పించవచ్చని కోర్టు తెలిపింది. అయితే తమ తుది నిర్ణయం మేరకు వాటి పరిష్కారం పూర్తవుతుందని స్పష్టం చేసింది.

13–బీ సర్టిఫికెట్ జారీకి ఇబ్బందులు

కోర్టు తీర్పు వచ్చేసరికి కొత్త రెవెన్యూ చట్టం అమల్లోకి రావడంతో సాదా బైనామాల పరిష్కారం ప్రహసనంగా మారింది. సాదా బైనామా దరఖాస్తులను పరిశీలించి హక్కులు కల్పించడం కోసం 13–బీ సర్టిఫికెట్ జారీ చేసే అధికారం పాత రెవెన్యూ చట్టం ప్రకారం తహశీల్దార్లకు ఉండేది. కానీ కొత్త చట్టంలో.. జిల్లాల కలెక్టర్లు గ్రామాలకు వెళ్లి పరిశీలించి వాటి పరిష్కారానికి సిఫారసు చేస్తేనే తహశీల్దార్లు 13–బీ సర్టిఫికెట్ జారీ చేయాలనే నిబంధన చేర్చారు. కానీ కలెక్టర్లు పని ఒత్తిడితో గ్రామాలకు వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో రెవెన్యూ శాఖ దీన్ని పక్కన పడేసింది. అయితే 5 ఎకరాల లోపు లావాదేవీలకు స్టాంపు డ్యూటీ కూడా వసూలు చేయవద్దని కొత్త రెవెన్యూ చట్టంలో మార్పులు చేసినందునే అధికారులు దీన్ని పట్టించుకోవట్లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పరిష్కారానికి రెండు మార్గాలు!

సాదా బైనామాల అంశాన్ని ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని 9.24 లక్షల మంది దరఖాస్తుదారులు కోరుతున్న నేపథ్యంలో ఇందుకు రెండు మార్గాలున్నాయని నిపుణులు చెబుతున్నారు. 2020 అక్టోబర్ 29లోగా వచ్చిన 2.4 లక్షల దరఖాస్తులను పరిష్కరించవచ్చని హైకోర్టు చెప్పినందున, పాత చట్టం ప్రకారం ఫీజు కట్టించుకొని తహసీల్దార్ల ద్వారా క్రమబద్ధీకరణ కోసం 13–బీ సర్టిఫికెట్ జారీ చేయించవచ్చని అంటున్నారు. అక్టోబర్ 29 తర్వాత వచ్చిన 7 లక్షల దరఖాస్తులను పరిష్కరించాలంటే కొత్త చట్టంలోని కలెక్టర్ల సిఫారసు నిబంధనను మార్చాలని, ఇందుకోసం ఆర్డినెన్స్ లేదా చట్ట సవరణ తేవాలని సూచిస్తున్నారు.

31 కి.మీ.కి.. ₹ 1,297 కోట్లు!

మియాపూర్–సంగారెడ్డి మధ్య 6 లేన్ రోడ్డు నిర్మాణానికి కానున్న ఖర్చు ఇది

- డీపీఆర్‌కు కేంద్ర ప్రభుత్వ అధీనంలోని స్టాండింగ్ ఫైనాన్స్ కమిటీ ఆమోదం
- త్వరలో టెండర్లు.. రెండున్నరేళ్లలో పూర్తి.. ఇక ట్రాఫిక్ సమస్యకు చెక్



ట్రాఫిక్ చిక్కులకు తెరదించేలా...

సాక్షి, హైదరాబాద్: ఆరు వరుసలకు విస్తరిస్తున్న రోడ్డది.. నిడివి 31 కి.మీ. మాత్రమే. కానీ దాని నిర్మాణానికి మాత్రం ఏకంగా రూ. 1,297 కోట్లు ఖర్చు కానుంది! అంటే ఒక కిలోమీటర్‌కు దాదాపు రూ. 42 కోట్ల వ్యయం అన్నమాట. దీన్ని మరోలా చెప్పాలంటే ఎనిమిది వరుసలు, 158 కి.మీ. నిడివితో రూపుదిద్దుకున్న ఔటర్ రింగురోడ్డు నిర్మాణంలో ప్రతి కిలోమీటర్‌కు అయిన ఖర్చు స్థాయికి దాదాపు సమానమన్నమాట! ఈ కాస్త దూరానికే అంత ఖర్చు ఎందుకు అనుకుంటున్నారా? ఇందులో నిర్మించేది ప్రధాన రోడ్డొక్కటే కాదు.. సర్వీసు రోడ్లు, క్రాష్ బ్యారియర్లు, ఎలివేటెడ్ కారిడార్లు, జంక్షన్ల వద్ద వంతెనలు, అండర్‌పాస్‌లు, కల్వర్టులు.. ఒకటేమిటి ఎక్స్‌ప్రెస్ వే అంటే ఇలా ఉండాలనే రీతిలో ఇది రూపుదిద్దుకోబోతోంది. ఓ రకంగా చెప్పాలంటే మోడల్ ఎక్స్‌ప్రెస్ వేగా నిలవబోతోంది. హైదరాబాద్–పుణే జాతీయ రహదారిపై మియాపూర్–సంగారెడ్డి మధ్య ఉన్న ఈ మార్గం ఎక్స్‌ప్రెస్ వే తరహాలో ముస్తాబుకానుంది. అందుకే ఖర్చు సైతం భారీగా ఉంది.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రల్లో విస్తరించి ఉన్న 65వ నంబర్ జాతీయ రహదారిపై కొన్నేళ్లుగా ట్రాఫిక్ విపరీతంగా పెరిగిపోయింది. దీంతో దాన్ని విస్తరించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా హైదరాబాద్ శివార్లలో ఆ మార్గాన్ని యుద్ధప్రాతిపదికన 6 వరుసలకు విస్తరించనుంది. ఇందులో హయత్‌నగర్ దాటాక విజయవాడ రోడ్డులో జాతీయ రహదారుల అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) రోడ్డు విస్తరణను చేపట్టనుండగా ముంబై రహదారిలో మియాపూర్ సమీపంలోని మదీనాగూడ నుంచి సంగారెడ్డి వరకు రాష్ట్ర పీడబ్ల్యూడీ విభాగం అభివృద్ధి చేయనుంది. తాజాగా మదీనాగూడ–సంగారెడ్డి మధ్య 6 వరుసల విస్తరణ పనులకు సంబంధించిన డీపీఆర్‌కు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ అధీనంలోని స్టాండింగ్ ఫైనాన్స్ కమిటీ ఆమోదించింది. దీంతో ఇక టెండర్లు పిలిచేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అవి ఖరారయ్యాక రెండున్నరేళ్లలో ప్రాజెక్టును పూర్తి చేయనున్నారు.



రోజుకు సగటున లక్ష వాహనాలు..

నగరం నుంచి సంగారెడ్డి రోడ్డు అత్యంత బిజీగా మారిపోయింది. డీపీఆర్ తయారీలో భాగంగా గత ఆగస్టులో ఇస్నాపూర్, పటాన్‌చెరు మధ్య వెళ్తున్న వాహనాల సంఖ్యపై జాతీయ రహదారుల విభాగం సర్వే నిర్వహించగా ఒక రోజులో సగటున లక్ష వాహనాలు ప్రయాణిస్తున్నట్లు తేలింది. పటాన్‌చెరు వద్ద రోజుకు 30,683 కార్లు, 12,353 త్రిచక్ర వాహనాలు, 34,437 ద్విచక్ర వాహనాలు, 5,551 బస్సులు, 9 వేల ట్రక్కులు... ఇలా అన్నీ కలిపి రోజుకు లక్ష వరకు తిరుగుతున్నాయి. ఇక మదీనాగూడ ప్రాంతంలో ఆ సంఖ్య అంతకు రెట్టింపుగా ఉంటోంది. ఈ రోడ్డును విస్తరిస్తే ట్రాఫిక్ సమస్య పరిష్కారమవుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

ఇప్పుడేం చేస్తారు..?

మదీనాగూడ నుంచి సంగారెడ్డి వరకు 31 కి.మీ.మేర రోడ్డును 6 వరుసలకు విస్తరించనున్నారు. మూడు వరుసల సర్వీసు రోడ్డు, ఫుట్‌పాత్, వరద నీటి డ్రెయిన్‌తో 11.66 కి.మీ., మిగతా నిడివిలో రెండు వరుసల సర్వీసు రోడ్డు ఉండేలా నిర్మించనున్నారు. రుద్రారం వద్ద 1,020 మీటర్ల మేర, గంగారం వద్ద 840 మీటర్ల మేర రెండు ఎలివేటెడ్ కారిడార్లతోపాటు కొత్తగా 11 చిన్న వంతెనలు నిర్మించనున్నారు. ఏడు మేజర్, 19 మైనర్ జంక్షన్లను విస్తరించనున్నారు. ఏడు ప్రాంతాల్లో అండర్‌పాస్‌లు, ఆరు చోట్ల కల్వర్టులను కట్టనున్నారు. ఐదు ప్రాంతాల్లో లిఫ్టు వసతి ఉండే ఫుట్ ఓవర్ బ్రిడ్జీలు, రోడ్డుకు రెండు వైపులా క్రాష్ బ్యారియర్లను ఏర్పాటు చేయనున్నారు. వెరసి ప్రధాన క్యారేజ్ వే మీదకు చుట్టుపక్కల నుంచి ఇతర వాహనాలు, మనుషులు, జంతువులు వచ్చే వీలుండదు. ప్రధాన క్యారేజ్ వే మీదుగా వెళ్లే వాహనాలకు, దీన్ని దాటుతూ అటూఇటూ పోయే వాహనాలకు పరస్పరం ఆటంకం లేని విధంగా డిజైన్ చేశారు. ఇందుకు వీలుగా అదనంగా కావాల్సిన భూమి కోసం రూ. 166 కోట్లు వెచ్చిస్తున్నారు. అన్నీ కలిపి నిర్మాణానికి రూ. 1,297 కోట్లు ఖర్చు కానున్నట్టు డీపీఆర్‌లో పేర్కొనగా దానికి తాజాగా కేంద్రం ఆమోదముద్ర వేసింది.

బీహెచ్ఈఎల్ వంతెన కాకుండా..

ఈ రోడ్డు విస్తరణలో భాగంగా బీహెచ్ఈఎల్ కూడలి వద్ద 131 కోట్లతో భారీ వంతెన నిర్మిస్తున్నారు. 60 మీటర్ల వెడల్పుతో అది ఉండనుంది. దాన్ని ఈ రోడ్డు విస్తరణ ప్రాజెక్టులో కాకుండా విడిగా చూపారు. దానికి సంబంధించి ఎన్‌హెచ్ఏఐ రూపొందించిన నమూనా ప్రకారం పనులు సాధ్యం కాదంటూ రాష్ట్ర ప్రభుత్వ అధీనంలోని ఎన్‌హెచ్ విభాగం ఇటీవల ప్రతిపాదించింది. దీనిపై ఇరు విభాగాల మధ్య విభేదాలు తలెత్తడంతో పనుల్లో జాప్యం జరుగుతోంది. ఇందుకు కారణం మీరంటే మీరంటూ ఇరు విభాగాలు లేఖలు రాసుకోవడం వివాదాస్పదంగా మారింది.

టీఎస్‌పీఎస్సీ బాధితుల కోసం బీజేపీ వాట్సాప్ నంబర్




సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ వ్యవహారంపై హైకోర్టులో పిల్ వేయాలా, సుప్రీంకోర్టును ఆశ్రయించాలా అనే విషయంలో న్యాయసలహా ప్రకారం నిర్ణయం తీసుకుంటామని బీజేపీ టాస్క్‌ఫోర్స్ కమిటీ కన్వీనర్, టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యుడు సిహెచ్ విఠల్ తెలిపారు. పేపర్ లీక్ వల్ల నష్టపోయిన విద్యార్థులతో ఇంటరాక్ట్ అయ్యేందుకు బీజేపీ ఒక వాట్సాప్ నంబర్ 8688821794ను అందుబాటులోకి తీసుకొచ్చింది. టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు చంద్రవదన్, కృష్ణప్రసాద్, మర్రిశశిధర్‌రెడ్డి, ఎస్. కుమార్, కరుణాగోపాల్‌లతో కలిసి విఠల్ మంగళవారం మీడియాతో మాట్లాడారు. లీకేజీ అంశాన్ని పక్కదారి పట్టించేందుకు బండి సంజయ్‌ను అరెస్ట్ చేసి కేసీఆర్ సర్కార్ అభాసుపాలైందన్నారు. పేపర్ లీకేజీపై విచారణ జరుపుతున్న సిట్ అధిపతికి కోర్టు ధిక్కార కేసులో నాలుగు వారాల శిక్ష పడిందని మర్రి శశిధర్‌రెడ్డి తెలిపారు. పేపర్ లీక్ విషయంలో తమకు కేటీఆర్‌పై అనుమానాలున్నాయని, ఆయన తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో యువతకు జరుగుతున్న అన్యాయంపై రాష్ట్రపతి, గవర్నర్‌కు నివేదిక ఇవ్వాలని బీజేపీ టాస్క్ ఫోర్స్ కమిటీ నిర్ణయించినట్టు మాజీ డీజీపీ కృష్ణ ప్రసాద్ తెలిపారు.

టీఎస్‌పీఎస్సీ ఉద్యోగులు

పరీక్ష ఎలా రాస్తారు?

రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు
- పరీక్షపత్రాలు సిద్ధం చేయడానికి ఎలా అనుమతిచ్చారు?
- నిందితుల వివరాలు తెలియజేయాలని ఆదేశం
- హైకోర్టుకు నివేదిక సమర్పించిన సిట్



సాక్షి, హైదరాబాద్: ‘తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ) ఉద్యోగులు అది నిర్వహించే పరీక్షలు ఎలా రాస్తారు. వారిని పరీక్షపత్రాల తయారీకి ఎలా అనుమతిస్తారు?’అని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. టీఎస్‌పీఎస్సీ అసిస్టెంట్ ఇంజనీర్ పోస్టుల ప్రశ్నపత్రం లీకేజీపై హైకోర్టుకు మంగళవారం సిట్ దర్యాప్తు స్థాయీ నివేదిక సీల్డ్ కవర్‌లో సమర్పించింది. అయితే నిందితుల వివరాలను ఇవ్వాలని సర్కార్‌కు హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. పేపర్ లీకేజీ కేసును సిట్ పారదర్శకంగా దర్యాప్తు చేయలేదని, సీబీఐతో విచారణ జరిపించాలని కోరుతూ ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్‌తోపాటు మరో ఇద్దరు నిరుద్యోగులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి మంగళవారం విచారణ చేపట్టారు. సిట్ తరఫున అడ్వొకేట్ జనరల్(ఏజీ) బీఎస్ ప్రసాద్ నివేదిక అందజేసి వాదనలు వినిపించారు. దర్యాప్తు నివేదికను పిటిషనర్లకు ఇవ్వాలని, వారి తరఫు సీనియర్ న్యాయవాది వివేక్ ఠంకా న్యాయమూర్తికి విజ్ఞప్తి చేశారు. సీల్డ్ కవర్ నివేదికలను బహిర్గతం చేయవచ్చని సుప్రీంకోర్టు పలు సందర్భాల్లో పేర్కొందని ఠంకా చెప్పారు. దర్యాప్తులో తీవ్ర లోపాలున్నాయని, సాక్ష్యాలు మాయమవుతున్నాయని అన్నారు. సిట్ చైర్మన్‌పై ఆరోపణలు ఉన్నాయని, సర్వీస్ కమిషన్ ఏర్పాటులోనూ లోపాలున్నాయని పేర్కొన్నారు. ఈ కేసులో ప్రవాస భారతీయుల పాత్ర ఉందన్నారు. ఇది 30 లక్షల మంది భవిష్యత్‌తో ముడిపడి ఉన్న అంశమని అన్నారు. సెక్షన్ అధికారి వద్ద మాత్రమే కాకుండా చైర్మన్, కార్యదర్శి వద్ద కూడా పాస్‌వర్డ్ ఉంటుందన్నారు.

పారదర్శకంగా సాగని దర్యాప్తు

సిట్ దర్యాప్తు పారదర్శకంగా సాగడంలేదని పిటిషనర్ల తరఫు న్యాయవాది వివేక్ ఠంకా అన్నారు. ఈ క్రమంలో ప్రశ్నపత్రాలను ఎవరు తయారీ చేశారు.. ఏ ఏజెన్సీకి అప్పగించారు.. అని న్యాయమూర్తి ప్రశ్నించారు. పరీక్షలు రాసేవారిని విధులకు ఎందుకు అనుమతించారని అడుగగా, పరీక్షలు రాసే వారిని నిర్వహణ ప్రక్రియకు దూరంగా పెట్టినట్లు ఏజీ చెప్పారు. దర్యాప్తు పురోగతిపై పూర్తి వివరాలతో నివేదికను సమర్పిస్తామని, ఎఫ్ఎస్ఎల్ రిపోర్టులతోపాటు మరికొన్ని వివరాలు అందాల్సి ఉందన్నారు. ఈ కేసులో మొత్తం 18 మంది నిందితులుండగా, 17 మందిని అరెస్ట్ చేశామని పేర్కొన్నారు. ఒకరు మాత్రం న్యూజిలాండ్‌లో ఉన్నారని అన్నారు. సీబీఐ దర్యాప్తు అవసరం లేదని నివేదించారు. ఏ ఒక్కరూ చట్టం నుంచి తప్పించుకోలేరని తెలిపారు. వాదనలను విన్న న్యాయమూర్తి.. తదుపరి విచారణను ఈనెల 24కి వాయిదా వేశారు.

క్లుప్తంగా...

ఎమ్మెల్సీ కవిత కాలికి గాయం

వైద్యుల సూచనతో 3 వారాల విశ్రాంతి



సాక్షి, హైదరాబాద్: రెండు రోజుల క్రితం కాలికి గాయమైన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మూడు వారాల పాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. తన నివాసంలో రెండు రోజుల క్రితం కాలి ఎముక విరగడంతో కవిత వైద్యులను సంప్రదించారు. విశ్రాంతిలో ఉన్నా అవసరమైన సాయం, సమాచారం కోసం తన కార్యాలయ సిబ్బంది అందుబాటులో ఉంటారని ఆమె తెలిపారు. కాగా కవిత త్వరగా కోలుకోవాలని కోరుకుంటూ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సహా పలువురు బీఆర్ఎస్ నేతలు ట్విట్టర్ వేదికగా సందేశాలు పంపారు.

చేతనైతే బయ్యారం స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయించు

ట్విట్టర్‌లో కేసీఆర్‌పై షర్మిల ఆగ్రహం



సాక్షి, హైదరాబాద్: కేసీఆర్‌కు చేతనైతే కేంద్రం మెడలు వంచి బయ్యారం స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయించాలని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. కేంద్రం ఏర్పాటు చేయకుంటే రాష్ట్ర ప్రభుత్వమే ఏర్పాటు చేస్తుందని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సూచించారు. సీఎం కేసీఆర్‌పై ట్విట్టర్ వేదికగా షర్మిల విరుచుకుపడ్డారు. గెలిస్తే 100 రోజుల్లో నిజాం షుగర్ ఫ్యాక్టరీ తెరిపిస్తానని హామీ ఇచ్చి, నెరవేర్చకుండా కార్మికులను మోసం చేశారని విమర్శించారు. తెలంగాణలో మూతపడ్డ పరిశ్రమలకు దిక్కులేదు కానీ, పక్క రాష్ట్రాల్లో ఫ్యాక్టరీలను కాపాడేపనిలో పడ్డారని షర్మిల ఎద్దేవా చేశారు. 'అజంజాహీ మిల్స్, పేపర్ ఫ్యాక్టరీలకు పునర్వైభవం తీసుకొస్తానని దగా చేశారు. ఎన్నడో మూతపడిన ఐడీపీఎల్, హెచ్ఎంటీ, హెచ్‌సీఎల్, ఆల్విన్, ప్రాగాటూల్స్ లాంటి కంపెనీలను వెంటనే తెరిపించాలని కోరారు.

అసదుద్దీన్‌కు షర్మిల లేఖ

టీ–సేవ్ ఫోరమ్‌లో భాగంగా యువత, విద్యార్థుల హక్కుల కోసం జరిగే పోరాటంలో భాగస్వామి కావాలని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీని షర్మిల ఆహ్వానించారు. ఈ మేరకు మంగళవారం ఒవైసీకి ఆమె రాసిన లేఖను వైఎస్సార్‌టీపీ కార్యాలయం విడుదల చేసింది.

బీజేపీలో జూపల్లి, పొంగులేటి చేరికకు సంప్రదింపులు

సాక్షి, న్యూఢిల్లీ: బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ అయిన మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డిలను కాషాయ గూటిలో చేర్చుకునే ప్రక్రియ హస్తినకు చేరుకుంది. తెలంగాణలో బీజేపీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన సంప్రదింపులు పార్టీ పెద్దలతో జరుగుతున్నట్లు తెలిసింది. అందులో భాగంగా పార్టీ చేరికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ సంప్రదింపుల ప్రక్రియను వేగవంతం చేసేందుకు ఢిల్లీ వచ్చినట్లు సమాచారం. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జూపల్లి, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలకున్న ప్రజాదరణను పార్టీకి ఏవిధంగా ఉపయోగించాలనే అంశంపై పార్టీ పెద్దలతో ఈటల చర్చలు జరుపుతున్నారని తెలిసింది.

భద్రాచలం బీఆర్ఎస్ ఇన్‌చార్జిగా బాలసాని

మూడు రోజుల క్రితం ఎంపీ మాలోత్ కవితకు బాధ్యతలు

సాక్షి, హైదరాబాద్: భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జిగా మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణను నియమిస్తున్నట్లు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ప్రకటించారు. ప్రస్తుతం ఇన్‌చార్జిగా ఉన్న మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత అభ్యర్థన మేరకు ఇన్‌చార్జిని మారుస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా, మూడు రోజుల క్రితం రాష్ట్రంలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జీలుగా ముగ్గురు నేతలకు పార్టీ జాతీయ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్ బాధ్యతలు అప్పగించారు. ఎంపీ మాలోత్ కవితకు భద్రాచలం, మర్రి రాజశేఖర్‌రెడ్డికి సికింద్రాబాద్ కంటోన్మెంట్, నందకిషోర్ వ్యాస్ బిలాల్‌కు గోషామహల్ ఇన్‌చార్జీలుగా బాధ్యతలు అప్పగించారు. ఆత్మీయ సమ్మేళనాలతో పాటు పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలను నూతన ఇన్‌చార్జీలకు అప్పగించారు. భద్రాచలం బాధ్యతల నుంచి కవితను తప్పించారు. మూడు రోజుల వ్యవధిలోనే మార్పులు చేయడం పార్టీలో చర్చనీయాంశమైంది.

'పార్టీ కార్యక్రమాలకు అందరినీ పిలవండి'

సాక్షి, హైదరాబాద్: క్షేత్రస్థాయిలో నిర్వహించే కార్యక్రమాల్లో పార్టీకి చెందిన అన్ని స్థాయిల్లోని నాయకులను భాగస్వాములను చేయాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ఈ మేరకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులకు సూచనలతో కూడిన లేఖను పంపింది. పార్టీ కార్యక్రమాలు, కార్యవర్గ సమావేశాలను నిర్వహించే సమయంలో జిల్లా కాంగ్రెస్ కమిటీలో ఉండే అనుబంధ సంఘాల అధ్యక్షులు, విభాగాల చైర్మన్లు, జిల్లాకు సంబంధించిన రాష్ట్ర, జాతీయ కార్యవర్గ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధులను ఆహ్వానించి వారిని భాగస్వాములను చేయాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ మంగళవారం డీసీసీ అధ్యక్షులకు లేఖలు రాశారు.

ఆరోపణలు నిరూపిస్తే ఉద్యోగం వదిలేస్తా

- రాజకీయాలకు అతీతంగా పని చేస్తున్నా
- బండి సంజయ్ ఆరోపణలను ఖండించిన వరంగల్ సీపీ రంగనాథ్



విలేకరులతో మాట్లాడుతున్న వరంగల్ సీపీ ఏవీ రంగనాథ్

వరంగల్ క్రైం: 'బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ నాపై చేసిన సెటిల్‌మెంట్లు, అక్రమాస్తుల ఆరోపణలు నిరూపిస్తే నా ఉద్యోగం వదిలేస్తా.. అని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ సవాల్ విసిరారు. బండి సంజయ్‌కి నాకు ఏమైనా గట్టు పంచాయితీ ఉందా?' అని ప్రశ్నించారు. మంగళవారం సాయంత్రం వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో సీపీ మీడియాతో మాట్లాడారు. సంజయ్ ఇన్నాళ్లూ ఈ ఆరోపణలు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. రకరకాల కేసుల్లో ముద్దాయిలు తనపై నిందలు మోపడం సాధారణమేనని, ఇది ఆక్రోశంతో చేసినట్లు అనిపించిందన్నారు. ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లో గతంలో పనిచేశానని, అక్కడ ఉన్న బీజేపీ కార్యకర్తలను అడిగితే నా పనితనం ఏమిటో చెబుతారన్నారు. వరంగల్ బీఆర్ఎస్ కార్పొరేటర్లు, కాంగ్రెస్ నేతలు, బీజేపీ నేతలపై కూడా కేసులు నమోదు చేస్తున్నామని, రాజకీయాలకతీతంగా ఉద్యోగబాధ్యతల్ని నిర్వర్తిస్తున్నానని సీపీ రంగనాథ్ తెలిపారు. 'రౌడీలు, చీటర్స్, లోఫర్స్, భూకబ్జాదారులు నాకు వ్యతిరేకంగా మిమ్ముల్ని కలిసుండొచ్చు. గతంలో వారిపై చట్టపరంగా చర్యలు తీసుకున్నాం. అలాంటి వారికి వ్యతిరేకంగా బాధితులు, సామాన్యులు ముందుకు వస్తారు'అంటూ ఒకింత ఘాటుగా వ్యాఖ్యానించారు. తనకు మధ్యవర్తులు ఎవరూ ఉండరని, రోజూ పోలీస్ గ్రీవెన్స్‌కు 50 నుంచి 60మంది వస్తారని, ఒక్కసారి సంజయ్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదుదారులను చూడాలని కోరారు.

ప్రమాణం చేయడం అశాస్త్రీయం

యూనిఫాం మీద ప్రమాణం చేసి కేసుల గురించి చెప్పమనడం అశాస్త్రీయమని సీపీ అన్నారు. ఉద్యోగంలో చేరే ముందు ప్రమాణం చేసి విధుల్లో చేరుతామని, ప్రతి కేసులో ప్రమాణం చేయడం కుదరదని, ప్రమాణం చేసి తప్పులు చెప్పవచ్చా..? అని సీపీ ప్రశ్నించారు. ఆయేషా హత్య కేసు విషయంలో సత్యంబాబు కేసు గురించి పదే పదే చెబుతున్నారు.. ఆ కేసు నేను చేసింది కాదు, అప్పుడు అడిషనల్ ఎస్పీగా ఉన్నా అని సీపీ వివరించారు. కాల్‌డేటా విషయంలో సుప్రీంకోర్టు స్పష్టమైన ఉత్తర్వులు ఇచ్చిందని, దాని ప్రకారమే ముందుకెళ్తున్నానని వెల్లడించారు. తనపై ప్రభుత్వంనుంచి ఎలాంటి ఒత్తిడీ లేదని, హిందీ పేపర్ మాల్ ప్రాక్టీస్ వ్యవహారంలో దానికి ముందు జరిగిన వాట్సాప్ చాటింగ్‌ల ఆధారంగానే కేసులు నమోదు చేసినట్లు స్పష్టం చేశారు. పెళ్లి, చావులు విషయంలో కేసులు ఆగవని, చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు.

అలా అనడం బెదిరింపులే

విచారణ అధికారిని జాగ్రత్త అని హెచ్చరించడమంటే బెదిరింపులకు పాల్పడడమే అవుతుందని రంగనాథ్ అన్నారు. బండి సంజయ్ ఫోన్ తమ దగ్గరకు రాలేదని, అర్ధరాత్రి 1.14 నిమిషాలకు చివరి కాల్ ఉందని, రాత్రి ఆ ఫోన్ చివరగా లోకేషన్ వెజ్జంకి అని వచ్చిందని తెలిపారు. సంజయ్ ఉక్రోషంతో ఉన్నారని, పరువు నష్టం దావా వేసుకోవచ్చని, కానీ తాను మాత్రం వేయనన్నారు. సమావేశంలో సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్ బారీ, కాజీపేట ఏసీపీ శ్రీనివాస్, ఎస్‌బీ ఏసీపీ తిరుమల్‌లు పాల్గొన్నారు.

దయనీయ స్థితికి పాలన వ్యవహారాలు

- బీజేపీయేతర రాష్ట్రాలకు కేంద్రం సహాయ నిరాకరణ
- మంత్రి కేటీఆర్ ట్వీట్

సాక్షి, హైదరాబాద్: అత్యున్నత రాజ్యాంగ పదవులు కేంద్ర ప్రభుత్వం చేతిలో రాజకీయ సాధనాలుగా మారాయని, దీంతో దేశంలో పాలన వ్యవహారాలు చాలా దయనీయ స్థితికి చేరాయని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు వ్యాఖ్యానించారు. తమ వద్దకు వచ్చే బిల్లులను గవర్నర్లు నిర్ణీత కాల వ్యవధిలోపు ఆమోదించాలని తమిళనాడు ప్రభుత్వం చేసిన తీర్మానాన్ని సమర్థిస్తూ రాష్ట్ర డిజిటల్ మీడియా వింగ్ డైరెక్టర్ కొణతం దిలీప్ ఒక ట్వీట్ చేశారు. 'దేశంలో బీజేపీయేతర ప్రభుత్వాలను ఇబ్బందులకు గురిచేసేందుకు గవర్నర్లు తమ అధికారాలను దుర్వినియోగం చేస్తున్నారు. వలస పాలనకు ప్రతీకలుగా ఉన్న గవర్నర్ల వ్యవస్థను రద్దు చేయాలి'అని దిలీప్ పేర్కొన్నారు. దీనిపై కేటీఆర్ మంగళవారం స్పందించారు. 'బీజేపీయేతర రాష్ట్రాల వైపు ఒకసారి చూడండి. తమపార్టీ అధికారంలో లేని అన్ని రాష్ట్రాల విషయంలో కేంద్ర ప్రభుత్వం ఒకే విధమైన సహాయ నిరాకరణ చేస్తూ, ప్రతీకారేచ్ఛను చూపుతోంది. సహకార సమాఖ్య నమూనా అంటే ఇదేనా? ఈ తరహా టీమ్ ఇండియా స్ఫూర్తి దేశ ప్రగతికి, సామరస్యానికి ఎలా దోహదం చేస్తుంది?..'అని కేటీఆర్ ఒక ట్వీట్‌లో ప్రశ్నించారు.

జ్యోతిబా పూలే చిత్ర పటానికి పుష్పాంజలి

అణగారిన వర్గాల అభ్యున్నతి, విద్యాభివృద్ధికి కృషి చేసిన గొప్ప సంఘసంస్కర్త మహాత్మా జ్యోతిబా పూలే అని కేటీఆర్ కొనియాడారు. పూలే జయంతి సందర్భంగా తెలంగాణభవన్‌లో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.

కేటీఆర్‌తో మహారాష్ట్ర నేత ఆదిత్య థాకరే భేటీ



కేటీఆర్‌తో భేటీ అయిన ఆదిత్య థాకరే

సాక్షి, హైదరాబాద్: మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ థాకరే కుమారుడు, మాజీమంత్రి ఆదిత్యథాకరే మంగళవారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్‌తో భేటీ అయ్యారు. హైదరాబాద్ పర్యటనకు వచ్చిన ఆదిత్య థాకరే తన బృందంతో కలిసి 'టీ హబ్'ను సందర్శించారు. టీహబ్ ఏర్పాటుకు జరిగిన కృషి, ఇక్కడ జరిగిన ఆవిష్కరణలు తదితరాల గురించి కేటీఆర్‌ను అడిగి తెలుసుకున్నారు. టీహబ్ ప్రాంగణంలో పనిచేస్తున్న పలు స్టార్టప్‌లు, ఆవిష్కర్తలతో సంభాషించారు. టీహబ్ సందర్శనకు వచ్చిన ఆదిత్య థాకరేను మంత్రి కేటీఆర్ సన్మానించి ఫిలిగ్రీ కళాకృతిని బహూకరించారు. ఆదిత్య థాకరే కూడా మంత్రి కేటీఆర్‌ను సన్మానించి సిద్ధివినాయకుడి ప్రతిమను బహూకరించారు. కేటీఆర్‌తో జరిగిన భేటీకి సంబంధించిన ఫొటోలను ట్యాగ్ చేస్తూ భారతదేశ అభివృద్ధికి ఇంధనంలా దోహదం చేయనున్న సుస్థిరాభివృద్ధి, పట్టణీకరణ, సాంకేతికత వంటి అంశాలపై తమ నడుమ చర్చ జరిగినట్లు ఆదిత్య థాకరే ట్విట్టర్‌లో పేర్కొన్నారు. కేటీఆర్‌ను కలవడం ఎల్లప్పుడూ తనకు అద్భుతంగా, స్ఫూర్తిమంతంగా ఉంటుందన్నారు. కేటీఆర్ కూడా ఆదిత్య థాకరే చేసిన ట్వీట్‌కు స్పందిస్తూ 'గతేడాది దవోస్‌లో ఆదిత్యతో భేటీ జరిగిన తర్వాత మళ్లీ కలవడం ఆనందంగా ఉంది'అని కేటీఆర్ పేర్కొన్నారు. ఆదిత్య థాకరేతోపాటు శివసేన రాజ్యసభ సభ్యురాలు ప్రియాంక చతుర్వేది కూడా పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు మూడోసారి పాలించే హక్కులేదు

కొల్లాపూర్‌లో విలేకరులతో మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: రాష్ట్రాన్ని మూడోసారి పాలించే హక్కును బీఆర్ఎస్ పార్టీ కోల్పోయిందని మాజీమంత్రి జూపల్లి కృష్ణారావు విమర్శించారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తే కిరీటం ఏమీ పోలేదని, మరింత గౌరవం పెరిగిందన్నారు. గత మూడేళ్లుగా తనను పార్టీ సభ్యుడిగా చూడలేదని, కనీసం సభ్యత్వ పుస్తకాలను కూడా చేతికివ్వలేదని చెప్పారు. అక్రమాలపై ప్రశ్నించినందుకే తనపై సస్పెన్షన్ వేటు వేశారన్నారు. ఇప్పుడు తనకు పంజరం నుంచి బయటకు వచ్చినంత సంతోషంగా ఉందని చెప్పారు. రిమోట్ కంట్రోల్ అంతా ప్రగతిభవన్‌లోనే ఉందని చెప్పా రు. వైఎస్ రాజశేఖరరెడ్డి ఫొటో ఇంట్లో పెట్టుకుంటే మంత్రి నిరంజన్‌రెడ్డికి కోపమెందుకని ప్రశ్నించారు. తన ఇంట్లో సీఎం కేసీఆర్ ఫొటో కూడా ఉందని, భవిష్యత్తులోనూ ఉంటుందని స్పష్టం చేశారు. ఈసారి ఎన్నికల్లో ఉమ్మడి పాలమూరు జిల్లాలో 13 సీట్లలో బీఆర్ఎస్ వ్యతిరేకులే గెలుస్తారని జోస్యం చెప్పారు. బీఆర్ఎస్ కనీసం ఒక్క సీటు గెలవడం కూడా అనుమానమేనన్నారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం మొదట 2.50 లక్షల ఎకరాల సామర్థ్యానికే మంజూరైందని, తర్వాత 3.50 లక్షల ఎకరాలకు తానే పెంచానని చెప్పారు. కేఎల్ఐ ద్వారా వనపర్తికి నీళ్లు రావడంతోనే ఆయనకు పేరొచ్చిందన్నారు. టీడీపీ హయాంలో ఖాదీ బోర్డు చైర్మన్‌గా ఉన్న నిరంజన్‌రెడ్డి అక్రమాలకు పాల్పడటంతో ప్రభుత్వం ఆయన్ను సస్పెండ్ చేసిందని గుర్తుచేశారు. అయినా పదవికి రాజీనామా చేయక పోవడంతో బోర్డునే రద్దు చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు.

జూపల్లికి డీకే అరుణ ఫోన్

'మీరు దేని కోసమైతే పోరాడారో ఆ లక్ష్యం నెరవేరలేదు. ఉద్యమించి సాధించుకున్న రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగడం లేదు. ఈ నియంతృత్వ ప్రభుత్వంపై సమష్టిగా పోరాటం చేద్దాం'అని సీనియర్ నేత, మాజీమంత్రి జూపల్లి కృష్ణారావును బీజేపీలోకి రండి అంటూ ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ఆహ్వానించారు. బీఆర్ఎస్ నుంచి సస్పెన్షన్‌కు గురైన జూపల్లికి ఆమె ఫోన్ చేసి మాట్లాడారు.

మేడే రోజు కార్మికులకు సీఎం శుభవార్త

- ఆంధ్ర కార్మికులు తెలంగాణ ఓటర్లుగా చేరండి
- ఆర్థిక వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్



సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: మేడే రోజున సీఎం కేసీఆర్ నోట కార్మికులు శుభవార్త వింటారని ఆర్థిక వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. సంగారెడ్డిలో భవన నిర్మాణ కార్మికుల భవన నిర్మాణానికి మంగళవారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములై చెమట చుక్కలు కార్చిన ప్రతి ఒక్కరూ తెలంగాణ బిడ్డలేనని కేసీఆర్ పేర్కొన్నారని చెప్పారు. ఆంధ్ర ప్రాంతానికి చెందిన భవన నిర్మాణ కార్మికులు తెలంగాణలో ఓటర్లుగా నమోదు చేసుకోవాలని కోరారు. రోడ్లు, ఆసుపత్రులు వంటి వాటి విషయంలో ఆంధ్రకు, తెలంగాణకు జమీన్ ఆస్మాన్ ఫరక్ ఉందని వ్యాఖ్యానించారు. ఆంధ్రలో ఓటు హక్కు రద్దు చేసుకొని తెలంగాణలో ఓటర్లుగా నమోదు చేసుకోవాలని హరీశ్ సూచించారు.

27న బీఆర్ఎస్ ప్రతినిధుల భేటీ: కేటీఆర్

119 అసెంబ్లీ నియోజకవర్గాలోనూ నిర్వహణ

సాక్షి, హైదరాబాద్: భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈనెల 27వ తేదీన పార్టీ అధినేత, సీఎం కె.చంద్రశేఖర్‌రావు ఆదేశాల మేరకు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ పార్టీ ప్రతినిధుల సభలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు అన్ని జిల్లాల పార్టీ ఇన్‌చార్జిలకు సూచనలు, సలహాలు ఇచ్చామని మంత్రి కేటీఆర్ తెలిపారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. పార్టీ ఆవిర్భావం 22 ఏళ్లు పూర్తి చేసుకుని 23వ సంవత్సరంలో అడుగుపడుతున్న తరుణంలో అన్ని గ్రామాలు, డివిజన్లు, వార్డుల్లో పార్టీ పతాక ఆవిష్కరణలు చేపట్టాలని సూచించారు. రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు, రాజకీయ పరిస్థితులు దేశంలోని రాజకీయాలు చర్చించాలని కోరారు. రాష్ట్రంలో ఈ ఏడాది చివరలో జరిగే శాసనసభ , వచ్చే ఏడాది జరిగే పార్లమెంట్ ఎన్నికల కోసం సన్నద్ధం అవడానికి వీలుగా ఈ సమావేశాలు కొనసాగుతాయన్నారు.

తెలుగు రాష్ట్రాలకు తీరని అన్యాయం

▶ మొదటి పేజీ తరువాయి

గుజరాత్‌లోని ముంద్రాలో నిర్మించే ఉక్కు పరిశ్రమకు ఏ విధంగా లాభసాటి అవుతుందని ఆయన ప్రశ్నించారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో మంత్రులు సత్యవతి రాథోడ్, పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్సీలు కోటిరెడ్డి, భానుప్రసాద్ తదితరులతో కలిసి కేటీఆర్ విలేకరులతో మాట్లాడారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో మంత్రులు పువ్వాడ అజయ్, సత్యవతి రాథోడ్

కుట్రలు గమనించలేకపోయాం..

'బయ్యారం, విశాఖ రెండింటికీ ముఖ్యమైంది బైలదిల్లా. 134 కోట్ల మెట్రిక్ టన్నుల గని. బయ్యారం, కడపలో ఉక్కు కర్మాగారాలు నిర్మిస్తామని ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోనే చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం బయ్యారం కోసం 2014 నుంచి అడుగుతోంది. పరిశ్రమల మంత్రిగా నేను ప్రధానమంత్రిని 2018 జూన్‌లో కలిసి విజ్ఞప్తి చేశా. సీఎం కేసీఆర్ కూడా లేఖలు రాశారు. అయితే బయ్యారంలో ఇనుప ఖనిజం నాణ్యత తక్కువ అంటూ తప్పుదోవ పట్టించారు. ''బయ్యారానికి కేవలం 150 కి.మీ దూరంలోపి బైలదిల్లాలో నాణ్యత గల ఇనుప ఖనిజం ఉంది. అక్కడ నుంచి స్లర్రీ పైపు లైను వేయవచ్చు. అందుకయ్యే వ్యయంలో యాభై శాతం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుంది. బైలదిల్లా నుంచి ఇనుప ఖనిజం కేటాయించి, బయ్యారంలో స్టీల్ ఫ్యాక్టరీ నిర్మిస్తే 15 వేల నుంచి 20 వేల మంది స్థానికులకు ఉపాధి లభిస్తుంది. మీరు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నట్లు అవుతుంది''అని ప్రధానికి చెప్పా. మేం అడిగి వచ్చామో లేదో 2018 సెప్టెంబర్‌లో అదానీ బైలదిల్లా ఐరన్ ఓర్ కంపెనీని పెట్టారు. బైలదిల్లా అదానీ చేతుల్లోకి వెళ్లింది 'అని వివరించారు.

'విశాఖ'ను అమ్మడానికి కేంద్రం కుట్ర..

'విశాఖ ప్లాంట్‌కు క్యాప్టివ్ మైనింగ్ ఇవ్వకుండా నష్టాల్లోకి వెళ్లేలా చేసి, దానిని అడ్డికి పావుశేరు లెక్కన అమ్మడానికి కేంద్రం కుట్ర చేస్తోంది. అదానీకి రూ.6 లక్షల కోట్ల విలువైన బైలదిల్లాను కట్టబెట్టడమే కాకుండా.. రూ. 1.5 లక్షల కోట్ల విలువైన విశాఖ కర్మాగారాన్ని కూడా కట్టబెట్టే యత్నం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి పార్లమెంట్‌లో అడిగిన ప్రశ్నకు కేంద్రం బదులిస్తూ.. పాస్కో విశాఖ కర్మాగారాన్ని చూసిందని, అక్కడ పరిశ్రమ పెట్టాలని యోచించగా, దానిని గుజరాత్‌కు మళ్లించారు'అని ధ్వజమెత్తారు.

బిడ్డింగ్ సాధ్యాసాధ్యాల పరిశీలనకే విశాఖకు..

'విశాఖపై అధ్యయనం మాత్రమే చేస్తున్నాం. క్యాప్టివ్ మైనింగ్ లేకుండా సాధ్యమవుతుందా లేదా? బిడ్డింగ్‌లో పాల్గొనడానికి ఉన్న సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేయడానికే అధికారులు అక్కడికి వెళ్లారు. అన్ని అంశాలను పరిశీలించి నివేదిక ఇచ్చిన తరువాతే ఒక నిర్ణయం తీసుకుంటాం..'అని కేటీఆర్ తెలిపారు.

బండి సంజయ్ ఓ అజ్ఞాని..

'బయ్యారం ఉక్కు పరిశ్రమను పట్టించుకోకుండా విశాఖ ఉక్కుపై ఎందుకు ఆసక్తి చూపుతున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ సంజయ్ ప్రశ్నించారు. ఆయనకు విషయపరిజ్ఞానం లేదు. ఓ అజ్ఞాని. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి.. బయ్యారం కర్మాగారానికి ఫీజిబిలిటీ లేదు అంటాడు. అక్కడ నాణ్యత లేదంటాడు. ప్రధాని, అదాని, అజ్ఞాని.. ఓ డెడ్లీ కాంబినేషన్. ప్రధానులు ఎవరైనా ప్రాజెక్టులను జాతికి అంకితం చేస్తారు. కానీ ఈ ప్రధాని జాతి సంపదను తన జాతి రత్నాలకు దోచిపెడుతున్నారు. ఇప్పటికే విమానాశ్రయాలు, పోర్టులను కట్టబెట్టారు..'అని కేటీఆర్ ఆరోపించారు.

ఒరిస్సా ఐరన్ ఓర్, వైజాగ్ స్టీల్స్‌తో తెలంగాణకు ఏం సంబంధం?

- కేటీఆర్‌కు బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ప్రశ్న



సాక్షి, హైదరాబాద్: ఒరిస్సాలోని ఐరన్ ఓర్‌కు, ఏపీలోని వైజాగ్ స్టీల్ ఫ్యాక్టరీకి తెలంగాణకు ఏం సంబంధమని కేటీఆర్‌ను బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ప్రశ్నించారు. ఆ రెండు లేకపోతే తెలంగాణలో తినడానికి అన్నమే దొరకదనట్లుగా కేటీఆర్ మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీలో ప్రభుత్వ వైఫల్యం బయటపడటంతో కేటీఆర్‌కు మైండ్ దొబ్బిందని, ఏం మాట్లాడుతున్నారో ఆయనకే అర్థం కావడం లేదని ఒక ప్రకటనలో విమర్శించారు. రాష్ట్రంలోని నిజాం షుగర్స్, అజంజాహి, సిర్పూర్ కాగజ్ మిల్లులను తెరిపించడం చేతగాదు కానీ, వైజాగ్ స్టీల్‌లో వాటా అంటూ బోగస్ మాటలు మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు. ఇదే విషయాన్ని తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ప్రశ్నిస్తే.. తమ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు బయ్యారం స్టీల్ అంశాన్ని కేంద్రంపైకి నెట్టే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. 'ఒరిస్సా లోని మైనింగ్‌లో ఎవరు బిడ్డింగ్ వేశారు? అక్కడ అవినీతి జరిగితే నవీన్ పట్నాయక్ ప్రభుత్వం ఎందుకు నోరు మూసుకుంది? అక్కడేమైనా బీజేపీ ప్రభుత్వం ఉందా? నవీన్‌కు తెల్వని బైలడిల్ల మైనింగ్ కుంభకోణం కేటీఆర్‌కు ఎట్లా తెలిసింది? ఆయనే సమాధానం చెప్పాలి'అని అరుణ డిమాండ్ చేశారు.



దేనికీ తొందరపడకు. సమయం వచ్చినప్పుడు దానంతట అదే జరుగుతుంది.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, ఏప్రిల్, 12

పులుల ప్రోగ్రెస్ రిపోర్ట్!

జీవవైవిధ్యాన్ని పరిరక్షించటంలో, పర్యావరణాన్ని కాపాడటంలో, ప్రకృతి సమతుల్యత కొనసాగటంలో పులుల ప్రాధాన్యం తెలిసినవారికి దేశంలో పులుల సంఖ్య పెరిగిందన్న వార్త ఉపశమనం ఇస్తుంది. ప్రధాని ఆదివారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం ప్రస్తుతం దేశవ్యాప్తంగా 3,167 పులులున్నాయి. అయిదేళ్లక్రితం 2,226గా ఉన్న సంఖ్య ఇంతగా పెరిగిందంటే పులుల సంరక్షణకు తీసుకుంటున్న పటిష్ఠ చర్యలే కారణమనడంలో సందేహం లేదు. ఒక్క పులులన్న మాటేమిటి... వన్యమృగాల సంరక్షణ కోసం తీసుకుంటున్న చర్యల వల్ల సింహాలు, చిరుతపులుల సంఖ్య కూడా గణనీయంగా హెచ్చింది. ఆసియా జాతి సింహాల సంఖ్య 523 నుంచి 674కు, చిరుతల పులుల సంఖ్య దాదాపు 8,000 నుంచి 12,852కు పెరిగాయి. పులుల సంఖ్య పెంచటంతోపాటు దేశంలో కనుమరుగైన చీతాలను నమీబియా, దక్షిణాఫ్రికాల నుంచి తెప్పించి ఇక్కడి అడవుల్లో వదిలిపెట్టారు. ప్రపంచంలో ఉన్న పులుల్లో 70 శాతం మన దేశంలోనే ఉన్నాయంటే అది ప్రాజెక్టు టైగర్ పథకం చలవే. సరిగ్గా యాభైయ్యేళ్ల క్రితం భారత్‌లో పులుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలన్న సంకల్పంతో డాక్టర్ కరణ్‌సింగ్ నేతృత్వంలో పద్మజానాయుడు, కైలాస్ సంకాల వంటివారితో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశారు. తర్వాతే ప్రాజెక్ట్ టైగర్ కింద పులుల తొలి సంరక్షణ కేంద్రం జిమ్ కార్బెట్ నేషనల్ పార్క్ మొదలైంది. పులుల సంరక్షణ కేంద్రాల సంఖ్య ప్రస్తుతం 55కు చేరుకుంది. ప్రాజెక్టు టైగర్ ప్రారంభించేనాటికి పులులు, సింహాల వేట సంపన్నవర్గాలకు వినోదంగా ఉండేది. వారిని అడవుల జోలికి రాకుండా చేయటానికి కఠిన చర్యలు తీసుకోవటం ప్రారంభించాక క్రమేపీ ఆ ధోరణి తగ్గింది.

అభివృద్ధి పేరిట ప్రకృతి వనరులను అతిగా వినియోగించుకోవటం వల్ల వన్యప్రాణుల్లోని ఎన్నో జాతులకు ప్రాణం మీదికొస్తోంది. ప్రపంచ వన్యప్రాణుల సమాఖ్య లెక్క ప్రకారం ప్రపంచవ్యాప్తంగా రోజుకు 27 రకాల జాతులు అంతరిస్తున్నాయి. పులుల సంఖ్య పెరిగిందని తాజా గణాంకాలు చెబుతున్నా దేశంలో ఇంకా శ్రద్ధ పెట్టాల్సిన ప్రాంతాలు చాలానే ఉన్నాయి. ప్రపంచంలోనే జీవ వైవిధ్యతకు పెట్టింది పేరైన పడమటి కనుమల ప్రాంతంలో పులుల సంఖ్య తగ్గిందని గణాంకాలు సూచిస్తున్నాయి. 1,600 కిలోమీటర్ల పొడవునా 1,40,000 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం పరిధిలో పడమటి కనుమలు కర్ణాటక, మహారాష్ట్ర, గోవా, కేరళ, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల్లో విస్తరించి ఉన్నాయి. ఈ రాష్ట్రాల్లో పులుల సంరక్షణ కేంద్రాలు 12 ఉండగా, ఇతరేతర వన్యప్రాణి సంరక్షణ కేంద్రాలు 68 వరకూ ఉన్నాయి. అయితే అయిదేళ్లక్రితం ఈ ప్రాంతంలో 981గా ఉన్న పులుల సంఖ్య ఇప్పుడు 824 మాత్రమే. పడమటి కనుమలను యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించి చాన్నాళ్లయింది. అక్కడి మూడోవంతు ప్రాంతం జీవావరణపరంగా సున్నితమైనదని 2010లో కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ ప్రకటించింది కూడా. కానీ తదుపరి చర్యలు అందుకు తగ్గట్టుగా లేవు. ఇలా ప్రకటించటాన్ని కర్ణాటక, కేరళ, గోవా తప్పుబట్టాయి. కేంద్ర ప్రభుత్వం తన బాధ్యత తీరిందన్నట్టు చేతులు దులుపుకొంది. ఫలితంగా అడవులు తరిగి, పర్యావరణం దెబ్బతిని, వన్యప్రాణులకు ప్రాణాంతకమైన పరిస్థితులు ఏర్పడ్డాయి. దాని పర్యవసానంగానే దేశమంతా పులుల సంఖ్య పెరిగితే అక్కడ తగ్గింది. దీన్ని తగ్గటంగా పరిగణించనవసరం లేదు...పులుల సంఖ్య స్థిరంగా ఉండిపోయినట్టు భావించాలని సన్నాయి నొక్కులు నొక్కుతున్నవారు లేకపోలేదు. కానీ అడవులు అంతరిస్తూ వాటి స్థానంలో రోడ్లు విస్తరిస్తుంటే...పర్యాటకం పేరిట మనుషుల తాకిడి పెరుగుతుంటే, ఖనిజాల కోసం అడవులు నరకడానికి పూనుకుంటే వన్యప్రాణులు ప్రశాంతంగా మనుగడ సాగించలేవు. పులులు, అవి వేటాడే జంతువులు సంచరించే ప్రాంతాలు కుంచించుకుపోతే పులులపై అది తీవ్ర ప్రభావం చూపుతుంది. వేట కోసం వెదుక్కుంటూ జనావాసాలపై కూడా పడతాయి. రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు లొంగి అడవుల వినాశనానికి కారణమవుతున్న ప్రభుత్వాలు ఆ తర్వాత జరిగే పర్యవసానాలు ఎదుర్కొనటానికి మరిన్ని అవకతవకలకు పాల్పడుతున్నాయి. ఏనుగులు, పులులు, చిరుతల బారినపడి గత పదినెలల్లో 41మంది పౌరులు మరణించారని మొన్న ఫిబ్రవరిలో కర్ణాటక ప్రభుత్వం అసెంబ్లీకి తెలిపింది. స్వేచ్ఛగా సంచరించటానికి, ఆహారం వెదుక్కొనటానికి అనువైన పరిస్థితులు లేనప్పుడు పులుల్లో ఒకరకమైన అభద్రతాభావం ఏర్పడి వాటి పునరుత్పత్తి సామర్థ్యం క్షీణిస్తుందని నాలుగేళ్లక్రితం సీసీఎంబీ నివేదిక హెచ్చరించింది.

వన్యమృగాల సంరక్షణ పేరుతో ఆదివాసీలను అడవులకు దూరం చేద్దామని ప్రయత్నించే ప్రభుత్వాలు తీరా ఆ అడవులను ఖనిజాల వెలికితీత కోసం బహుళజాతి సంస్థలకు కట్టబెట్టడానికి, విశాలమైన రోడ్లు నిర్మించటానికి వెనకాడటం లేదు. దాంతో భారీ యంత్రాలు అక్కడికి తరలివస్తున్నాయి. వన్యప్రాణులను హడలెత్తిస్తున్నాయి. నిజానికి శతాబ్దాలుగా ఆదివాసీలు వన్యప్రాణులతో సురక్షితంగా సహజీవనం సాగిస్తున్నారు. వాటి కదలికలకు అనువుగా జీవనం సాగించటం, వాటికి హాని కలగనిరీతిలో అవసరమైన ఆత్మరక్షణ చర్యలు తీసుకోవటం పరంపరాగతంగా వారికి అలవడిన విద్య. ఏదేమైనా అడవుల సంరక్షణకూ, వన్యమృగాలను కాపాడటానికి ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోనట్టయితే జీవవైవిధ్యం నాశనమవుతుంది. మానవాళి మనుగడకు ముప్పు ఏర్పడుతుంది. ఇప్పుడు వెలువడిన నివేదికలోని గణాంకాలు ఆశావహంగానే ఉన్నా చేయాల్సింది ఇంకెంతో ఉన్నదని నివేదిక తెలియజేస్తోంది. ఆ దిశగా అడుగులేయటమే ప్రభుత్వాల కర్తవ్యం.

డిజిటల్ అగ్రగామిగా భారత్!

ఆధార్, ఏకీకృత చెల్లింపు వ్యవస్థలు, డేటా పంపిణీ... ఈ మూడూ కలిసి భారత్‌ను 'ప్రపంచ డిజిటల్ అగ్రగామి'గా నిలబెట్టాయని 'స్టాకింగ్ ఆఫ్ ది బెనిఫిట్స్ : లెసన్స్ ఫ్రమ్ ఇండియాస్ డిజటల్ జర్నీ' అనే శీర్షికతో తాజాగా విడుదల చేసిన కార్యాచరణ పత్రంలో అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) వెల్లడించింది. ఈ డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ని ఉపయోగించడం ద్వారానే భారత్ మహమ్మారి కాలంలో నిరుపేద కుటుంబాలకు చెప్పుకోదగిన వాటాతో మద్దతును వేగంగా అందివ్వగలిగిందని, డిజిటల్ అకౌంట్ అగ్రిగేటర్ ద్వారా ఆర్థిక సేవల సులభ సంప్రాప్యత నుంచి దాదాపు 45 లక్షల మంది వ్యక్తులు, కంపెనీలు లబ్ధి పొందారని, దీన్నింకా వేగంగా తమ సొంతం చేసుకుంటున్నారని ఆ పత్రం ప్రశంసించింది. అదే సమయంలో భారత్‌లో సమగ్ర డేటా రక్షణ చట్టం ఇప్పటికీ లేదని ఐఎమ్ఎఫ్ పత్రం పేర్కొంది. పౌరుల గోప్యతను కాపాడటానికి డేటా ఉల్లంఘనలకు పాల్పడిన వారిని జవాబుదారీగా చేయడానికి దృఢమైన డేటా పరిరక్షణ చట్టం రూపకల్పన తప్పనిసరి అని సూచించింది.

మానవ జీవితాలను, ఆర్థిక వ్యవస్థను మార్చివేస్తున్న ప్రపంచ స్థాయి డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ని భారతదేశం నిర్మించిందని, ఇది అనేక దేశాలు అనుసరించాల్సిన పాఠం అవుతుందని తాజా ఐఎమ్ఎఫ్ కార్యాచరణ పత్రం పేర్కొంది. 'ఇండియా స్టాక్' అనేది భారత్‌లో సాధారణంగా ఉపయోగిస్తున్న డిజిటల్ పబ్లిక్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐలు) సెట్‌కి సామూహిక పేరు. దీంట్లో మూడు విభిన్నమైన పొరలు ఉంటున్నాయి. అవి, 1. ప్రత్యేక గుర్తింపు (ఆధార్), 2. కాంప్లిమెంటరీ చెల్లింపు వ్యవస్థలు (ఏకీకృత చెల్లింపు ఇంటర్‌ఫేస్, ఆధార్ పేమెంట్స్ బ్రిడ్జ్, ఆధార్ ఆధారిత పేమెంట్ సర్వీస్), 3. డేటా పంపిణీ (డిజీలాకర్, అకౌంట్ అగ్రిగేటర్). ఇవన్నీ కలిసి అనేక పబ్లిక్, ప్రైవేట్ సేవలకు.. ఆన్‌లైన్, కాగిత రహిత, నగదు రహిత, గోప్యతకు ప్రాధాన్యం ఇచ్చే డిజిటల్ సంప్రాప్యతను కల్పించాయని 'స్టాకింగ్ ఆఫ్ ది బెనిఫిట్స్ : లెసన్స్ ఫ్రమ్ ఇండియాస్ డిజిటల్ జర్నీ' అనే శీర్షికతో కూడిన అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ కార్యాచరణ పత్రం తెలిపింది. ఈ మదుపు ప్రయోజనం భారత్ వ్యాప్తంగా అనుభవంలోకి రావడమే కాకుండా కోవిడ్ 19 మహమ్మారి కాలంలో దేశానికి ఎంతో సేవచేసిందని ఆ పత్రం వెల్లడించింది. ప్రభుత్వ ఖజానా నుంచి లబ్ధిదారుల బ్యాంక్ అకౌంటుకు నేరుగా సామాజిక భద్రతా చెల్లింపుల పంపిణీని సులభతరం చేయడంలో ఆధార్ సహకరించిందని అది పేర్కొంది. దీనివల్ల లీకేజీలను తగ్గించడం, అవినీతిని అరికట్టడం, విస్తృతిని పెంచడం, సమర్థంగా కుటుంబాల వద్దకు చేరుకోవడానికి ఒక సాధనాన్ని అందించడంలో ఇది సహకరించింది అని వ్యాఖ్యానించింది.



విస్తృతంగా డిజిటల్ చెల్లింపులు

డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఇతర ప్రభుత్వ సంస్కరణల కారణంగా 2021 మార్చి వరకు జీడీపీలో 1.1 శాతం వ్యయాన్ని ఆదా చేసినట్లు భారత ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ డిజిటల్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్‌ని ఉపయోగించడం ద్వారా భారత్ మహమ్మారి కాలంలో నిరుపేద కుటుంబాలకు చెప్పుకోదగిన వాటాతో మద్దతును వేగంగా అందించగలిగింది. మహమ్మారి ఆవహించిన తొలి నెలల కాలంలో నిరుపేద కుటుంబాల్లో 87 శాతం కనీసం ఒక లబ్ధి పథకాన్నయినా అందుకున్నారు. సృజనాత్మక ఆవిష్కరణను, పోటీని పెంచడానికి, మార్కెట్లను విస్తరించడానికి, ప్రభుత్వ ఆదాయ సేకరణను పెంచుకోవడానికి, ప్రభుత్వ వ్యయ సమర్థతను మెరుగుపర్చుకోవడానికి ఇండియా స్టాక్ ఒక ప్లాట్‌ఫామ్‌గా ఉపయోగపడింది. డిజిటల్ చెల్లింపులు ఇప్పుడు సర్వవ్యాప్తమయ్యాయి. దేశంలో అన్ని చెల్లింపుల లావాదేవీల్లో యూపీఐ చెల్లింపులు 68 శాతంగా ఉన్నాయి. డిజిటల్ చెల్లింపుల ఉపయోగం చిన్న వర్తకుల కస్టమర్ పునాదిని విస్తరించింది, వారి నగదు ప్రవాహాన్ని నమోదు చేసి, ద్రవ్య సంప్రాప్యతను మెరుగుపర్చింది.

పెరిగిన ప్రభుత్వ రాబడి

2021 ఆగస్టులో మొదటిసారి ప్రారంభించినది మొదలు 'అకౌంట్ అగ్రిగేటర్' ద్వారా ఆర్థిక సేవల సులభ సంప్రాప్యత నుంచి దాదాపు 45 లక్షల మంది వ్యక్తులు, కంపెనీలు లబ్ధి పొందారని, దీన్ని వేగంగా తమ సొంతం చేసుకుంటున్నారని ఆ పత్రం తెలిపింది. డిజిటలీకరణ అనేది ఆర్థిక వ్యవస్థ అధికారికీకరణను కూడా బలపర్చింది. 2017 జూలై నుంచి 2022 మార్చి మధ్యలో జీఎస్టీ కోసం 88 లక్షల మంది కొత్త పన్ను చెల్లింపుదారులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. దీంతో ఇటీవలి సంవత్సరాల్లో ప్రభుత్వ రాబడులు గణనీయంగా పెరిగాయి. ప్రభుత్వ సర్వీస్ ప్రొవిజన్‌ను కూడా క్రమబద్ధీకరించారు. ఉదాహరణకు... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన డాక్యుమెంట్లను ఒకే ప్లాట్ ఫామ్ ద్వారా పౌరులు పొందవచ్చు. అదేవిధంగా, ఇండియా స్టాక్ 'నో యువర్ కస్టమర్' నిబంధనలను డిజిటలీకరించి, సులభతరం చేసింది. ఖర్చులను తగ్గించింది. ఇ-కేవైసీని ఉపయోగిస్తున్న బ్యాంకులు సమ్మతి ఖర్చును 12 అమెరికా డాలర్ల నుంచి 6 అమెరికన్ సెంట్లకు తగ్గించుకున్నాయి.

మహిళలే లక్ష్యంగా జన్‌ధన్

ఖర్చుల్లో ఈ తగ్గుదల తక్కువ ఆదాయం ఉన్న క్లయింట్‌లు కొత్త ఉత్పత్తుల అభివృద్ధి కోసం సేవలను మరింతగా ఆకర్షిస్తూ, లాభాలు ఆర్జించడానికి వీలు కల్పించింది. ఆర్థిక అభివృద్ధిలో అందర్నీ భాగస్వామ్యం చేయడానికి సంబంధించి ఒక ఉదాహరణను ప్రస్తావిస్తూ ఆ పత్రం ఇలా చెప్పింది. "తక్కువ ఖర్చుతో కూడిన బ్యాంక్ ఖాతాకు అవకాశం కల్పించడం వల్ల బ్యాంక్ ఖాతాలతో వ్యక్తుల కవరేజీ రెట్టింపు అయింది. జన్‌ధన్ పథకం ఆర్థికంగా అర్హత లేనివారిని, ప్రత్యేకించి గ్రామీణ మహిళలను లక్ష్యంగా చేసుకుంది. ఈ పథకం కింద 2022 ఆగస్టు నాటికి 46 కోట్లకు పైగా బ్యాంక్ ఖాతాలను పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తెరిచారు. డిజిటల్ బ్యాక్‌బోన్‌ను ఉపయోగించడం వల్ల భారత్ తన వ్యాక్సిన్ పంపిణీని శరవేగంగా చేయగలడమే కాదు... భారీస్థాయి అంతర్గత వలసలు వంటి సవాళ్లను అధిగమించింది" అని ఐఎమ్ఎఫ్ కార్యాచరణ పత్రం పేర్కొంది. కో-విన్‌లో పొందుపర్చిన టెక్నాలజీని ఇండోనేసియా, ఫిలిప్పీన్స్, శ్రీలంక, జమైకాలలో కూడా అమలు పర్చారు. ఇది ఆయా దేశాల వ్యాక్సినేషన్ ప్రోగ్రాంను సులభతరం చేసింది.

డేటా పరిరక్షణ తప్పనిసరి

సవాళ్ల విషయానికి వస్తే, భారత్‌లో సమగ్ర డేటా రక్షణ చట్టం ఇప్పటికీ లేదని ఐఎమ్ఎఫ్ పత్రం పేర్కొంది. పౌరుల గోప్యతను కాపాడటానికి; కంపెనీలు, ప్రభుత్వాలు విచక్షణారహితంగా డేటా సేకరించడాన్ని నిరోధించడానికి; డేటా ఉల్లంఘనలకు పాల్పడిన కంపెనీలు, ప్రభుత్వాలను జవాబుదారీగా చేయడానికి దృఢమైన డేటా పరిరక్షణ చట్ట రూపకల్పన తప్పనిసరి. సముచితమైన రీతిలో డేటా నిర్వహణకు, సైబర్ భద్రత రంగంలో తగిన మదుపులు పెట్టడానికి ఇది చాలా అవసరం.

సామాజిక సహాయం మరింత దృఢంగా, స్వీకరించదగినదిగా చేసే ప్రయత్నాలకు మద్దతు ఇచ్చే విషయంలో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐ) కూడా సహకరిస్తుంది. ఉదాహరణకు, రాష్ట్రాల వ్యాప్తంగా వివిధ పథకాల మధ్య డేటా పంపిణీకి ఆధార్‌ను ఉపయోగించవచ్చని ఐఎమ్ఎఫ్ కార్యాచరణ పత్రం పేర్కొంది. చివరగా, డీపీఐ (డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్)ని ప్రభావితం చేయడానికి కాలక్రమాలు, నాణ్యత, సాధారణ ప్రభుత్వ ద్రవ్య నివేదికల కవరేజీ వంటివాటిని భారత్ గణనీయంగా మెరుగుపర్చుకుంది. అదే సమయంలో తన పౌరుల కోసం ప్రభుత్వ రంగ జవాబుదారీతనాన్ని మెరుగుపర్చుకోవడంలో ద్రవ్యపరమైన పారదర్శకతను విస్తరించడం అనేది కీలక అంశంగా ఉంటోంది.

– ఎమ్. ముఖేశ్ రాణా, ప్రెస్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

అనుకునే ప్రమాదం



భారతదేశంలో గత దశాబ్ద కాలంగా పేదరికంపై అధికారిక సర్వే విడుదల కాలేదు. పక్షపాతంతో కూడిన ప్రైవేట్ డేటా కారణంగా నిజమేమిటో మరుగున పడిపోయి భారత్ నిజంగానే పేదరికాన్ని నిర్మూలించిందని ప్రజలు అనుకునే ప్రమాదం ఉంది. నా అభిప్రాయం ప్రకారం దేశంలో పేదరికం మరింతగా పెరిగింది.

– అశోక్ మోదీ, 'ప్రిన్స్‌టన్' ప్రొఫెసర్

జాతీయ నాయకుడు



ఒకవైపు రాహుల్ కలలో కూడా అదానీ పేరును మరిచిపోవడం లేదు. మరోవైపు స్థానిక సమస్యలపై ఆయన దృష్టి పెట్టడం లేదని కర్ణాటక కాంగ్రెస్ నాయకులు అసంతృప్తితో ఉన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ గెలుపు ఖాయం అనుకుని ఈ ఎన్నికలను రాహుల్ పట్టించుకోవడం లేదా?!

– వర్షాసింగ్, జర్నలిస్ట్

మరీ అంతగానా!



జర్మనీ రాయబారి జాన్ క్రిస్టియన్ గోర్డాన్ క్రీక్ తన 'మర్యాద లేని వైఖరి'తో మధ్య ఆఫ్రికా దేశం చాద్ నుండి బహిష్కరణకు గురయ్యారు. ఇంతకూ ఆయన చేసిన తప్పేమిటి? చాద్‌లో ప్రజాస్వామ్య పునః ప్రతిష్ఠకు జరుగుతున్న జాప్యంపై పదే పదే ఆందోళన వ్యక్తం చేయడం!

– అజిత్ దత్తా, పొలిటికల్ కామెంటేటర్

చట్టానికి చెల్లు చీటీ



మొత్తానికి ఫిజీ పార్లమెంటు తన చరిత్రాత్మకమైన ఓటింగుతో వివాదాస్పదమైన 'మీడియా ఇండస్ట్రీ డెవలప్‌మెంట్ అథారిటీ యాక్ట్'ను రద్దు చేసింది. ఆ చట్టం 2010 నుంచి జర్నలిస్టుల పనిని నియంత్రిస్తూ, వారి రెక్కలను కత్తిరిస్తూ వస్తోంది.

– సీమా భిస్తీ, 'ది వైర్' ఎడిటర్

చారిత్రక విశేషం



నేను చదివిన అదే కాలేజీలో (బిట్స్ పిలానీ), అదే కోర్సు (గణితం) చేసిన విక్రమ్ సంపత్ పుస్తకాన్ని కొన్నాను. 'బ్రేవ్ హార్ట్స్ ఆఫ్ భారత్'ను ఆయన అద్భుతంగా రాశారు. ఆయన నా కాలేజీమేట అన్నది గొప్పగా అనిపిస్తోంది.

– విశాల్ కుమార్‌సింగ్, హిస్టరీ లవర్

ఇన్‌బాక్స్

ఆదివాసులను పట్టించుకోరా?

కేంద్ర పాలక పక్షం మావోయిస్టుల బూచి చూపిస్తూ జనవరి 11న, ఏప్రిల్ 7న ఛత్తీస్‌గఢ్‌లో ఆదివాసీ గ్రామాలపై వైమానిక దాడులు చేసింది. అయితే ఈ సమాచారం సోషల్ మీడియాలో సర్క్యులేట్ అయింది కానీ పౌర సమాజం పట్టించుకునేంత వైరల్ అవ్వలేదు. ఈ దాడులు కేవలం 'లా అండ్ ఆర్డర్' ప్రక్రియలో భాగంగానే జరిపారనేది ఒక వాదన. పాలకులు ఆయుధాలు ధరించిన మావోయిస్టులను భారతదేశ చట్టాలకు పూర్తి వ్యతిరేకులుగానే పరిగణించి ఉండవచ్చు. చట్ట ప్రకారం వ్యవహరిస్తూ వారిని అదుపు చెయ్యలేమనీ, యుద్ధం చేసి వారిని నిర్మూలించడం మినహా మరొక మార్గం లేదనీ వారు భావిస్తున్నట్లున్నారు. అయితే చట్టాలపై నమ్మకం లేని మావోయిస్టులకు చట్టబద్ధ పాలన గొప్పతనాన్ని నిరూపించే ప్రయత్నాలు ఎంతవరకు చేశారో పాలకులు ఆలోచించాల్సిందే.

నిజానికి నేడు పాలకులు, మావోయిస్టులు అంతర్జాతీయ యుద్ధనియమాలూ, మానవ హక్కులనూ దృష్టిలో పెట్టుకుని ఎవరికి వారు కొన్ని నియమాలు ఏర్పరచుకొని యుద్ధం చేయాలి. అలా నియమాలు పెట్టుకొని అనుసరించక పోవడం వల్ల స్థానికంగా నివసిస్తున్న ఆదివాసుల ప్రాథమిక హక్కుల ఉల్లంఘన జరుగుతోంది. అలాగే భారత రాజ్యాంగం ఆర్టికల్ 21 కల్పిస్తున్న జీవించే హక్కుకు భంగం కలుగుతోంది. చట్టబద్ధ పాలనను అందించాల్సిన పాలకులు మావోయిస్టుల నిర్మూలన పేరుతో అమాయక ఆదివాసీల హననానికి పాల్పడటం ఎంతవరకు సమంజసం? పాలకులకు, మావోయిస్టులకు మధ్య జరుగుతున్న యుద్ధం ఫలితంగా భారీ స్థాయిలో గిరిజనులు నష్టపోతు న్నారు. కాబట్టి యుద్ధం చేస్తున్న ఇరు పక్షాలూ స్థానిక ఆదివాసీల జీవించే హక్కుతో సహా ఇతర మానవ హక్కులను దృష్టిలో ఉంచుకోవాలి.

– అంకాళ్ళ పృథ్వీ రాజ్, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాది

నానాటికీ తీసికట్టుగా... మన ఔన్నత్యం

అభిప్రాయం



సి. రామచంద్రయ్య

పార్లమెంట్ సమావేశాలు ఒక తంతుగా, మొక్కుబడిగా సాగడం ఓ రివాజుగా మారి చాలాకాలం అయింది. ఇటీవల అర్ధంతరంగా ముగిసిన బడ్జెట్ సమావేశాలు ఆ సంప్రదాయాన్ని కొనసాగించాయి. పార్లమెంట్ అధికారిక లెక్కల ప్రకారం 134 గంటల పాటు జరగాల్సిన లోక్‌సభ సమావేశాలు కేవలం 46 గంటలపాటు, 130 గంటలపాటు నిర్వహించాల్సిన రాజ్యసభ సమావేశాలు అతి తక్కువగా 31 గంటలపాటు జరిగాయి. లోక్‌సభ ప్రొడక్టివ్ (ఉత్పాదకత) పని 34 శాతం కాగా, రాజ్యసభ ఉత్పాదకత 24.4 శాతం మాత్రమే. 6 బిల్లులు ఉభయ సభల ఆమోదం పొందాయి. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలలో ఇంత తక్కువ సంఖ్యలో బిల్లులు ఉభయ సభల ఆమోదం పొందడం చాలా అరుదు. ముఖ్యంగా ద్రవ్య వినిమయ బిల్లుపై అతి తక్కువ చర్చ జరిగింది. 12 నిమిషాలలో రూ. 50 లక్షల కోట్ల బడ్జెట్‌ను ఆమోదింపజేసుకొన్నారని విపక్షనేతలు విమర్శించడంలో అర్థం ఉంది.

భారతదేశానికి స్వాతంత్ర్యం లభించే సమయంలో దేశానికి అమెరికా తరహా ప్రజాస్వామ్యం ఉండాలా, లేక బ్రిటిష్ తరహా ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం మంచిదా అనే చర్చ జరిగింది. మెజారిటీ నేతలు, మేధావులు భారతదేశానికి ప్రాతినిధ్య ప్రజాస్వామ్యమే ఉత్తమమని తేల్చి దానికే మొగ్గు చూపారు. ఎందుకంటే, ప్రజలచే ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులు చట్టసభలలో ప్రజలవాణిని వినిపిస్తారనీ, ఫలితంగా చట్టసభల ప్రయోజనం నెరవేరుతుందనీ భావించారు.

చట్టసభల ప్రయోజనంపై పాలకపక్షానికి స్పష్టత ఉండాలి. చట్టసభల్లో సభ్యుల సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకోవాలి. దానినే కలెక్టివ్ విజ్‌డమ్ (సమిష్టి జ్ఞానం) అంటారు. పార్టీల సిద్ధాంతాలు, విధానాలు వేర్వేరు అయినప్పటికీ ప్రజల విశాల ప్రయోజనాలకు సంబంధించి అన్ని పార్టీలూ కొన్ని అంశాలపై ఏకాభిప్రాయానికి వస్తాయి. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలోని గొప్పతనం అదే. కానీ, తమమాట మాత్రమే నెగ్గాలన్న ధోరణి పాలక పార్టీలో ఉన్నప్పుడు, పట్టు విడుపులు లేకుండా తమ మాటనే నెగ్గించుకొన్నప్పుడు పార్లమెంటరీ ప్రజాస్వామ్య ఉద్దేశ్యమే దెబ్బతిన్నట్టు కాదా?

'అదానీ' వ్యవహారాన్నే తీసుకొంటే... హిండెన్‌బర్గ్ నివేదిక దరిమిలా 'అదానీ' వ్యవహారంలో 'జాయింట్ పార్లమెంటరీ కమిటీ' (జేపీసీ)ని వేయాలని ప్రతిపక్షాలు పట్టుబట్టాయి. బీజేపీ ప్రభుత్వం అందుకు నిరాకరించింది. పైగా, గతంలో ఎన్నడూలేని విధంగా పార్లమెంట్ ఉభయసభలను పాలక పార్టీ సభ్యులే అడ్డుకోవడం ఓ వింత.

ఓ వ్యక్తి లోక్‌సభకో, రాజ్యసభకో ఎన్నిక కావాలంటే దానికి సుదీర్ఘ ప్రక్రియ అవసరం అవుతోంది. క్లుప్తంగా చెప్పాలంటే, ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి, ఎంతోమంది సహాయ సహకారాలతో ఎన్నికయ్యే వ్యక్తి.. లోక్‌సభలో పట్టుమని 45 గంటలైనా కూర్చొని పార్లమెంట్ బిజినెస్‌లో భాగస్వామి కాకపోతే... కలిగే ప్రయోజనం ఏముంటుంది?

కనీస స్థాయిలో కూడా చర్చలు జరక్కుండానే బిల్లులు చట్టాలుగా రూపొందితే అవి ప్రజల పాలిట శాపాలుగా మారతాయనడంలో ఎటువంటి సందేహం లేదు. ఉదాహరణకు వివాదాస్పద వ్యవసాయ బిల్లుల్ని అడ్డుకోవడం వల్లనే అవి చట్టాలు కాలేకపోయాయి. ఒకవేళ, అవి చట్టాలుగా రూపొంది ఉంటే దేశ రైతాంగం ఏమయ్యి ఉండేది?



చర్చలకు కేటాయించే సమయం ఇటీవల కాలంలో తగ్గిపోయింది. మన పార్లమెంటరీ వ్యవస్థ బ్రిటిష్ తరహా విధానాన్ని పోలి ఉన్నప్పటికీ... బ్రిటన్ అనుసరిస్తున్న విధానాలు మన వద్ద లేవు. బ్రిటన్ పార్లమెంట్‌లో ప్రతిపక్షాల చర్చలకు ప్రత్యేకంగా 20 రోజులు కేటాయించే అవకాశాన్ని వారి రాజ్యాంగం కల్పించింది. 20 రోజుల్లో ప్రధాన ప్రతిపక్షానికి 17 రోజులు; ఇతర విపక్ష పార్టీ సభ్యులకు 3 రోజులు కేటాయిస్తారు. ఇక సభలో చర్చించే అంశాలను మన వద్ద స్పీకర్ సమక్షంలో బిజినెస్ అడ్వయిజరీ కమిటీ (బీఏసీ) నిర్ణయిస్తుంది. బీఏసీలో అధికార పార్టీ, విపక్ష పార్టీల వారు ఉంటారు. పరస్పర అంగీకారంతో ఎజెండాను రూపొందించడం సంప్రదాయంగా వస్తోంది. కానీ, బ్రిటన్‌లో విపక్షాలు తమ ఎజెండాను తామే నిర్ణయించుకొంటాయి. అంతేకాదు 40 మంది సభ్యులు కనుక ఓ అంశాన్ని తీసుకొని దానిపై చర్చించాలని స్పీకర్‌కు నోటీసు ఇస్తే దానిని స్పీకర్ తిరస్కరించడానికి వీలు లేదు. అలాగే కొన్ని దేశాలలో ప్రజాప్రతినిధులు తగిన కారణం లేకుండా చట్టసభలకు హాజరు కాకపోతే, వారిపై చర్యలు తీసుకొనే విశిష్టాధికారాలు చట్ట సభలకు ఉన్నాయి. చట్టసభలు క్రియాశీలకంగా ఉన్న దేశాలలో ప్రజా స్వామ్యం పరిపుష్టం అవుతోంది. 'నో వర్క్ నో పే' అనే విధానం పలు దేశాలలో అమలు అవుతోంది. పైగా, ఎన్నో అంశాలపై, బిల్లులపై క్షుణ్ణంగా అధ్యయనం చేయడానికి పార్లమెంటరీ కమిటీలు ఉంటాయి.

ప్రభుత్వంలో పారదర్శకత లేకుంటే, పార్లమెంట్ పని సజావుగా సాగదు. గుప్పిట మూసివుంచే విధానాలను అమలు చేసే ప్రభుత్వాలు పార్లమెంట్‌ను పరిగణనలోకి తీసుకోవు. నిజానికి, కేంద్రంలో సుదీర్ఘ కాలం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అనుసరించిన లోప భూయిష్ఠ విధానాల వల్లనే పార్లమెంట్ ప్రాధాన్యం తగ్గుతూ వచ్చింది.

అయితే, పార్లమెంట్ ఔన్నత్యం నిలబెడతామని, రాజ్యాంగం దిక్సూచిగా చట్టసభలను నడుపుతామని ప్రధాని నరేంద్రమోదీ దేశ ప్రజలకు హామీ ఇచ్చారు. పార్లమెంట్ ఔన్నత్యాన్ని నిలబెట్టడానికి అన్ని పార్టీల సూచనలు, సలహాలు కోరుతూ 2016లో ప్రత్యేకంగా 2 రోజుల పాటు పార్లమెంట్ సమావేశాలు నిర్వహించారు. కానీ, ఇపుడు ఎన్డీఏ–2 పాలనలో పార్లమెంట్ ఔన్నత్యం పడిపోతోంది. బిల్లులు ఎక్కువగా గిలెటిన్ అవుతున్నాయి. సభలు అర్ధంతరంగా, నిరవధికంగా వాయిదా పడటం ఎక్కువైంది. ఇక, లోక్‌సభలో కంటే పెద్దల సభగా పిలవబడే రాజ్యసభలోనే అర్థవంతమైన చర్చకు ఆస్కారం ఉంది. వివిధ రంగాలకు చెందిన నిపుణులు, విద్యావంతులను రాజ్యసభకు పంపిన సమయంలో... మన రాజ్యసభ ప్రపంచానికే ఆదర్శప్రాయంగా నిలిచిందంటే అతిశయోక్తి కాదు. కానీ, ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.

దేశంలో ప్రైవేటీకరణ మొదలయ్యాక... వివిధ కీలకరంగాలలో ప్రైవేటు రంగానికి భాగస్వామ్యం కల్పిస్తూ నిర్ణయాలు తీసుకొంటున్న నేపథ్యంలో, వాటిపై ర్యాసభలో కూలంకషంగా చర్చ జరిగినపుడే ప్రజల ప్రయోజనాలు కాపాడబడతాయి.

పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ ఎప్పుడైతే ఓ తంతుగా, తమాషాగా మారిపోయిందో, అప్పటి నుంచే సామాన్య ప్రజల్లో ప్రజా ప్రతినిధుల పట్ల గౌరవం సన్నగిల్లి పోయింది.

పార్లమెంట్ ప్రాముఖ్యతను తగ్గించకుండా తగిన కార్యాచరణను రూపొందించడంలో అన్ని రాజకీయ పార్టీల మధ్య ఏకాభిప్రాయం ఉండాలి. లేదంటే పార్లమెంట్ అస్తిత్వమే ప్రమాదంలో పడుతుంది.

వ్యాసకర్త ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యులు

ఘనమైన రాత్రి

ఏడాదిలోని పన్నెండు నెలల్లో రమజాన్ ఆద్యంతమూ కారుణ్యభరితమైన నెల. ఈనెల చివరి రాత్రుల్లో ఒక జగ్నేకీ రాత్ ఉంది. ఖురాన్ పరిభాషలో దీన్ని 'లైలతుల్ ఖద్ర్' అంటారు. అంటే ఘనతగల రాత్రి అని అర్థ. ఈ రాత్రిలోనే పవిత్ర ఖురాన్ గ్రంథం అవతరించింది. అల్లాహ్ ఇలా ప్రకటించాడు: 'మేము దీన్ని (ఖురాన్ గ్రంథాన్ని) ఘనమైన రాత్రిన అవతరింపజేశాము. ఆ రాత్రి ఘనత ఏమిటో మీకు తెలుసా? ఆ మహారాత్రి వెయ్యి నెలల కన్నా ఎంతో శ్రేష్ఠమైనది. ఆ రాత్రి పరిశుద్ధాత్మ, దైవ దూతలు తమ ప్రభువు అనుమతితో ప్రతి వ్యవహారానికి సంబంధించిన ఆజ్ఞలు తీసుకొని అవతరిస్తారు. అది ఉషోదయం వరకూ పూర్తిగా శుభవంతమైన రాత్రి' (ఖురాన్ 97- 1,5).



రమజాన్ చివరి పదిరోజుల్లోని బేసిరాత్రుల్లో ఆరాధనలు ఎక్కువగా చెయ్యాలని ప్రవక్త (స) ఉపదేశించారు. అంటే 21, 23, 25, 27, 29 రాత్రులన్నమాట. ఆత్మ సంతోషంతో, పరలోక పుణ్యఫలాపేక్షతో 'ఖియాముల్లైల్' చేస్తే ధన్యులౌతారు. 'ఏతెకాఫ్', 'ఫిత్రా'లకు కూడా ఇదే అనువైనకాలం. చివరి పదిరోజులు ఏతెకాఫ్ పాటించాలి. రమజాన్ చివరి రోజుల్లో పండుగకు కొన్ని రోజుల ముందు ఫిత్రాలు కూడా చెల్లిస్తే పేదసాదల పండుగ అవసరాలు తీరతాయి. వారు కూడా సంతోషంగా పండుగ జరుపుకోగలుగుతారు. కొందరి సంతోషమే కాకుండా అందరి ఆనందమే ఈద్. అల్లాహ్ అందరికీ ఆయురారోగ్యాలు ప్రసాదించుగాక!

– మదీహా అర్జుమంద్

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్‌నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, తిథి: బ.సప్తమి రా.2.40 వరకు, తదుపరి అష్టమి, నక్షత్రం: మూల ఉ.11.14 వరకు, తదుపరి పూర్వాషాఢ, వర్జ్యం: ఉ.9.44 నుండి 11.14 వరకు, తిరిగి రా.8.16 నుండి 9.46 వరకు, దుర్ముహూర్తం: ప.11.33 నుండి 12.25 వరకు, అమృతఘడియలు: తె.5.20 నుండి 6.48 వరకు (తెల్లవారితే గురువారం); రాహుకాలం: ప.12.00 నుండి 1.30 వరకు, యమగండం: ఉ.7.30 నుండి 9.00 వరకు, సూర్యోదయం: 5.49, సూర్యాస్తమయం: 6.11.

అసెంబ్లీలో వినిపించనున్న
విద్యార్థుల స్వరం

'వాట్ ఈజ్ మై గోల్' స్టార్టప్ మాక్ 'యు 18 ఎన్నికలు'

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా జరిగే అండర్ 18 మాక్ అసెంబ్లీ ఎన్నికల ద్వారా 200 మంది విద్యార్థులు కొద్దివారాల్లో అసెంబ్లీలో అడుగుపెట్టనున్నారు. చట్టసభల పనితీరుపై పాఠశాల విద్యార్థులకు అవగాహన పెంచేందుకు వీలుగా 'వాట్ ఈజ్ మై గోల్'అనే హైదరాబాద్‌కు చెందిన స్టార్టప్ శ్రీకారం చుట్టింది. స్టార్టప్ ప్రణాళికలో భాగంగా చేపట్టిన 'అండర్ 18 ఎన్నికలు'ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావు మంగళవారం ప్రారంభించారు. కొద్ది వారాల్లో మాక్ అండర్ 18 ఎన్నికలు నిర్వహించి వారితో మాక్ అసెంబ్లీ నిర్వహించేందుకు 'వాట్ ఈజ్ మై గోల్'స్టార్టప్ సన్నాహాలు చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 50 పాఠశాలలకు చెందిన 200 మంది విద్యార్థులు వివిధ పదవులకు ఎన్నికై మాక్ అసెంబ్లీలో తమ గొంతును వినిపిస్తారు. విద్యార్థులకు రాజకీయాలతోపాటు వివిధ కెరీర్ అవకాశాలపై అవగాహన కల్పించేందుకు 'వాట్ ఈజ్ మై గోల్'తోడ్పడుతోందని టీఎస్ఐసీ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ డాక్టర్ శాంత తౌటం వెల్లడించారు. చట్టసభల పనితీరును విద్యార్థులు నేరుగా తెలుసుకునేందుకు మాక్ అసెంబ్లీ దోహదం చేస్తుందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో చట్టాలు రూపొందే ప్రక్రియపై విద్యార్థులకు అవగాహన కలిగేందుకు ఇది ఉపయోగపడుతుందని టి-హబ్ సీఈఓ శ్రీనివాసరావు మహంకాళి అన్నారు. భవిష్యత్ ప్రపంచాన్ని మార్చే నాయకత్వం ఇలాంటి కార్యక్రమాలతోనే రూపుదిద్దుకుంటుందన్నారు.

కేసీఆర్ అక్రమార్జన రూ.లక్ష కోట్లు

- ఆ సొమ్ముతో దేశ రాజకీయాలను శాసించాలని చూస్తున్నారు: రేవంత్‌రెడ్డి
- యశోద, అలెగ్జాండ్రియా సంస్థలకు చౌకగా రూ. 800 కోట్ల భూములిచ్చారు
- భవన నిర్మాణ అనుమతుల్లో మంత్రి కేటీఆర్‌కు 20 శాతం కమీషన్లు
- నా ఆరోపణలు తప్పని నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధం



సాక్షి, హైదరాబాద్: ఉద్యమకారుడినని చెప్పుకున్న కేసీఆర్‌కు వేల ఎకరాల భూములు, ఫాంహౌస్‌లు ఎలా వచ్చాయని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. భూములను కొల్లగొట్టి రూ. లక్ష కోట్లు అక్రమంగా సంపాదించారని, ఆ సంపాదనతోనే దేశ రాజకీయాలను శాసించాలనుకుంటున్నారని ఆరోపించారు. మంగళవారం గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ నేతలు అంజన్‌కుమార్ యాదవ్, మల్లు రవి, చామల కిరణ్‌రెడ్డి, హర్కర వేణుగోపాల్, సంగిశెట్టి జగదీశ్వర్, రోహిణ్‌రెడ్డి, మెట్టు సాయికుమార్‌లతో కలసి రేవంత్ మాట్లాడుతూ కేసీఆర్ భూములు అమ్మితే రూ.2,500 కోట్లు వస్తాయని, ఆ డబ్బులతో రాష్ట్రంలోని నిరుద్యోగులను ఆదుకోవచ్చని వ్యాఖ్యానించారు.

రూ. 800 కోట్ల భూమిని రూ. 100 కోట్లకే..

యశోద ఆసుపత్రులకు రూ. 800 కోట్ల విలువైన భూమిని కేవలం రూ. 100 కోట్లకే సీఎం కేసీఆర్ కేటాయించారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమెరికాకు చెందిన అలెగ్జాండ్రియా అనే కంపెనీకి శేరిలింగంపల్లి మండలంలోని ఖానాపూర్ గ్రామంలో ఐదెకరాల స్థలాన్ని వైద్య, ఆరోగ్య రంగంలో పరిశోధనలు, మౌలిక సదుపాయాల కల్పన కోసం కేటాయించిందని చెప్పారు. ఆ తర్వాత ధరను సవరించారని, సవరించిన మేరకు ఎక్కువ ధర చెల్లించాలని అలెగ్జాండ్రియాతోపాటు మారుతి సుజుకీ కంపెనీకి హెచ్ఎండీఏ లేఖ రాసిందని రేవంత్ పేర్కొన్నారు. అయితే అలెగ్జాండ్రియా కంపెనీ ఆ మొత్తాన్ని చెల్లించకుండా కోర్టుకు వెళ్లిందని, కోర్టులో కేసు నడుస్తుండగానే తెలంగాణ ఆవిర్భవించిందన్నారు. ఆ భూమిపై కల్వకుంట్ల మాఫియా కన్నుపడిందని, అలెగ్జాండ్రియా కంపెనీని బెదిరించి, ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా కేసు ఓడిపోయేలా చేసి రూ. 500 కోట్ల విలువైన భూమిని అలెగ్జాండ్రియా కంపెనీకి ధారాదత్తం చేశారని ఆరోపించారు. కోర్టు తీర్పుపై ప్రభుత్వం అప్పీలుకు కూడా వెళ్లలేదని, ఆ తర్వాత అదే సర్వే నంబర్‌లో ఉన్న మూడెకరాల ప్రభుత్వ భూమిని కూడా అగ్గువకు కొట్టేశారని ఆరోపించారు. ఈ భూమిని యశోదా ఆసుపత్రుల గ్రూప్ గజం రూ. 37,611 చొప్పున కొనుగోలు చేసిందని, వాస్తవానికి అక్కడ గజానికి కనీసం రూ. 2 లక్షల ధర పలుకుతుందని చెప్పారు. ఆ భూమి వెనుక ఉన్న భూమికి హెచ్ఎండీఏ గజం రూ. 80 వేలను అప్‌సెట్ ప్రైస్‌గా నిర్ధారించిందని రేవంత్ పేర్కొన్నారు.

కమీషన్లు తీసుకొని అదనపు అంతస్తులకు అనుమతులు...

లిక్కర్ కుంభకోణంలో ఉన్న పెద్దలకు ఖానామెట్‌లో 25 ఎకరాల భూమిని కేటాయించారని, ఇందుకోసం మంత్రి కేటీఆర్‌కు 20 శాతం కమీషన్ ముట్టజెబుతున్నారని రేవంత్ ఆరోపించారు. జూబ్లీ హిల్స్ చెక్‌పోస్టు, నాగార్జున సర్కిల్‌లోని భవనాలకు అదనపు అంతస్తుల నిర్మాణానికి అనుమతులు ఎలా ఇచ్చారో కేటీఆర్ చెప్పాలన్నారు. తాను చేసిన ఆరోపణలు నిజం కాదని నిరూపిస్తే ఎలాంటి శిక్షకైనా సిద్ధమని రేవంత్ స్పష్టం చేశారు.

వైద్య విద్య హబ్‌గా తెలంగాణ

త్వరలో అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామక ప్రక్రియ పూర్తి
వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ నాణ్యమైన వైద్యానికి, వైద్య విద్యకు హబ్‌గా మారిందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. గడిచిన ఏడాదిలో ఒకేసారి 8 మెడికల్ కాలేజీలు ప్రారంభించుకొని ఎంతో వృద్ధి సాధించామని, ఈ ఏడాది మరో 9 మెడికల్ కాలేజీల్లో వంద ఎంబీబీఎస్ సీట్లతో తరగతులు ప్రారంభించుకోబోతున్నామని చెప్పారు. కొమురంభీం ఆసిఫాబాద్, కామారెడ్డి, ఖమ్మం మెడికల్ కాలేజీలకు ఇప్పటికే అనుమతులు వచ్చాయని, మిగతా వాటికీ త్వరలో వచ్చేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమీక్షలో మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో 2014–15లో 2,950 ఎంబీబీఎస్ సీట్లు ఉంటే, ప్రస్తుతం 7,090కు చేరాయని, పీజీ సీట్లు 1183 నుంచి 2548కు పెరిగాయని తెలిపారు. 65 మందికి కొత్తగా ప్రొఫెసర్ పదోన్నతులు ఇచ్చామని, 210 అసోసియేట్ ప్రొఫెసర్లకు ప్రమోషన్లు త్వరలో ఇవ్వబోతున్నామని తెలిపారు. త్వరలో 1,442 అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులు భర్తీ ప్రక్రియ పూర్తి అవుతుందన్నారు. 800 మంది పీజీ సీనియర్ రెసిడెంట్లను జిల్లాల్లోని మెడికల్ కాలేజీలకు, వైద్య విధాన పరిషత్ ప్రధాన ఆసుపత్రులకు అవసరం మేరకు కేటాయించామ తెలిపారు. బ్రెయిన్ డెడ్ డిక్లరేషన్ జిల్లాలోనే జరిగే దిశగా ప్రయత్నాలు చేయాలని అధికారులను ఆదేశించారు. అవయవ దానం ప్రోత్సహించి, ఇతరుల ప్రాణాలు కాపాడేందుకు కృషి చేయాలన్నారు. డిశ్చార్జ్ అయిన రోగులకు ఉచితంగా మందులు ఇచ్చి పంపాలని, ఈ విషయం రోగులకు తెలిసేలా బోర్డ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. రాత్రి వేళల్లో సైతం పోస్టుమార్టం జరిగేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సమావేశంలో వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీ, ప్రజారోగ్య సంచాలకుడు డాక్టర్ శ్రీనివాసరావు, డీఎంఈ రమేశ్‌రెడ్డి, వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్, అన్ని జిల్లా ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

108 సేవల కోసం 200 కొత్త అంబులెన్స్‌లు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: రాష్ట్రంలో 108 సేవల కోసం కొత్తగా 200 అంబులెన్స్‌లు కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని రాష్ట్ర ఆర్థిక, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి టి.హరీశ్‌రావు వెల్లడించారు. మూడు లక్షల కిలోమీటర్లు తిరిగిన అంబులెన్స్‌ల స్థానంలో ఈ కొత్త అంబులెన్స్‌లు సేవలందిస్తాయని ప్రకటించారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ ఈ విషయాన్ని వెల్లడించారు.

ప్రజాస్వామ్య రక్షణకే సత్యాగ్రహ సభ

- 14న మంచిర్యాలలో భారీ బహిరంగ సభ
- మహాత్మా జ్యోతిబాపూలేకు నివాళులర్పించిన భట్టి విక్రమార్క
- మోదీ, కేసీఆర్‌పై విరుచుకుపడ్డ సీఎల్పీ నేత


మీడియాతో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ''రాహుల్‌గాంధీపై అన్యాయంగా అనర్హత వేటు వేశారు. ఆయనకు మద్దతుగా, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు, రాజ్యాంగ రచయిత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి రోజు ఈ నెల 14న మంచిర్యాలలో 'జై సత్యాగ్రహ'సభ నిర్వహిస్తున్నాం''అని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఈ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, ఏఐసీసీ ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. మహాత్మా జ్యోతిబాపూలే జయంతి సందర్భంగా మంగళవారం మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ప్రగతి స్టేడియంలోని పాదయాత్ర క్యాంపులో పూలే చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం ఏఐసీసీ కార్యదర్శి రోహిత్‌చౌదరితో కలిసి భట్టి మీడియాతో మాట్లాడారు. తాత, నాన్నమ్మ తండ్రి ప్రధానులుగా పనిచేసినా, సొంతిల్లు కూడా లేని రాహుల్‌గాంధీ కావాలా? ప్రజల సంపదను దోచేస్తున్న మోదీ, కేసీఆర్ లాంటి వాళ్లు కావాలా? ప్రజలే ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై సమగ్ర విచారణ, ముంపుపై అధ్యయనం చేస్తామని వెల్లడించారు. రూ.10వేల కోట్లు ఖర్చు చేసి నిర్మించాలనుకున్న ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టుకు అడ్డుపడ్డ పెద్ద ద్రోహి కేసీఆర్ అని విమర్శించారు. తెలంగాణ ఏర్పడిందే ఉద్యోగాల కోసమైతే ప్రైవేటీకరణతో సింగరేణిలో ఉద్యోగాలు లేకుండా చేస్తున్నారన్నారు. హౌసింగ్ కార్పొరేషన్, దిల్ దక్కన్ భూములతోపాటు కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇచ్చిన అసైన్డ్, మన్యం భూములు లాక్కొని ప్లాట్లు చేసి అమ్మేస్తున్నారని, చివరికి రాష్ట్రాన్నీ అమ్మేలా ఉన్నారని ధ్వజమెత్తారు. బయ్యారం ప్లాంటుపై చిత్తశుద్ధి లేని కేసీఆర్ విశాఖ స్టీల్ కొనాలని వెళ్లడం విడ్డూరంగా ఉందన్నారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలిస్తామని చెప్పిన మోదీ, ఆస్తులు అమ్మేస్తూ, విభజన హామీలపై ఏ ప్రకటన లేకుండా హైదరాబాద్ వచ్చి రాజకీయ ప్రసంగం చేసి వెళ్లాడని విమర్శించారు. కేసీఆర్ కుటుంబం అవినీతిలో మునిగిందని చెప్పే ప్రధాని, విచారణకు ఎందుకు ఆదేశించలేదని ప్రశ్నించారు. సమావేశంలో రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ అజ్మతుల్లా, కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి, నాయకులు లోకేశ్ యాదవ్, విజయ్, శివకుమార్ పాల్గొన్నారు.

అదిరిపోయే ఎండలు..

▶ మొదటి పేజీ తరువాయి

పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నట్లు తెలిపింది.

వేసవి ప్రణాళిక అమలులో నిర్లక్ష్యం...

ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో వేసవి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని విపత్తు నిర్వహణ శాఖ ఆదేశించినా సంబంధిత శాఖలు మాత్రం దృష్టిపెట్టడంలేదన్న ఆరోపణలున్నాయి. వైద్య, ఆరోగ్యశాఖ ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేసే సిబ్బందికి, ఆశ వర్కర్లు, పారామెడికల్ సిబ్బందికి ఎండల తీవ్రత నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణ కల్పించడంతోపాటు వడదెబ్బ బాధితుల కోసం ప్రత్యేక పడకలు ఏర్పాటు చేయాల్సి ఉండగా ఇవేవీ పెద్దగా అమలు కావట్లేదన్న విమర్శలు వస్తున్నాయి. వడదెబ్బ హెచ్చరికలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయాలన్న విపత్తు నిర్వహణశాఖ సూచనలను పట్టించుకొనే పరిస్థితి కనిపించట్లేదు. అంగన్‌వాడీ, ఆరోగ్య కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్న నిర్ణయం దాదాపు ఎక్కడా అమలుకావడం లేదని ప్రజలు చెబుతున్నారు. ఉపాధి హామీ పథకం కింద పనిచేసే కూలీలకు పనిచేసే చోట షెల్టర్లు కట్టించాలన్న నిబంధన కాగితాలకే పరిమితమైంది. కార్మికులు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఆరుబయట పనిచేయకూడదన్న నిబంధనను అనేక కంపెనీలు ఉల్లంఘిస్తున్నా అధికారులు చర్యలు తీసుకోవడంలేదు.

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో మంగళవారం నమోదైన ఉష్ణోగ్రతలు (డిగ్రీ సెల్సియస్‌లలో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
చాప్రాల (ఆదిలాబాద్ జిల్లా)	43.8	-
జూలూరుపాడు (భద్రాద్రి కొత్తగూడెం జిల్లా)	43.8	-
దస్తురాబాద్ (నిర్మల్ జిల్లా)	42.8	-
ఆదిలాబాద్	41.8	23.7
భద్రాచలం	40.5	26.5
హనుమకొండ	38.0	21.5
హైదరాబాద్	37.7	22.5
ఖమ్మం	39.6	23.6
మహబూబ్‌నగర్	40.0	24.5
మెదక్	38.8	21.5
నల్లగొండ	40.0	22.0
నిజామాబాద్	40.4	25.0
రామగుండం	40.2	23.2

ఎంత ఎండకు ఏ అలర్ట్?

- రెడ్ అలర్ట్ (సాధారణం కంటే 6 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు, తీవ్ర వడగాడ్పులు ఉంటే జారీ చేసేది)
- ఆరెంజ్ అలర్ట్ (సాధారణం కంటే 4–5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదైతే)
- ఎల్లో అలర్ట్ (హీట్‌వేవ్ వార్నింగ్. సాధారణ ఉష్ణోగ్రతల కంటే కాస్త ఎక్కువ నమోదైతే)
- వైట్ అలర్ట్ (సాధారణం కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదైతే జారీ చేసేది)

ఎండ తీవ్రంగా ఉన్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

- తరచూ నీళ్లు తాగాలి. బయటకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా నీళ్ల సీసాను వెంట తీసుకెళ్లాలి.
- తెలుపు, లేతవర్ణంగల పలుచటి కాటన్ వస్త్రాలు ధరించాలి.
- తలకు వేడి తగలకుండా టోపీ లేదా రుమాలు చుట్టుకోవాలి.
- వడదెబ్బ తగిలిన వారిని నీడలో ఉంచాలి. శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వచ్చే వరకు తడిగుడ్డతో తుడవాలి.
- ప్రాథమిక చికిత్స అనంతరం సాధారణ స్థితికి రాకుంటే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలి.
- వడగాడ్పులు వీస్తుంటే భవన నిర్మాణ కార్మికులకు యాజమాన్యాలు నీడ కల్పించాలి. తాగునీటి వసతి, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలి.
- ఉపాధి హామీ కూలీలకు పనిచేసే చోట టెంట్లు ఏర్పాటు చేయాలి. నీటి వసతి కల్పించాలి.
- బస్టాండ్లలో, దూర ప్రాంతాలకు వెళ్లే బస్సుల్లో తాగునీరు అందుబాటులో ఉంచాలి.

యాసంగి ధాన్యం @ కోటి మెట్రిక్ టన్నులు!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో యాసంగి సీజన్‌లో కోటి మెట్రిక్ టన్నులకుపైగా ధాన్యాన్ని సేకరించాలని పౌరసరఫరాల సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. ఈసారి దిగుబడి 1.20 కోట్ల మెట్రిక్ టన్నుల మేర రావచ్చని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. ఇందులో ప్రైవేటు అమ్మకాలు పోగా, కోటీ రెండు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రావచ్చని భావిస్తున్నారు. ధాన్యం కొనుగోలుకు వీలుగా అవసరమైన సదుపాయాలను కల్పించాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ మంగళవారం సంబంధిత అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. ధాన్యాన్ని తెచ్చిన రైతులు వేచిచూసే పరిస్థితి లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ఇప్పటికే నిజామాబాద్, కామారెడ్డి, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో కోతలు సాగుతుండగా, మరో 10–15 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభం కానున్నందున 7వేలకు పైగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. అవసరమైన గోనెసంచుల సేకరణ, మాయిశ్చరైజర్ మెషీన్లు, తూకం యంత్రాలు, ఇతర సామాగ్రిని అందుబాటులో ఉంచుకోవాలని అదనపు కలెక్టర్లు, పౌరసరఫరాల శాఖ డీఎస్‌ఓలు, డీఎంలకు మంత్రి సూచించారు. నిర్దేశిత సమయంలో సీఎంఆర్ ఇవ్వని మిల్లర్లపై కఠినంగా వ్యవహరించాలని పౌరసరఫరాల శాఖ నిర్ణయించింది. ధాన్యం కొనుగోలు చేసిన వారంలోగా రైతుల ఖాతాల్లో డబ్బులు వేసేందుకు వీలుగా పౌరసరఫరాల సంస్థ వద్ద రూ.5వేల కోట్లు ఉన్నాయని, మరో రూ.20వేల కోట్లు అప్పు తీసుకోనున్నట్టు చెప్పారు.

యాదాద్రీశునికి అరకేజీ బంగారం మొక్కు

సాక్షి, హైదరాబాద్: యాదాద్రిలో కొలువైన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి ఓ భక్తుడు అర కేజీ బంగారంతో చేసిన కిరీటం, ఇతర ఆభరణాలను ఇవ్వనున్నారు. హైదరాబాద్, చంపాపేటకు చెందిన మాచమోని ప్రకాశ్ ముదిరాజ్ దంపతులు శ్రీ లక్ష్మీ నరసింహస్వామికి రూ. 31 లక్షల విలువైన బంగారు కిరీటాలను, అర కేజీ వెండి పళ్లెంను ఈ నెల 13వ తేదీన సమర్పించనున్నారు. తమ 35 ఏళ్ల వివాహ వేడుకల సందర్భంగా ఆభరణాలను అందించనున్నట్లు ప్రకాశ్ చెప్పారు.

బీసీ కుల జనగణన చేపట్టాలి

పూలే జయంతి వేడుకల్లో మంత్రులు కమలాకర్, శ్రీనివాస్‌గౌడ్


పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రులు

గన్‌ఫౌండ్రీ: కేంద్ర ప్రభుత్వం బీసీల కులజనగణన తక్షణమే నిర్వహించాలని మంత్రుల గంగుల కమలాకర్, శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం రవీంద్రభారతిలో మహాత్మా జ్యోతిబా పూలే ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిబాపూలే 197వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంత్రి కమలాకర్ మాట్లాడుతూ కేంద్రంలో ప్రత్యేక బీసీ మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా బీసీల అభివృద్ధి కోసం కేవలం రూ.2 వేల కోట్లు కేటాయించి తీవ్ర వివక్షను చూపిందని మండిపడ్డారు. బడుగు, బలహీన వర్గాలకు విద్యాప్రదాత మహాత్మా జ్యోతిబా పూలే ఆశయసాధన కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం తరహాలో మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహ ఏర్పాటు విషయాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఐక్యంగా ఉండాలని, విభజించి పాలించే రాజకీయ పార్టీల కుట్రలను గమనించాలని సూచించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బీసీలంతా ఐక్యంగా ఉండాలని, అప్పుడే రాజ్యాధికారం సాధ్యమవుతుందన్నారు. అనంతరం వివిధ రంగాల్లో సేవలందిస్తున్న పలువురు ప్రముఖులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శాసనమండలి వైస్ చైర్మన్ బండా ప్రకాశ్ ముదిరాజ్, బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం, బీసీ కమిషన్ సభ్యులు ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

ఇకపై రెండు గంటల్లోనే 'టోఫెల్'



న్యూఢిల్లీ: విదేశీ ఉన్నత విద్యా సంస్థల్లో ప్రవేశానికి ఉపకరించే 'టోఫెల్' పరీక్ష ఇకపై రెండు గంటలలోపే ముగియనుంది. ప్రస్తుతం ఈ పరీక్షను మూడు గంటలపాటు నిర్వహిస్తున్నారు. అధికారిక స్కోర్‌ను విడుదల చేసే తేదీని టోఫెల్ పూర్తికాగానే అభ్యర్థులు తెలుసుకోవచ్చని ఎడ్యుకేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఈటీఎస్) వెల్లడించింది. టోఫెల్ ఒక గంట 56 నిమిషాల పాటు ఉంటుందని పేర్కొంది. టోఫెల్‌లో చేస్తున్న మార్పులు ఈ ఏడాది జూలై 26వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయని స్పష్టంచేసింది. టోఫెల్ స్కోర్‌ను 160కిపైగా దేశాల్లో 11,500కిపైగా యూనివర్సిటీలు అంగీకరిస్తున్నాయి. ఇందులో అమెరికా, యూకే, కెనడా, ఆస్ట్రేలియా తదితర దేశాల్లోని వర్సిటీలు ఉన్నాయి. టోఫెల్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత సులభతరం చేస్తున్నట్లు ఈటీఎస్ సీఈవో అమిత్ సేవక్ తెలిపారు. టెస్టు ఫీజును భారతీయ రూపాయల్లో చెల్లించవచ్చని సూచించారు. టోఫెల్ ప్రక్రియలో తీసుకొస్తున్న మార్పులతో లక్షలాది మంది భారతీయ విద్యార్థులకు లబ్ధి చేకూరుతుందని అసోసియేషన ఆఫ్ ఆస్ట్రేలియన్ ఎడ్యుకేషన్ రిప్రజంటేటివ్స్ ఇన్ ఇండియా అధ్యక్షుడు నిశిధర్‌రెడ్డి బొర్రా వివరించారు.

అమెరికా రాయబారి రాక

న్యూఢిల్లీ: భారత్‌లో అమెరికా రాయబారిగా నియమితులైన ఎరిక్ గార్సెట్టి మంగళవారం రాత్రి ఢిల్లీ చేరుకున్నారు. అమెరికా అధ్యక్షుడిగా జో బైడెన్‌కు అత్యంత సన్నిహితుడైన గార్సెట్టి రెండేళ్ల క్రితమే భారత రాయబారిగా నియమితులయ్యారు. సెనేట్ మాత్రం నెల క్రితమే ఆమోద ముద్ర వేసింది. ''నమస్తే ఎరిక్ గార్సెట్టి: మీకు సాదర స్వాగతం. భారత్–అమెరికా మధ్య మరింత బలమైన బంధాలను నిర్మించడానికి మీతో కలిసి పనిచేస్తాం'' అని భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం ట్వీట్ చేసింది. రెండేళ్లుగా అమెరికా రాయబారి పదవి ఖాళీగానే ఉంది.

'జేపీసీ'ని వ్యతిరేకించను: పవార్

ముంబై: గౌతం అదానీ ఉదంతంపై సంయుక్త పార్లమెంటరీ సంఘం దర్యాప్తు కోసం విపక్షాలు చేస్తున్న డిమాండ్‌ను వ్యతిరేకించబోనని ఎన్సీపీ అధినేత శరద్ పవార్ అన్నారు. జేపీసీ కంటే సుప్రీంకోర్టు విచారణ కమిటీ మేలన్న ఆయన వ్యాఖ్యలు కలకలం రేపడం తెలిసిందే. ఈ నేపథ్యంలో, ''జేపీసీ కావాలన్న విపక్షాల వైఖరి ఎన్సీపీకి అంగీకారం కాదు. అయినా వాటి ఉమ్మడి వైఖరికి భిన్నంగా పోదలచుకోలేదు. విపక్షాల ఐక్యత కోసమే ఈ నిర్ణయం తీసుకున్నాం'' అని మంగళవారం చెప్పారు.

నువ్వా? నేనా..!



కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో నెలకొన్న త్రిముఖ పోరులో మెజార్టీ అనేది ముఖ్య భూమిక పోషిస్తోంది. ప్రతీ నియోజకవర్గంలోనూ చిన్న పార్టీల జోరు పెరిగిపోతూ ఉండడంతో అత్యధిక స్థానాల్లో అభ్యర్థులు స్వల్ప ఓట్ల తేడాతో గట్టెక్కడం పరిపాటిగా మారింది. దాంతో ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి ఓటునూ ఒడిసిపట్టడం ప్రధాన పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్, జేడీ(ఎస్)లకు కీలకంగా మారింది...

1985 నుంచి ఇప్పటివరకు కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు చూస్తే అత్యధిక స్థానాల్లో బొటాబొటి మెజార్టీతోనే నేతలు గట్టెక్కారు.

25 శాతానికి పైగా స్థానాల్లో హోరాహోరీ పోరు నెలకొంది. విజేతలకు, పరాజితులకు మధ్య తేడా 5, అంతకంటే తక్కువ శాతమే ఉంది.

గత మూడు దశాబ్దాల్లో కేవలం 5 శాతం స్థానాల్లో మాత్రమే భారీ మెజార్టీ నమోదైంది.

విజేతలు, పరాజితులకు వచ్చిన ఓట్లు, వాటి మధ్య తేడాలను విశ్లేషిస్తే ఓటరు గాలివాటంగా పోకుండా ఎంతో మేధోమథనం చేసి ఓటేస్తున్నాడని తేటతెల్లమవుతుంది.

మొదటి, రెండు స్థానాల్లో నిలిచిన అభ్యర్థులిద్దరికీ ఓట్లు 5 శాతం తేడా వస్తే హోరాహోరీగా పోరు సాగిందని, 20 శాతం కంటే ఎక్కువ ఉంటే ఓటరు నిర్ణయాత్మకంగా స్పందించారని అంటారు.

అధికార వ్యతిరేకత, చిన్న పార్టీల జోరు ఈ రెండూ కర్ణాటక ఎన్నికల ఫలితాల్ని శాసిస్తున్నాయి. వరసగా రెండోసారి ఏ పార్టీకీ అధికారాన్ని కట్టబెట్టే సంప్రదాయం లేని కన్నడ నేలపై అత్యంత తక్కువ ఓట్ల తేడాతో అభ్యర్థులు గెలవడం సాధారణంగా మారింది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఏకంగా 16 స్థానాల్లో విజేతలు 3 వేల కంటే తక్కువ మార్జిన్‌తో గట్టెక్కారు. గత ఎన్నికల్లో ఏకైక పెద్ద పార్టీగా అవతరించిన బీజేపీ 36% ఓట్లతో 104 స్థానాల్లో విజయం సాధిస్తే, 38% ఓట్లు సాధించిన కాంగ్రెస్ మాత్రం 80 సీట్లతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది! మన ప్రజాస్వామ్యంలోని ఈ వైచిత్రి కారణంగా అత్యధిక ఓట్ల కంటే ఎక్కువ సీట్లు సాధించడమే సవాల్‌గా మారింది. అందుకే ఈసారి పార్టీలన్నీ ఒక్క ఓటు కూడా పోకుండా క్షేత్రస్థాయిలో వ్యూహాలు రచిస్తూ బూత్ మేనేజ్‌మెంట్‌కు అత్యధిక ప్రాధాన్యమిస్తున్నాయి.

చాలాచోట్ల ఓట్ల తేడా స్వల్పమే
కర్ణాటకలో గత కొన్నేళ్లుగా ఇదే ట్రెండ్

కర్ణాటకలో 1985 నుంచి అసెంబ్లీ స్థానాలవారీగా మెజారిటీ

	1985	1989	1994	1999	2004	2008	2013	2018
0-5%	59	48	64	61	68	70	67	63
5-10%	61	40	44	44	56	56	46	62
10-15%	31	34	32	44	40	40	35	44
15-20%	28	41	31	31	34	29	32	24
20-30%	28	38	32	32	20	22	32	23
30% కంటే ఎక్కువ	17	23	21	12	6	7	12	8

మూడు ఎన్నికల ముచ్చట



గత మూడు ఎన్నికల్లోనూ అన్ని పార్టీలకు స్వల్ప మార్జిన్ పెద్ద తలనొప్పిగా మారింది. 2008 ఎన్నికల్లో 224 స్థానాలకు గాను 70 స్థానాల్లో ఎమ్మెల్యేలు 5 శాతం కంటే తక్కువ మార్జిన్‌తో గెలుపొందారు. అంటే 31% స్థానాల్లో హోరాహోరీ పోరు నెలకొన్నట్టయింది. 2013 ఎన్నికల దగ్గరకి వస్తే 5 శాతం కంటే తక్కువ ఓట్లతో గెలుపొందిన స్థానాల శాతం 30గా ఉంది. గత ఎన్నికల్లో 28% స్థానాల్లో హోరాహోరీ పోరు నెలకొంది. గత మూడు ఎన్నికల ఫలితాలను విశ్లేషిస్తే బీజేపీ, జేడీ(ఎస్) పార్టీల సగటు గెలుపు ఆధిక్యం 12 శాతం ఉండగా, కాంగ్రెస్‌కు 11 శాతం ఉంది. 1980ల వరకు ఏ రాష్ట్రంలోనైనా గెలుపు ఆధిక్యాలు చాలా ఎక్కువగా దాదాపుగా 30% అంతకంటే ఎక్కువ ఓట్లు ఉండేవి. తర్వాత ప్రాంతీయ పార్టీలు పెరగడం, పార్టీల సామాజిక సమీకరణలు వంటివి ప్రధానంగా మారి ఓట్ల ఆధిక్యానికి అడ్డుకట్ట వేస్తున్నాయి.

పార్టీల్లో టెన్షన్ టెన్షన్

ఈసారి ఎవరి ఓటు బ్యాంకుకి గండిపడుతుందా అని మూడు ప్రధాన పార్టీల్లో టెన్షన్ మొదలైంది. మొత్తం 224 స్థానాలకు గాను అసదుద్దీన్ ఒవైసీకి చెందిన మజ్లిస్ 25 స్థానాల్లో పోటీ చేయనుంది. సోషల్ డెమొక్రాటిక్ పార్టీ ఆఫ్ ఇండియా 100 స్థానాల్లో పోటీకి సన్నాహాలు చేస్తోంది. వీటితో కాంగ్రెస్, జేడీ(ఎస్)లకు నష్టమనే అంచనాలున్నాయి. బీజేపీని వీడిన గాలి జనార్దన రెడ్డి కళ్యాణ రాజ్య ప్రగతి పక్ష పేరుతో పార్టీ ఏర్పాటు చేశారు. ఆప్ అన్ని స్థానాల్లోనూ పోటీ పడుతోంది. ఈ పార్టీల ప్రభావం గత ఎన్నికల్లో 5 వేల కంటే తక్కువ మెజారిటీ నమోదైన 30 సీట్లపై ఉంటుందని భావిస్తున్నారు. ''ఏదైనా నియోజకవర్గంలో హోరాహోరీ పోరు నెలకొన్నప్పుడు చిన్న పార్టీలు రెండు నుంచి మూడు వేలు ఓట్లు సంపాదించినా అది చాలా పెద్ద ప్రభావాన్ని చూపిస్తుంది. వారు ఎన్నికల్లో గెలవలేకపోయినా ఫలితాలను మార్చే సత్తా కలిగి ఉంటారు''అని బెంగుళూరుకి చెందిన రాజకీయ విశ్లేషకుడు నరేంద్రపాణి అభిప్రాయపడ్డారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

నోటాకే ఎక్కువ ఓట్లు!



2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఏడు నియోజకవర్గాల్లో అభ్యర్థులకు వచ్చిన మెజారిటీ కంటే నోటా (నన్ ఆఫ్ ది ఎబౌ)కే ఎక్కువ ఓట్లు రావడం విశేషం. వాటిలో ఆరు నియోజకవర్గాల్లో కాంగ్రెసే నెగ్గింది. అలంద్, బాదామి, గడగ్, హిరెకెరూర్, కంగ్‌డోల్, మాస్కి, పావగడలో అభ్యర్థుల గెలుపులో ఓట్ల కంటే నోటాకే ఎక్కువ పడ్డాయి.

కర్ణాటకలో బీజేపీ అభ్యర్థుల తొలి జాబితా

న్యూఢిల్లీ: కర్ణాటకలో 189 మందితో బీజేపీ అభ్యర్థుల తొలి జాబితాను మంగళవారం విడుదల చేసింది. వీరిలో 52 మంది కొత్తవారు. 32 మంది బీసీ, 30 మంది ఎస్సీ, 16 ఎస్టీ, 8 మంది మహిళలున్నారు. సీఎం బసవరాజ బొమ్మై శిగ్గావ్, మాజీ సీఎం యడియూరప్ప కుమారుడు విజయేంద్ర శికారిపుర, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీటీ రవి చిక్‌మగళూరు నుంచి పోటీచేస్తారు. పీసీసీ చీఫ్ డీకే శివకుమార్‌పై కనకపురలో మంత్రి ఆర్.అశోక బరిలో దిగనున్నారు. వరుణలో కాంగ్రెస్ నేత, మాజీ సీఎం సిద్ధరామయ్యపై మంత్రి వి.సోమన్న పోటీకి సిద్ధమయ్యారు.

తప్పుకుంటున్నా:ఈశ్వరప్ప

బెంగళూరు/హుబ్బళ్లి: క్రియాశీల రాజకీయాల నుంచి వైదొలుగుతానని, ఎన్నికల్లో పోటీ చేయబోనని బీజేపీ సీనియర్ నేత కేఎస్ ఈశ్వరప్ప (74) ప్రకటించారు. తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించవద్దంటూ బీజేపీ చీఫ్ జేపీ నడ్డాకు లేఖ రాశారు. ఇక మాజీ సీఎం జగదీశ్ షెట్టర్ (67)కు బీజేపీ అధిష్టానం షాకిచ్చింది. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయొద్దని సూచించింది. ఆయన మాత్రం తాను పోటీ చేస్తానని చెప్పారు.

సల్మాన్ ఖాన్‌కు బెదిరింపు కాల్



ముంబై: బాలీవుడ్ స్టార్ సల్మాన్‌ఖాన్‌ను చంపుతానంటూ ఓ టీనేజీ బాలుడు(16) బెదిరింపు కాల్ చేయడం సంచలనం కలిగించింది. సోమవారం రాత్రి ముంబై పోలీస్ కంట్రోల్ రూంకు అతడు ఫోన్ చేసి ఏప్రిల్ 30వ తేదీన సల్మాన్‌ను చంపుతానంటూ హెచ్చరించాడు. ఈ విషయాన్ని సల్మాన్‌కు తెలపాలంటూ ఫోన్ పెట్టేశాడు. వెంటనే పోలీసులు తిరిగి అతడికి ఫోన్ చేయగా గోరక్షకుడినని, తనది రాజస్తాన్‌లోని జోధ్‌పూర్ అని చెప్పుకున్నాడు. హుటాహుటిన రంగంలోకి దిగిన పోలీసులు సాంకేతిక ఆధారాలతో ముంబైకి 70 కిలోమీటర్ల దూరంలోని థానె జిల్లా షాహాపూర్ నుంచి కాల్ వచ్చినట్లు గుర్తించారు. అక్కడికి చేరుకున్న పోలీసు బృందాలను చూడగానే సదరు టీనేజర్ బైక్‌పై పారిపోయేందుకు యత్నించగా వెంబడించి పట్టుకున్నారు. ముంబై పోలీసులకు అతడిని అప్పగించారు. పోలీస్ కంట్రోల్ రూంకు ఫోన్ చేసినట్లుగా అతడి సెల్‌ఫోన్‌లో కాల్‌డేటాను గుర్తించారు. అతడిది రాజస్తాన్ అని పోలీసులు చెప్పారు. ముంబై పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. గత నెలలో గ్యాంగ్‌స్టర్లు లారెన్స్ బిష్ణోయ్, గోల్డీ బ్రార్‌లనుంచి వచ్చిన బెదిరింపు ఈ–మెయిల్‌తో ఇప్పటికే సల్మాన్‌కున్న వై ప్లస్ కేటగిరీ బందోబస్తును పోలీసులు మరింతగా పెంచారు.

మరింత 'అణు' దూకుడు
ఉత్తర కొరియా అధినేత కిమ్
మళ్లీ పెరుగుతున్న ఉద్రిక్తతలు

సియోల్: అణు పాటవాన్ని మరింతగా పెంచుకుంటామని ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ ప్రకటించారు. కొరియా ద్వీపకల్పంలో నానాటికీ పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో దేశ అత్యున్నత సైనికాధికారులతో ఆయన సమావేశమయ్యారు. అమెరికా–దక్షిణ కొరియా సంయుక్త సైనిక విన్యాసాలకు దీటుగా రక్షణ సామర్థ్యాన్ని, యుద్ధ సన్నద్ధతను పెంచుకోవడంపై భేటీలో లోతుగా చర్చ జరిగినట్టు అధికార కొరియన్ సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ (కేసీఎన్ఏ) తెలిపింది. అణ్వాయుధ సామర్థ్యాన్ని భారీగా పెంచాలని ఈ సందర్భంగా అధికారులను కిమ్ ఆదేశించారు. దక్షిణ కొరియాతో మిలిటరీ హాట్‌లైన్ చర్చలకు కూడా ఐదు రోజులుగా ఉత్తర కొరియా ముందుకు రాకపోవడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. బహుశా ప్రస్తుత ఉద్రిక్తతలను బూచిగా చూపుతూ దూకుడు చర్యలకు దిగేందుకు ఉత్తర కొరియా యోచిస్తుండవచ్చని దక్షిణ కొరియా అనుమానిస్తోంది. 2023లో ఉత్తర కొరియా ఇప్పటికే 30కి పైగా క్షిపణి పరీక్షలు నిర్వహించింది. వీటిలో ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులు కూడా ఉన్నాయి. 2022లో కూడా రికార్డు స్థాయిలో 70కి పైగా క్షిపణి పరీక్షలు జరిపింది. తమను అణ్వాయుధ దేశంగా అంగీకరించేలా, ఆర్థిక ఆంక్షలను సడలించేలా అమెరికాపై ఒత్తిడి పెంచడమే వీటి ఉద్దేశమని భావిస్తున్నారు. ఇరు దేశాల మధ్య అణు చర్చల్లో 2019 నుంచీ ప్రతిష్టంభన నెలకొంది. ఉత్తర కొరియా 2017లో తొలిసారి అణుపరీక్షలు నిర్వహించింది.

71 వేల నియామకపత్రాలు... పంపిణీ చేయనున్న ప్రధాని

న్యూఢిల్లీ: కొత్తగా ఉద్యోగాల్లో చేరనున్న 71 వేల మంది యువతకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 13న వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నియామక పత్రాలను పంపిణీ చేయనున్నారు. ఈ సందర్భంగా వారితో ఆయన మాట్లాడతారని ప్రధాని కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. 10 లక్షల మందికి ఉద్యోగకల్పన లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన రోజ్‌గార్ మేళాలో భాగంగా ఈ కార్యక్రమం జరుగుతోందని పేర్కొంది.

మాజీ మెకానిక్‌ను వరించిన రూ.328 కోట్ల లాటరీ



క్లీవ్(అమెరికా): ఆదివారంతో వారాంతం ముగిశాక అందరూ సోమవారం కొత్త వారాన్ని మొదలుపెడతారు. కానీ అమెరికాకు చెందిన మాజీ మెకానిక్ ఏకంగా కొత్త జీవితాన్నే మొదలుపెట్టారు. 40 మిలియన్ డాలర్ల(దాదాపు రూ.328 కోట్ల) లాటరీ రూపంలో ఆయనను ధనలక్ష్మి వరించింది. చిరకాల మిత్రుడొచ్చి లాటరీ గెలుపు సంగతి చెబితే 'ఏప్రిల్ ఫూల్' చేస్తున్నాడని భావించాడు ఎర్ల్ లాపే. ఎందుకంటే ఏప్రిల్ ఒకటో తేదీన ఆయన ఆ టికెట్ కొన్నాడు మరి. అమెరికాలోని అయోవా రాష్ట్రంలోని డబ్యూక్ సిటీలో ఉండే 61 ఏళ్ల లాపే మెకానిక్‌గా చేసి రిటైర్ అయ్యారు. ఇటీవల ఆయన కొన్న 'లోట్టో అమెరికా' లాటరీ టికెట్‌కు జాక్‌పాట్ తగిలింది. దీంతో ఆయన ఆనందానికి అవధుల్లేవు. సోమవారం లాటరీ ప్రధాన కార్యాలయానికి వచ్చి టికెట్‌ను క్లెయిమ్ చేశాడు. విడతలవారీగా అయితే రూ.328 కోట్లను 29సంవత్సరాల కాలంలో ఇస్తారు. కానీ విడతలవారీగా కాకుండా ఒకేసారి ఏకమొత్తంగా తీసుకోవాలని నిర్ణయించుకున్నాడు. దీంతో ఆయనకు రూ.175 కోట్ల నగదు బహుమతి దక్కనుంది.

ఎల్‌నినో ఉన్నా మంచి వానలే!
దేశంలో నైరుతి వర్షపాతంపై భారత వాతావరణ శాఖ అంచనా

న్యూఢిల్లీ: భారత్‌లో వర్షాభావ పరిస్థితులకు కారణమయ్యే 'ఎల్ నినో' దాపురించే అవకాశాలు ఉన్నాసరే ఈ ఏడాది దేశంలో నైరుతి రుతుపవన వర్షపాతం సాధారణస్థాయిలో కొనసాగి వ్యవసాయ రంగానికి మేలుచేకూర్చనుందని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) మంగళవారం అంచనావేసింది. సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశముందని ప్రైవేట్ వాతావరణ అంచనాల సంస్థ స్కైమేట్ సోమవారం ప్రకటించిన మరుసటి రోజే వాతావరణ శాఖ మరోలా అంచనాలు వెల్లడించడం గమనార్హం. భారత్‌లో వ్యవసాయం ప్రధానంగా వర్షాలపై ఆధారపడింది. మొత్తం పంట విస్తీర్ణంలో దాదాపు 52 శాతం భూభాగం వర్షాధారం. దేశ మొత్తం ఆహారోత్పత్తిలో 40 శాతం.. ఈ భూభాగంలో పండించే పంట నుంచే వస్తోంది. ఇది దేశ ఆహారభద్రతకు, ఆర్థిక సుస్థిరతకు కీలక భూమికగా మారింది. ఈ పరిస్థితుల్లో దేశంలో వర్షపాతం సాధారణంగా ఉంటుందని అంచనావేసి వ్యవసాయరంగానికి ఐఎండీ తీపికబురు మోసుకొచ్చింది. పసిఫిక్ మహాసముద్ర ఉపరితర జలాలు వేడెక్కితే ఎల్ నినో అంటారు. దీనివల్ల భారత్‌లో రుతుపవన గాలులు బలహీనమై పొడిబారి వర్షాభావం తలెత్తుతుంది.



సగటు వానలు

జూన్ నుంచి సెప్టెంబర్ దాకా నైరుతి సీజన్‌లో దాదాపుగా సుదీర్ఘకాల సగటు అయిన 87 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కావచ్చని కేంద్ర భూ శాస్త్ర శాఖ కార్యదర్శి ఎం.రవిచంద్రన్ చెప్పారు. సాధారణం, అంతకు ఎక్కువ వానలు పడేందుకు 67 శాతం ఆస్కారముందని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మహాపాత్ర అంచనావేశారు. ''రెండో అర్ధభాగంపై ఏర్పడే ఎల్‌నినో ప్రభావం చూపొచ్చు. అంతమాత్రాన వర్షాభావం ఉంటుందని చెప్పలేం. ఎన్నోసార్లు ఎల్‌నినో వచ్చినా సాధారణ వర్షపాతం నమోదైంది'' అని ఆయన వివరించారు.

పోతపోసిన పోస్టాఫీస్...!

బెంగళూరు: 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీతో పోతపోసిన తపాలా కార్యాలయం దేశంలో తొలిసారిగా బెంగళూరులో కొలువు తీరనుంది. దీన్ని ఎల్ అండ్ టీ సంస్థ 45 రోజుల్లో 1,000 చదరపు అడుగుల్లో నిర్మించనుంది. పూర్తిగా ఆటో మేటిక్‌గా పనిచేసే రోబోటిక్ ప్రింటర్ దీన్ని తయారు చేస్తుంది. కాంక్రీట్‌ను పొరలు పొరలుగా 3డీ మోడల్‌కు తగ్గట్టు పోస్తుంది. ఎక్కడా కాంక్రీట్ పడే వేగం తగ్గకుండా చూస్తూ వెనువెంటనే గట్టిపడేలా చేస్తుంది. పొరల మధ్య బలమైన బంధం ఉండేలా 'గ్రీన్ కాంక్రీట్'ను నింపుతుంది. ''జీ+3 నిర్మాణాలు, విల్లాలు, సైనిక బ్యారక్‌లు, ఒకే అంతస్తుండే పాఠశాలలు, పోస్టాఫీసులు, ఫ్యాక్టరీల నిర్మాణంపై దృష్టిపెట్టాం'' అని సంస్థ పూర్తికాల డైరెక్టర్, ఎల్ అండ్ టీ కన్‌స్ట్రక్షన్ (బిల్డింగ్స్) సీనియర్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఎంపీ సతీశ్ ఈ సందర్భంగా మీడియాకు చెప్పారు.



300కుపైగా సీట్లు మావే

- వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయం
- నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేస్తారు
- కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ధీమా



దిబ్రూగఢ్: 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ విజయం తథ్యమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో 300కు పైగా సీట్లు సాధించి వరుసగా మూడోసారి అధికారంలోకి రాబోతున్నామని ధీమా వెలిబుచ్చారు. అస్సాంలోని దిబ్రూగఢ్‌లో అప్పర్ అస్సాం జోనల్ బీజేపీ కార్యాలయ నిర్మాణానికి అమిత్ షా మంగళవారం పునాదిరాయి వేశారు. అనంతరం నిర్వహించిన సభలో ప్రసంగించారు. అస్సాంలో 14 లోక్‌సభ స్థానాలు ఉండగా, వచ్చే ఎన్నికల్లో తాము 12 స్థానాలు గెలుచుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఈశాన్య రాష్ట్రాల్లో ఒకప్పుడు కాంగ్రెస్ బలంగా ఉండేదని, ఇప్పుడు ఆ పార్టీ నామమాత్రంగా మారిపోయిందని అన్నారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర పెద్దగా ఫలితాన్ని ఇవ్వలేదని, ఇటీవల ఈశాన్యంలో జరిగిన మూడు రాష్ట్రాల ఎన్నికల్లో ఆ పార్టీ ఘోరంగా ఓడిపోయిందని గుర్తుచేశారు. ఈశాన్యంలో తమకు అధికారం కట్టబెట్టిన తొలి రాష్ట్రం అస్సాం ప్రజలకు అమిత్ షా కృతజ్ఞతలు తెలియజేశారు.

అస్సాంలో శాంతి సౌభాగ్యాలు

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విదేశీ గడ్డపై దేశాన్ని అవమానించారని అమిత్ షా మండిపడ్డారు. ఇలాగే చేస్తే కాంగ్రెస్ తుడిచిపెట్టుకుపోతోందని అన్నారు. ప్రధాని మోదీని కొందరు ఇష్టారాజ్యంగా దూషిస్తున్నా ప్రజల ఆశీస్సులు ఆయనకు లభిస్తున్నాయన్నారు. మోదీ బాగుండాలని ప్రజలంతా ప్రార్థిస్తున్నారని తెలిపారు. అస్సాం అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. రాష్ట్రంలో 70 శాతం భూభాగం నుంచి వివాదాస్పద సైనిక దళాల (ప్రత్యేక అధికారాల) చట్టం–1958ను తొలగించామని పేర్కొన్నారు. అస్సాం అనగానే ఆందోళనలు, ఉగ్రవాదం గుర్తుకొచ్చేవని, ప్రస్తుతం శాంతి సౌభాగ్యాలు పరిఢవిల్లుతున్నాయని ఆనందం వ్యక్తం చేశారు.

నన్నెవరూ ఆపలేరు: రాహుల్
వయనాడ్ జిల్లాలో 'సత్యమేవ జయతే' రోడ్డు షో



వయనాడ్: భయభ్రాంతులకు గురి చేసినా, ఎంపీ పదవి నుంచి తొలగించినా వయనాడ్ లోక్‌సభ స్థానం ప్రజలకు ప్రాతినిధ్యం వహించకుండా తననెవరూ అడ్డుకోలేరని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తేల్చిచెప్పారు. అనర్హత వేటు తర్వాత తొలిసారిగా కేరళలోని వయనాడ్ జిల్లాలో ఆయన మంగళవారం పర్యటించారు. కల్పెట్టాలో 'సత్యమేవ జయతే' పేరిట రోడ్డు షో నిర్వహించారు. తనను జైలులో పెట్టినప్పటికీ వయనాడ్ ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తూనే ఉంటానన్నారు. ''నాపైకి పోలీసులను పంపిస్తే, నా ఇంటిని లాక్కుంటే భయపడే ప్రసక్తే లేదు. అదానీ గురించి, ఆయనతో ప్రధాని మోదీకి సంబంధాల గురించి నా ప్రశ్నలను తట్టుకోలేకే లోక్‌సభ నుంచి పంపించారు'' అన్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించినందుకు రాహుల్‌పై బీజేపీ ప్రభుత్వం క్రూరంగా మాటల దాడికి పాల్పడిందని ఆయన సోదరి ప్రియాంకాగాంధీ వాద్రా ఆరోపించారు. అబద్ధాలు చెప్పేవారికి, దుష్ప్రచారం చేసేవారికి నిజాలు చేదుగానే ఉంటాయని ఎద్దేవా చేశారు.

ఈడీ ఎదుటకు తేజస్వీ యాదవ్

న్యూఢిల్లీ: ల్యాండ్ ఫర్ జాబ్స్ కుంభకోణం కేసులో బిహార్ డిప్యూటీ సీఎం తేజస్వీయాదవ్ మంగళవారం ఈడీ విచారణకు హాజరయ్యారు. ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేసినట్లు అధికారులు చెప్పారు. ఈ కేసులో గత నెలలో తేజస్వీతోపాటు, ఆయన సోదరి, ఎంపీ మిసా భారతిని ఈడీ ప్రశ్నించడం తెలిసిందే.

'డ్రోన్ ఆయుధాలు' పెను సవాళ్లు
భద్రతామండలిలో భారత ప్రతినిధి రుచిరా కాంభోజ్

ఐక్యరాజ్యసమితి: సరిహద్దుల ఆవలి నుంచి డ్రోన్ల ద్వారా జరుగుతున్న అక్రమ ఆయుధ సరఫరాతో పెనుసవాళ్లను ఎదుర్కొంటున్నామని భారత్ పేర్కొంది. ప్రభుత్వాల అండదండలు లేకుండా ఇవి అసాధ్యమని పాకిస్తాన్‌నుద్దేశించి వ్యాఖ్యానించింది. 'అంతర్జాతీయ శాంతి భద్రతలకు ముప్పు: ఆయుధాలు, సైనిక పరికరాల ఎగుమతులను నియంత్రించే ఒప్పందాల ఉల్లంఘనలతో ఉత్పన్నమవుతున్న ప్రమాదాలు' అంశంపై ఐరాస భద్రతా మండలిలో సోమవారం భారత్ శాశ్వత ప్రతినిధి రుచిరా కాంభోజ్ ఈ మేరకు పేర్కొన్నారు. ప్రమాదకర ఆయుధాలు, సైనిక పరికరాలను దొంగచాటుగా సరఫరా చేస్తూ దేశాల మధ్య ఉద్రిక్తతలకు కారణమవుతున్న దేశాలను వదిలి పెట్టరాదన్నారు.

అధిష్టానం వద్దన్నా పైలట్ నిరశన దీక్ష

జైపూర్: రాజస్తాన్‌లో కాంగ్రెస్ అసమ్మతి నేత సచిన్ పైలట్ పార్టీ అధిష్టానం హెచ్చరికలను బేఖాతరు చేశారు. ముందుగా ప్రకటించినట్టుగానే రాష్ట్రంలో సొంత పార్టీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మంగళవారం నిరశనకు దిగారు. గత బీజేపీ సర్కారు అవినీతిపై చర్యలు తీసుకుంటామన్న ఎన్నికల హామీని సీఎం అశోక్ గహ్లోత్ నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ ఒక్క రోజు నిరాహార దీక్ష చేశారు. అవినీతిపై తన పోరాటం కొనసాగుతూనే ఉంటుందని అనంతరం ప్రకటించారు.

మయన్మార్‌లో వైమానిక దాడి.. 100 మంది ప్రజలు మృతి

బ్యాంకాక్: మయన్మార్ సైనిక పాలకుల వైమానిక దాడిలో సుమారు 100 మంది ప్రజలు చనిపోయారు. సగయింగ్ ప్రాంతం కన్‌బాలు పట్టణ సమీపంలోని పజిగ్యి గ్రామంలో మంగళవారం ఉదయం ఈ దారుణం జరిగింది. సైనిక పాలనను వ్యతిరేకిస్తూ విపక్ష ఉద్యమకారులు ఏర్పాటు చేసిన కార్యాలయ ప్రారంభోత్సవంపై యుద్ధవిమానం బాంబులు వేసింది. సైనిక హెలికాప్టర్ నుంచి కాల్పులు జరిపారు. దాంతో 30 మంది మహిళలు, చిన్నారులు సహా 100 మంది దాకా చనిపోయారంటున్నారు.

భావసారూప్య పార్టీలతో చేతులు కలుపుతాం
రాజ్యాంగ పరిరక్షణే మా ధ్యేయం • కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత సోనియా గాంధీ స్పష్టీకరణ

న్యూఢిల్లీ: నరేంద్ర మోదీ ప్రభుత్వం ఇష్టారాజ్యంగా అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని, అన్ని వ్యవస్థలనూ స్వలాభం కోసం వాడుకుంటోందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత సోనియా గాంధీ ఆరోపించారు. ప్రభుత్వ నిర్వాకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తామని చెప్పారు. దేశంలో రాజ్యాంగ పరిరక్షణమే తమ ధ్యేయమని, ఇందుకోసం భావసారూప్యం కలిగిన రాజకీయ పక్షాలతో చేతులు కలుపుతామని, కలిసి పని చేస్తామని ఓ పత్రికకు రాసిన వ్యాసంలో వెల్లడించారు. శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలను మోదీ ప్రభుత్వం ఒక పద్ధతి ప్రకారం నిర్వీర్యం చేస్తోందని సోనియా దుయ్యబట్టారు. ప్రభుత్వ పెద్దల చర్యలను పరికిస్తే ప్రజాస్వామ్యం కంటే తామే అధికులమన్న భావన వారిలో వ్యక్తమవుతోందని పేర్కొన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ దేశంలో విద్వేషం, హింసను ప్రేరేపిస్తున్నాయని, ప్రధానమంత్రి ఉద్దేశపూర్వకంగానే వాటిని విస్మరిస్తున్నారని దుయ్యబట్టారు. శాంతి, సామరస్యం కోసం ప్రధాని ఏనాడూ పిలుపునివ్వలేదని ఆక్షేపించారు. మతం, ఆహారం, కులం, భాష పేరిట ప్రజలపై వివక్ష చూపుతున్నారని, భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



మోదీది కేవలం మాటల గారడీ

రాబోయే కొన్ని నెలలు దేశ ప్రజాస్వామ్యానికి అగ్ని పరీక్షలాంటివని సోనియా అన్నారు. ''ముఖ్య రాష్ట్రాల్లో ఎన్నికలున్నాయి. దేశం కీలకమైన కూడలిలో ఉంది. రాజ్యాంగ ఆశయాల పరిరక్షణకు భావసారూప్య పార్టీలతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నాం. ప్రజావాణికి కాపలాదారుగా ఉంటాం. ప్రధాని మోదీ మాటల గారడీతో జనాన్ని మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రతిపక్ష నాయకులపై లెక్కలేనన్ని కేసులు! బీజేపీలో చేరితే అవన్నీ మటుమాయం!'' అని దుయ్యబట్టారు.

సాక్షి హైదరాబాద్

బుధవారం । 12 । ఏప్రిల్ । 2023



మౌలిక వసతుల్లో అగ్రగామి ఓయూ

రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలన్నింటిలోకెల్లా మౌలిక వసతుల్లో ఓయూ అగ్రగామిగా నిలుస్తోందని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. -8లో



ఐపీఎల్ బెట్టింగ్ @ రూ.కోటి

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) నేపథ్యంలో బెట్టింగ్ జోరుగా సాగుతోంది. మంగళవారం సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర బెట్టింగ్ వివరాలను వెల్లడించారు. -8లో

మైనారిటీల సంక్షేమానికి కృషి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి కృషి చేస్తోందని మంత్రులు కొప్పుల ఈశ్వర్, మహమూద్ అలీ అన్నారు. నేడు ఎల్బీస్టేడియంలో నిర్వహించనున్న ఇఫ్తార్ విందుకు సంబంధించిన ఏర్పాట్లను మంగళవారం వివిధ శాఖల అధికారులతో కలిసి వారు పరిశీలించారు. ప్రభుత్వ సలహాదారు ఏకే ఖాన్, మైనారిటీ కార్పొరేషన్ ఛైర్మన్ ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.



న్యూస్‌రీల్

ఎల్బీ స్టేడియం కేంద్రంగా ట్రాఫిక్ మళ్లింపులు

- నేటి సాయంత్రం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఎల్బీ స్టేడియంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసింది. ముఖ్యమంత్రి కేసీఆర్ సహా అనేక మంది ప్రముఖులు, అధికారులు, రాజకీయ నాయకులు హాజరుకానున్న నేపథ్యంలో నేటి సాయంత్రం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు స్టేడియం కేంద్రంగా ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపులు విధిస్తూ ట్రాఫిక్ చీఫ్ జి.సుధీర్‌బాబు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. నిర్దేశిత సమయంలో స్టేడియం చుట్టు పక్కల మార్గాల్లోకి సాధారణ వాహనాలను అనుమతించబోమని, వాహన చోదకులు సహకరించాలని ఆయన కోరారు.

ఎండలు భగ భగ

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో ఎండలు భగభగ మండుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచి భానుడు ప్రతాపం చూపిస్తున్నాడు. గత రెండు రోజుల నుంచి సాధారణ ఉష్ణోగ్రత కంటే నాలుగైదు డిగ్రీలు అధికంగా నమోదువుతోంది. మంగళవారం సాధారణ ఉష్ణోగ్రత 35.4 డిగ్రీలు ఉండగా, పలు ప్రాంతాల్లో అంతకంటే అధికంగా నమోదైంది. మరో మూడు నాలుగు రోజులు ఉష్ణోగ్రత ప్రభావం అధికంగా ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది.

స్ఫూర్తి ప్రదాత జ్యోతిరావు పూలే



సాక్షి, సిటీబ్యూరో: సమ సమాజ స్థాపనలో భావితరాలకు స్ఫూర్తి ప్రదాతగా నిలిచిన మహాత్మా జ్యోతిరావు పూలేను ఆదర్శంగా తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేశ్ కుమార్ అన్నారు. జ్యోతిరావు పూలే జయంతిసందర్భంగా మంగళవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆయా విభాగాల ఉన్నతాధికారులు దేవేందర్‌రెడ్డి, బి.కృష్ణ, జయరాజ్ కెన్నెడి, మహ్మద్ ముర్తుజా, వెంకటరమణ, జీవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సైబర్ సెక్యూరిటీ సమ్మిట్

- హాజరుకానున్న మంత్రులు కేటీఆర్, మహముద్ అలీ

హిమాయత్‌నగర్: సైబర్ నేరగాళ్ల చేతిలో చిక్కుకుని పలువురు నగర వాసులు మోసపోతూనే ఉన్నారు. ఈ క్రమంలో సైబర్ నిపుణులు, సైబర్‌క్రైం పోలీసులు నేరాలు జరుగుతున్న తీరుపై ప్రజలకు వివరించనున్నారు. బుధవారం బంజారాహిల్స్‌లోని తాజ్‌డెక్కన్ హోటల్లో సైబర్ సమ్మిట్-2023ను హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ (హెచ్‌సీఎస్సీ) ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ సమ్మిట్‌కు ముఖ్య అతిథులుగా మంత్రులు కేటీఆర్, మహముద్ అలీ రానున్నారు. ప్రత్యేక అతిథులుగా సినీ దర్శకుడు రాజమౌళి, క్రీడాకారిణులు హాజరవుతున్నారు. సమ్మిట్‌లో నగర నలుమూలల నుంచి 111 మంది యువతీ యువకులకు హెచ్‌సీఎస్సీ ఆహ్వానం అందించింది.

'న్యాక్'కు అచీవ్‌మెంట్ అవార్డు

మాదాపూర్: మాదాపూర్‌లోని న్యాక్ అచీవ్‌మెంట్ అవార్డును అందుకుంది. కన్‌స్ట్రక్షన్ ఇండస్ట్రీ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (సీఐడీసీ) విశ్వకర్మ అవార్డుల ప్రదానోత్సవంలో భాగంగా న్యూఢిల్లీ ఐకార్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో నిర్మాణ నైపుణ్యం అభివృద్ధికి అచీవ్‌మెంట్ అవార్డును న్యాక్ సంస్థకు అందించారు. పార్లమెంటరీ వ్యవహారాలు, సాంస్కృతిక శాఖ సహాయమంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్ ఈ అవార్డును అందజేశారు. కార్యక్రమంలో న్యాక్ డైరెక్టర్ జనరల్ కె.భిక్షపతి, న్యాక్ డైరెక్టర్లు ఎం.రాజిరెడ్డి, శాంతిశ్రీ, సత్యపాల్‌రెడ్డి, హేమలత తదితరులు పాల్గొన్నారు.



అవార్డును అందుకున్న న్యాక్ డైరెక్టర్లు



బషీర్‌బాగ్‌లో..



'పది'ంతల ఆనందం

పదోతరగతి వార్షిక పరీక్షలు ముగియడంతో విద్యార్థులు కేరింతలతో ఆనందం వ్యక్తం చేశారు. వారి తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. నగరంలో గట్టి బందోబస్తు మధ్య పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. గ్రేటర్ పరిధిలో 590 పరీక్ష కేంద్రాల్లో సుమారు 1.60 లక్షల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. జిల్లాల వారీగా పరిశీలిస్తే హైదరాబాద్‌లో మొత్తం 68,939, రంగారెడ్డిలో 47,661, మేడ్చల్-మల్కాజిగిరిలో 43,595 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. - సాక్షి, సిటీబ్యూరో

అలా ఇచ్చేశారు



80 కేంద్రాలు.. ఒక్కోదాన్నుంచి 100కుపైగా..

- అక్రమ మార్గాల్లో జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ
- చర్యలు తీసుకోవాలని సీపీలకు జీహెచ్‌ఎంసీ లేఖలు
- హెల్త్ అసిస్టెంట్ల పాత్రపై విజిలెన్స్ విచారణ

సాక్షి, సిటీబ్యూరో: వక్రమార్గాల్లో జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ చేసిన మీ సేవ కేంద్రాలు ఒకటి కాదు.. రెండు కాదు దాదాపు 800 ఉన్నాయి. ఇవి నిబంధనలకు విరుద్ధంగా 'నాన్ అవైలబిలిటీ' పేరిట ఆర్‌డీఓ ప్రొసీడింగ్స్ లేనప్పటికీ సర్టిఫికెట్లు జారీ చేశాయి. వీటిలో కొన్ని కేంద్రాలు పది కంటే తక్కువ సర్టిఫికెట్లను జారీ చేయగా, వందకు పైగా సర్టిఫికెట్లు జారీ చేసిన కేంద్రాలు దాదాపు 80 ఉన్నట్లు జీహెచ్‌ఎంసీ అంతర్గత పరిశీలనలో గుర్తించారు. సదరు మీ సేవ కేంద్రాలపై తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా, వాటి సేవల్ని రద్దు చేయాల్సిందిగా ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ కమిషనర్‌కు జీహెచ్‌ఎంసీ అధికారులు లేఖ రాసినట్లు తెలిసింది.

- మరోవైపు సదరు మీ సేవ కేంద్రాలపై చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ, సిద్దిపేట పోలీస్ కమిషనర్లకు జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు లేఖలు రాసినట్లు సమాచారం. వక్రమార్గాల్లో సర్టిఫికెట్లు జారీ చేసిన కేంద్రాల్లో కొన్ని సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఉన్నందున అక్కడ ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అవకతవకలకు పాల్పడ్డ మీ సేవ కేంద్రాలపై చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతూ సర్కిళ్ల పరిధిలోనూ సంబంధిత బర్త్‌అండ్ డెత్ రిజిస్ట్రార్లుగా వ్యవహరిస్తున్న ఏఎంఓహెచ్‌లు(అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ ఆఫ్ హెల్త్), ఏఎంసీలు(అసిస్టెంట్ మునిసిపల్ కమిషనర్లు)స్థానిక పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశారు.
- ఫిర్యాదులకు స్పందిస్తూ పోలీసులు జీహెచ్‌ఎంసీ అధికారుల స్టేట్‌మెంట్లను రికార్డు చేసే పనిని చేపట్టినట్లు తెలిసింది. వక్రమార్గాల్లో సర్టిఫికెట్లు ఎలా జారీ అయ్యాయనే వివరాలను సేకరిస్తుండటంతోపాటు సంబంధిత మీ సేవ కేంద్రాల చిరునామాలు, ఫోన్ నంబర్లు తదితర వివరాలు సేకరిస్తున్నట్లు తెలిసింది. అవకతవకలు వెలుగు చూశాక తిరిగి అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జీహెచ్‌ఎంసీ చేపట్టిన చర్యలను కూడా వారు అడిగి తెలుసుకుంటున్నట్లు సమాచారం.

డాక్యుమెంట్లు పరిశీలించాకే..

ఆస్పత్రుల్లో జరిగిన జనన, మరణాలకు సంబంధించి ఇన్‌స్టంట్ అప్రూవల్‌తో సర్టిఫికెట్లు యథాతథంగా జారీ అవుతున్నప్పటికీ , ఇళ్ల వద్ద జనన, మరణాలు జరిగిన.. నాన్ అవైలబిలిటీ కింద సర్టిఫికెట్ల కోసం అందుతున్న దరఖాస్తులను, పొరపాట్ల సవరణల కోసం అందుతున్న దరఖాస్తులను మాత్రం సంబంధిత అధికారులు పరిశీలించాకే, అన్ని డాక్యుమెంట్లు సవ్యంగా ఉన్నట్లు నిర్ధారించుకున్నాకే జారీ చేస్తున్నట్లు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఆర్‌డీఓ ప్రొసీడింగ్స్‌ను సైతం అసలువా, నకిలీవా అన్నది పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. పరిశీలన పేరిట జాప్యం చేయకుండా ఉండేందుకు వారం రోజుల వరకు గడువునిచ్చినట్లు పేర్కొన్నారు.

హెల్త్ అసిస్టెంట్ల పాత్రపైనా విచారణ?

మరోవైపు అక్రమ మార్గాల్లో బర్త్, డెత్ సర్టిఫికెట్ల జారీలో జీహెచ్‌ఎంసీ సర్కిళ్లలోని హెల్త్ అసిస్టెంట్ల పాత్ర ఉందనే ఫిర్యాదులు అందడంతో వారి పాత్రపైనా విజిలెన్స్ విచారణ జరిపించేందుకు జీహెచ్‌ఎంసీ సిద్ధమైనట్లు తెలిసింది. నాన్ అవైలబిలిటీ పేరిట ఆర్‌డీఓ ప్రొసీడింగ్స్ స్థానే చిత్తు కాగితాలు, తెల్లకాగితాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం ద్వారా జారీ అయిన దాదాపు 21వేల బర్త్, డెత్ సర్టిఫికెట్లను జీహెచ్‌ఎంసీ రద్దు చేయడం తెలిసిందే.



ఏటీఎం మెషిన్ వద్ద నిందితుడు



ఇలా పరిశీలిస్తూ..



ధ్వంసం చేసేందుకు యత్నిస్తూ..

శభాష్.. పోలీస్

ఫోన్ చేసిన 5 నిమిషాల్లో ఘటనా స్థలానికి..

- ఏటీఎం ధ్వంసం చేస్తుండగా నిందితుడి పట్టివేత

సాక్షి, సిటీబ్యూరో: డయల్ 100కు ఫోన్ చేసిన 5 నిమిషాల్లోనే ఘటనా స్థలానికి చేరుకొని నిందితుడిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోవటంతో పాటు ప్రభుత్వ ఆస్తిని, నగదును కాపాడారు రాచకొండ పోలీసులు. రాచకొండ క్రైమ్స్ డీసీపీ మధుకర్ స్వామి తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన పంకజ్ కుమార్ కొంతకాలంగా మౌలాలీలో ఉంటున్నాడు. అర్ధరాత్రుల్లో ఏటీఎం సెంటర్ల వద్ద సంచరిస్తూ రెక్కీ చేస్తుంటాడు. జన సంచారం లేని ఏటీఎం సెంటర్‌ను ఎంపిక చేసి వాటిని ధ్వంసం చేసి చోరీకి పాల్పడుతుంటాడు.

ఈ క్రమంలో మౌలాలిలోని ఎస్‌బీఐ ఏటీఎం సెంటర్‌పై కన్నేశాడు. సోమవారం అర్ధరాత్రి సెంటర్‌లోకి ప్రవేశించి సీసీ టీవీ కెమెరాలో తన ముఖం రికార్డు కాకుండా ఉండేందుకు మాస్క్, చున్నీతో కప్పేశాడు. తన వెంట తెచ్చుకున్న ఇనుప రాడ్డు, తాళంచెవులతో నగదు ఉన్న బాక్స్‌ను తెరిచేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో అటువైపు వచ్చిన ఓ గుర్తు తెలియని వ్యక్తి వెంటనే డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించారు. వెంటనే మల్కాజిగిరి ఇన్‌స్పెక్టర్ రవికుమార్, మౌలాలీ సెక్టార్ ఎస్‌ఐ సీహెచ్ హరి ప్రసాద్, ఏఎస్‌ఐ సుబ్బా రాయుడు, హెడ్ కానిస్టేబుల్ రామచందర్, హోంగార్డు హరికాంత్‌లతో కలిసి పెట్రో వాహనంలో ఫోన్ వచ్చిన అయిదు నిమిషాల్లో ఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే ఏటీఎంను ధ్వంసం చేసేందుకు ప్రయత్నిస్తున్న నిందితుడు పంకజ్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో వేగంగా, చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులను రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ అభినందించారు.



పోలీసులను అభినందిస్తున్న సీపీ చౌహాన్

స్తంభించిన చెత్త తరలింపు

- బిల్లులు రాలేదని పనులు నిలిపివేసిన కాంట్రాక్టర్లు
- సాయంత్రం తిరిగి ప్రారంభించిన వైనం



సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీలో చెత్త తరలింపు పనులు చేసే టిప్పర్లు, మినీ టిప్పర్ల కాంట్రాక్టర్లకు నెలల తరబడి బిల్లులు చెల్లించకపోవడంతో మంగళవారం ఉదయం నుంచి చెత్త రవాణా పనులు నిలిపివేశారు. చెత్త తరలింపు, నిర్వహణ పనులు చేస్తున్న రాంకీ సంస్థకు జీహెచ్‌ఎంసీ నుంచి దాదాపు రూ. 400 కోట్లు నిలిచిపోవడంతో కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేదు. చెత్త రవాణాకు రాంకీ సంస్థ సొంత వాహనాలతో పాటు కాంట్రాక్టు వాహనాలతోనూ పనులు నిర్వహిస్తోంది. సదరు కాంట్రాక్టర్లకు దాదాపు రూ. 100 కోట్ల బకాయిలుండటంతో వారు చెత్త తరలించకుండా సమ్మెకు దిగారు. బిల్లుల చెల్లింపు అంశాన్ని రాంకీ సంస్థ పలు పర్యాయాలు జీహెచ్‌ఎంసీ దృష్టికి తెచ్చినా చెల్లింపులు చేయలేదు. సమ్మె నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ రాంకీకి రూ. 40 కోట్లు విడుదల చేసినట్లు తెలిసింది. దీంతో రాంకీ టిప్పర్ల కాంట్రాక్టర్లతో చర్చించడంతో సాయంత్రం అయిదు గంటల తర్వాత సమ్మె విరమించి పనులు ప్రారంభించారు. జీహెచ్‌ఎంసీలో రోజుకు దాదాపు ఆరున్నర వేల మెట్రిక్ టన్నుల చెత్త తరలిస్తుండగా, సమ్మె కారణంగా 3వేల మెట్రిక్ టన్నుల చెత్త తరలింపు నిలిచిపోయింది.



T20 జర్నీ!

మెగా టూరిస్ట్ హబ్‌గా ట్యాంక్ బండ్- నెక్లెస్ రోడ్

10 కి.మీ దూరంలో 20కిపైగా పర్యాటక ప్రదేశాలు

చార్మినార్.. గోల్కొండ కోట.. సాలార్‌జంగ్ మ్యూజియం.. సెవెన్ టూంబ్స్ (కుతుబ్‌షాహీ సమాధులు).. జూపార్క్.. చౌమహల్లా ప్యాలెస్.. ఇవే ఒకప్పుడు హైదరాబాద్ పర్యాటక చిరునామాలు. కాలక్రమేణా వీటితో పాటు అక్కడక్కడా మరి కొన్ని ఏర్పాటయ్యాయి. ఇప్పుడు ఏకంగా 10 కిలోమీటర్ల దూరంలోనే సుమారు 20కిపైగా ప్రదేశాలతో మెగా టూరిస్ట్ సర్కిల్‌గా రూపుదిద్దుకుంటోంది. ఒక్క రోజులోనే ఇవన్నీ చుట్టేసి రావొచ్చు. ఎలా వెళ్లినా తక్కువ బడ్జెట్‌తో ఒక రోజు కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులతో హాయిగా గడిపేయొచ్చు. పర్యాటకుల కోలాహలానికి చిరునామాగా మారిన ట్యాంక్ బండ్ – నెక్లెస్ రోడ్‌పై ఓ లుక్కేద్దాం! – సాక్షి, సిటీడెస్క్

- దేనికదే ప్రత్యేకత.. ఒక్కోచోట ఒక్కో ఆహ్లాదం
- తక్కువ బడ్జెట్‌తో సింగిల్ డే జాలీ జర్నీ
- భిన్న రుచులకు కేరాఫ్‌గా నయా టూరిస్ట్ సర్కిల్
- భాగ్యనగర సిగలో విభిన్న అనుభూతుల నగ

ట్యాంక్‌బండ్.. పర్యాటక సంగమం..

ట్యాంక్‌బండ్, బుద్ధ విగ్రహం, ఇందిరా పార్కు, స్నో వరల్డ్, మరో రెండురోజుల్లో ఆవిష్కరణ కానున్న 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం, అద్భుతంగా ఆవిష్కృతం కాబోతున్న రాష్ట్ర నూతన సచివాలయం, ప్రారంభానికి సిద్ధమైన అమరవీరుల స్మారకం, లుంబినీ పార్కు,, ఎన్టీఆర్ గార్డెన్, ప్రసాద్ ఐమాక్స్, బిర్లా మందిర్, బిర్లా ప్లానెటోరియం, జలవిహార్, థ్రిల్ సిటీ, ఈట్ స్ట్రీట్, సంజీవయ్య పార్కు, పీవీ జ్ఞాన భూమి, జైపాల్‌రెడ్డి స్మృతి వనం, ఇందిరా పార్కు.. ఇలా సుమారు 20కిపైగా ప్రదేశాలు పర్యాటక ప్రాంతాలుగా విరాజిల్లుతున్నాయి. ఇవన్నీ కేవలం 10కి.మీ సర్కిల్‌లో ఉండడం విశేషం. మరోవైపు ఇటీవల నిర్వహించిన ఫార్ములా ఈ కార్ రేసింగ్ ఈవెంట్ ట్యాంక్‌బండ్ ఖ్యాతిని ఖండాంతరాలకు పరిచయం చేసింది.

కొత్తందాల సమ్మేళనం

ఎప్పుడూ చూసే ట్యాంక్‌బండే కదా అనుకుంటే పొరపడినట్లే. పర్యాటకుల అభిరుచులకు అనుగుణంగా తనను తాను మార్చుకుంటోంది. కొత్తందాలతో కళకళలాడుతోంది. మిరుమిట్లుగొలిపే వెలుగుల్లో తథాగతుడు కనువిందు చేస్తున్నాడు. సండే ఫన్‌డే రోజున జరిగే సంగీత కార్యక్రమాలు ఆబాలగోపాలాన్ని అలరిస్తున్నాయి. ఇటీవలే ఏర్పాటు చేసిన నీటి ఫౌంటేన్లు జిగేల్‌మంటున్నాయి. లగ్జరీ బోట్లలో వ్యక్తిగత పార్టీలు, రాత్రి వేళల్లో బర్త్‌డే పార్టీలకు కేరాఫ్‌గా మారింది. ఇక ఎన్టీఆర్ గార్డెన్‌లో అరుదైన బొన్సాయ్ మొక్కలు, ఆర్టిఫిషియల్ మర్రిచెట్టులోంచి రైలు ప్రయాణం, భయపెట్టించే హంటర్ హౌస్, అబ్బురపరిచే పూల వనాలు, వింటేజ్ కార్లలో స్నాక్స్, అత్యంత ఎత్తులో నెక్లెస్ రోడ్ అందాలను చూపించే జెయింట్ వీల్, అండర్ గ్రౌండ్‌లో ఆటలు, ఆకట్టుకునే బొమ్మలు, ఎడారి మొక్కలు, కళ్లముందు మ్యాజిక్ చేసే త్రీడీ షో.. ఇవన్నీ ఇప్పుడు ట్యాంక్ బండ్‌కు సమ్‌థింగ్ స్పెషల్. ప్రసాద్ ఐమాక్స్‌లో సినిమా, షాపింగ్, గేమింగ్, ఈటింగ్, జల్ విహార్‌లో రెయిన్ డ్యాన్స్, వాటర్ గేమ్స్‌తో ఫుల్ ఎంజాయ్ ఉంటుంది. థ్రిల్ సిటీలో ప్రమాదకరమైన ఆటలతో భయానకమైన వాతావరణంతో థ్రిల్లింగ్ అనుభూతిని పంచుతుంది. సంజీవయ్య పార్క్‌లో అనేక రంగులతో అలరించే రోస్ గార్డెన్, బటర్‌ఫ్లై పార్క్, అతి పెద్ద జాతీయ జెండా, డాగ్ పార్క్, సైక్లింగ్ క్లబ్ ఇలా ఎన్నో.. మరెన్నో విశేషాలకు వేదిక అయ్యింది.

నీరా కేఫ్

హుస్సేన్‌సాగర్ తీరం చెంత నెక్లెస్ రోడ్‌లో మరో కొత్త పర్యాటక కేంద్రం నీరా కేఫ్ సిద్ధమైంది. అతి త్వరలో ఇది అందుబాటులోకి రానుంది. తెలంగాణ రుచులందించే స్టాళ్లతోపాటు కల్లుగీత వృత్తికి అద్దం పట్టేలా దీన్ని నిర్మించారు. పై అంతస్తులో ఒక సమావేశ మందిరం, రెస్టారెంట్ ఉంటుంది. మరోవైపు ప్రస్తుతం లుంబినీ పార్కు వద్ద ఉన్న బోటింగ్ పాయింట్‌కు తోడుగా నీరా కేఫ్ వెనుకభాగంలో మరో బోటింగ్ పాయింట్‌ను కొత్తగా అందుబాటులోకి తెచ్చారు. నెక్లెస్‌రోడ్‌లో విహరించేవారు లుంబినీ పార్కు బోటు యూనిట్ వరకూ వెళ్లాల్సిన అవసరం లేదు. సాగర్‌కు దక్షిణం వైపు నుంచి కూడా ప్రయాణించడానికి వీలు కల్పించినట్లయింది.

ప్రతిరోజూ వెళ్లాలనిపిస్తోంది



15 ఏళ్ల క్రితం సిటీకి వచ్చాను. నేడు ఎంతగానో మారింది. ముంబై, బెంగళూరు నగరాల కంటే ఎక్కువగా పర్యాటక రంగం దూసుకెళుతోంది. ఒకప్పుడు ఈవెనింగ్ టైంలో ట్యాంక్‌బండ్‌కు వెళ్లి రెండు, మూడు గంటల పాటు ఎంజాయ్ చేసేవాడిని. లాస్ట్ వన్ ఇయర్‌లో ట్యాంక్‌బండ్ ఏరియాలో జరిగిన డెవలప్‌మెంట్‌కు వీకెండే కాదు ప్రతిరోజూ వెళ్లాలనిపిస్తోంది. సరికొత్తగా కనిపిస్తోంది,

– చక్రవర్తి, ఐటీ ఉద్యోగి, రాంనగర్

బడ్జెట్ ఫ్రెండ్లీ సిటీ



హైదరాబాద్ అనేది బడ్జెట్ ఫ్రెండ్లీ సిటీ . ఇతర నగరాల్లో అయితే పర్యాటక ప్రాంతాలు ఒకే దగ్గర ఉండవు. అదే మన సిటీలో ఒక్క ట్యాంక్ బండ్‌కు వస్తే చాలు బోలెడన్ని ప్లేస్‌లు. ఒక్క రోజులో అన్నీ చుట్టేసి రావచ్చు. ఎంటర్‌టైన్‌మెంట్ అందించే ప్రాంతాలే ఎక్కువ. ఫుల్ ఎంజాయ్ చేయొచ్చు. పైగా తక్కువ ఖర్చులో వీటన్నింటినీ ఒకేరోజులో చూడొచ్చు.

– శివాని సింగ్, ట్రావెలర్, బంజారాహిల్స్

ఇవి చేస్తే ఇంకా మేలు

- పర్యాటకుల సంఖ్యకు అనుగుణంగా రీఫ్రెష్‌మెంట్ సౌకర్యాలపై జీహెచ్‌ఎంసీ, టూరిజం విభాగం దృష్టి సారించాలి. ప్రధానంగా టాయిలెట్ల సంఖ్య పెంచాలి.
- మినీ మొబైల్ వ్యాన్‌లు, షటిల్ సర్వీస్‌లు పెడితే బావుంటుంది. రోజంతా తిరిగేందుకు ఆర్టీసీ తరహా సింగిల్ డే పాస్‌లు ఉంటే మేలు.
- మొబైల్ చార్జింగ్ పాయింట్లు ,లాన్లలో కూర్చుకునేందుకు స్ట్రీట్ ఫర్నీచర్ అవసరం (ట్యాంక్‌బండ్, పీవీ మార్గ్ మినహా మరెక్కడా ఎక్కడా లేవు).
- షీ-టీంలను పెంచి, పోకిరీలు, ఆకతాయిల వేధింపులపై మరింత దృష్టి సారించాలి.
- రద్దీ వేళల్లో సందర్శకులతో ట్రాఫిక్ జాం అవుతోంది. వీకెండ్స్‌లో ట్యాంక్ బండ్ మాదిరిగానే హుస్సేన్ సాగర్ చుట్టూ ఉన్న ప్రాంతాన్ని నో వెహికిల్స్ జోన్‌గా మార్చాలి.



అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహాత్ముడు పూలే



నివాళులర్పిస్తున్న జలమండలి ఎండీ దానకిశోర్



హైదరాబాద్ కలెక్టరేట్‌లో..

సాక్షి,సిటీబ్యూరో: మహాత్మ జ్యోతి రావు పూలే లాంటి ఎందరో మహానుభావుల త్యాగాల ఫలితంగానే మనం హక్కులను అనుభవిస్తున్నామని జలమండలి ఎండీ దానకిశోర్ అన్నారు. మంగళవారం జలమండలి ప్రధాన కార్యాలయంలో బోర్డు బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జ్యోతి రావు పూలే జయంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పూలే చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. మహాత్మ జ్యోతిరావు పూలే వంటి మహనీయులను స్మరించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎంతో కాలంగా వివక్ష, అణచి వేతకు గురైన వారి అభ్యున్నతికి ఆయన తోడ్పాటు అందరించారని గుర్తు చేశారు. అంటరానితనం నిర్మూలన, వివక్షకు వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో ఈఎన్సీ ఆపరేషన్స్ -1 డైరెక్టర్ అజ్మీరా కృష్ణ, ఆపరేషన్స్-2 డైరెక్టర్ స్వామి, బీసీ కమిషన్ సభ్యుడు కిశోర్ గౌడ్, సీజీఎంలు వినోద్ భార్గవ, అమరేందర్ రెడ్డి, జీఎంలు, నాయకులు రాంబాబు యాదవ్, రామరాజు, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ కలెక్టరేట్‌లో..

సాక్షి,సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో టీజీవో హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ యాదవ్ డాక్టర్ ఎన్ సురేందర్. ఆనంద్. రెడ్డప్ప. కిషోర్ కుమార్. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

ఐపీఎల్ బెట్టింగ్ @ రూ.కోటి

- అంతర్రాష్ట్ర ముఠా ఆటకట్టు
- 10 మంది నిందితుల అరెస్టు
- పరారీలో ప్రధాన నిందితుడు పండు

సాక్షి, సిటీబ్యూరో: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) నేపథ్యంలో బెట్టింగ్ జోరుగా సాగుతోంది. సోమవారం ఆర్సీబీ, లక్నో సూపర్ గెయిట్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌పై బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో సైబరాబాద్ పోలీసులు బెట్టింగ్ గుట్టురట్టు చేశారు. సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర మంగళవారం వివరాలు వెల్లడించారు.

- బాచుపల్లి, సాయి అనురాగ్ కాలనీలోని ఓ ఇంటిలో యూసుఫ్‌గూడకు చెందిన వెంకట శివరామకృష్ణ అలియాస్ వెంకట్, అడ్డిపల్లి ప్రతాప్ గన కుమార్, సింగమనేని కిరణ్ కుమార్, బంజారాహిల్స్‌కు చెందిన నందం శ్రీనివాస్ బాబు, పంజాగుట్టకు చెందిన కడియాల మహేశ్, చీరెడ్డి కాశి, పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన కే విజయ్ కుమార్, వినయ్, బీ వెంకట రత్నకుమార్, చీరాలకు చెందిన జీ శ్రీకాంత్ వ్యవస్థీకృతంగా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారు.
- ఆర్సీబీ, లక్నో మ్యాచ్‌పై పెద్ద మొత్తంలో బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు బాలానగర్ స్పెషల్ ఆపరేషన్ టీం (ఎస్ఓటీ), బాచుపల్లి పోలీసులకు సమాచారం అందింది. దీంతో దాడులు నిర్వహించిన పోలీసులు 10 మంది నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.66.28 లక్షల నగదు, లైన్ బోర్డులు, ల్యాప్‌టాప్‌లు, టీవీలు, రౌటర్లు, ప్రింటర్లు, సిమ్ కార్డులు, వాయిస్ రికార్డర్లు, ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.కోటి ఉంటుదని తెలిపారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు విజయవాడకు చెందిన పండు కోసం గాలిస్తున్నామన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర



రోడ్డు ప్రమాదంలో వైద్య విద్యార్థి దుర్మరణం



నూతక్కి నిఖిల్ (ఫైల్)

కొండపాక(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో వైద్య విద్యార్థి మృతి చెందిన సంఘటన కొండపాక శివారులో మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. కుకునూరుపల్లి ఎస్ఐ పుష్పరాజ్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, శిల్పా బృందావనానికి చెందిన నూతక్కి నిఖిల్ కరీంనగర్ జిల్లా, చల్మెడలోని ఆనందరావు మెడికల్ కాలేజీలో హౌస్ సర్జన్ చేస్తున్నాడు. మంగళవారం ఉదయం హైదరాబాద్ నుంచి కాలేజీకి వెళ్తున్నాడు వెళ్తుండగా కొండపాక శివారులో రాజీవ్ రహదారి పక్కన ఉన్న కల్వర్టును ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన అతను అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఒంటిపై పెట్రోల్.. పొంతన లేని సమాధానాలు..

- నిప్పంటించుకున్న యాచకురాలు
- కాలిన గాయాలతో పరిస్థితి విషమం



కాలిన గాయాలతో శివాని

రాజేంద్రనగర్: మతిస్థిమితం సరిగా లేని ఓ యాచకురాలు మంగళవారం ఉదయం ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంది. స్థానికులు మంటలు ఆర్పి పోలీసులకు సమాచారం అందించారు. కాగా.. తన భర్త పెట్రోల్ పోసి నిప్పంటించాడని ఒకసారి, ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఈ ఘాతుకానికి పాల్పడ్డారని మరోసారి.. దుర్గామాత కలలోకి వచ్చి నిప్పంటించుకోమంది అంటూ ఇంకోసారి పొంతన లేని సమాధానాలు చెప్పడం గమనార్హం. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నందిముస్లాయిగూడ సాయిబాబా దేవాలయ ప్రాంతంలో శివాని (38) అనే మహిళ తన తల్లి లక్ష్మి, కూతురు చిట్కీతో కలిసి నివసిస్తోంది. భర్త మృతి చెందడంతో స్థానికంగా భిక్షాటన చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. మంగళవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వచ్చి పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్‌వే పిల్లర్ నంబర్ 133 వద్ద రోడ్డు పక్కన శివాని ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంది. స్థానికులు మంటలను ఆర్పివేసి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి వచ్చిన ఎస్సై శ్వేత బాధితురాలితో మాట్లాడారు. అనంతరం చికిత్స నిమిత్తం ఆమెను 108 వాహనంలో ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ నాగేంద్రబాబు మాట్లాడుతూ.. శివానితో తాము స్థానికంగా విచారించామని.. కావాలనే ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకుందన్నారు. కొన్ని రోజులుగా శివాని మానసిక పరిస్థితి సరిగా లేదన్నారు. 75 శాతం కాలిన గాయాలతో ఆమె పరిస్థితి విషమంగా ఉందన్నారు.

మౌలిక వసతుల్లో అగ్రగామి ఓయూ

- విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి
- క్యాంపస్‌లో మరో హాస్టల్ భవనం
- 30కి చేరిన ఉస్మానియా హాస్టళ్ల సంఖ్య

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో మౌలిక వసతుల్లో ఓయూ అగ్రగామిగా ఉందని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మంగళవారం ఇంజినీరింగ్ కళాశాలలో బాలుర కోసం రూ.39.50 కోట్ల వ్యయంతో చేపట్టిన హాస్టల్ భవన నిర్మాణానికి హోంమంత్రి మహమూద్ అలీ, వీసీ ప్రొ.రవీందర్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ తెలంగాణ విద్యార్థులను ప్రపంచ స్థాయిలో పోటీ పడేలా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. రాష్ట్ర అవతరణ అనంతరం విద్యా వ్యవస్థ స్వరూపమే మారిందన్నారు. సంప్రదాయ, టెక్నికల్ కోర్సులతో పాటు వెటర్నరీ, వ్యవసాయ, వైద్య కోర్సులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. విభిన్న రంగాల్లో ఆణిముత్యాలను అందించిన ఓయూ అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందన్నారు. వర్సిటీలో ఉన్నత విద్యా కోర్సుల్లో మహిళల సంఖ్య 75 శాతానికి చేరుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. 105 వసంతాలు పూర్తి చేసుకున్న ఓయూ అభివృద్ధికి ముఖ్యమంత్రి ఏటా బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు పెంచుతున్నారని హోం మంత్రి మహమూద్ అలీ అన్నారు. నూతన భవనంతో ఓయూలో హాస్టళ్ల సంఖ్య 30కి చేరుకుందని త్వరలో ట్రైబల్ వెల్ఫేర్ సహకారంతో మరో రెండు కొత్త హాస్టల్ భవనాలను నిర్మించనున్నట్లు వీసీ ప్రొ.రవీందర్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర విద్య సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ) ఆధ్వర్యంలో చేపట్టిన ఇంజినీరింగ్ హాస్టల్ భవనం పది నెలల్లో అందుబాటులోకి రానున్నట్లు రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ తెలిపారు. నూతన హాస్టల్ భవనంతో 500 మంది విద్యార్థులకు వసతి లభిస్తుందని ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.శ్రీరామ్ వెంకటేష్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, రాష్ట్ర ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొ.లింబాద్రి, టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, ఇంజినీరింగ్ కాలేజీ ప్రొఫెసర్లు, బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చటారి దశరథ్ తదితరులు పాల్గొన్నారు.



హాస్టల్ భవనానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రులు సబితా ఇంద్రా రెడ్డి, మహమూద్ అలీ తదితరులు

3 నెలల్లో 45 శిక్షలు

సాక్షి, సిటీబ్యూరో: సమష్టి కృషితో పక్కా ఆధారాలు సేకరించి, నేరస్తులకు న్యాయస్థానంలో శిక్ష పడేలా రాచకొండ పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. ఫలితంగా నేర నిరూపణలో రాష్ట్రంలో రాచకొండ కమిషనరేట్ మొదటి స్థానంలో నిలిచింది. 2020లో 75 శాతం కన్విక్షన్లు రాగా.. 2021లో 79 శాతం, 2022లో 95 శాతంగా కన్విక్షన్ల రేటు ఉందని రాచకొండ పోలీసు కమిషనర్ దేవేంద్ర సింగ్ చౌహాన్ తెలిపారు. ఈ ఏడాది తొలి త్రైమాసికంలో 45 కేసుల్లో నేర నిరూపణలు జరిగాయని, ఇందులో 4 కేసులలో నిందితులకు యావజ్జీవ శిక్ష పడగా.. 3 కేసుల్లో 20 ఏళ్లు, మరో మూడింటిలో పదేళ్లు, నాలుగింటిలో ఏడేళ్లు, ఐదు కేసులో ఐదేళ్లు, ఏడు కేసుల్లో మూడేళ్లు, 19 కేసుల్లో రెండేళ్ల వరకు నిందితులకు జైలు శిక్షలు ఖరారయ్యాయి. ఆయా కేసులలో నిందితులు శిక్ష పడేలా చేసిన 168 మంది ఆఫీసర్లను సీపీ అభినందించారు. ఇందులో 41 మంది విచారణాధికారులు, 39 మంది కోర్టు డ్యూటీ ఆఫీసర్లు, 32 మంది సమన్స్ ఆఫీసర్లు, 27 మంది పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఉన్నారు. ఈ సందర్భంగా వారికి రివార్డులను అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ సీపీ సత్యనారాయణ, డీసీపీలు డీ జానకీ, ఎం రాజేశ్ చంద్ర, సీహెచ్ శ్రీనివాస్, సాయి శ్రీ, అదనపు పీడీ డిప్యూటీ డైరెక్టర్ డీటీపీ కస్తూరి, పీపీ జాయింట్ డైరెక్టర్ డీటీపీ రాము, తదితరులు పాల్గొన్నారు.

మహిళ దారుణ హత్య



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ వెంకట్‌రెడ్డి

- వివాహేతర సంబంధమే కారణం
- మరో ముగ్గురితో కలిసి ప్రియుడి భార్య ఘాతుకం

మేడ్చల్‌రూరల్: వివాహేతర సంబంధం కారణంగా ఓ మహిళ దారుణ హత్యకు గురైన సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మంగళవారం మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌లో ఏసీపీ వెంకట్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. ఒరిస్సా రాష్ట్రం, కైన్‌పులియా గ్రామానికి చెందిన ధరిత్రీ సింగ్(22) బతుకుదెరువు కోసం మేడ్చల్‌కు వలస వచ్చింది. డబిల్‌పూర్ చౌరస్తాలోని బనియన్ ట్రీ హోటల్‌లో కార్మికురాలిగా పని చేసేది. అదే హోటల్‌లో మేనేజర్‌గా పని చేస్తూ స్థానిక వినాయక్‌నగర్-2లో ఉంటున్న షేక్ చాంద్‌తో ఆమెకు పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం వివాహేతర సంబంధానికి దారితీయడంతో ధరిత్రీ సింగ్ గర్భవతి అయ్యింది. దీంతో ఆమె తనను పెళ్లి చేసుకోవాలని షేక్ చాంద్‌పై ఒత్తిడి తెచ్చింది. అప్పటికే అతడికి వివాహం జరగడంతో ఈ విషయం చాంద్ కుటుంబసభ్యులకు తెలియడంతో ఇంట్లో గొడవలు జరిగాయి. దీంతో అతను ధరిత్రీ సింగ్‌ను సొంత ఊరికి పంపించాడు. అయితే నెల న్నర క్రితం చాంద్ ఆమెను మళ్లీ నగరానికి రప్పించి రహస్యంగా డబిల్‌పూర్ గ్రామంలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంచి ఆమెతో సంబంధాన్ని కొనసాగిస్తున్నాడు. ఈ విషయం తెలియడంతో చాంద్ భార్య పాకీజా భర్తను నిలదీయడంతో ధరిత్రీ తనను వదలడం లేదని మాయమాటలు చెప్పాడు. దీంతో ఆమె అడ్డు తొలగించుకోవాలని భావించిన పాకీజా అదే హోటల్‌లో పనిచేస్తున్న అజీమ్ షా, దంపతులు, అదే కాలనీలో ఉంటున్న మందాకినికి విషయం చెప్పింది. దీంతో నలుగురు కలిసి ధరిత్రీని హత్య చేయాలని పథకం పన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 9న అజీమ్‌షా, మందాకిని బైక్‌పై ధరిత్రీ సింగ్ ఇంటికి వెళ్లారు. మందాకిని బయటే ఉండి పరిస్థితిని గమనిస్తుండగా అజీమ్‌షా ఆమె ఇంట్లోకి వెళ్లి ధరిత్రీ సింగ్ చేతులు కట్టేసి మెడకు టవల్ బిగించి హత్య చేశాడు. అనంతరం వీరు అక్కడి నుంచి పరారయ్యారు. దీనిపై సమాచారం అందడంతో మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టగా వివాహేతర సంబంధం వెలుగులోకి వచ్చింది. దీంతో చాంద్, అతని భార్యను అదుపులోకి తీసుకుని విచారించగా నలుగురు కలిసి హత్య చేసినట్లు అంగీకరించారు. నిందితులను అరెస్టు చేసిన పోలీసులు మంగళవారం రిమాండ్‌కు తరలించారు.

భద్రాచలం ఆర్డీఓ భర్త ఆత్మహత్య

అమీర్‌పేట: ఓ ఆర్డీవో భర్త ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం ఎస్ఆర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రదీప్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, భద్రాచలం ఆర్‌డీఓగా పనిచేస్తున్న రత్న కల్యాణి, తన భర్త ఎస్‌వీ చంద్రశేఖర్(58)తో కలిసి బాపూనగర్‌లోని సాయి కృప అపార్ట్‌మెంట్‌లో ఉంటోంది. వీరి కుమారుడు అమెరికాలో ఎంఎస్ చేస్తున్నాడు. గత కొన్నేళ్లుగా మానసిక సమస్యలతో బాధపడుతున్న చంద్రశేఖర్ చికిత్స పొందుతున్నాడు. మంగళవారం ఉదయం దంపతులిద్దరూ కొత్తగూడెం నుంచి బాపూనగర్‌లోని ఇంటికి వచ్చారు. ఆ తర్వాత కొద్ది సేపటికి రత్న కల్యాణికి నాంపల్లిలోని లోకాయుక్త కోర్టులో పని ఉండటంతో అక్కడికి వెళ్లింది. ఇంట్లో ఒంటరిగా ఉన్న చంద్రశేఖర్ డైనింగ్ హాల్‌లో సీలింగ్ ఫ్యాన్ కొక్కానికి దుప్పటితో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మధ్యాహ్నం ఇంటికి తిరిగి వచ్చిన కల్యాణి భర్త ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కాగా చంద్రశేఖర్ గతంలోనూ మూడు సార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ఎస్సై తెలిపారు.

సభ్యత్వ పరీక్షకు సన్నద్ధమవుతూ..

చెరువులో మునిగి యువకుడి గల్లంతు



రాకేశ్ (ఫైల్)

దుండిగల్: ఆ కుటుంబంపై విధి పగబట్టింది. నాలుగు నెలల వ్యవధిలోనే తండ్రి కొడుకులు మృతి చెందారు. తండ్రి మరణాన్ని దిగమింగుకుని కుటుంబానికి అండగా నిలుద్దామనుకున్న కుమారుడు ఆ ప్రయత్నంలోనే గల్లంతయ్యాడు. వివరాల్లోకి వెళితే.. దుండిగల్ మున్సిపాలిటీ డి.పోచంపల్లి ప్రాంతానికి చెందిన శ్రీనివాస్ స్థానిక చెరువులో చేపలను పడుతూ జీవనం సాగించేవాడు. అతని పెద్ద కుమారుడు పోతారం రాకేశ్(23) ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. నాలుగు నెలల క్రితం శ్రీనివాస్ ఆకస్మికంగా మృతి చెందాడు. మత్స్యకారుల సహకార సంఘంలో సభ్యుడిగా ఉన్న శ్రీనివాస్ స్థానంలో రాకేశ్ తన తండ్రి వృత్తిని ఎంచుకుని కుటుంబానికి ఆసరా కావాలని నిర్ణయించుకున్నాడు. మత్స్యకారుల సభ్యత్వం కోసం పరీక్షలు నిర్వహిస్తారు. ఈత కొట్టడం, వల వేసి చేపలను పట్టడం, పడవ నడపడంలో శిక్షణ పొందిన వారినే పరీక్షల ద్వారా ఎంపిక చేసి సొసైటీ సభ్యత్వం ఇస్తారు. ఈ నేపథ్యంలో బుధవారం అర్హత పరీక్ష ఉండడంతో రాకేష్ మంగళవారం సాయంత్రం ఈత కొట్టేందుకు కుడికుంట చెరువులోకి దిగాడు. చెరువు లోతులోకి వెళ్లడంతో నీటి మునిగి గల్లంతయ్యాడు. సహచరులు అతని కోసం గాలించగా ఆచూకీ లభించలేదు. బుధవారం గజ ఈతగాళ్లతో గాలింపు చేపట్టనున్నట్లు సొసైటీ సభ్యులు తెలిపారు.

రెండు రోజుల్లో రూ. కోటి లూటీ

హిమాయత్‌నగర్: అమాయకులకు వలవేసి సైబర్ నేరగాళ్లు అందినకాడికి స్వాహా చేస్తున్నారు. పెట్టుబడుల పేరుతో సోమ, మంగళవారాల్లో 11 మందికి టోకరా వేసిన సైబర్ కేటుగాళ్లు రూ. కోటికి పైగా కాజేశారు. బాధితులు సిటీ సైబర్‌క్రైం పోలీసులను ఆశ్రయించారు. వీరిలో పలువురిని పార్ట్ టైం జాబ్ పేరుతో ఆకర్షించి, ఆ తర్వాత మాయ మాటలు చెప్పి ఇన్వెస్ట్‌మెంట్ వైపు మళ్లించారు. ఇలా ఓ యువకుడి నుంచి రూ.46లక్షలు కాజేయగా, మరో యువకుడి నుంచి రూ.30 లక్షలు, ఓటీపీ చెప్పి మరొకరి నుంచి రూ.8 లక్షలు స్వాహా చేశారు. మరి కొందరికి ఇంట్లోనే ఉంటూ రూ. లక్షలు సంపాదించొచ్చని చెప్పి తొలి రోజుల్లో కొంత లాభాలు ఇచ్చి నమ్మకాన్ని కలిగించారు. ఆ తర్వాత రూ.లక్ష, రూ.2లక్షలు చొప్పున పెట్టుబడి పెట్టించి మోసం చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ కేవీఎం ప్రసాద్ తెలిపారు.

కారు ఢీకొని విద్యార్థిని మృతి

మరో ఇద్దరు విద్యార్థులకు తీవ్ర గాయాలు



మృతిచెందిన అమీనా

జవహర్‌నగర్: పాఠశాల నుంచి ఇంటికి వెళ్తున్న విద్యార్థులను వేగంగా వచ్చిన కారు ఢీ కొనడంతో ఒక విద్యార్థిని మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జవహర్‌నగర్ కార్పొరేషన్, ఫైరింగ్ కట్ట సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలో 8 వ తరగతి చదువుతున్న షేక్ అమీనా (14) మరో ఇద్దరు విద్యార్థులతో కలిసి మంగళవారం స్కూల్ నుంచి ఇంటికి వెళుతుండగా మార్కెట్ గల్లీ సమీపంలో వేగంగా వచ్చిన వ్యాగనార్ కారు వారిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని ఆసుపత్రికి తరలించగా షేక్ అమీనా చికిత్స పొందుతూ మృతి చెందింది, మిగతా ఇద్దరు చికిత్స పొందుతున్నారు. మృతురాలు అమీనా తండ్రి మునీరుద్దీన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి అక్రమ రవాణాకు చెక్

ఏడుగురు నిందితుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ చక్రవర్తి

చాంద్రాయణగుట్ట: గంజాయి రవాణాకు పాల్పడుతున్న కేసులో ఏడుగురు నిందితులను బహదూర్‌పురా పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పురానీహవేలీలోని తన కార్యాలయంలో మంగళవారం హెచ్-న్యూ(హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్) డీసీపీ గుమ్మి చక్రవర్తి వివరాలు వెల్లడించారు. వరంగల్ జిల్లా, మహబూబాబాద్‌కు చెందిన తేజావత్ కోటేష్ గత కొన్నేళ్లుగా ఏపీలోని సీలేరు ఏజెన్సీ ప్రాంతం నుంచి గంజాయి తీసుకొచ్చి మంగళ్‌హాట్‌కు చెందిన పెడ్లర్లు రాకేష్ సింగ్, బజ్‌రంగ్ సహకారంతో నగరంలో విక్రయించేవాడు. అయితే ఇటీవలి కాలంలో పోలీసుల నిఘా తీవ్రం కావడంతో వ్యాన్‌ను కొనుగోలు చేసిన అతను అందులో గంజాయి సరఫరాకు అనుగుణంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశాడు. సీలేరుకు చెందిన పంగి పందన్న, కొర్ర సీతారాం, కొర్ర సుబ్బన్న, పంగి కృష్ణమూర్తి నుంచి గంజాయి కొనుగోలు చేసి మంగళ్‌హాట్ ప్రాంతానికి తరలించేవాడు. ఒక్కోసారి ఒడిశా నుంచి కూడా అక్రమ రవాణా చేసేవాడు. మంగళవారం వారు బహదూర్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి సరఫరా చేస్తున్నట్లు సమాచారం అందడంతో బహదూర్‌పురా, హెచ్-న్యూ పోలీసులు దాడులు చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 80 కిలోల గంజాయి, ఆరు సెల్‌ఫోన్లు, ఒక ట్రాలీ ఆటోను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై గతంలో గంజాయి అక్రమ రవాణా కేసులు ఉన్నట్లు డీసీపీ తెలిపారు. సమావేశంలో ఏసీపీ షేక్ జహంగీర్, ఇన్‌స్పెక్టర్లు పి.రాజేష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఈ నెల 16న ఫిలిం ఫెడరేషన్ ఎన్నికలు

బంజారాహిల్స్: తెలుగు ఫిలిం ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ 2023–25 సంవత్సరానికి నూతన కార్యవర్గ ఎన్నికలు ఈ నెల 16వ తేదీన జరగనున్నాయి. నామినేషన్ల అనంతరం అధ్యక్ష పదవికి జూనియర్ ఆర్టిస్ట్ యూనియన్ అధ్యక్షుడు అనిల్‌కుమార్, స్టూడియో వర్కర్స్ యూనియన్ నుంచి జె. అప్పన్న పోటీ పడుతున్నారు. సెక్రటరీ పదవికి పీఎస్ఎన్.దొర, కోశాధికారి పదవికి తెలుగు సినీ అండ్ టీవీ ప్రొడక్షన్ అసిస్టెంట్ యూనియన్ నుంచి ఎస్. సత్యనారాయణ, డ్యాన్సర్ యూనియన్‌కు చెందిన కె.శ్రీనివాసరావు అలియాస్ ఏడుకొండలు, అవుట్‌డోర్ యూనిట్‌కు చెందిన వి. సురేష్ నామినేషన్లు వేశారు. నామినేషన్ల ఉపసంహరణకు బుధవారం గడువు విధించారు.అదే రోజు గుర్తుల కేటాయింపు కూడా జరుగుతుంది. 16 న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వెంకటగిరిలోని ఫిలిం ఫెడరేషన్ కార్యాలయంలో జరిగే ఎన్నికల్లో 72 మంది ఓటర్లు పాల్గొననున్నారు.

కేంద్రం కుతంత్రాలకు ఆమ్‌ఆద్మీ భయపడదు

లిబర్టీ: ఆమ్‌ఆద్మీ పార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం జాతీయ హోదా కల్పించడాన్ని స్వాగతిస్తున్నట్లు ఆమ్‌ఆద్మీ పార్టీ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు డాక్టర్ డి.సుధాకర్ తెలిపారు. ప్రజల హృదయాల్లో నుంచి పుట్టిన ఆమ్‌ఆద్మీ పార్టీకి జాతీయ హోదాను కల్పించడం గొప్ప పరిణామం అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఆమ్‌ఆద్మీ పార్టీని నాయకులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులకు గురి చేసిన కేసులు మోపిన భయపడకుండా ప్రజల కోసం పని చేస్తుందని పేర్కొన్నారు. ప్రజల ఆదరణతో పార్టీ దేశంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనేక కుట్రలు కుతంత్రాలు చేసి కేంద్ర ఎన్నికల సంఘంపై కూడా ఒత్తిడి తెచ్చినప్పటికి జాతీయ స్థాయిలో స్వయంగా ఎన్నికల సంఘమే చట్టబద్ధంగా న్యాయబద్ధంగా ధర్మబద్ధంగా గుర్తించిందంటే ఆమ్‌ఆద్మీ పార్టీకి తిరుగు లేదని భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధిస్తుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజలో పాల్గొన్న నవీన్ మిట్టల్

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 13లోని శ్రీనాగదేవతా ఆలయం త్రయోదశి వార్షికోత్సవాలు, సుబ్రహ్మణ్యస్వామి షష్టి వేడుకలు మంగళవారం అత్యంత వైభవంగా జరిగాయి. సీనియర్ ఐఏఎస్ అధికారి నవీన్ మిట్టల్ ఈ వేడుకల్లో పాల్గొని అమ్మవారికి, స్వామివార్లకు విశేష పూజలు నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ఉదయం గణపతి పూజ, కలశస్థాపన, అభిషేకం, అగ్నిప్రతిష్ఠ, పూర్ణాహుతి అంగరంగ వైభవంగా జరిగాయి. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి దంపతులు కూడా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగదేవత దేవాలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించారు.

అవమానకరంగా సోషల్ మీడియాలో పోస్ట్‌లు

పోలీసులకు మహిళా కార్పొరేటర్ ఫిర్యాదు

బంజారాహిల్స్: సమాజంలో తన పేరు ప్రతిష్ఠలకు భంగం కలిగించే రీతిలో ఫేస్‌బుక్‌లో అసభ్యకర పోస్టులు పెట్టిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ ఓ మహిళా కార్పొరేటర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు అఖిల్‌పై క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఈ నెల 8వ తేదీన తాను ఫేస్‌బుక్ పోస్టింగ్‌లు చూస్తుండగా టైమ్‌లైన్‌లో అఖిల్ అనే వ్యక్తి పేరుతో తన పరువు ప్రతిష్టలకు భంగం కలిగించే రీతిలో కించపరిచే విధంగా పోస్టింగ్ పెట్టడం జరిగిందని తాను ఆరా తీయగా పోస్ట్ చేసిన అఖిల్ రౌడీషీటర్ బిల్లా పవన్ అనుచరుడని ఆయన ఆదేశాలతోనే ఈ పోస్ట్ పెట్టి తనకున్న పేరును తక్కువ చేసేలా ఉందన్నారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అఖిల్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెట్టు నరికిన వారికి రూ. 9 వేల జరిమానా

బంజారాహిల్స్: ఒక వైపు ప్రభుత్వం పచ్చదనాన్ని పెంచేందుకు విరివిగా మొక్కలు నాటుతుండగా మరో పక్క కొంత మంది తమ వ్యాపారాలకు అడ్డుగా ఉన్నాయని చెట్లను నరికేస్తున్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని లోటస్‌పాండ్‌లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఓ ప్రైవేట్ ఆస్పత్రి యజమానులు ఆస్పత్రి ముందున్న ఓ భారీ చెట్టుతో పాటు ఎదురుగా పార్కును ఆనుకొని ఉన్న మరో చెట్టును కారు పార్కింగ్ చేసేందుకు అనువుగా లేదన్న నెపంతో కొట్టివేశారు. విషయం తెలుసుకున్న కేబీఆర్ పార్కు అటవీ అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేసి రూ. 9 వేల జరిమానా విధించారు.

కాలనీల్లోకి వస్తారు.. సమస్యలు పరిష్కరిస్తారు!

కాలనీ ముంగిట్లోకే అధికారుల బృందాలు

- నేటి నుంచి కాలనీవాసులతో ఐదు విభాగాల అధికారులు ముఖాముఖి
- సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు



నోడల్ అధికారులతో సమావేశమైన ఉన్నతాధికారులు

బంజారాహిల్స్: తాము ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడం కోసం ఇక కాలనీ వాసులు అధికారుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. అధికారులే కాలనీముంగిట్లోకి వచ్చే సరికొత్త పథకాన్ని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ విభాగం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ అధికారులకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 12వ తేదీ నుంచి జలమండలి, జీహెచ్‌ఎంసీ, టీఎస్ఎస్‌పీడీసీఎల్, వైద్య ఆరోగ్య శాఖ, పోలీస్ తదితర ఐదు శాఖలకు చెందిన అధికారుల బృందం కాలనీల్లో పర్యటించి అక్కడే సమావేశాలు ఏర్పాటు చేసి వారి సమస్యలను తెలుసుకోవడమే కాకుండా అప్పటికప్పుడే పరిష్కరించాల్సిన సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తారు. కొన్ని సమస్యలకు సమయం కావాలనుకుంటే ఆ వివరాలను కాలనీ అసోసియేషన్‌కు తెలియజేస్తారు. జీహెచ్‌ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్–18 పరిధి కిందకు వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, షేక్‌పేట మండలాల పరిధిలో 149 కాలనీలు ఉండగా ఈ కాలనీ సంక్షేమ సంఘాలతో ముఖాముఖి–సమస్యల పరిష్కారం అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. మొదటి సమావేశం ఈ నెల 12న గ్రేటర్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సమక్షంలో నిర్వహించనున్నారు. ఇందుకోసం ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ కార్యక్రమం కోసం పది మంది నోడల్ అధికారులను నియమించారు. వీరందరితో ఇప్పటికే సర్కిల్–18 డీఎంసీ రజినీకాంత్ రెడ్డి సమావేశం నిర్వహించి కార్యక్రమాన్ని ఎలా విజయవంతం చేయాలో సూచనలు జారీ చేసి వారి సలహాలు తీసుకొని సందేహాలు కూడా నివృత్తి చేశారు.

ఒక్కోరోజు ఒక్కో కాలనీలో..

జలమండలి, జీహెచ్‌ఎంసీ, పోలీస్, మెడికల్, ఎలక్ట్రిసిటీ విభాగాల అధికారులతో ఏర్పాటు చేసిన టీమ్ ఒక్కో రోజు ఒక్కో కాలనీలో సమావేశాలు ఏర్పాటు చేసి ఆ కాలనీ అసోసియేషన్లకు సమాచారం ఇస్తారు. ఈవ్‌టీజింగ్‌తో పాటు అసాంఘిక శక్తుల కార్యకలాపాలు, గంజాయి, ఇతరత్ర అసభ్యకర కార్యకలాపాలతో ఇబ్బందులు పడుతుంటే కాలనీవాసులు అక్కడే ఉండే పోలీసుల దృష్టికి తీసుకొస్తారు. మురుగు నీరు వస్తున్నా, మంచినీటి సరఫరాలో లోపాలు ఉన్నా మ్యాన్‌హోళ్లు సరిగ్గా లేకున్నా తదితర సమస్యలు జలమండలి అధికారుల దృష్టికి తీసుకొస్తారు. దోమలు విజృంభణ, వీధి దీపాల సమస్యలు కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాలన్నా అక్కడే ఉండే ఎంటమాలజీ, వీధి దీపాల ఏఈల దృష్టికి తీసుకురావచ్చు. రోడ్లు బాగా లేకపోయినా, కొత్తగా రోడ్లు వేయాల్సిన ప్రాంతాలకు సంబంధించి, పార్కులు బాగు చేయాలని తదితర సమస్యలను జీహెచ్‌ఎంసీ ఏఈల దృష్టికి తీసుకొస్తారు. నోడల్ అధికారులు ఎప్పటికప్పుడు ఈ సమస్యలపై సమీక్ష నిర్వహించి వాటి పురోగతిపై కాలనీవాసులతో మాట్లాడతారు. సాధ్యమైనంత వరకు అక్కడికక్కడే సమస్యలు పరిష్కారమయ్యే దిశలో కృషి చేస్తారు.

ఇదొక మంచి అవకాశం



మొట్ట మొదటిసారిగా ఐదు విభాగాల అధికారులతో ఇంటరాక్షన్ విత్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. ఇది కాలనీవాసులకు ఎంతో ప్రయోజనకారిగా ఉండే కార్యక్రమం. అక్కడే వివిధ విభాగాల అధికారులు ఉండటంతో సమస్యలు చాలా వరకు పరిష్కారమవుతాయి. ఇప్పటికే సమావేశాలు నిర్వహించి ఈ కార్యక్రమం విజయవంతం చేసే దిశలో ప్రణాళికలు రూపొందించాం. ఏ కాలనీలో సమావేశం ఉంటుందో సంబంధిత నోడల్ అధికారులు ఆ కాలనీ సంక్షేమ సంఘాలకు సమాచారం ఇస్తారు. గడువు తీసుకుని సమస్యలపై ఎప్పటికప్పుడు సమీక్ష ఉంటుంది.

– రజినీకాంత్‌రెడ్డి, డీఎంసీ, జూబ్లీహిల్స్ సర్కిల్–18

ఇఫ్తార్ విందులను విజయవంతం చేయాలి

ఎమ్మెల్యే దానం నాగేందర్



మైనార్టీ నేతలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్: రంజాన్ పురస్కరించుకొని నియోజకవర్గ పరిధిలో ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేస్తున్నట్లు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తెలిపారు. మంగళవారం జూబ్లీహిల్స్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఆయన ముస్లిం ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ నెల 13న సోమాజిగూడ, ఖైరతాబాద్ డివిజన్లకు సంబంధించి జయ గార్డెన్స్‌లో, 15వ తేదీన బంజారాహిల్స్, వెంకటేశ్వరకాలనీ డివిజన్లకు సంబంధించి లేక్‌వ్యూ బంజారా ఫంక్షన్ హాల్‌లో ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జూబ్లీహిల్స్, హిమాయత్‌నగర్ డివిజన్ల ఇఫ్తార్ విందుల తేదీలను త్వరలో ప్రకటిస్తామని అన్నారు. కేసీఆర్ నేతృత్వంలో ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేస్తున్న ఇఫ్తార్ విందుకు ఆహ్వానిస్తూ ముస్లిం సోదరులకు ఆయన సంబంధిత పాస్‌లను మజీదు కమిటీల ప్రతినిధులకు అందజేశారు.

ముస్లిం గ్రేవ్‌యార్డ్ స్థలం కేటాయిస్తూ ఉత్తర్వులు..

సోమాజిగూడ డివిజన్ పరిధిలో ముస్లిం గ్రేవ్‌యార్డ్ కోసం స్థలం కేటాయిస్తూ (మెమో 6925) రెవెన్యూ శాఖాధికారులు ఖైరతాబాద్ దానం నాగేందర్‌కు లేఖ రాశారు. ఈ మేరకు సోమాజిగూడ డివిజన్ ముస్లిం ప్రతినిధులతో మంగళవారం క్యాంపు కార్యాలయంలో సమావేశమై ప్రభుత్వం నుంచి వచ్చిన లేఖను చూపించారు. గత నెల 4వ తేదీన ఎమ్మెల్యే ప్రభుత్వానికి లేఖ రాస్తూ ముస్లిం గ్రేవ్‌యార్డ్‌కు స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 16వ తేదీన ప్రభుత్వ అదనపు కార్యదర్శి నరేందర్ రావు నుంచి ఎమ్మెల్యేకు స్థలం కేటాయిస్తున్నట్లు లేఖ రావడంతో ముస్లిం ప్రతినిధులు ఎమ్మెల్యేను కలిసి ఆనందం వ్యక్తం చేశారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి ఎర్ర జెండా



పార్టీలోకి ఆహ్వానిస్తున్న చాడ వెంకట్‌రెడ్డి

చాడ వెంకట్ రెడ్డి

హిమాయత్‌నగర్: ఎర్ర జెండాకు ఘనమైన చరిత్ర ఉందని అనేక ప్రజా ఉద్యమాలు నిర్వహించి ప్రజా సమస్యలు పరిష్కారం చేసిన, పేద బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం నిరంతరం పని చేస్తున్న ఘనత ఎర్ర జెండాకు దక్కిందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో మంగళవారం పలువురు పార్టీలో చేరగా వారికి ఆయన కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతోన్మాది బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులు, చట్టాలను రద్దు చేసి బడా కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. రైతులు చేసిన ఉద్యమంలాగే దేశంలోని కార్మికులంతా సంఘటితమై సమరోత్సాహంతో కార్మిక నల్ల చట్టాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. దేశంలోని ప్రతి వర్గం బాధలు పడుతోందని, మోదీ ప్రభుత్వం దృష్టి మాత్రం ప్రజలను విభజించడంపైనే ఉందని, బీజేపీ నిరంకుశ రాజకీయాలు దేశానికి ప్రమాదకరంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశాన్ని రక్షించుకోవాల్సిన అవసరముందని భావించి 'బీజేపీ హటావ్–దేశ్ బచావ్' నినాదంతో సీపీఐ దేశవ్యాప్తంగా ఈ నెల 14 తేదీ నుంచి వచ్చే నెల 15 వ వరకు పాదయాత్రలు నిర్వహిస్తుందని తెలిపారు. ఈ.టి. నరసింహ మాట్లాడుతూ.. దేశ సంపదను ఎలా అమ్ముకోవాలనే ధ్యాస తప్ప పేదల హక్కుల కోసం బీజేపీ పోరాడిన చరిత్ర లేదన్నారు.

ఐకమత్యంతో సమస్యలు పరిష్కరించుకోవాలి



సభ్యులను అభినందిస్తున్న ఎమ్మెల్యే

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నెం. 10సీలోని గాయత్రిహిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మంగళవారం జూబ్లీహిల్స్‌లోని క్యాంపు కార్యాలయంలో అభినందించారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా కె. రాఘవులు, జనరల్ సెక్రటరీగా కె. లీలా రమేష్ గెలుపొందారు. కాలనీవాసులంతా ఐకమత్యంగా ఉండి తమ సమస్యలు పరిష్కరించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కాలనీ అభివృద్ధికి తన సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని ప్రతి సందర్భంలోనూ తాను కాలనీ అభివృద్ధిపైనే దృష్టి సారిస్తున్నానని తెలిపారు.

అధికారులతో కార్పొరేటర్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ వెంకటేష్

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని గౌతంనగర్ కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం స్థానిక కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. స్థానిక బస్తీవాసులు కూడా ఇందులో పాల్గొని తమ ప్రాంతంలో ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా డ్రైనేజీ, పెండింగ్‌లో ఉన్న రోడ్డు పనులపై స్థానికులు నిలదీశారు. వినాయకనగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న డ్రైనేజీ పైప్‌లైన్ వ్యవస్థ త్వరలో పూర్తవుతుందని సీసీ రోడ్లు కూడా వేస్తామని కార్పొరేటర్ తెలిపారు. కొత్తగా వీధి దీపాలను కూడా ఏర్పాటు చేయాలని అక్కడే ఉన్న అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ వెంకటేష్, జలమండలి ఫిలింనగర్ సెక్షన్ మేనేజర్ పవన్, వీధి దీపాల అధికారి రమేష్, బీఆర్ఎస్ నేతలు అబ్దుల్ గని, రమేష్, శేఖర్, మహేష్, రహీం పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన..

ఫిలింనగర్‌లోని గౌతంనగర్‌లో ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్డు పనులు రూ. 25 లక్షల వ్యయంతో నిర్మిస్తున్నట్లు కార్పొరేటర్ వెంకటేష్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానికులు, జీహెచ్‌ఎంసీ ఇంజినీర్లతో కలిసి పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించాలని కోరారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి రానివ్వొద్దు



వెంగళరావునగర్: వేసవిలో ప్రజలు నీటికి ఇబ్బందులు పడే అవకాశం ఉన్నందున నిరంతరం జలమండలి సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని కార్పొరేటర్ దేదీప్య విజయ్ పేర్కొన్నారు. గత వారంరోజులుగా డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో నీరు రాక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. జవహర్‌నగర్‌లోని కొన్ని ప్రాంతాల్లో వారం రోజులుగా నీరు రావడంలేదని జలమండలి అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడంతో సమస్యను కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. హుటాహుటిన ఆమె మంగళవారం జవహర్‌నగర్ బస్తీలో పర్యటించి జలమండలి అధికారులు, సిబ్బందిని పిలిపించి సమస్యను వివరించారు. సాధ్యమైనంత త్వరలో సమస్యను పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ డీజీఎం వాహబ్, నాయకులు విజయ్‌కుమార్, అఫ్జర్, చోటూ, ఇస్మాయేల్, గణేష్‌సింగ్, వినోద్, షోయబ్ పాల్గొన్నారు.

టీ–సేవ్ లోగో ఆవిష్కరణ



లోగోను ఆవిష్కరిస్తున్న నాయకులు

బంజారాహిల్స్: నిరుద్యోగ సమస్య, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పేపర్ లీకేజీ ఘటనలపై ఈ నెల 15వ తేదీన ఇందిరాపార్కు దగ్గర వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు షర్మిల 48 గంటల దీక్షను విజయవంతం చేయాలని ఖైరతాబాద్ నియోజక వర్గ ఆ పార్టీ కో–ఆర్డినేటర్ యత్రవరపు రమణ కోరారు. పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం పంజగుట్ట చౌరస్తాలో టీ–సేవ్ లోగోను ఆవిష్కరించారు. రాష్ట్రంలో ఉన్న ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాలను కలుపుకొని టీ–సేవ్ ఆధ్వర్యంలో ఈ దీక్ష జరుగుతుందన్నారు. విద్యార్థులు, యువత, పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను పారదోలేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఈ దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రతినిధులు జి. సతీష్‌కుమార్, వి. రవీంద్రాచారి, రాధిక, మేఘన పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

చార్మినార్: ఏబీవీపీ కోఠి జిల్లా, చార్మినార్ సిటీ కళాశాల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం అసమర్థత, అవినీతి, విద్యార్థి వ్యతిరేక విధానాలను నిరసిస్తూ విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని.. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని హైకోర్టు చౌరస్తాలో రాష్ట్ర ప్రభుత్వం దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ కోఠి జిల్లా కన్వీనర్ సబావట్ కల్యాణ్, కళాశాల అధ్యక్షులు దిలీప్ మాట్లాడుతూ.. 18 లక్షల మంది విద్యార్థుల ఎదురు చూపులు అయిన 500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే ప్రభుత్వం విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని యెడల ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

హక్కుల సాధనకు పోరాటాలు చేయాలి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

పంజగుట్ట: మన హక్కులు మనం సాధించుకోవడం కోసం భిక్షం ఎత్తుకోవాల్సిన అవసరం లేదని అంబేడ్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే చూపించిన బాటలో పోరాడి సాధించుకోవాలని భారతీయ మౌనజాతుల ప్రజా సమితి అధ్యక్షులు రాంచంద్రమ్ ముస్త్యాల అన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి పురస్కరించుకుని మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా రాంచంద్రమ్ మాట్లాడుతూ .. దేశంలో 90 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీకి చెందిన మౌనజాతులు అగ్రవర్ణ, మనువాదుల చేతుల్లో మోసపోతూనే ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారందరి కోసమే భారతీయ మౌనజాతుల ప్రజా సమితి ఏర్పాటు చేశామన్నారు. సమితి ఆధ్వర్యంలో వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని స్థానాల్లో బరిలోకి దిగుతామని ప్రకటించారు. 50 శాతం జనాభా ఉన్న మహిళలకు ఏ పార్టీ కూడా న్యాయం చేయడం లేదని తాము మహిళలకు 50 శాతం సీట్లు ఇస్తామన్నారు. సమావేశంలో వశపాక నర్సింహ, కొమ్ము అగ్రప్ప, తాడూరి గగన్ కుమార్, చిట్టపల్లి బాలయ్య, తాడూరి సత్తయ్య, కె.చంద్రశేఖర్ రెడ్డి, పృథ్వీరాజ్, రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

గ్లోబల్ వార్మింగ్ అరికట్టడమే బాధ్యతగా..



సందీప్ చౌదరి

బంజారాహిల్స్: వాతావరణ మార్పుల ద్వారా మానవజాతికి ముప్పు సంభవిస్తుందని సేవ్ ఎర్త్ కార్యకర్త, ఎస్ వరల్డ్ క్లైమేట్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో సందీప్ చౌదరి ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం జూబ్లీహిల్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్లోబల్ వార్మింగ్‌ను అరికట్టడం ప్రతి ఒక్కరు బాధ్యత అనే ప్రచారాన్ని ప్రారంభించామని ఇది ఎంతో ముఖ్యం అన్నారు. శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం గ్లోబల్ వార్మింగ్ భయంకరమైన సమస్య అని పరిష్కరించుకోకపోతే 2040 నాటికి భూమి అంతరించిపోతుందన్నారు. వాతావరణంలో ఏర్పడుతున్న మార్పులతో మానవ జాతి ప్రమాదంలో పడిపోతున్న పరిస్థితి నెలకొందన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం అనేక సమావేశాలు నిర్వహించినా, హామీలు ఇచ్చినా ఖచ్చితమైన ఫలితాలు రావడం లేదన్నారు. తమ సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటికే మొట్టమొదటి గృహ, వాణిజ్య నిర్మాణాలకు సంబంధించి కార్బన్‌ను నివారించే గాజుతో కూడిన ఉత్పత్తులను సేవ్ ఎర్త్ మిషన్ కార్యక్రమంలో అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు.

పూలే జీవితం ఆదర్శనీయం



జయంతిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

ఖైరతాబాద్: మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను మంగళవారం బ్యాక్‌వర్డ్ క్లాసెస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఖైరతాబాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే దానం నాగేందర్, బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం క్రిష్ణ మోహన్, మాజీ ఎంపీ హనుమంతరావు, అంజన్‌కుమార్ యాదవ్, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, గ్రంథాలయ చైర్ పర్సన్ ప్రసన్న పాల్గొని పూలే చిత్రపటానికి నివాళి అర్పించారు.

ఫిలింనగర్‌లో..

ఫిలింనగర్: అణగారిన వర్గాల కోసం జీవితాన్ని దారపోసిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి అన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు మంగళవారం జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లో ఘనంగా నిర్వహించారు. పార్టీలకతీతంగా నేతలు, కార్యకర్తలు సంఘ సేవకులు, బీసీ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై పూలే చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

బీసీ దళ్ కార్యాలయంలో..

లిబర్టీ: సమాజంలో నెలకొన్న కుల వివక్షత, మహిళల అభ్యున్నతికి అన్యాయాలను రూపుమాపడానికి జీవితాంతం పోరాడిన క్రాంతిమూర్తి మహాత్మా జ్యోతిరావు పూలే అని బీసీ దళ్ జాతీయ అధ్యక్షులు డి.కుమారస్వామి వెల్లడించారు. సమసమాజ స్థాపన కోసం కలలు కన్న సంఘ సంస్కర్త అని కొనియాడారు. పూలే జయంతిని పురస్కరించుకుని బీసీ దళ్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన జయంతి సభలో ఆయన ప్రసంగించారు. బడుగు బలహీన వర్గాల సమగ్ర అభివృద్ధి కోసం అణచివేత దోపిడీ బానిస బతుకుల విముక్తి కోసం అనేక ఉద్యమాలు సాగించారని గుర్తు చేశారు. మహిళల హక్కుల కోసం సాధికారత కోసం నడుం బిగించి ఉద్యమించారన్నారు. సమాజంలో అన్ని వర్గాలకు విద్యను అందించాలని ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నవ్య, సాయి, సుభాష్ పాల్గొన్నారు.

బోరబండ బస్టాప్‌లో..

రహమత్‌నగర్: ప్రజాసామ్యం విలువల కోసం పోరాడిన గొప్ప సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే అని బోరబండ బీఆర్ఎస్ నాయకులు కొనియాడారు. పూలే జయంతిని పురస్కరించుకుని మంగళవారం బోరబండ బస్టాప్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కృష్ణమోహన్, సీనియర్ నాయకుడు లక్ష్మణ్‌గౌడ్ పూలే చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో విజయసింహ, విజయ్‌కుమార్,రమేశ్ యాదవ్, ఏడీ మధు, బాబానాయక్,ఆనంద్,రామక్రిష్ణ,యూసుఫ్,నాగమణి పాల్గొన్నారు.

మంత్రులకు సన్మానం..

మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా మంత్రులు గంగుల కమలాకర్, శ్రీనివాస్ గౌడ్‌ను మంగళవారం వడ్డెర సంఘం (గున్నుదెబ్బ) రాష్ట్ర అధ్యక్షుడు ఎత్తరి అంతయ్య, నాయకులు జరుపటి సత్యనారాయణ, డా.ఓర్సు కృష్ణయ్యలతో సన్మానించారు.



మంత్రులను సన్మానిస్తున్న వడ్డెర సంఘం నాయకులు



పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పిస్తున్న రోహిణ్‌రెడ్డి



ఫిలింనగర్‌లో..



బోరబండ బస్టాప్‌లో..



నివాళులర్పిస్తున్న కంజర్ల సదాశివయాదవ్

బీసీ కుల గణనకు జై

- ఏపీలో నిర్వహించేందుకు సీఎం వైఎస్ జగన్ కీలక నిర్ణయం



సాక్షి, అమరావతి : కుల గణన చేపట్టాలన్న బీసీ సంఘాల న్యాయమైన డిమాండ్‌కు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జైకొట్టింది. వెనుకబడిన వర్గాల అశల అమలు దిశగా రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేసింది. వీరి న్యాయమైన డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకోవడం ద్వారా సీఎం వారికి నైతిక మద్దతు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న ఈ తాజా నిర్ణయంపట్ల బీసీ సంఘాలు హర్షం వ్యక్తంచేస్తున్నాయి. మరోవైపు.. దేశవ్యాప్త జనాభా లెక్కల సేకరణలో బీసీ కులం కాలమ్ చేర్చి కుల గణన చేపట్టాలంటూ కేంద్రాన్ని కోరుతూ ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అసెంబ్లీ తీర్మానం చేసింది. పైగా ఇప్పుడు రాష్ట్ర పరిధిలో కుల గణనకు సన్నద్ధమైంది. దీనిపై అధ్యయనానికి రాష్ట్రస్థాయి కమిటీని ఏర్పాటుచేయాలని సీఎం వైఎస్ జగన్ ఆదేశించినట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ మంగళవారం వెల్లడించారు. త్వరలో మంత్రి వేణు నేతృత్వంలో కమిటీని కూడా ప్రభుత్వం ప్రకటించనుంది. ఇప్పటికే బీసీ కుల గణనకు ముందుకొచ్చిన బిహార్, పంజాబ్, ఒడిశా రాష్ట్రాల్లో ఈ కమిటీ అధ్యయనం చేస్తుంది. అధ్యయన నివేదికను ప్రభుత్వానికి సమర్పించిన అనంతరం రాష్ట్రంలో బీసీ కుల గణనకు శ్రీకారం చుట్టేలా రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలను రూపొందిస్తుంది. తద్వారా జనాభా లెక్కల సేకరణలో కులం కాలమ్ చేర్చి కుల గణన చేపట్టేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుంది.

విదేశాల్లో చంద్రబాబు నల్లధనం రూ.5 లక్షల కోట్లు

ప్రధాని మోదీ స్పందించి ఈడీ, సీబీఐతో విచారణ చేయించాలి: లక్ష్మీపార్వతి

తిరుపతి రూరల్: చంద్రబాబునాయుడు అధికారాన్ని అడ్డం పెట్టుకుని అక్రమార్జన చేసి దుబాయ్, స్విట్జర్లాండ్‌లో దాచిన రూ.5 లక్షల కోట్ల నల్లధనాన్ని స్వదేశానికి రప్పించాలని తెలుగు, సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి డిమాండ్ చేశారు. తిరుపతిలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. విదేశాల్లో లక్షల కోట్లు దాచిన చంద్రబాబుపై ఈడీ, సీబీఐ విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ దీనిపై స్పందించాలని కోరారు. ఈ మేరకు ఆయనకు లేఖ రాయనున్నట్లు చెప్పారు. చంద్రబాబు అక్రమార్జనలపై పోరాటం చేస్తూనే ఉంటానన్నారు.

అడ్డంగా దొరికినా అడ్డదారిలోనే!

ఆర్బీఐ వారించినా రామోజీ బుద్ధి వంకరే


సాక్షి, అమరావతి: చట్టాలను ఉల్లంఘిస్తూ అక్రమాలకు పాల్పడటంలో తనకు సాటిలేదని చెరుకూరి రామోజీరావు మళ్లీ మళ్లీ నిరూపించుకుంటూనే ఉన్నారు. ఆర్బీఐ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ డిపాజిట్లను సేకరించడమే కాకుండా తన చర్యను నిస్సిగ్గుగా సమర్థించుకునేందుకు బరితెగించడం ఆయనకే చెల్లింది. తటస్థుల ముసుగులో టీడీపీ సానుభూతిపరులతో మాట్లాడిస్తూ మరో నాటకానికి తెర తీశారు. డిపాజిట్ల సేకరణ ముమ్మాటికీ చట్టవిరుద్ధమేనని ఆర్బీఐ కొరడా ఝుళిపించడం, అడ్డంగా దొరికిపోవడంతో కేసు విచారణ ఇంకా కొనసాగుతుండగానే నేరపూరిత కుట్రతో నాడు 'మార్గదర్శి ఫైనాన్షియర్స్'ను రామోజీ మూసివేశారు. ఇక ఇప్పుడు 'మార్గదర్శి చిట్‌ఫండ్స్' పేరిట రశీదుల రూపంలో అక్రమ డిపాజిట్ల సేకరణకు బరితెగించారు. చందాదారుల సొమ్ముతో అక్రమ ఆర్థిక సామ్రాజ్యాన్ని నిర్మించుకున్నారు. స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ, సీఐడీ అధికారుల సోదాలతో ఈ అక్రమాల బాగోతం మరోసారి బట్టబయలైంది.

మార్గదర్శివి అక్రమ డిపాజిట్లే...

'మార్గదర్శి ఫైనాన్షియర్స్' పేరిట చెరుకూరి రామోజీరావు అక్రమ డిపాజిట్లు సేకరించారని ఆర్బీఐ తేల్చింది. ఈమేరకు 2006 నవంబరులో కేంద్ర ఆర్థిక శాఖకు లిఖితపూర్వకంగా తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వానికి కూడా ఓ లేఖ ద్వారా వెల్లడించింది. డిపాజిట్ల సేకరణను సమర్థించుకుంటూ రామోజీరావు చేసిన వాదన పూర్తిగా అహేతుకం, చట్టవిరుద్ధమని స్పష్టం చేసింది. ఆదాయపన్ను చట్టం ప్రకారం తమ వ్యాపార సంస్థలన్నీ హిందూ అవిభక్త కుటుంబం (హెచ్‌యూఎఫ్) కిందకు వస్తాయి కాబట్టి ప్రజల నుంచి డిపాజిట్లు వసూలు చేయవచ్చని, ఆర్బీఐ చట్టంలోని '45 ఎస్' నిబంధన తమకు వర్తించదని రామోజీ అడ్డగోలుగా వాదించారు. దీన్ని ఆర్బీఐ పూర్తిగా తిరస్కరించింది. 'మార్గదర్శి ఫైనాన్షియర్స్' పేరిట వసూలు చేసినవి అక్రమ డిపాజిట్లేనని స్పష్టం చేసింది.

కొత్తగా సేకరించొద్దు.. రెన్యువల్ చేయొద్దు

మార్గదర్శి ఫైనాన్సియర్స్ పేరిట రామోజీరావు రూ.2,204.42 కోట్లు అక్రమంగా డిపాజిట్లుగా సేకరించారని ఆర్బీఐ వెల్లడించింది. మార్గదర్శి ఫైనాన్షియర్స్ తక్షణం డిపాజిట్ల సేకరణను నిలిపివేయాలని ఆదేశించింది. కొత్తగా డిపాజిట్లు సేకరించడం, కాలపరిమితి ముగిసిన పాత డిపాజిట్లు రెన్యూవల్ చేసేందుకు వీల్లేదని తేల్చిచెప్పింది. దీంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో రామోజీరావు డిపాజిట్ల సేకరణను నిలిపివేశారు. అప్పటికే సేకరించిన రూ.2,204.42 కోట్లను డిపాజిట్‌దారులకు వెనక్కి ఇచ్చేస్తామని ఆర్బీఐకి లిఖితపూర్వకంగా తెలిపారు. విధిలేని పరిస్థితుల్లో తమ మార్గదర్శి ఫైనాన్షియర్స్ సంస్థను మూసివేశారు. నాడు దివంగత వైఎస్సార్ సకాలంలో స్పందించి 2.50 లక్షల మంది డిపాజిట్‌దారులు హక్కులను పరిరక్షించారు.



RESERVE BANK OF INDIA

To Govt. Of Andhra Pradesh, 29.12.2006

Chief General Manager in Charge
D.O.DNBS CO/01.02.007/2006-07 November 30, 2006

Dear Shri Amitabh Verma

Representation of Sri Vundavalli Arun Kumar, M.P. received through Dr. Y.S. Rajasekhara Reddy, Chief Minister, Andhra Pradesh regarding alleged irregularities being committed by Margadarsi Financiers, Hyderabad based HUF.

Please refer to Government's letter F.No 5/94/2006-BO.II dated November 10, 2006 on the captioned subject.A Status paper indicating the background in respect of Margadarsi Financiers is given in Annex.

2. In view of the letter under reference received from the Ministry, the Bank had called the representative of the unincorporated body (UIB) of discussion on November 13, 2006 and they were asked to a) Substantiate their stance that they are not covered under Section 45S of the RBI Act, 1934 and b) detail their plans for protection of the interest of the depositors. Pending submission of the replies, the UIB was advised neither to accept any fresh deposit nor renew the maturing deposits forthwith.

మార్గదర్శి ఫైనాన్షియర్స్ డిపాజిట్ల సేకరణ అక్రమం అని చెబుతూ ఆర్‌బీఐ కేంద్ర ఆర్థిక శాఖకు రాసిన లేఖ... డిపాజిట్ల సేకరణ నిలిపివేయాలి, డిపాజిట్‌దారులకు డిపాజిట్ మొత్తానికి తిరిగి చెల్లించాలని ఆదేశించినట్టు పేర్కొన్న ఆర్‌బీఐ

2006లో ఆర్బీఐ ఏం చెప్పిందంటే..?

- 'మార్గదర్శి ఫైనాన్షియర్స్'వి కచ్చితంగా అక్రమ డిపాజిట్లే
- నిబంధనలకు విరుద్ధంగా రూ.2,205 కోట్ల డిపాజిట్ల సేకరణ
- డిపాజిట్‌దారులకు తక్షణం డిపాజిట్ మొత్తాన్ని చెల్లించాలి
- కొత్తగా డిపాజిట్ల స్వీకరణ, పాతవి రెన్యువల్ చేయకూడదు

మళ్లీ అక్రమ డిపాజిట్లు సేకరణ

ఆర్బీఐ ఆదేశాలతో మార్గదర్శి ఫైనాన్షియర్స్ దుకాణాన్ని మూసివేసిన రామోజీ ఈసారి మార్గదర్శి చిట్‌ఫండ్స్ పేరుతో అక్రమ డిపాజిట్లకు తెరతీశారు. చందాదారులు పాడిన చిట్టీ మొత్తాన్ని వారికి పూర్తిగా చెల్లించకుండా రశీదుల రూపంలో డిపాజిట్లుగా వసూలు చేశారు. చిట్‌ఫండ్ కంపెనీలు డిపాజిట్లు వసూలు చేయడం చిట్‌ఫండ్ చట్టం –1982కు విరుద్ధం. మార్గదర్శి బ్రాంచి కార్యాలయాల నుంచి అక్రమ డిపాజిట్లను సేకరించి హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయానికి తరలించారు. అక్కడ నుంచి తమ అనుబంధ సంస్థలైన ఉషాకిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్, మార్గదర్శి చిట్‌ఫండ్స్(తమిళనాడు)–చెన్నై, మార్గదర్శి చిట్‌ఫండ్స్(కర్ణాటక)–బెంగళూరులలో అక్రమ పెట్టుబడులు పెట్టారు. ముంబైలోని మ్యూచ్‌వల్ ఫండ్స్ కంపెనీలు, షేర్ మార్కెట్లో కూడా అక్రమ పెట్టుబడులుగా మళ్లించారు. ఇలా తన చేతి సొమ్ము రూపాయి పెట్టకుండా చందాదారుల కష్టార్జితాన్ని పెట్టుబడిగా పెట్టి ఆస్తులు కూడగట్టారని స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ, సీఐడీ అధికారుల సోదాల్లో వెల్లడైంది.



A LETTER FROM
RBI (Central Office) MUMBAI
to A.P Government

Copy of of letter No. DNBS.CO. 4230/01.02.06-2007 dated 29th December 2006 of from Sri P. Krishnamurthy, Chief General Manager-in-Charge, Reserve Bank of India, Central Office, Mumbai addressed to Sri Paul Bhavan, IAS, Special Chief Secretary to Government, Home Department, Government of Andhra Pradesh, A-Block, 3rd Floor, Secretariat, Hyderabad.

Dear Sir,

Please refer to your letter No. 37008/General.B/A2/2006-1 dated December 19, 2006 requesting certain information / documents etc. on Margadarsi Financiers, Hyderabad.

2. As you may be aware, the Reserve Bank of India draws its powers for regulation and supervision over the non-banking financial companies (NBFCs) from the provisions of Chapter III B of the Reserve Bank of India Act, 1934/ These powers include registration of NBFCs, inspecting their business, calling for information, calling for returns/statements on deposits and issuing directions. However, the Act does not provide for the Reserve Bank to issue directions. However, the Act does not provide for the Reserve Bank to issue directions or exercise other regulatory and supervisory powers as regards unincorporated bodies (UIBs) such as Margadarsi Financ[illegible] which is stated to belong to a Hindu Undivided Family (I[illegible] Since HUFs are not falling within the definition of a NBFC non-banking Institution under Chapter III B of the RBI Act, 1934. 31

డిపాజిట్ దారుల ప్రయోజనాల పరరక్షణ కోసం సీఐడీ ద్వారా తగిన చర్యలు రాష్ట్ర ప్రభుత్వమే తీసుకోవాలని ఆర్‌బీఐ రాసిన లేఖ

చర్యలు తీసుకోవాల్సింది ప్రభుత్వమేనన్న ఆర్బీఐ

నిబంధనలకు విరుద్ధంగా అక్రమ డిపాజిట్లను సేకరించే సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాల్సింది రాష్ట్ర ప్రభుత్వమేనని ఆర్బీఐ 2006లోనే స్పష్టం చేసింది. మార్గదర్శి ఫైనాన్సియర్స్ అక్రమ పెట్టుబడుల అంశంపై నాడు ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ కేంద్ర ఆర్థిక శాఖ, ఆర్‌బీఐకి ఫిర్యాదు చేశారు. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఇదే విషయాన్ని కేంద్ర ఆర్థిక శాఖ ద్వారా ఆర్బీఐ దృష్టికి తేవడంతో లిఖితపూర్వకంగా సమాధానమిచ్చింది. డిపాజిట్‌దారుల ప్రయోజనాలకు కాపాడాల్సిన బాధ్యత ఆయా రాష్ట్ర ప్రభుత్వాలదేనని స్పష్టం చేసింది. అక్రమ డిపాజిట్లు వసూలు చేసే ఆర్థిక సంస్థలపై చర్యలు తీసుకునే యంత్రాంగం ఆర్బీఐకి ప్రత్యేకంగా లేదని పేర్కొంది. ఆ తరహా ఆర్థిక నేరాలను కట్టడి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వాల వద్ద సీఐడీ విభాగం ప్రత్యేకంగా ఉందని ఆర్బీఐ ప్రస్తావించడం గమనార్హం. ఆమేరకు ఏపీ ప్రభుత్వం కూడా 1999 రాష్ట్ర డిపాజిట్‌దారుల హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించింది. నాడు ఆర్బీఐ ఆదేశాలతోనే దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం మార్గదర్శి ఫైనాన్సియర్స్‌పై చర్యలు చేపట్టింది. ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కూడా మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక మోసాలపై అదే నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటోంది. సోదాలు నిర్వహించి అక్రమాలు జరిగినట్లు వెల్లడికావడంతో సీఐడీ కేసు నమోదు చేసింది. ఏ–1గా చెరుకూరి రామోజీరావు, ఏ–2గా చెరుకూరి శైలజపై ఎఫ్ఐఆర్ నమోదు చేసింది.

అవినాశ్, భాస్కర్‌రెడ్డిలను ఇరికించే కుట్ర

వైఎస్ వివేకా హత్య కేసును తప్పుదారి పట్టిస్తున్నారు

- టీడీపీ నేతలు, వైఎస్ సునీత కథ నడిపిస్తున్నారు
- సాక్ష్యాలు, ఆధారాలను పట్టించుకోకుండా విచారణ
- దస్తగిరి వాంగ్మూలం ఆధారంగా సీబీఐ దర్యాప్తు
- దస్తగిరి చెప్పిన విషయాలకు ఎలాంటి సాక్ష్యం లేదు
- సాక్ష్యం లేకుండా వ్యక్తులను నేరంలోకి నెట్టడం చట్టవ్యతిరేకం
- హత్యలో కీలకమైన దస్తగిరికి బెయిల్ ఇచ్చారు
- తెలంగాణ హైకోర్టులో వైఎస్ భాస్కర్‌రెడ్డి న్యాయవాది వాదనలు
- విచారణ గురువారానికి వాయిదా



సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తును టీడీపీ నేతలు, వైఎస్ సునీత కలసి తప్పుదారి పట్టిస్తున్నారని, కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, ఆయన తండ్రి వైఎస్ భాస్కర్‌రెడ్డిలను కేసులో ఇరికించేందుకు కుట్ర సాగుతోందని భాసర్కర్‌రెడ్డి తరపు సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి తెలంగాణ హైకోర్టుకు తెలిపారు. టీడీపీ నేతలు, సునీతకు సీబీఐ దర్యాప్తు అధికారి కూడా పూర్తిగా సహకరించారని చెప్పారు. దర్యాప్తు సరిగా చేయడం లేదని భావించిన సుప్రీంకోర్టు ఆ అధికారిని విచారణ నుంచి తప్పించిందని వివరించారు. ప్రత్యక్ష సాక్షులను, ఆధారాలను పట్టించుకోకుండా దస్తగిరి తప్పుడు వాంగ్మూలం ఆధారంగా దర్యాప్తు సాగిస్తున్నారన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు దస్తగిరిని అప్రూవర్‌గా ప్రకటించినా, బెయిల్ ఇచ్చినా సునీత మౌనంగా ఉండటం వెనుక కుట్ర దాగి ఉందని వెల్లడించారు. 'వివేకా హత్య కేసులో సీబీఐ చెప్పినట్లు ఏ–4 దస్తగిరి వాంగ్మూలం ఇచ్చాడు. దాని ఆధారంగా నన్ను, మరికొందరిని నిందితులుగా చేర్చే అవకాశం ఉంది. దస్తగిరిని అప్రూవర్‌గా ప్రకటించడాన్ని, అతనికి బెయిల్ ఇస్తూ కిందికోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేయాలి. నన్ను, మరికొందిరిని నిందితులుగా చేర్చవద్దని ఆదేశాలు ఇవ్వాలి'అని కోరుతూ భాస్కర్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ సురేందర్ మంగళవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరపున నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. 'హత్య కేసులో నిందితుడైన కిరాయి హంతకుడికి ముందస్తు బెయిల్ ఇవ్వకూడదని సుప్రీం కోర్టు పలు తీర్పులిచ్చింది. అప్రూవర్‌గా మారిన దస్తగిరి వాంగ్మూలంలో చెప్పిన వాటికి సాక్ష్యం లేదు. ఇలా ఎలాంటి సాక్ష్యం లేకుండా ఒకరు చెప్పారంటూ వ్యక్తులను నేరంలోకి నెట్టడం చట్టవ్యతిరేకం. నేరంలో నలుగురు పాలుపంచుకున్నారు. వీరిలో తక్కువ నేరం చేసిన వారు జైలులో ఉండగా, కీలక పాత్ర పోషించిన దస్తగిరికి మాత్రం బెయిల్ ఇచ్చారు. దస్తగిరిని కస్టడీలోకి తీసుకోలేదు. విచారణా జరపలేదు. గంగిరెడ్డి ఆదేశాల మేరకు దస్తగిరి హత్యలో కీలక పాత్ర పోషించాడు. దీని కోసం భారీ మొత్తంలో నగదు కూడా తీసుకున్నాడు. అతని వద్ద కొంత నగదు కూడా దొరికింది. ఆయుధాన్ని అతనే తెచ్చినట్లు, హత్యలో ప్రధాన పాత్ర పోషించినట్లు కూడా ఒప్పుకున్నాడు. ఇంత చేసినా అతన్ని అప్రూవర్‌గా ప్రకటించేలా కడప కోర్టులో సీబీఐ కౌంటర్ వేసింది. 2021 ఆగస్టులో అనుకూల వాంగ్మూలం ఇచ్చిన కారణంగానే అక్టోబర్‌లో బెయిల్‌కు సీబీఐ సహకరించింది. మన వెనుక అవినాశ్, భాస్కర్‌రెడ్డి లాంటి కీలక వ్యక్తులు ఉన్నారని గంగిరెడ్డి చెప్పినట్లు దస్తగిరి వాంగ్మూలం ఇచ్చాడని సీబీఐ చెబుతోంది. అయితే అసలు ఎవరి పేర్లూ చెప్పలేదని గంగిరెడ్డి వాంగ్మూలంలో పేర్కొన్నాడు. ఈ అంశాన్ని మాత్రం సీబీఐ పరిగణనలోకి తీసుకోవడం లేదు. వారికి ఏది కావాలో దాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకుని విచారణ సాగిస్తున్నారు. గూగుల్ టేక్ అవుట్ డేటాను ఆధారంగా చేసుకోవడం సరికాదు'అని నిరంజన్‌రెడ్డి వాదించారు.

టీడీపీతో సునీత మిలాఖత్

'వైఎస్ వివేకా తన వారసుడిగా రెండో భార్య కుమారుడిని ప్రకటించారు. ఇది మొదటి భార్య, కూతురు సునీత, అల్లుడికి నచ్చలేదు. ఆస్తుల విషయంలోనూ వారి మధ్య తీవ్రమైన మనస్పర్థలు వచ్చాయి. మరోవైపు గంగిరెడ్డితో వివేకాకు నగదుకు సంబంధించిన విభేదాలు కూడా ఉన్నాయి. అలాగే తన తల్లితో వివేకా అసభ్యకరంగా ప్రవర్తించినట్లు సునీల్ యాదవ్ చెప్పాడు. ఇలాంటి వివాదాల నేపథ్యంలోనే హత్య జరిగింది. వీటిని కూడా సీబీఐ పరిగణనలోకి తీసుకోలేదు. అవినాశ్‌తో వివేకా సన్నిహితంగా ఉండేవారు. ఎన్నికల్లో అవినాశ్ విజయం కోసం ప్రచారం కూడా చేశారు. వివేకా హత్య తర్వాత ఇదే విషయాన్ని సునీత కూడా చెప్పారు. టీడీపీతో ఆమె మిలాఖత్ అయినప్పటి నుంచి మాట మార్చారు. విభేదాలు ఉన్న వారిని వదిలిపెట్టి.. సన్నిహితులను కేసులో ఇరికించేందుకు పథకం సాగుతోంది. దస్తగిరిపై వాచ్‌మేన్ రంగన్న చెప్పిన ఆధారాలను కింది కోర్టు పట్టించుకోలేదు. దస్తగిరిని అప్రూవర్‌గా ప్రకటించడం చట్టవిరుద్ధం. అతనికి బెయిల్ ఇచ్చే సమయంలోనూ అన్ని అంశాలను కింది కోర్టు పరిగణనలోకి తీసుకోలేదు. బెయిల్ చట్టప్రకారం ఇవ్వలేదు కనుక కడప కోర్టు ఉత్తర్వులను కొట్టివేయాలి. దర్యాప్తు అధికారులకు అవినాశ్, భాస్కర్‌రెడ్డి పూర్తిగా సహకరిస్తున్నారు. విచారణకు హాజరవుతున్నారు. భాస్కర్‌రెడ్డిని నిందితుడిగా చేర్చవద్దని సీబీఐని ఆదేశించాలి'అని నిరంజన్ రెడ్డి కోర్టుకు నివేదించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేశారు.

నగర వార్తలు

బ్రైడ్ అండ్ గ్రూమ్ చిత్ర ప్రదర్శన ప్రారంభం



మాదాపూర్: కళాకారుడు వేసిన చిత్రాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో మంగళవారం బ్రైడ్ అండ్ గ్రూమ్ పేరిట ఏఎస్ చక్రవర్తి వేసిన పెయింటింగ్స్ ప్రదర్శనను ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్ కె.లక్ష్మి ప్రారంభించారు. ఈ చిత్రాలు సందేశాత్మకంగా ఉన్నాయని ఆమె కొనియాడారు. 35 చిత్రాలతో కూడిన ప్రదర్శన ఈ నెల 16వ తేదీ వరకు అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో కళాకారుడు ఆర్.సుభాష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

బేగంపేటలో 'వావ్ ఈట్స్' ప్రారంభం

సనత్‌నగర్: ప్రముఖ సినీనటుడు అలీ బేగంపేటలో సందడి చేశారు. ఎస్పీరోడ్డులో సింధికాలనీలో వావ్ మోమో ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ నూతనంగా ఏర్పాటుచేసిన వావ్ ఈట్స్ ఔట్‌లెట్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఔట్‌లెట్ మొత్తం కలియదిరిగిన ఆయనకు అక్కడ అందుబాటులో ఉన్న ప్రత్యేక వంటకాల గురించి నిర్వాహకులు వివరించారు. ఈ సందర్భంగా అలీ మాట్లాడుతూ, ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇచ్చేలా విభిన్న రకాల వంటకాలను అందుబాటులోకి తీసుకువచ్చిన వావ్ ఈట్స్ నిర్వాహకులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో వావ్ మోమో ఫుడ్స్ కో–ఫౌండర్, చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ మురళీకృష్ణ, సౌత్ ఇండియా ఆపరేషన్స్ వైస్ ప్రెసిడెంట్ విష్ణువర్దన్‌రెడ్డి, హైదరాబాద్ ఆపరేషన్స్ మేనేజర్ ఫైజాన్, రీజనల్ మార్కెటింగ్ మేనేజర్ ఇస్మాయిల్ ఫరాజ్, ఆష్రఫ్ తదితరులు పాల్గొన్నారు.



వావ్ ఈట్స్‌లోని వంటకాల గురించి తెలుసుకుంటున్న అలీ

హజ్ యాత్రపై గందరగోళం

- యాత్రకు మిగిలింది 45 రోజులే
- ఇంకా ఖరారు కాని వ్యయం
- అంచనాలు లేకుండానే డబ్బు వసూళ్లు చేపట్టిన అధికారులు
- అయోమయంలో యాత్రికులు

సాక్షి,సిటీబ్యూరో: ఈ ఏడాది హజ్ యాత్ర ఏర్పాట్లలో తీవ్ర జాప్యమౌతోంది. ప్రతి ఏటా యాత్రకు మూడు నెలల ముందు యాత్రకు అయ్యే ఖర్చుల వివరాలను కేంద్ర హజ్ కమిటీ విడుదల చేస్తుంది. అయితే, ఈ ఏడాది జూన్ నెలలోనే హజ్ ఆరాధనలు ప్రారంభం కానున్నా.. ఇప్పటి వరకు కేంద్ర హజ్ కమిటీ 2023 హజ్ యాత్రకు అయ్యే ఖర్చుల వివరాలను వెల్లడించలేదు. దీంతో యాత్రకు ఎంపికైన వారిలో గందరగోళ పరిస్థితి నెలకొంది.

- ఖర్చుల వివరాలు వెల్లడించకుండానే ప్రతి యాత్రికుడి నుంచి మొదటి విడతగా రూ. 81,800 వసూలు చేస్తున్నారు.
- యాత్రపై అంచనాలు లేకుండానే డబ్బులు వసూలు చేయడం సరికాదని పలు మైనార్టీ సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి.
- ఈ విషయంపై రాష్ట్ర హజ్ కమిటీ అధికారులను అడిగితే కేంద్ర హజ్ కమిటీ సూచనల మేరకే డబ్బులు వసూలు చేస్తున్నామని చెబుతున్నారు.
- ఏది ఏమైనా.. హజ్ యాత్ర కేవలం 45 రోజులే ఉంది. కేంద్ర, రాష్ట్ర హజ్ కమిటీల సమన్వయ లోపంతో తమకు సరైన సమాచారం ఇవ్వడం లేదని యాత్రికులు ఆరోపిస్తున్నారు.



ఒరిజినల్స్ జమ చేయాలి..

- యాత్రకు అయ్యే ఖర్చు ఎంత అనేది ఇంకా నిర్ధారించని కేంద్ర హజ్ కమిటీ యాత్రకు ఎంపికైన యాత్రికులకు సంబంధించి ఒరిజినల్ పాస్‌పోర్ట్‌లతో పాటు ఇతర దస్తావేజులు జమ చేయాలని ఆదేశాలు జారీ చేసింది.
- యాత్రకు అయ్యే ఖర్చు ఎంత అవుతుందో తెలియజేస్తే యాత్రకు వెళ్లాలా లేదా అనేది నిర్ణయించుకుంటారని యాత్రకు ఎంపికైన ఓ యాత్రికుడు సాక్షికి చెప్పాడు. ప్రతి ఏటా ఖర్చులు ముందుగా తెలియజేస్తారు.
- దీంతో యాత్రికులు డబ్బులు పోగు చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. అలా కాకుండా ఇప్పటి వరకు ఖర్చులు వెల్లడించకపోవడంతో పలు యాత్రికుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వెంటనే యాత్రకు అయ్యే ఖర్చులను రాష్ట్ర హజ్ కమిటీ వెల్లడించాలని ధార్మిక మతపెద్దలు కోరుతున్నారు.

'రెడ్డి, వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు హామీని సీఎం నెరవేర్చాలి'

కవాడిగూడ: రెడ్డి, వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఓసీ సామాజిక వర్గాల సమైఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు డిమాండ్ చేశారు. సిద్ధిపేటలో జరిగిన రెడ్డి జేఏసీ నిరసన దీక్షలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీ 2018 అసెంబ్లీ ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలను, హుజూరాబాద్ ఉప ఎన్నికల సందర్భంగా ఇచ్చిన వాగ్దానాలను తక్షణమే అమలు చేయాలన్నారు. ఓసీ రెడ్డి, ఆర్యవైశ్య, వైశ్య పేదల సంక్షేమానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.



సిద్ధిపేటలో జరిగిన నిరసన దీక్షలో మాట్లాడుతున్న పోలాడి రామారావు

ఇప్పటికైనా సీఎం కేసీఆర్ సానుకూలంగా స్పందించి తన హామీలను నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు.

కోత లేకుండా గుండెకు చికిత్స

అరుదైన శస్త్ర చికిత్స చేసిన నిమ్స్ వైద్యులు

లక్డీకాపూల్: నిమ్స్‌లో కోత లేకుండా అరుదైన గుండె శస్త్ర చికిత్స చేశారు. జగిత్యాలకు చెందిన దేవమ్మ (67) 2015 లో ఆపరేషన్ ద్వారా మైట్రల్ వాల్వ్ మార్పిడి చేయించుకుంది. ఆ వాల్వ్ మూసుకుపోవడంతో అవస్థ పడుతూ చాలా హాస్పిటల్స్ తిరిగిన ఆమె.. చివరకు నిమ్స్ కార్డియాలజీ విభాగంలో చేరింది. మళ్లీ గుండె కోత ఆపరేషన్ రిస్క్ తో కూడినందు వలన, కోత లేకుండా తొడ నుంచి కాథెటర్ ద్వారా వాల్వ్ మార్పిడి చేశారు. నిమ్స్ కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ బి. శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైద్యులు సతీష్ రావు, మణికృష్ణ, హరీష్ రెడ్డి, ప్రదీప్, సదానంద్ , మెహరున్నీసాతో కూడిన బృందం విజయవంతంగా ఆపరేషన్ చేసింది. ఈ విధంగా కాథెటర్ ద్వారా మైట్రల్ వాల్వ్ మార్పిడి చేయడం నిమ్స్ లో ప్రప్రథమం. తెలంగాణ ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ ద్వారా చేసిన ఆర్థిక సహాయం వలన ఈ చికిత్స సాధ్యమైంది.



దివ్యాంగుల ఉపకరణాలకు 25లోగా దరఖాస్తు చేసుకోవాలి

చాదర్‌ఘాట్: తెలంగాణ వికలాంగుల కార్పొరేషన్ అందజేసే ఉచిత ఉపకరణాల కోసం అర్హులైన దివ్యాంగులు ఈనెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలని కార్పొరేషన్ చైర్మన్ కె.వాసుదేవరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీఎస్ఓబీఎంఎంఎస్.సీజీజీ.జీఓవీ.ఐఎన్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు జిల్లా సంక్షేమాధికారులను సంప్రదించాలని అన్నారు.

న్యాయ సహాయానికి ఎల్‌ఏడీసీఎస్‌లో సంప్రదించాలి

యాకుత్‌పురా: ప్రజలు న్యాయ సహాయం పొందేందుకు రాష్ట్రంలోని 16 జిల్లాల్లో ఏర్పాటు చేసిన లీగల్ ఎయిడెడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం (ఎల్ఏడీసీఎస్) కేంద్రాలలో సంప్రదించాలని హైకోర్టు న్యాయమూర్తి, తెలంగాణ న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ నవీన్ రావు సూచించారు. తెలంగాణ న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసిజర్(ఎస్ఓపీ) ఫర్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం, ప్రీ ఇనిస్టిట్యూషన్ మీడియేషన్ అండ్ సెటిల్మెంట్ ఇన్ కమర్షియల్ డిస్ప్యూట్స్‌పై రూపొందించిన గైడ్‌లైన్స్ పుస్తకాలను ఆయన మంగళవారం పురానాహవేలీలోని న్యాయ సేవాసదన్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ న్యాయ సేవా అధికార సంస్థ సభ్య కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రాధిక తదితరులు పాల్గొన్నారు.



గైడ్‌లైన్స్ పుస్తకాలను విడుదల చేస్తున్న జస్టిస్ నవీన్

మనువాద వ్యతిరేక పోరాటం చేయాలి: చాడ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఆనాడు మనువాదానికి వ్యతిరేకంగా జ్యోతిరావు పూలే పోరాటం చేశారని, ఈనాడు కూడా మనువాదం కొత్త రూపంలో అమలవుతోందని, దానికి వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీపీఐ రాష్ట్ర నాయకుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఐ, సీపీఐ(ఎం)ల సంయుక్త ఆధ్వర్యంలో మహాత్మాజ్యోతిరావు పూలే 197వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ, మనువాదానికి వ్యతిరేకంగా పోరాటం చేయడమే జ్యోతిరావు పూలేకు ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. దేశంలో రోజు రోజుకూ మూకదాడులు పెరిగిపోతున్నాయని, మతోన్మాదం పేరుతో బీజేపీ అల్లర్లు సృష్టిస్తూ ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలపై దాడులు చేయిస్తోందని ఆరోపించారు. కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ రమణ మాట్లాడుతూ, బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి ఆగిపోయిందని విమర్శించారు. ఒకే జాతి, ఒకే మతం అంటూ రెచ్చగొట్టే ఉపన్యాసాలు చేస్తూ ప్రజలను విచ్ఛిన్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి మనువాద చర్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, సీపీఐ రాష్ట్ర నాయకులు బాలమల్లేష్, బొమ్మగాని ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతిరావు పూలే జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వం ఆటలు

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరయ్య

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.వీరయ్య డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ నిరుద్యోగ యువత జీవితాలతో ఆటలాడుతోందని విమర్శించారు. మంగళవారం సుందరయ్య పార్కు వద్ద ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యంలో టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీని నిరసిస్తూ ఒక రోజు దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ, టీఎస్‌పీఎస్‌సీ ఏఈ, గ్రూప్–1 పేపర్ల లీక్‌పై విద్యార్థి, నిరుద్యోగ యువత తీవ్ర మానసిక ఒత్తిడికి లోనవుతుంటే వారికి భరోసా కల్పించేందుకు ముఖ్యమంత్రి ఎలాంటి ప్రకటన చేయలేదన్నారు. టీఎస్‌పీఎస్‌సీలో 30 లక్షల మంది వన్‌టైమ్ రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, వీరందరిలో ఈ లీకేజీతో చదివితే ఉద్యోగం వస్తుందో రాదో అన్న అభద్రత భావం నెలకొందన్నారు. దీక్షను విరమింపజేసిన ఎమ్మెల్సీ ఎ.నర్సిరెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రతి నిరుద్యోగి ఖాతాల్లో రూ. 50 వేలు జమ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోటా రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్, వివిధ సంఘాల నాయకులు టి.స్కైల్యాబ్‌బాబు, ప్రసాద్, అరుణజ్యోతి, శోభన్‌నాయక్, ఎ.విజయ్, మహేందర్, అశోక్‌రెడ్డి, జావిద్ పాల్గొన్నారు.




నిరాహార దీక్షలో మాట్లాడుతున్న ఎస్.వీరయ్య

'బలగం' మొగిలయ్యకు నిమ్స్‌లో చికిత్స

- వరంగల్ నుంచి తరలించిన కుటుంబ సభ్యులు

లక్డీకాపూల్: బలగం సినిమాలోని క్లైమాక్స్ సాంగ్ 'తోడుగా మాతో ఉండి' అనే పాటను ఆలపించి అందరినీ ఏడిపించిన బుడగ జంగాల కళాకారుడు పస్తం మొగిలయ్య తీవ్ర అవస్థతకు గురైన సంగతి తెలిసిందే. మొగిలయ్య ఆరోగ్యంపై రాష్ట్ర మంత్రులు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్ రావు స్పందించారు. ఆయనకు మెరుగైన వైద్యం అందిస్తామని చెప్పారు. దీంతో మంగళవారం రాత్రి మొగిలయ్యను వరంగల్ నుంచి నిమ్స్కు తరలించారు. కొద్ది రోజులుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆయనకు ఏఆర్సీయూ లో చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆయన ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వైద్యులు తెలిపారు.



మొగిలయ్యను నిమ్స్‌కు తీసుకొచ్చిన దృశ్యం

క్లుప్తంగా...

సమస్త వృత్తి కులాలన్నీ ఏకం కావాలి : జూలూరి



తిరుపతి కల్చరల్: మహాత్మా జ్యోతిరావ్ పూలే చూపిన మార్గంలో బహుజనుల హక్కుల సాధన కోసం, రిజర్వేషన్ల కోసం బహుజన కవులు, కళాకారులు, రచయితలు, సామాజిక కార్యకర్తలు సాహిత్య సాంస్కృతిక ఉద్యమాన్ని నిర్మించాలని తెలంగాణా సాహిత్య అకాడమీ ఛైర్మన్ జూలూరి గౌరీ శంకర్ అభిప్రాయపడ్డారు. ఇందుకు సమస్త వృత్తి కులాలన్నీ ఏకం కావాలని పిలుపునిచ్చారు. టీటీడీ ఆధ్వర్యంలో తిరుపతి మహతి కళాక్షేత్రంలో నిర్వహించిన పూలే జయంతి వేడుకల్లో గౌరీశంకర్ ప్రసంగించారు. పూలే తాత్వికతను కథలు, కవితలు, గేయాలు, పాటలు, పదాల రూపంలో దేశమంతటా విస్తృత ప్రచారం చేయాలని కోరారు. ఇప్పటివరకు అందరి కోసం సాహిత్య సృజన చేసిన బహుజన కవులు నేడు తమ కోసం, తమ బిడ్డల హక్కుల కోసం గళమెత్తి బహుజన జాతీయోద్యమ గీతాలను రాయాలన్నారు. 'జర్నలిజం అధ్యాపకుడు మాలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ పూలేతాత్వికతను విశ్లేషించారు.

13న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జ్ఞానయాత్ర



అంబేడ్కర్ జ్ఞానయాత్ర ర్యాలీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి ఈశ్వర్ తదితరులు

కవాడిగూడ (హైదరాబాద్): ప్రభుత్వం బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో పాటు నూతన సచివాలయానికి అంబేడ్కర్ నామకరణం చేసిన సందర్భంగా ఈ నెల 13న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జ్ఞానయాత్రను నిర్వహించనున్నట్టు మాలమాదిగ ప్రజా సంఘాల ఫ్రంట్ నేతలు తెలిపారు. ఈ సందర్భంగా ఫ్రంట్ నేతలు రూపొందించిన అంబేడ్కర్ జ్ఞానయాత్ర ర్యాలీ పోస్టర్‌ను మంగళవారం మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆవిష్కరించారు. 13న సాయంత్రం 5 గంటలకు లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం నుంచి నెక్లెస్ రోడ్‌లోని 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం వరకు జ్ఞాన యాత్ర కొనసాగుతుందని ఫ్రంట్ నేతలు తెలిపారు. కార్యక్రమంలో టీఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇటుక రాజుమాదిగ, తెలంగాణ మాదిగ హక్కుల దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు జన్ను కనకరాజు, ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బీఎస్ రమేష్‌కుమార్‌మాదిగ, మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు చెరుకు రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

13న ఐచ్ఛిక సెలవు

సాక్షి, హైదరాబాద్: షహదత్ హజ్రత్ అలీ సందర్భంగా ఈ నెల 11న ప్రకటించిన ఐచ్ఛిక సెలవును ఈ నెల 13వ తేదీకి మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

స్టీల్‌ప్లాంట్ ఉన్నతాధికారులతో సింగరేణి అధికారుల భేటీ

ఉక్కునగరం: తెలంగాణకు చెందిన సింగరేణి అధికారుల బృందం మంగళవారం విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సందర్శించింది. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ముడి సరుకులు, నగదు కోసం ఆసక్తి వ్యక్తీకరణ (ఈవోఐ) కోసం నోటిఫికేషన్ జారీ చేసిన విషయం విదితమే. ఈవోఐకు ఈ నెల 15న గడువుగా నిర్ణయించారు. ఈవోఐలో పాల్గొనేందుకు తెలంగాణ ప్రభుత్వం ఆసక్తి కనబరుస్తుందన్న వార్తల నేపథ్యంలో సింగరేణి డైరెక్టర్లు సత్యనారాయణ రావు, సుబ్బారావు, బలరాంతో పాటు మరో ఇద్దరు జీఎంలు ఉక్కు పరిపాలన భవనంకు వచ్చారు. ఉక్కు సీఎండీ కాన్ఫరెన్స్ హాల్‌లో స్టీల్ ప్లాంట్ డైరెక్టర్ (ఫైనాన్స్) వేణుగోపాల రావు, డైరెక్టర్ (కమర్షియల్) డీకే మొహంతి, డైరెక్టర్ (ఆపరేషన్స్) ఇన్‌చార్జ్ ఏకే బాగ్చీ, మార్కెటింగ్ అధికారులతో సమావేశమై ఈవోఐ విధి విధానాల గురించి చర్చించినట్లు సమాచారం. కాగా, సింగరేణి అధికారులతో పోరాట కమిటీ నేతలు భేటీ అయ్యారు.

స్టీల్‌ప్లాంట్‌పై కేసీఆర్‌ది కపట ప్రేమ: మాధవ్



ఎంవీపీ కాలనీ (విశాఖ తూర్పు): తెలంగాణ సీఎం కేసీఆర్ స్టీల్‌ప్లాంట్‌పై కపటప్రేమ ఒలకబోస్తున్నారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ విమర్శించారు. మంగళవారం మాధవ్ విలేకరులతో మాట్లాడుతూ.. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడతామంటున్న బీఆర్‌ఎస్ నాయకుల ప్రకటనలను తప్పుబట్టారు. కేసీఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే తెలంగాణలో మూతబడ్డ పరిశ్రమలను, ప్రభుత్వ సంస్థలను ముందు తెరిపించాలన్నారు. కేసీఆర్ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం ఏపీ ప్రజలను మోసం చేయాలని చూస్తున్నాడని చెప్పారు. విభజన సమయంలో ఆంధ్ర ప్రజలపై విషం కక్కిన కేసీఆర్ ఇప్పుడు ఏపీని ఉద్ధరిస్తామంటూ ప్రగల్భాలు పలకడం సిగ్గుచేటన్నారు.

నాన్నకు ప్రేమతో..



విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి మంగళవారం స్వగ్రామమైన సూర్యాపేట జిల్లా నాగారం వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎండలో పొలాలను పరిశీలిస్తున్న తండ్రి రామచంద్రారెడ్డికి గొడుగు పట్టారు. ఎనభై ఏళ్ల ప్రాయంలో వ్యవసాయ క్షేత్రాన్ని చూసుకుంటున్న తండ్రికి తోడుగా జగదీశ్‌రెడ్డి కూడా పొలాల్లో కలియతిరిగారు.
–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ

సతీమణితో ఎర్రబెల్లి స్టెప్పులు



జనగామ జిల్లా పాలకుర్తి మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనాలు జరిగాయి. ఈ సందర్భంగా పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తన సతీమణి ఉషాదయాకర్‌తో కలిసి సరదాగా నృత్యం చేశారు. కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. – పాలకుర్తి

డేటా దేశం దాటిందా?

లీకుపై కేంద్ర హోం శాఖ ఆరా

- రక్షణ శాఖ రహస్య సమాచారం కూడా ఉండటంతో అప్రమత్తం
- సైబరాబాద్ పోలీసులతో వీడియో కాన్ఫరెన్స్
- 80 కోట్ల మంది వ్యక్తిగత సమాచారం చోరీ చేసిన నిందితులు
- ఇందులో 2.60 లక్షల మంది రక్షణ శాఖ ఉద్యోగుల వివరాలు
- జస్ట్ డయల్‌తో పాటు 28 వెబ్‌సైట్ల ద్వారా డేటా విక్రయం

సాక్షి, హైదరాబాద్: సంచలనం సృష్టించిన డేటా లీక్ వ్యవహారాన్ని కేంద్ర హోం శాఖ సీరియస్‌గా తీసుకుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు 24 రాష్ట్రాలకు చెందిన 80 కోట్ల మంది ప్రజలు, ప్రభుత్వ ఉద్యోగుల వ్యక్తిగత సమాచారాన్ని బహిరంగ మార్కెట్‌లో విక్రయానికి పెట్టడంపై దృష్టి సారించింది. ముఖ్యంగా చౌర్యానికి గురైన డేటాలో 2.60 లక్షల మంది రక్షణ శాఖ ఉద్యోగుల రహస్య సమాచారం కూడా ఉండటంతో అప్రమత్తమైంది. దీనిపై మంగళవారం సైబరాబాద్ పోలీసులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించింది. ఇటీవల మూడు డేటా చౌర్యం కేసులకు సంబంధించి 17 మంది నిందితులను సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఉద్యోగుల వ్యక్తిగత వివరాలు, ర్యాంకులు, పనిచేస్తున్న చోటు, విభాగం వంటి వివరాలు లీక్ అయ్యాయి. విద్యుత్, ఇంధన శాఖ, జీఎస్‌టీ, ఆర్‌టీఓలతో పాటు ఇతర ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, ప్రవాసులు, టీచర్లు, వైద్యులు, లాయర్లు, ఐటీ ఉద్యోగులు, విద్యార్థులు, గృహిణులు.. ఇలా 104 కేటగిరీలకు చెందిన ప్రజలు, సంస్థల వ్యక్తిగత, రహస్య సమాచారాన్ని నిందితులు విక్రయిసున్నారు.

ఎలా లీకైంది? ఎవరు కొన్నారు?

హై ప్రొఫైల్ వ్యక్తుల రహస్య సమాచారం లీక్ కావడంతో అప్రమత్తమైన కేంద్ర హోం శాఖ.. నిందితులకు సమాచారం ఎలా చేరింది? ఎక్కడి నుంచి లీకైంది? ఎవరెవరు డేటా కొనుగోలు చేశారు? కొన్న సమాచారాన్ని దేని కోసం వినియోగిస్తున్నారు? సున్నితమైన సమాచారం ఏమైనా దేశం దాటిందా? వంటి అంశాలపై సైబరాబాద్ పోలీసులను ఆరా తీసినట్టు తెలిసింది. దీంతో ఇప్పటికే నిందితుల నుంచి రాబట్టిన సమాచారాన్ని సైబరాబాద్ పోలీసులు వివరించారు.



21 సంస్థలకు నోటీసులు జారీ..

నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ఇతరత్రా ఎలక్ట్రానిక్ ఉపకరణాలను విశ్లేషించిన పోలీసులు.. 21 సంస్థల నుంచి డేటా చౌర్యానికి గురైనట్లు గుర్తించారు. దీంతో బిగ్ బాస్కెట్, ఫోన్‌పే, ఫేస్‌బుక్, క్లబ్ మహీంద్రా, పాలసీ బజార్, యాక్సిస్ బ్యాంక్, అస్ట్యూట్ గ్రూప్, మ్యాట్రిక్స్, టెక్ మహీంద్రా, బ్యాంక్ ఆఫ్ బరోడా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లాంటి 21 సంస్థలకు నోటీసులు జారీ చేశారు. ఇందులో 8 సంస్థలు మాత్రమే విచారణకు హాజరై.. కస్టమర్ల డేటా సమీకరణ, భద్రత విధానాలపై పోలీసులకు నివేదికను సమర్పించాయి. దీంతో గైర్హాజరైన కంపెనీలపై పోలీసులు న్యాయపరమైన చర్యలకు సిద్ధమైనట్లు తెలిసింది.

వెబ్‌సైట్ల ద్వారా డేటా విక్రయం..

తొలుత నిందితులు జస్ట్ డయల్ వేదికగా డేటాను విక్రయిస్తున్నట్టు సైబరాబాద్ పోలీసులు నిర్ధారించారు. అయితే కస్టడీలో ఉన్న నిందితుల నుంచి సేకరించిన సమాచారాన్ని విశ్లేషించగా.. నిందితులు సొంతగా నకిలీ గుర్తింపు కార్డులతో కంపెనీలను ఏర్పాటు చేసి, వాటి పేరుతో వెబ్‌సైట్లను సృష్టించి మరీ డేటాను విక్రయిస్తున్నట్లు తేలింది. ఢిల్లీ, ఫరీదాబాద్‌లో నకిలీ కాల్ సెంటర్లను ఏర్పాటు చేసి, గ్రామీణ నిరుద్యోగులను టెలీ కాలర్లుగా నియమించుకొని మోసాలకు పాల్పడుతున్నట్లు తెలిసింది. నకిలీ పేర్లతో సిమ్ కార్డులు, బ్యాంకు ఖాతాలు తెరుస్తూ.. కొట్టేసిన సొమ్మును నేరుగా ఆయా ఖాతాలకు మళ్లిస్తే పోలీసులకు దొరికిపోతామని నోబ్రోకర్.కామ్, హౌసింగ్.కామ్, పేటీఎం, మ్యాజిక్ బ్రిక్స్ వంటి ఆన్‌లైన్ సంస్థలకు మళ్లిస్తున్నట్లు గుర్తించారు.

28 వెబ్‌సైట్లు ఇవే..

- ఇన్‌స్పైర్ వెబ్స్ • డేటా మార్ట్ ఇన్ఫోటెక్
- గ్లోబల్ డేటా ఆర్ట్స్ • ఎంఎస్ డిజిటల్ గ్రో
- ఇన్‌స్పైర్ డిజిటల్ • ఫన్‌డూడేటా.కామ్
- కెనిల్స్.కో • డేటాస్పెర్‌నీడ్.కామ్
- బినరీక్లూస్.కామ్ • ఇనిగ్మా మార్కెటింగ్
- అల్టీమోకడ్స్.కామ్ • ఫాస్ట్ డేటాబేస్ ప్రొవైడర్ • డేటా సొల్యూషన్ ఫర్ బీ2బీ అండ్ బీ2సీ పోర్టల్ • బీజీ డేటా • డిమాండ్ డేటా సొల్యూషన్ • స్పెర్ డిజిటల్ ఇండియా
- క్యూబిక్‌టెక్నాలజీ.కామ్ • బీబీజీఈబ్రాండిం గ్.కామ్ • ఈజీసర్వ్.కో.ఇన్ • డేటాప్రొలిక్స్.కామ్ • క్యూబిర్ డేటాబేస్ మార్కెటింగ్
- 77డేటా.నెట్ • 99డేటాఏసీడీ.కామ్
- డేటాబేస్‌ప్రొవైడర్.ఇన్ • హెచ్‌ఐడేటాబేస్.కామ్ • బల్క్‌డేటాబేస్.ఇన్ఫో • గ్లోబల్‌డేటా.కామ్ • డేటాపార్క్.కో.ఇన్

కమ్యూనిస్టు నేత వెంకటయ్య కన్నుమూత



సాక్షి, హైదరాబాద్: సీనియర్ కమ్యూనిస్టు, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు బొమ్మగాని వెంకటయ్య (98)మంగళవారం హైదరాబాద్‌లో కన్నుమూశారు. ఆయన ప్రముఖ కమ్యూనిస్టు బొమ్మగాని ధర్మభిక్షం సోదరుడు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మగాని ప్రభాకర్ తండ్రి. వెంకటయ్య భౌతికకాయాన్ని బుధవారం ఉదయం 8 గంటల వరకు ఎల్బీనగర్ లోని ఆయన కుమారుడు నాగభూషణం నివాసంలో సందర్శనార్థం ఉంచుతారు. అనంతరం సూర్యాపేటకు తరలించి మధ్యాహ్నం రెండు గంటలకు అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

తెలంగాణ గురుకులాలు దేశానికే తలమానికం

- సీవోఈ సెట్ పరీక్ష ఫలితాల విడుదలలో మంత్రులు కొప్పుల, సత్యవతి
- ఏప్రిల్ 22 నుంచి 15 రోజులు సమ్మర్ క్యాంప్స్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ గురుకులాలు దేశానికే తలమానికమని ఎస్సీ అభివృద్ధి, మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ గురుకులాల్లో విద్యనందిస్తున్నామని, వాటిలో చదివిన విద్యార్థులెందరో ఉన్నత స్థానాల్లో ఉన్నారని తెలిపారు. గిరిజన, సంక్షేమశాఖ విద్యార్థులకు సమ్మర్ స్పోర్ట్స్ క్యాంప్ నిర్వహణ పోస్టర్‌ను, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలల సీవోఈ సెట్ ఫలితాలను మంగళవారం విడుదల చేశారు. అనంతరం మంత్రులు మాట్లాడుతూ.. దళిత, గిరిజన విద్యార్థులకు సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారన్నారు. అందుకే ప్రభుత్వ గురుకులాల్లో అడ్మిషన్ల కోసం పోటీ పడుతున్నారని, తల్లిదండ్రుల నుంచి మంచి ప్రోత్సాహం లభిస్తోందని తెలిపారు. సీవోఈ సెట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను మంత్రులు కొనియాడారు.

45 చోట్ల 15 రోజుల పాటు జరిగే సమ్మర్ స్పోర్ట్స్ క్యాంపులు ఏప్రిల్ 22న ప్రారంభమై, మే ఆరున ముగుస్తాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రులు సూచించారు. కార్యక్రమంలో రెసిడెన్షియల్ విద్యా సంస్థల సొసైటీ కార్యదర్శి రోనాల్డ్ రోస్, ట్రైబల్ వెల్ఫేర్ అడిషనల్ డైరెక్టర్ సర్వేశ్వర్‌రెడ్డి, డిప్యూటీ సెక్రటరీ శ్రీనివాస్‌రెడ్డి, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ రవీందర్‌సింగ్, వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ వాసుదేవరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కాళ్లు విరగ్గొడతామన్నారు

- అంబర్‌పేట ఎమ్మెల్యేపై బీఆర్‌ఎస్ కార్పొరేటర్ ఆరోపణ
- జ్యోతిరావు పూలే జయంతి వేడుకల్లో వివాదం



అలీకేఫ్ చౌరస్తాలో ఎమ్మెల్యే వెంకటేశ్, శ్రీనివాస్ గౌడ్‌ల వాగ్వాదం

అంబర్‌పేట: మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకల సందర్భంగా అంబర్‌పేటలో బీఆర్‌ఎస్ వర్గ విభేధాలు రోడ్డున పడ్డాయి. వివరాలిలా.. మంగళవారం అలీకేఫ్ చౌరస్తాలోని జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద జరిగిన వేడుకల్లో భాగంగా స్థానిక కార్పొరేటర్ దూసరి లావణ్య భర్త శ్రీనివాస్‌గౌడ్ ముందుగా విగ్రహానికి పూల మాల వేసి కిందకు దిగారు. అదే సమయంలో పూల మాల వేసేందుకు పైకి ఎక్కుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ కనపడటంతో నమస్కరించి చేయి కలిపేందుకు ప్రయత్నించారు. అయితే ఎమ్మెల్యే ఆగ్రహంతో శ్రీనివాస్‌గౌడ్ వీపుపై చిన్నగా చరిచారు. అదేందన్నా అని శ్రీనివాస్‌గౌడ్ ప్రశ్నించినా ఎమ్మెల్యే పట్టించుకోకుండా పూలే విగ్రహానికి నివాళులర్పించి కిందకు దిగారు. అక్కడే నా భర్తపై ఎందుకు చేయి వేసుకున్నారని ఎమ్మెల్యేను అడగ్గా... చేయి చేసుకునుడు కాదు కాళ్లు విరగకొడుతా అన్నారంటూ కార్పొరేటర్ లావణ్య ఆరోపించారు. పార్టీ ఆత్మీయ సమ్మేళనంపై తనకు సమాచారం ఇవ్వలేదని శ్రీనివాస్‌గౌడ్ ఎమ్మెల్యేను ప్రశ్నించగా ''నువ్వు కార్పొరేటర్‌వు కాదు నీకు ఎందుకు సమాచారం ఇవ్వాలి. నీ భార్య ఫోన్‌కి సమాచారం ఇస్తాము' అని ఎమ్మెల్యే సమాధానమిచ్చారు. వీరి మధ్య వాగ్వివాదం రోడ్డుపై జరుగుతుండడంతో ఆ పార్టీ నాయకులు ఇద్దరినీ సముదాయించి అక్కడి నుంచి పంపించేశారు. కాగా, ఎమ్మెల్యే తమపై కక్ష కట్టారని, ఆయన నుంచి తమకు ప్రాణహాని ఉందని అధిష్టానానికి ఫిర్యాదు చేస్తామని కార్పొరేటర్ దంపతులు మీడియాకు చెప్పారు.

అంతా వక్రీకరించారు

జయంతి వేడుకల్లో అక్కడ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఉన్నారు. ముందుకు వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా చిన్నగా చేయిపడితే దానిని కొట్టినట్లు వక్రీకరించారు.
– ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



ఇక ఏదీ దాగదు..

సాక్షి, హైదరాబాద్: స్కానర్ల కళ్లుగప్పి బంగారం, ఆయుధాలు, ఇంకేదైనా రవాణా చేయడం ఇక అసాధ్యం. అదెలా అంటారా? ప్లాస్టిక్ మాత్రమే కాదు.. రబ్బర్, కాగితం, పింగాణీ వంటి పదార్థాల లోపలిక్కూడా చొచ్చుకుపోయి అక్కడ ఏముందో చూపించే 2డీ టెరాహెర్ట్జ్ ఇమేజింగ్ వ్యవస్థను హైదరాబాద్ యూనివర్సిటీ (హెచ్‌యూ)తయారు చేసింది. ఈ టెక్నాలజీ సాయంతో సెమీ కండక్టర్లు, మందులు, వాయువులు, రసాయన మిశ్రమాలను నిశితంగా పరిశీలించే అవకాశం ఉంది. ఈ సామర్థ్యం రక్షణ రంగంలో, దేశ భద్రతకూ చాలా ఉపయోగపడుతుంది. 2డీ టెరాహెర్ట్జ్ లేదా టీ–రేలు ఇప్పుడు మనం ఉపయోగిస్తున్న ఎక్స్‌రేల కంటే ఎంతో మెరుగైనవి. వంద గిగాహెర్ట్జ్‌లో నుంచి 10 టెరాహెర్ట్జ్ ఫ్రీక్వెన్సీ దీని పరిధి. ఇంకోలా చెప్పాలంటే మూడు మిల్లీమీటర్ల నుంచి 30 మైక్రోమీటర్ల మధ్య తరంగం దైర్ఘ్యం కలిగిన వీటిని టీ–రేలని పిలుస్తారు. ఈ కిరణాలు లోహేతర పదార్థాల గుండా కూడా చొచ్చుకు పోగలవు. దాచి ఉంచిన ఆయుధాలను వీటితో సులువుగా గుర్తించవచ్చు. హెచ్‌యూలోని ఏసీఆర్‌హెచ్‌ఈఎమ్ స్కూల్ ఆఫ్ ఫిజిక్స్ శాస్త్రవేత్త ఏకే చౌదరి నేతృత్వంలోని శాస్త్రవేత్తల బృందం టీ–రేలతో చిత్రాలు తీయడంలో ఒక వ్యవస్థను తయారు చేశారు. ఇది 0.1 టెరి హెర్ట్జ్ నుంచి 2.0 టెరాహెర్ట్జ్ వరకూ టీ–రేలు ప్రసరింపజేసి ఇమేజ్‌లు తీయగలదు. కాగితంలో చుట్టిన లోహపు, పేలుడు పదార్థాలను కూడా ఇది గుర్తించగలదని శాస్త్రవేత్తలు తెలిపారు.

రాష్ట్రపతితో బీసీ నేతల భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో 56 శాతం జనాభా గల బీసీలకు విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాలలో సమాన వాటా ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికైనా దేశవ్యాప్తంగా బీసీలకు న్యాయం చేయడానికి రాజ్యాంగంలోని 340 ఆర్టికల్ ప్రకారం రాష్ట్రపతి హోదాలో జోక్యం చేసుకోవాలని కృష్ణయ్యతో పాటు గుజ్జ కృష్ణ తదితరులు విజ్ఞప్తి చేశారు. బీసీలకు అన్నీ రంగాలలో సమాన వాటా ఇచ్చే ప్రక్రియ ప్రారంభమైందని, ఇంకా పూర్తిస్థాయి న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్రపతి తమకు హామీ ఇచ్చారని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు విలేకరులకు తెలిపారు. .

తూర్పు తీరం ఆడపడుచులు



ఆలివ్ రిడ్లే తాబేలు పిల్లలు

పుట్టిన చోటే పురుడు పోసుకుంటున్న ఆలివ్ రిడ్లే తాబేళ్లు

సంతానోత్పత్తి కేంద్రంగా కాకినాడ తీరం

ఈ ఏడాది రికార్డుస్థాయిలో తాబేళ్ల రాక



సంతానోత్పత్తికి వచ్చిన ఆలివ్ రిడ్లే తాబేలు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: పుట్టింటిపై మమకారం మగ పిల్లలతో పోలిస్తే ఆడపిల్లలకు మరింత ఎక్కువే. పెళ్లి చేసుకుని అత్తారింటికి వెళ్లిపోయినా.. పుట్టింటిపై మమకారం వారిలో చెక్కుచెదరదు. నోరులేని మూగజీవాలకు కూడా జన్మస్థలంపై అంతటి మమకారం ఉంటుందంటే ఆశ్చర్యమే. సైబీరియా పక్షుల మాదిరిగా కేవలం సంతానోత్పత్తి కోసమే ఎన్ని వేల కిలోమీటర్ల దూరమైనా ప్రయాణించి పుట్టింటికి వస్తాయి ఆలివ్ రిడ్లే తాబేళ్లు. పుట్టిన కొద్ది రోజులకే సముద్రంలో ఎంతో దూరం వెళ్లిపోయే ఈ తాబేళ్ల పదేళ్ల తరువాత సంతానోత్పత్తి కోసం వేల కిలోమీటర్లు ఈదుకుంటూ.. తాము పుట్టిన ప్రాంతానికే చేరుకుంటాయి. ఇలా రాగలగటం వాటి జ్ఞాపకశక్తికి నిదర్శనమంటారు. ఆలివ్ రిడ్లే శాస్త్రీయ నామం'లెపిడోచెలిస్ ఒలివేసియా'.గ్రీన్ టర్టిల్, లెదర్ బ్యాగ్, గ్రీన్‌సీ టర్టిల్, హాక్‌బిల్‌సీ వంటి జాతుల తాబేళ్లు ఉన్నప్పటికీ ఆలివ్ రిడ్లే రకం తాబేళ్లు తూర్పు తీరానికి ఎక్కువగా వస్తున్నాయి.

ఆ మూల నుంచి.. ఈ మూల వరకు

ఒడిశాలోని బీతర్కానిక తీరం నుంచి.. తమిళనాడు సరిహద్దులోని తడ వరకు విస్తరించి ఉన్న సముద్ర తీరం వరకు ఆలివ్ రిడ్లే తాబేళ్లు సంతానోత్పత్తి కోసం వస్తుంటాయి. అందులోనూ కాకినాడ తీరానికే వీటి రాక అధికం. ఇసుక, నీరు తేటగా ఉండటంతోపాటు 30 డిగ్రీల కంటే ఎక్కువ ఉష్ణోగ్రత ఉండే ప్రాంతాలపై ఆలివ్ రిడ్లే తాబేళ్లు ఆసక్తి చూపుతాయి. వివిధ సముద్రాల్లో ఉండే ఈ తాబేళ్లు సంపర్కం కోసం ఏటా నవంబర్, డిసెంబర్ నెలల్లో బంగాళాఖాతంలోకి చేరుతాయి. ఆ తరువాత ఆడ తాబేళ్లు మాత్రమే గుడ్లు పెట్టేందుకు తీరానికి వస్తాయి. జనవరి రెండోవారం నుంచి ఏప్రిల్ మొదటివారం వరకు ఇవి గుడ్లు పెట్టే సీజన్. ఈ తాబేళ్లు జీవితమంతా సముద్రంలోనే గడుపుతాయి.గుడ్లు పెట్టడానికి మాత్రం భూమి మీదకు వస్తాయి. నదులు సముద్రంలో కలిసే చోటు వీటి సంతానోత్పత్తికి అనువుగా ఉంటుంది. తీరంలోని ఇసుకలో బొరియలు తవ్వి ఒక్కో తాబేలు 100 నుంచి 150 వరకు గుడ్లు పెడుతున్నాయి. గుడ్లు పెట్టేశాక తల్లి సముద్రంలోకి వెళ్లిపోతుంది. ఆ గుడ్లలోంచి 45–55 రోజుల్లో పిల్లలు బయటకొస్తాయి. వీటిని ఏపీ అటవీ శాఖ సంరక్షిస్తోంది. కళ్లు తెరిచిన పిల్లలను సూర్యుడు ఉదయించే వేళ అధికారులు సముద్రంలోకి విడిచిపెడుతున్నారు. వెలుతురు అంటే ఇష్టపడే తాబేలు పిల్లలు సూర్యుడు ఉదయించేటప్పుడు ఆ కిరణాలవైపు పరుగులు తీస్తూ సముద్రంలో కలిసిపోతాయి. ఈ ప్రక్రియ నెల రోజులుగా కాకినాడ తీరంలో అటవీ రేంజర్ ఎస్.వరప్రసాద్ పర్యవేక్షణలో జరుగుతోంది. ఇప్పటికే 8వేల పిల్లలను సముద్రంలోకి విడిచి పెట్టారు.

సమతుల్యతలో కీలకం


కళ్లు తెరిచిన పిల్లలు సముద్రంలోకి వెళ్లిన పదేళ్లకు కౌమార దశకు వస్తాయి. సంపర్కం తరువాత తనకు జన్మనిచ్చిన తీరాన్ని గుర్తుంచుకుని గుడ్లుపెట్టేందుకు తిరిగి అక్కడికే వస్తాయి. సముద్రం జలాల్లో వాతావరణ సమతుల్యతను పరిరక్షించడంలో వీటి పాత్ర కీలకం. సముద్రంలో మత్స్య సంపదను మింగేస్తున్న జెల్లీ ఫిష్‌లను ఆలివ్ రిడ్లేలు ఆహారంగా తీసుకుంటాయి. మత్స్య సంపదకు రక్షణగా ఉండటం, సముద్ర జలాలలో కాలుష్యం నివారించి శుభ్రంగా ఉంచడంలో వీటి పాత్ర అమోఘం.
– ఎస్.వరప్రసాద్, రేంజర్, కోరంగి అభయారణ్యం

మేధస్సులో ఆడ తాబేళ్లు దిట్ట

తెలివితేటల్లో ఆడ తాబేళ్లు దిట్ట. ఆడ తాబేళ్లు గుడ్లు పెట్టడానికి ముందు ఇసుక తేటగా.. చదునుగా.. అలికిడి లేని, సముద్ర అలలు తాకని ప్రాంతాన్ని ఎంపిక చేసుకుంటాయి. గుడ్లు పెట్టే ప్రాంతంలో 30 సెంటీమీటర్ల మేర గొయ్యి తవ్వి గుడ్లు పెట్టి.. ఇసుకతో కప్పేస్తాయి. తవ్విన గోతిలో అడుగు భాగం (పునాది) గట్టిగా ఉండాలని శరీర బరువు (సుమారు 50 కేజీలు)తో అరగంట పాటు పైకి, కిందకు పడుతూ లేస్తూ చదును చేసి గుడ్లు పెడతాయి. గుడ్లను శత్రుజీవులు గుర్తించకుండా చుట్టుపక్కల డమ్మీగా నాలుగైదు గోతుల్ని తవ్వి ఇసుకతో కప్పేస్తాయి. నక్కలు, కుక్కలు, కాకులకు గుడ్లు పెట్టిన ప్రాంతం తెలియకుండా జాగ్రత్తలు తీసుకోవడంలో ఆలివ్ రిడ్లే తెలివితేటలు అమోఘం.

దేశంలోనే అట్టడుగున మన డిస్కంలు

- ఎన్పీడీసీఎల్‌కు 47వ ర్యాంకు.. 43వ ర్యాంకులో ఎస్పీడీసీఎల్
- వార్షిక డిస్కంల ర్యాంకులు, రేటింగ్స్ నివేదికలో వెల్లడి



జెన్‌కోల నుంచి కొనుగోలు చేసిన విద్యుత్ బిల్లుల చెల్లింపుల్లో దేశంలోనే అత్యధిక జాప్యాన్ని తెలంగాణ డిస్కంలు చేస్తున్నాయని పై పటంలో చూడవచ్చు..

సాక్షి, హైదరాబాద్: జాతీయ స్థాయి రేటింగ్, ర్యాంకింగ్స్‌లో తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు మరోసారి దేశంలోనే అట్టడుగు స్థానంలో నిలిచాయి. దేశంలోని 51 డిస్కంలలో టీఎస్ఎన్పీడీసీఎల్ 47వ ర్యాంకు, టీఎస్ఎస్పీడీసీఎల్ 43వ ర్యాంకుతో సరిపెట్టుకున్నాయి. ఈ మేరకు డిస్కంల 11వ వార్షిక రేటింగ్స్, ర్యాంకింగ్స్ నివేదికను కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. మెరుగైన రేటింగ్, ర్యాంకింగ్ కలిగి ఉంటేనే డిస్కంలకు ప్రభుత్వరంగ బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి రుణాలు లభించనున్నాయి. ఈ మేరకు కేంద్రం లంకె పెట్టడంతో ఈ రేటింగ్స్ కీలకంగా మారాయి. రాష్ట్ర డిస్కంలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్నట్లు ఈ నివేదిక స్పష్టం చేసింది.

డీ–గ్రేడ్‌కి అడుగు దూరంలో ...

డిస్కంల ఆర్థిక సుస్థిరతకు 75, పనితీరు సమర్థతకు 13, బయటి నుంచి ప్రభుత్వం/ఈఆర్సీల మద్దతుకు 12 కలిపి మొత్తం 100 స్కోరుకిగాను ఆయా డిస్కంలు సాధించిన స్కోరు ఆధారంగా వాటికి.. ఏ+, ఏ, బీ, బీ–, సీ, సీ–, డీ అనే గ్రేడులను కేటాయించింది. కీలక అంశాల్లో డిస్కంల వైఫల్యాలకు నెగెటివ్ స్కోర్‌ను సైతం కేటాయించింది. ఎస్పీడీసీఎల్ 10.8 స్కోరు సాధించి 'సీ–' గ్రేడ్‌ను, ఎన్పీడీసీఎల్ 6.6 స్కోరును సాధించి 'సీ–' గ్రేడ్‌ను పొందింది. చిట్టచివరి స్థానమైన 'డీ గ్రేడ్'లో మేఘాలయ డిస్కం మాత్రమే నిలిచింది.

దేశం మొత్తం బకాయిల్లో 15% మనవే...

జెన్‌కో, ట్రాన్స్‌కోలకు దేశంలోని అన్ని డిస్కంలు చెల్లించాల్సిన బకాయిలు 2021–22 నాటికి రూ.2.81 లక్షల కోట్లకు ఎగబాకినట్టు కేంద్రం పేర్కొంది. అందులో ఎస్పీడీసీఎల్ వాటా ఏకంగా 10.3 శాతం కాగా, ఎన్పీడీసీఎల్ వాటా 4.3 శాతం కావడం గమనార్హం. జెన్‌కోల నుంచి డిస్కంలు కొనుగోలు చేసే విద్యుత్‌కు సంబంధించిన బిల్లులను 45 రోజుల్లోగా చెల్లించాల్సి ఉండగా ఎస్పీడీసీఎల్ 375 రోజులు, ఎన్పీడీసీఎల్ 356 రోజుల కిందటి నాటి బిల్లులను బకాయిపడ్డాయి. అంటే మన డిస్కంలు విద్యుదుత్పత్తి సంస్థలకు బకాయిల చెల్లింపులకు కనీసం ఏడాది సమయాన్ని తీసుకుంటున్నాయి.

సామాజిక తెలంగాణ పొలిటికల్ ఫ్రంట్ ఆవిర్భావం



ఆవిర్భావ సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ సూరజ్‌మండల్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సామాజిక తెలంగాణ పొలిటికల్ ఫ్రంట్ ఆవిర్భవించింది. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం జరిగిన ఈ ఆవిర్భావ సమావేశంలో ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ సూరజ్‌మండల్ మాట్లాడారు. దేశంలో కులజనగణన చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం భయపడుతోందన్నారు. మండల్ కమిషన్ సిఫారస్సును అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. వెంటనే మండల్ కమిషన్ సిఫారస్సులు అన్నింటినీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల విషయంలో ఆదాయ పరిమితి ఉన్నత వర్గాలకు రూ.8 లక్షలు చేసి, ఓబీసీలకు రూ.2.5 లక్షలు మాత్రమే పెట్టారని విమర్శించారు. బహుజనులకు రాజ్యాధికారం దక్కాలంటే ఎన్నికల్లో పోటీ చేయాల్సిందేనని స్పష్టం చేశారు. తమిళనాడు సీఎం స్టాలిన్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో సామాజిక న్యాయ కూటమి ఏర్పాటవుతోందని, దీనికి ప్రతి ఒక్కరూ మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రొఫెసర్ల మీద వివక్ష చూపుతున్నారని, ప్రమోషన్లలో అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, పొలిటికల్ ఫ్రంట్ కో–చైర్మన్ ఆకునూరు మురళి మాట్లాడుతూ.. బలహీన వర్గాలను అణచివేసేందుకు ప్రభుత్వాలు వెనుకాడడం లేదన్నారు. సామాజిక న్యాయం దక్కాలంటే రాజ్యాధికారమే శరణ్యమని, ఆ దిశగా ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఫ్రంట్ చైర్మన్ ప్రొఫెసర్ మురళీమనోహర్, కన్వీనర్ బొంగు ప్రసాద్‌గౌడ్, కమిటీ సభ్యులు హంసోల్ లక్ష్మణ్, వెంకట్, దాసురామ్‌నాయక్, డాక్టర్ వినయ్‌కుమార్, ప్రొఫెసర్ తిరుమలి, ప్రొఫెసర్ ప్రభంజన్‌యాదవ్, కేపీ గౌడ్, చామకూర రాజు, ఓరుగంటి వెంకటేశ్వర్లు, శంకర్ తదితరులున్నారు.



ఆర్‌సీబీ కెప్టెన్ డుప్లెసిస్‌పై రూ. 12 లక్షల జరిమానా

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టు కెప్టెన్ ఫాఫ్ డుప్లెసిస్‌పై ఐపీఎల్ నిర్వాహకులు రూ. 12 లక్షలు జరిమానా విధించారు. లక్నో సూపర్ జెయింట్స్ జట్టుతో సోమవారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో ఆర్‌సీబీ జట్టు నిర్ణీత సమయంలో ఓవర్ల కోటా పూర్తి చేయనందుకు ఈ చర్య తీసుకున్నారు. తదుపరి మ్యాచ్‌ల్లో స్లో ఓవర్ రేట్ పునరావృతమైతే జరిమానా మొత్తాన్ని రెట్టింపు చేస్తారు. ఇదే మ్యాచ్‌లో విజయానంతరం ఆనందంలో తన హెల్మెట్‌ను నేలకేసి కొట్టిన లక్నో ప్లేయర్ అవేశ్ ఖాన్‌ను మ్యాచ్ రిఫరీ మందలించి వదిలేశారు.



తొలి రౌండ్‌లోనే ఓడిన మనిక బత్రా

ప్రపంచ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) చాంపియన్స్ టోర్నీలో భారత నంబర్‌వన్ మనిక బత్రా పోరాటం తొలి రౌండ్‌లోనే ముగిసింది. చైనాలోని జిన్‌జియాంగ్ నగరంలో జరుగుతున్న ఈ టోర్నీలో మహిళల సింగిల్స్ మొదటి రౌండ్‌లో ప్రపంచ 39వ ర్యాంకర్ మనిక 4-11, 9-11, 1-11తో ప్రపంచ 24వ ర్యాంకర్ జియోనా షాన్ (జర్మనీ) చేతిలో ఓడిపోయింది. కేవలం సింగిల్స్ విభాగాల్లో మాత్రమే నిర్వహిస్తున్న ఈ టోర్నీలో భారత్ నుంచి మనిక మాత్రమే పోటీపడింది.

రజతం నెగ్గిన నిషా

ప్రియా ఖాతాలో కాంస్యం



నిషా

అస్తానా (కజకిస్తాన్): ఆసియా సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో మంగళవారం మొదలైన మహిళల ఫ్రీస్టయిల్ విభాగంలో భారత్‌కు రెండు పతకాలు లభించాయి. నిషా (68 కేజీలు) రజత పతకం... ప్రియా (76 కేజీలు) కాంస్య పతకం సాధించారు. నీలమ్ (50 కేజీలు) కాంస్య పతక బౌట్‌లో ఓడిపోగా... సీతో (55 కేజీలు), సరిత మోర్ (59 కేజీలు) నిరాశపరిచారు. 68 కేజీల విభాగంలో ఫైనల్లో నిషా 0-10తో గత ఏడాది ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రజతం గెలిచిన అమీ ఇషి (జపాన్) చేతిలో ఓడిపోయింది. ప్రియా 2-1తో మిజుకి నాగషిమ (జపాన్)పై గెలుపొంది కాంస్య పతకాన్ని దక్కించుకుంది. నీలమ్ 0-10తో జికి ఫెంగ్ (చైనా) చేతిలో ఓటమి చవిచూసింది.

11వ ర్యాంక్‌లో పీవీ సింధు



న్యూఢిల్లీ: ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య ర్యాంకింగ్స్‌లో మహిళల సింగిల్స్ విభాగంలో భారత స్టార్ పీవీ సింధు మళ్లీ టాప్-10లో చోటు కోల్పోయింది. తాజా ర్యాంకింగ్స్‌లో సింధు రెండు స్థానాలు పడిపోయి తొమ్మిది నుంచి 11వ ర్యాంక్‌కు చేరుకుంది. గత నెలలో 2016 తర్వాత తొలిసారి టాప్-10లో స్థానం కోల్పోయిన సింధు ఈనెల తొలి వారంలో తొమ్మిదో స్థానానికి చేరుకొని మళ్లీ టాప్-10లోకి వచ్చింది. అయితే వారం వ్యవధిలో సింధు ర్యాంక్ మారిపోయింది. భారత్‌కే చెందిన సైనా 31వ ర్యాంక్‌లో, ఆకర్షి 40వ ర్యాంక్‌లో, మాళవిక 42వ ర్యాంక్‌లో, అష్మిత 48వ ర్యాంక్‌లో ఉన్నారు. పురుషుల సింగిల్స్‌లో ప్రియాన్షు రజావత్ కెరీర్ బెస్ట్ ర్యాంక్‌కు చేరుకున్నాడు. గతవారం ఫ్రాన్స్‌లో జరిగిన ఓర్లియాన్స్ మాస్టర్స్ టోర్నీలో మధ్యప్రదేశ్‌కు చెందిన ప్రియాన్షు విజేతగా నిలిచాడు. దాంతో ప్రియాన్షు 20 స్థానాలు ఎగబాకి 38వ ర్యాంక్‌లో నిలిచాడు.

ముంబై బోణీ...

'సీనియర్లు మరింత బాధ్యత తీసుకోవాలి... అది నాతోనే మొదలు కావాలి... గత మ్యాచ్‌లో ఓటమి తర్వాత ముంబై కెప్టెన్ రోహిత్ శర్మ చేసిన వ్యాఖ్య ఇది. దానికి తగినట్లుగానే బ్యాటింగ్‌లో సత్తా చాటిన రోహిత్... అంతకుముందు సారథిగా మైదానంలో ప్రణాళికలు సరిగ్గా అమలు చేసి చూపించాడు. బౌలింగ్‌లో పీయూష్ చావ్లా, బెహ్రెన్‌డార్ఫ్... బ్యాటింగ్‌లో రోహిత్, తిలక్ వర్మ కీలకపాత్ర పోషించడంతో మాజీ చాంపియన్‌కు రెండు ఓటముల తర్వాత తొలి విజయం దక్కింది. మరోవైపు అక్షర్ పటేల్, వార్నర్ ఆటతో పడుతూ లేస్తూ కాస్త గౌరవప్రదమైన స్కోరు చేసినా... సొంత మైదానంలో ఢిల్లీ క్యాపిటల్స్‌కు మరోసారి నిరాశ తప్పలేదు. వరుసగా నాలుగు పరాజయాలతో ఆ జట్టు పరిస్థితి ఇబ్బందికరంగా మారింది.


రోహిత్
చావ్లా

- సీజన్‌లో తొలి విజయం
- 6 వికెట్లతో ఓడిన ఢిల్లీ క్యాపిటల్స్
- రాణించిన రోహిత్, చావ్లా

న్యూఢిల్లీ: ఐదుసార్లు చాంపియన్ ముంబై ఇండియన్స్ ఐపీఎల్ తాజా సీజన్‌లో గెలుపు బోణీ చేసింది. మంగళవారం చివరి బంతి వరకు ఆసక్తికరంగా సాగిన మ్యాచ్‌లో ముంబై 6 వికెట్ల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌పై నెగ్గింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ 19.4 ఓవర్లలో 172 పరుగులకు ఆలౌటైంది. అక్షర్ పటేల్ (25 బంతుల్లో 54; 4 ఫోర్లు, 5 సిక్స్‌లు), డేవిడ్ వార్నర్ (47 బంతుల్లో 51; 6 ఫోర్లు) అర్ధ సెంచరీలు సాధించారు. స్పిన్నర్ పీయూష్ చావ్లా, పేసర్ బెహ్రెన్‌డార్ఫ్ చెరో 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం ముంబై 20 ఓవర్లలో 4 వికెట్లకు 173 పరుగులు సాధించి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రోహిత్ (45 బంతుల్లో 65; 6 ఫోర్లు, 4 సిక్స్‌లు), తిలక్ వర్మ (29 బంతుల్లో 41; 1 ఫోర్, 4 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు.

అక్షర్ మెరుపులు...

వరుసగా నాలుగో మ్యాచ్‌లోనూ ఢిల్లీ పేలవ బ్యాటింగ్ ప్రదర్శన కొనసాగింది. పృథ్వీ షా (15) ఈసారి రెండంకెల స్కోరు చేసినా పెద్దగా ప్రభావం చూపలేదు. మూడో స్థానంలో వచ్చిన మనీశ్ పాండే (18 బంతుల్లో 26; 5 ఫోర్లు) కాస్త ధాటిగా ఆడేందుకు ప్రయత్నించాడు. అయితే 22 పరుగుల వ్యవధిలో 4 వికెట్లు కోల్పోయి జట్టు కష్టాల్లో పడింది. సీనియర్ స్పిన్నర్ చావ్లా వరుసగా తన మూడు ఓవర్లలో ఒక్కో వికెట్ చొప్పున పాండే, రావ్‌మన్ పావెల్ (4), లలిత్ యాదవ్ (2)లను వెనక్కి పంపించాడు. ఈ దశలో వార్నర్, అక్షర్ కీలక ఇన్నింగ్స్ ఆడారు. 98/5 వద్ద బరిలోకి దిగిన అక్షర్ జోరుతో ఢిల్లీ కోలుకుంది. అయితే చివర్లో ఢిల్లీ పూర్తిగా కుప్పకూలింది. 18 ఓవర్లలో స్కోరు 165/5 కాగా... తర్వాతి 10 బంతుల్లో 5 వికెట్లు కోల్పోయిన టీమ్ మరో 7 పరుగులు మాత్రమే చేసింది! బెహ్రెన్‌డార్ఫ్ వేసిన 19వ ఓవర్లోనే ఒక రనౌట్ సహా మొత్తం 4 వికెట్లు పడ్డాయి.

రాణించిన తిలక్...

ఛేదనలో ముంబైకి ఎలాంటి ఇబ్బందీ ఎదురు కాలేదు. రోహిత్, ఇషాన్ కిషన్ (26 బంతుల్లో 31; 6 ఫోర్లు) ధాటికి ముంబై పవర్‌ప్లేలో 68 పరుగులకు చేసింది. సమన్వయలోపంతో ఇషాన్ రనౌట్ కాగా, మూడో స్థానంలో బరిలోకి దిగిన తిలక్ కూడా అదే జోరును కొనసాగించడంతో ముంబై వేగంగా గెలుపు దిశగా సాగింది. కుల్దీప్ బౌలింగ్‌లో 2 సిక్సర్లు కొట్టిన తిలక్... ముకేశ్ ఓవర్లో వరుసగా 4, 6, 6 బాదాడు. అయితే ఈ ఓవర్లోనే తిలక్‌తో పాటు సూర్యకుమార్ (0)ను కూడా ముకేశ్ అవుట్ చేశాడు. విజయానికి మరో 30 పరుగుల దూరంలో రోహిత్ వెనుదిరిగినా... కామెరాన్ గ్రీన్ (17 నాటౌట్), టిమ్ డేవిడ్ (13 నాటౌట్) కలిసి మ్యాచ్‌ను ముగించారు. నోర్జే వేసిన చివరి ఓవర్లో 5 పరుగులు అవసరం రాగా, తొలి ఐదు బంతుల్లో 3 పరుగులే వచ్చాయి. దాంతో కాస్త ఉత్కంఠ పెరిగింది. అయితే ఆఖరి బంతికి బ్యాటర్లు 2 పరుగులు రాబట్టగలగడంతో ముంబై ఊపిరి పీల్చుకుంది.

స్కోరు వివరాలు

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: వార్నర్ (సి) మెరిడిత్ (బి) బెహ్రెన్‌డార్ఫ్ 51; పృథ్వీ షా (సి) గ్రీన్ (బి) హృతిక్ షోకీన్ 15; మనీశ్ పాండే (సి) బెహ్రెన్‌డార్ఫ్ (బి) చావ్లా 26; యశ్ ధుల్ (సి) నేహల్ వధేరా (బి) మెరిడిత్ 2; పావెల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) చావ్లా 4; లలిత్ (బి) చావ్లా 2; అక్షర్ పటేల్ (సి) అర్షద్ ఖాన్ (బి) బెహ్రెన్‌డార్ఫ్ 54; అభిషేక్ (సి) గ్రీన్ (బి) బెహ్రెన్‌డార్ఫ్ 1; కుల్దీప్ (రనౌట్) 0; నోర్జే (బి) మెరిడిత్ 5; ముస్తఫిజుర్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (19.4 ఓవర్లలో ఆలౌట్) 172. వికెట్ల పతనం:** 1-33, 2-76, 3-81, 4-86, 5-98, 6-165, 7-166, 8-166, 9-166, 10-172. **బౌలింగ్:** బెహ్రెన్‌డార్ఫ్ 3-0-23-3, అర్షద్ ఖాన్ 1-0-12-0, గ్రీన్ 3-0-30-0, హృతిక్ షోకీన్ 4-0-43-1, మెరిడిత్ 3.4-0-34-2, పీయూష్ చావ్లా 4-0-22-3, తిలక్ వర్మ 1-0-7-0.

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (సి) అభిషేక్ (బి) ముస్తఫిజుర్ 65, ఇషాన్ కిషన్ (రనౌట్) 31; తిలక్ వర్మ (సి) మనీశ్ పాండే (బి) ముకేశ్ 41; సూర్యకుమార్ (సి) కుల్దీప్ (బి) ముకేశ్ 0; టిమ్ డేవిడ్ (నాటౌట్) 13, గ్రీన్ (నాటౌట్) 17, ఎక్స్‌ట్రాలు 6, **మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు) 173. వికెట్ల పతనం:** 1-71, 2-139, 3-139, 4-143. **బౌలింగ్:** ముకేశ్ 2-0-30-2, ముస్తఫిజుర్ 4-0-38-1, నోర్జే 4-0-35-0, లలిత్ 4-0-23-0, అక్షర్ 4-0-20-0, కుల్దీప్ 2-0-23-0.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
లక్నో	4	3	1	6	1.048
రాజస్తాన్	3	2	1	4	2.067
కోల్‌కతా	3	2	1	4	1.375
గుజరాత్	3	2	1	4	0.431
చెన్నై	3	2	1	4	0.356
పంజాబ్	3	2	1	4	-0.281
బెంగళూరు	3	1	2	2	-0.800
ముంబై	3	1	2	2	-0.879
హైదరాబాద్	3	1	2	2	-1.502
ఢిల్లీ	4	0	4	0	-1.576

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

చెన్నై × రాజస్తాన్ (రాత్రి గం. 7:30 నుంచి)

స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

ఉప్పల్ స్టేడియానికి మెరుగులు!

రూ. 117 కోట్లు కేటాయించనున్న బీసీసీఐ



న్యూఢిల్లీ: వచ్చే అక్టోబర్-నవంబర్‌లో వన్డే వరల్డ్‌కప్ నిర్వహణ కోసం సన్నద్ధమవుతున్న భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ప్రాథమిక ఏర్పాట్లపై దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా దేశంలో ఐదు స్టేడియాలను ఆధునీకరించి వసతులు మెరుగుపర్చాలని నిర్ణయించింది. ప్రపంచంలోనే అత్యంత ధనిక క్రికెట్ బోర్డు అయినా... ప్రేక్షకులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో బీసీసీఐ విఫలమైందంటూ ఇటీవల భారత్-ఆస్ట్రేలియా సిరీస్ టెస్టు సిరీస్ సందర్భంగా తీవ్ర విమర్శలు వచ్చాయి. దాంతో బీసీసీఐ స్టేడియాల్లో పలు మార్పులు చేసేందుకు సంకల్పించింది. ఈ జాబితాలో ఐదు స్టేడియాలు ఉన్నాయి. హైదరాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ స్టేడియంతోపాటు ఢిల్లీ, కోల్‌కతా, వాంఖెడే, మొహాలి మైదానాల ఆధునీకరణకు బోర్డు ప్రతిపాదిస్తూ నిధులు కేటాయించింది. ఉప్పల్ స్టేడియం కోసం రూ. 117 కోట్ల 17 లక్షలు ఖర్చును ప్రతిపాదించారు. వరల్డ్‌కప్ కోసం షార్ట్ లిస్ట్ చేసిన 12 స్టేడియాల్లో మొహాలి లేకపోయినా... అది బాగా పాతబడిపోవడంతో ఈ జాబితాలో చేర్చారు.

కోల్‌కతా, చెన్నైలలో...

మరోవైపు వన్డే ప్రపంచకప్‌లో పాకిస్తాన్ రెండు వేదికల్లోనే తమ అన్ని మ్యాచ్‌లు ఆడాలని భావిస్తోంది. తమ జట్టుకు కోల్‌కతా, చెన్నైలలోనే అన్ని మ్యాచ్‌లు కేటాయించాల్సిందిగా పాక్ క్రికెట్ బోర్డు (పీసీబీ) కోరనున్నట్లు సమాచారం. 2016 టి20 వరల్డ్‌కప్‌లో భారత్‌తో మ్యాచ్‌ను పాక్ కోల్‌కతాలోనే ఆడింది. చెన్నై కూడా తమకు అచ్చి వచ్చిన మైదానంగా ఆ జట్టు భావిస్తోంది. అన్నింటికి మించి ప్రస్తుతం ఇరు దేశాల మధ్య నెలకొని ఉన్న పరిస్థితుల నేపథ్యంలో ముంబై, ధర్మశాల తదితర వేదికల్లో ఆ జట్టు ఆడే అవకాశాలు కనిపించడం లేదు. పాక్ విజ్ఞప్తిపై ఐసీసీ ఎలా స్పందిస్తుందనేది చూడాలి.

భారత్‌ను గెలిపించిన అంకిత రైనా

తొలి మ్యాచ్‌లో 2-1తో థాయ్‌లాండ్‌పై విజయం



తాష్కెంట్ (ఉజ్బెకిస్తాన్): బిల్లీ జీన్ కింగ్ కప్ ఆసియా ఓసియానియా గ్రూప్-1 మహిళల టీమ్ టెన్నిస్ టోర్నీలో భారత్ శుభారంభం చేసింది. థాయ్‌లాండ్ జట్టుతో మంగళవారం జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌లో భారత్ 2-1తో విజయం సాధించింది. భారత నంబర్‌వన్ అంకిత రైనా తొలుత సింగిల్స్ మ్యాచ్‌లో, అనంతరం డబుల్స్ మ్యాచ్‌లో గెలుపొంది టీమిండియా విజయంలో కీలకపాత్ర పోషించింది. 'బెస్ట్ ఆఫ్ త్రీ' పద్ధతిలో జరిగిన ఈ పోటీలో తొలి సింగిల్స్‌లో రుతుజా భోస్లే 2-6, 1-6తో లుక్సికా కుమ్‌కుమ్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడిపోయింది. దాంతో భారత్ 0-1తో వెనుకబడింది. రెండో సింగిల్స్‌లో అంకిత 5-7, 6-1, 6-3తో పీంగ్‌టార్న్ ప్లిపుయెచ్‌పై గెలిచి స్కోరును 1-1తో సమం చేసింది. నిర్ణాయక డబుల్స్ మ్యాచ్‌లో అంకిత-రుతుజా జోడీ 4-6, 6-3, 6-2తో లుక్సికా కుమ్‌కుమ్-పీంగ్‌టార్న్ ప్లిపుయెచ్ జంటను ఓడించడంతో భారత్ 2-1తో విజయాన్ని ఖాయం చేసుకుంది.

జొకోవిచ్ శుభారంభం



మోంటెకార్లో (మొనాకో): ప్రపంచ నంబర్‌వన్ నొవాక్ జొకోవిచ్ మోంటెకార్లో ఓపెన్ మాస్టర్స్ సిరీస్ టోర్నీలో శుభారంభం చేశాడు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో 'బై' పొందిన ఈ సెర్బియా స్టార్ రెండో రౌండ్‌లో 7-6 (7/5), 6-2తో ఇవాన్ గఖోవ్ (రష్యా)పై గెలుపొందాడు. గంటా 47 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో జొకోవిచ్ ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేశాడు.

సినిమా


● వెంకటేశ్

యాక్షన్ సైంధవ్


వెంకటేశ్ కెరీర్‌లో 75వ చిత్రంగా రూపొందుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'సైంధవ్'. 'హిట్' ఫ్రాంచైజీ ఫేమ్ శైలేష్ కొలను దర్శకత్వంలో వెంకట్ బోయనపల్లి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో ఈ సినిమా తొలి షెడ్యూల్ చిత్రీకరణ మొదలైంది. ఈ షెడ్యూల్ విజయవంతంగా పూర్తయినట్లు, ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్‌తో పాటు వెంకటేశ్ పాల్గొనగా ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరించినట్లు చిత్ర యూనిట్ మంగళవారం వెల్లడించింది. ఓ పాట చిత్రీకరణ కోసం భారీ సెట్‌ను కూడా వేశారు. బాలీవుడ్ నటుడు నవాజుద్దీన్ సిద్ధిఖీ తెలుగుకి పరిచయం అవుతున్న ఈ చిత్రానికి సంగీతం: సంతోష్ నారాయణ్, కెమెరా: ఎస్. మణికందన్, సహనిర్మాత: కిషోర్ తాళ్లూరు.


● బాపినీడు, జీవీఎస్‌ఎన్ ప్రసాద్, 'దిల్' రాజు, సాయిధరమ్ తేజ్, అల్లు అరవింద్

ట్రైలర్‌లో విషయం కనిపిస్తోంది - 'దిల్' రాజు

''ఈ మధ్య ట్రైలర్‌ని బట్టి సినిమాలకు ఓపెనింగ్స్ వస్తున్నాయి. 'విరూపాక్ష' ట్రైలర్ చూస్తుంటే ఫుల్ ఓపెనింగ్స్ వస్తాయని వంద శాతం అనిపిస్తోంది. బైక్ ప్రమాదం నుంచి కోలుకున్న సాయిధరమ్ 'విరూపాక్ష'లో యాక్టింగ్ పరంగా చింపేశాడని అందరూ అంటుంటే వినటానికి సంతోషంగా ఉంది'' అని నిర్మాత అల్లు అరవింద్ అన్నారు. సాయిధరమ్ తేజ్, సంయుక్తా మీనన్ జంటగా కార్తీక్ దండు దర్శకత్వం వహించిన చిత్రం 'విరూపాక్ష'. బాపినీడు బి. సమర్పణలో శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్స్‌పై బీవీఎస్‌ఎన్ ప్రసాద్ నిర్మించారు. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో ఈ నెల 21న ఈ చిత్రం రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా అల్లు అరవింద్, 'దిల్' రాజు ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేశారు. అనంతరం 'దిల్' రాజు మాట్లాడుతూ- ''విరూపాక్ష' ట్రైలర్‌లో సినిమా కంటెంట్ (విషయం) కనిపిస్తోంది. ఈ మూవీ పెద్ద సక్సెస్ అవుతుంది'' అన్నారు. ''బాపినీడు ఆధ్వర్యంలో చేసిన ఈ సినిమా అందరికీ నచ్చుతుంది'' అన్నారు బీవీఎస్‌ఎన్ ప్రసాద్. సాయిధరమ్ తేజ్ మాట్లాడుతూ- ''ఎంతో ప్రేమించి, కష్టపడి చేసిన సినిమా 'విరూపాక్ష'. 'అమ్మా ఈ చిత్రం నీకోసం. ఐ లవ్ యు అమ్మా. నన్ను సపోర్ట్ చేయటానికి వచ్చిన నా తొలి సినిమా నిర్మాతలు 'దిల్' రాజు, అరవింద్‌గార్లకు థ్యాంక్స్'' అన్నారు. సినిమాటోగ్రాఫర్ శ్యామ్ దత్ పాల్గొన్నారు.

నిజమేనా?


● రజనీకాంత్

ఇటీవల తమిళ హీరో విజయ్‌తో 'వారిసు '(తెలుగులో 'వారసుడు') సినిమా నిర్మించారు 'దిల్' రాజు. తాజాగా సూపర్ స్టార్ రజనీకాంత్‌తో 'దిల్' రాజు ఓ సినిమాను పట్టాలెక్కించాలనే ప్రయత్నాల్లో ఉన్నారనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. పూర్తి స్క్రిప్ట్ పూర్తయ్యాక రజనీకాంత్‌ను కలిసి కథ వినిపించాలని 'దిల్' రాజు భావిస్తున్నారట. ఈ చిత్రానికి సంబంధించిన స్క్రిప్ట్ వర్క్ పనులను దర్శకుడు వంశీ పైడిపల్లికి 'దిల్' రాజు అప్పజెప్పారని, ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నది వంశీయే అనే టాక్ వినిపిస్తోంది. మరి.. రజనీకాంత్, 'దిల్' రాజు, వంశీ పైడిపల్లి కాంబినేషన్‌లోని సినిమా నిజమేనా? అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. మరోవైపు ప్రస్తుతం 'జైలర్' సినిమాలో నటిస్తున్నారు రజనీకాంత్. అలాగే 'లాల్ సలామ్'లో ఓ గెస్ట్ రోల్ చేస్తున్నారు. ఈ చిత్రాలు కాకుండా 'జై భీమ్' ఫేమ్ టీజే జ్ఞానవేల్ డైరెక్షన్‌లో రజనీ ఓ సినిమా కమిట్ అయిన సంగతి తెలిసిందే.

జీవితంలోనూ హీరోగా ఉండాలన్నారు - రాఘవా లారెన్స్


● 'ఠాగూర్' మధు, లారెన్స్, ప్రియా భవానీ

''స్క్రీన్‌పైనే కాదు.. నిజజీవితంలోనూ హీరోగా ఉండాలి అని మా అమ్మగారు చెబుతుంటారు. చదువు, వైద్యం విషయంలో ఎవరికైనా సాయం కావాలంటే లారెన్స్ చారిటబుల్ ట్రస్ట్‌ను సంప్రదించండి. సేవ చేయడానికి సిద్ధంగా ఉన్నాను. ఆ దేవుడే నా చేత సేవా కార్యక్రమాలు చేయిస్తున్నాడని భావిస్తున్నాను. సేవ చేయడానికి నన్నే ఎంచుకున్న ఆ రాఘవేంద్రస్వామికి ధన్యవాదాలు'' అన్నారు కొరియోగ్రాఫర్ దర్శక- నిర్మాత, నటుడు రాఘవా లారెన్స్. ఆయన టైటిల్ రోల్‌లో రూపొందిన చిత్రం 'రుద్రుడు'. ఇందులో ప్రియా భవానీ శంకర్ హీరోయిన్. స్వీయ దర్శకత్వంలో కదిరేశన్ నిర్మించిన ఈ చిత్రం తెలుగు, తమిళ భాషల్లో ఈ నెల 14న విడుదల కానుంది. పిక్సెల్ స్టూడియోస్ నిర్మాత 'ఠాగూర్' మధు 'రుద్రుడు' సినిమాను తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో రాఘవా లారెన్స్ మాట్లాడుతూ -''రుద్రుడు'లో మాస్, యాక్షన్, ఫ్యామిలీ, డ్యాన్స్ అన్నీ ఉన్నాయి. మదర్ సెంటిమెంట్ కూడా ఉంది. ఈ సినిమాను మధు గారు తెలుగులో రిలీజ్ చేస్తుండటం సంతోషంగా ఉంది. నా ప్రతి సినిమాలో మాస్, యాక్షన్ మిస్ కాకుండా కుటుంబపరమైన అంశాలు ఉండేలా చూసుకుంటాను'' అన్నారు.

ఆ సామెతకు విడుదల కరెక్ట్ - అల్లు అరవింద్


● వెట్రిమారన్, అల్లు అరవింద్, సూరి, భవానీ శ్రీ

''వెట్రిమారన్ సినిమాలంటే నాకు చాలా ఇష్టం. తను జాతీయ అవార్డు సినిమాలు తీసినా సింపుల్‌గా ఉంటాడు. ఆయన తీసిన 'విడుదల' చాలా గొప్ప సినిమా. తెలుగు ప్రేక్షకులు ఆదరించాలి'' అని నిర్మాత అల్లు అరవింద్ అన్నారు. హాస్య నటుడు సూరి లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'విడుదలై: పార్ట్1'. వెట్రిమారన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో విజయ్ సేతుపతి, భవానీ శ్రీ కీలక పాత్రలు చేశారు. ఎల్‌రెడ్ కుమార్ నిర్మించిన ఈ సినిమా మార్చి 31న తమిళంలో విడుదలై ఘనవిజయం సాధించింది. ఈ చిత్రాన్ని 'విడుదల: పార్ట్ 1' పేరుతో గీతా ఫిల్మ్ డిస్ట్రిబ్యూషన్స్‌పై అల్లు అరవింద్ ఈ నెల 15న తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో అల్లు అరవింద్ మాట్లాడుతూ- ''లోకల్ ఈజ్ గ్లోబల్' అంటూ ఇండస్ట్రీలో ఈ మధ్య కొత్త సామెత వచ్చింది.. దానికి కరెక్టుగా సరిపోయే సినిమానే 'విడుదల'' అన్నారు. వెట్రిమారన్ మాట్లాడుతూ- ''విడుదల' రెగ్యులర్ కమర్షియల్ మూవీ కాదు. తెలుగు ప్రేక్షకులు కూడా ఈ చిత్రానికి కనెక్ట్ అవుతారు. లాక్‌డౌన్ అనంతరం ఎన్టీఆర్‌ని కలిసి ఓ మూవీపై చర్చించాను. ఆయనతో ఓ స్ట్రయిట్ తెలుగు సినిమా ఉంటుంది. అందుకు సమయం పడుతుంది'' అన్నారు.


● నయనతార

మాస్ స్టెప్పులు

'జవాన్'తో అదిరిపోయే మాస్ స్టెప్పులేస్తున్నారు నయనతార. షారుక్ ఖాన్ హీరోగా అట్లీ దర్శకత్వంలో రూపొందుతున్న హిందీ సినిమా 'జవాన్'. ఇందులో నయనతార హీరోయిన్‌గా నటిస్తుండగా, కీలక పాత్రలో ప్రియమణి, ప్రత్యేక పాత్రలో దీపికా పదుకోన్ నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ ముంబైలో జరుగుతోంది. షారుక్, నయనతారలపై ఓ పెప్పీ మాస్ సాంగ్‌ను చిత్రీకరిస్తున్నారు. ఫరా ఖాన్ కొరియోగ్రఫీ చేస్తున్నారు. ఈ పాట చిత్రీకరణ పూర్తయిన తర్వాత షారుక్, దీపికలపై మరో సాంగ్ చిత్రీకరణ జరుగుతుందని, ఆ తర్వాత జరిగే ఓ చిన్న ప్యాచ్ వర్క్‌తో 'జవాన్' షూటింగ్ మొత్తం పూర్తవుతుందని బాలీవుడ్ సమాచారం. ఈ చిత్రం జూన్ 2న విడుదల కానుంది.

అంబాజీపేట బ్యాండు


● సుహాస్

'కలర్ ఫోటో', రైటర్ పద్మభూషణ్' వంటి హిట్ చిత్రాల ఫేమ్ సుహాస్ హీరోగా నటించిన తాజా చిత్రం 'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండు'. ఈ చిత్రంతో దుశ్యంత్ కటికనేని దర్శకునిగా పరిచయమవుతున్నారు. 'బన్నీ' వాసు, వెంకటేశ్ మహా సమర్పణలో జీఏ2 పిక్చర్స్, స్వేచ్ఛ క్రియేషన్స్‌పై ధీరజ్ మొగిలినేని నిర్మించారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ''అంబాజీపేట మ్యారేజ్ బ్యాండు' చిత్రంలో మ్యారేజ్ బ్యాండ్‌లో పని చేసే మల్లి అనే కుర్రాడిగా సుహాస్ నటించారు. త్వరలో మా సినిమా విడుదల తేదీని ప్రకటిస్తాం'' అని చిత్రబృందం పేర్కొంది.

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్


● నదియా, హరీష్ కల్యాణ్, ఇవానా

ప్రముఖ భారత క్రికెటర్ ఎంఎస్ ధోని, ఆయన సతీమణి సాక్షి ధోని నిర్మాణ సంస్థ ధోని ఎంటర్‌టైన్‌మెంట్‌పై ప్రారంభమైన తొలి చిత్రం 'ఎల్‌జీఎం'. హరీష్ కల్యాణ్, నదియా, ఇవానా టైటిల్ రోల్స్ పోషిస్తున్నారు. రమేష్ తమిళ్ మణి దర్శకత్వంలో వికాస్ హసిజా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ని ధోని సోషల్ మీడియా ద్వారా విడుదల చేశారు. వికాస్ హసిజా మాట్లాడుతూ- ''ఫీల్ గుడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రం 'ఎల్‌జీఎం'. చివరి షెడ్యూల్ చిత్రీకరణ జరుగుతోంది. త్వరలో పోస్ట్ ప్రొడక్షన్ పనులు ప్రారంభిస్తాం'' అన్నారు. ''ఎల్‌జీఎం'లో ఆశ్చర్యానికి గురి చేసే అంశాలు చాలా ఉంటాయి. ఫ్రెష్ కాన్సెప్ట్‌తో ఈ సినిమా రాబోతోంది'' అన్నారు క్రియేటివ్ ప్రొడ్యూసర్ ప్రియాంషు చోప్రా.

మా టైమింగ్ అదిరిపోయింది - సప్తగిరి


● వీజే సన్నీ, సప్తగిరి

'బిగ్ బాస్' ఫేమ్ వీజే సన్నీ, సప్తగిరి, నక్షత్ర, అక్సాఖాన్ హీరో హీరోయిన్లుగా డైమండ్ రత్నబాబు దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'అన్‌స్టాపబుల్'. రజిత్ రావు నిర్మిస్తున్న ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రంలోని 'బేబీ బేబీ' సాంగ్‌ను విడుదల చేశారు. భీమ్స్ సిసిరోలియో స్వరకల్పనలో కాసర్ల శ్యామ్ లిరిక్స్ అందించిన ఈ పాటను ఇంద్రావతి చౌహాన్ పాడారు. ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో వీజే సన్నీ మాట్లాడుతూ- ''ఈ సినిమాలోని ప్రతి సీన్ ఎంజాయ్ చేసేలా ఉంటుంది'' అన్నారు. ''సినిమాలో నా, వీజే సన్నీ టైమింగ్ అదిరిపోతుంది'' అన్నారు సప్తగిరి. ''రిలీజ్ తర్వాత చిన్న సినిమాల పరిస్థితి ఎలా ఉంటుందో తెలియదు. అందుకే చిన్న సినిమాలు తీస్తున్న ప్రతి నిర్మాత నాకు ఓ హీరోయే. ఈ సినిమా తర్వాత నన్ను 'అన్‌స్టాపబుల్' డైరెక్టర్ డైమండ్ రత్నబాబు అని పిలుస్తారని ఆశిస్తున్నాను'' అన్నారు డైమండ్ రత్నబాబు. ''మంచి సినిమాలు తీయాలని ఇండస్ట్రీకి వచ్చాను. 'అన్‌స్టాపబుల్' చిన్న సినిమా కాదు. అన్నీ ఉన్న సినిమా'' అన్నారు రజిత్ రావు.

సాక్షి
బిజినెస్
బుధవారం
12-4-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	311	60,152
నిఫ్టీ ▲	98	17,722

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	12,064	▽	20
డోజోన్స్	33,729	▲	142
ఎఫ్‌టీఎస్ఈ 100	7,786	▲	44
డాక్స్	15,655	▲	57
షాంఘై	3,314	▽	1
నికాయ్	27,923	▲	290

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారట్)	60,390	▲	35
బంగారం (22 క్యారట్)	60,148	▲	33
వెండి (కిలో)	74,416	▽	140

యాపిల్ స్టోర్లను ప్రారంభించనున్న టిమ్ కుక్!



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: టెక్నాలజీ దిగ్గజం యాపిల్ ఈ నెల 18న అధికారిక విక్రయ శాలను ముంబైలో ప్రారంభిస్తోంది. ఢిల్లీలో ఏర్పాటు చేసిన ఔట్‌లెట్ ఈ నెల 20న తెరుచుకోనుంది. ఈ రెండు కేంద్రాల ప్రారంభోత్సవానికి సంస్థ సీఈవో టిమ్ కుక్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని సమాచారం. ప్రధాని నరేంద్ర మోదీని కలిసే అవకాశమూ ఉంది. టిమ్ కుక్ 2016లో తొలిసారిగా భారత్‌లో పర్యటించారు. కంపెనీ భారత్‌లో 2020లో ఆన్‌లైన్ స్టోర్‌ను అందుబాటులోకి తెచ్చింది. ప్రస్తుతం రిటైల్‌లో ఎక్స్‌క్లూజివ్ యాపిల్ ప్రీమియం రీసెల్లర్ స్టోర్స్ (ఏపీఆర్), రిలయన్స్ డిజిటల్, క్రోమా వంటి భారీ చైన్స్, మల్టీ బ్రాండ్ రిటైల్ కేంద్రాలతోపాటు ఈ-కామర్స్ వేదికల ద్వారా యాపిల్ తన ఉత్పత్తులను విక్రయిస్తోంది. దేశవ్యాప్తంగా 100కుపైగా ఏపీఆర్ ఔట్‌లెట్లు ఉన్నాయి. భారత స్మార్ట్‌ఫోన్ విపణిలో 2022లో కంపెనీ 17 శాతం వృద్ధితో 4 శాతం వాటాను చేజిక్కించుకుంది. రూ.49,200 కోట్ల విలువైన అమ్మకాలను సాధించింది. దేశంలో ప్రీమియం స్మార్ట్‌ఫోన్ల విభాగం రెండంకెల వృద్ధి నమోదు చేస్తోంది. చైనా వెలుపల భారత్ సహా ఇతర దేశాల్లో ఉత్పత్తిని పెంచడానికి యాపిల్ స్థిర ప్రయత్నాలు చేసింది. యాపిల్ ప్రొడక్టులను సరఫరా చేస్తున్న ఫాక్స్‌కాన్, పెగట్రాన్, విస్ట్రన్ కంపెనీలు ఐఫోన్ల తయారీని భారత్‌లో అధికం చేశాయి. భారత ప్రభుత్వం స్థానికంగా తయారీని ప్రోత్సహించడం, ఆర్థిక ప్రోత్సాహకాలు అందించడం, చౌకగా కార్మికుల లభ్యత ఇందుకు దోహదం చేశాయి.

జీ20తో డిజిటల్ కృషిని ప్రపంచానికి చాటి చెప్తాం

జీ20 షెర్పా అమితాబ్ కాంత్



న్యూఢిల్లీ: డిజిటల్ పరివర్తనలో భారత్ చేస్తున్న కృషిని జీ20 కార్యక్రమాల ద్వారా ప్రపంచానికి చాటి చెప్పనున్నట్లు నీతి ఆయోగ్ మాజీ సీఈవో, జీ20 షెర్పా అమితాబ్ కాంత్ తెలిపారు. తద్వారా గ్లోబల్ సౌత్ (లాటిన్ అమెరికా, ఆసియా, ఆఫ్రికా, ఓషియానియా దేశాలు) ప్రజల జీవితాల్లో మార్పు తెచ్చేందుకు తోడ్పాటు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఆలిండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ఏఐఎంఏ) 8వ జాతీయ నాయకత్వ సదస్సులో పాల్గొన్న సందర్భంగా కాంత్ ఈ విషయాలు తెలిపారు. అంతర్జాతీయంగా 400 కోట్ల మందికి డిజిటల్ గుర్తింపు లేదని, 250 కోట్ల మంది కనీసం బ్యాంకు ఖాతా కూడా లేదని కాంత్ చెప్పారు. 133 దేశాల్లో వేగవంతమైన డిజిటల్ చెల్లింపుల విధానాలు లేవని పేర్కొన్నారు. అలాంటిది, డిజిటైజేషన్ ద్వారా భారత్ ప్రజల జీవితాల్లో మార్పులు తీసుకొచ్చిందని, ఉత్పాదకత పెంచుకుని సమర్థమంతమైన ఆర్థిక వ్యవస్థగా ముందుకెడుతోందని కాంత్ చెప్పారు. డిజిటైజేషన్ డిజిటల్ చెల్లింపులు తదితర విభాగాల్లో భారత్ సాధిస్తున్న పురోగతిని వివరించారు. 'భారత్ పాటిస్తున్న ఈ మోడల్‌ను మిగతా ప్రపంచం ముందుకు ఎలా తీసుకెళ్లాలన్నది ఒక సవాలు. భారత డిజిటల్ పరివర్తన గాథను ప్రపంచానికి పరిచయం చేసేందుకు జీ20 వేదికను ఉపయోగించుకుందాం. ఆ విధంగా గ్లోబల్ సౌత్ దేశాల పౌరుల జీవితాల్లో మార్పు తెచ్చేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకుందాం' అని కాంత్ పేర్కొన్నారు.

ప్రపంచీకరణలో మరింత పారదర్శకత అవసరం

- ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్
- భారత్‌లో పెట్టుబడులకు అమెరికన్ వ్యాపారవేత్తలకు ఆహ్వానం



యూఎస్ ఆర్థిక మంత్రి జానెట్ ఎలెన్‌తో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్

వాషింగ్టన్: గ్లోబలైజేషన్ ప్రయోజనాలను తక్కువ చేసి చూపాలని భారత్ కోరుకోవడం లేదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. అయితే దానిని మరింత పారదర్శకంగా మార్చాలని కోరుతోందని పేర్కొన్నారు. ప్రముఖ అమెరికన్ పీటర్సన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఇంటర్నేషనల్ ఎకనామిక్స్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆమె ఈ మేరకు తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) మరింత ప్రగతిశీలంగా ఉండాలని, ఇతర దేశాల అభిప్రాయాలనూ పరిగణనలోకి తీసుకోవాలని భారత్ కోరుతోందన్నారు. ''వినడానికి మాత్రమే కాకుండా చెప్పడానికి భిన్నమైన దేశాలకు డబ్ల్యూటీఓ మరింత వెసులుబాటు ఇవ్వాల్సిన అవసరం ఉందని'' ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

పరస్పర ప్రయోజనాలు లక్ష్యంగా..

భారత్ చాలా కాలంలో తన తయారీ రంగం వృద్ధి చెందేలా ప్రయత్నాలు చేస్తోందన్నారు. తను ఉత్పత్తి చేయగల వినియోగ వస్తువులను కూడా దిగుమతి చేసుకోవడం లేదని తెలిపారు. అయితే ధర వ్యత్యాసాలు, పోటీతత్వం వంటి అంశాలు అంతర్జాతీయంగా కొనుగోలు నిర్ణయాలపై ప్రభావం చూపుతున్నాయన్నారు. ఇలాంటి సమస్యల విషయంలో ఆయా దేశాల మధ్య పరస్పర ప్రయోజనకర అవగాహనలు అవసరమని అన్నారు.

పెట్టుబడులకు గమ్యస్థానం

ఇక అంతర్జాతీయ పెట్టుబడులకు భారత్ తగిన ప్రాంతమని ఆమె ఉద్ఘాటించారు. నైపుణ్యం, డిజిటలైజేషన్‌పై భారత్ ప్రధానంగా దృష్టి కేంద్రీకరించినట్లు సీతారామన్ స్పష్టం చేశారు.

క్రిప్టో 'జీ 20' ఉమ్మడి ఫ్రేమ్‌వర్క్!

క్రిప్టో రిస్క్‌లను ఎదుర్కోవడానికి ఉమ్మడి ఫ్రేమ్‌వర్క్‌ను అభివృద్ధి చేయడమే ఇండియా జీ20 ప్రెసిడెన్సీ లక్ష్యమని కూడా ఆర్థికమంత్రి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఇటీవలి పరిణామాల నేపథ్యంలో క్రిప్టోకరెన్సీలతో సంబంధం ఉన్న నష్టాలను ఎదుర్కోవడానికి అన్ని దేశాలకు ఉమ్మడి ఫ్రేమ్‌వర్క్ అవసరమన్నారు.

భారత్ పారదర్శక ఎకానమీ

భారత్‌లో పెట్టుబడులు పెట్టాలని ఆమె అమెరికన్ వ్యాపారవేత్తలను అభ్యర్థించారు. తద్వారా పారదర్శక ఎకానమీ నుంచి లభించే ప్రయోజనాలు పొందాలని అమెరికా ఇండియా బిజినెస్ కౌన్సిల్ నిర్వహించిన ఒక రౌండ్ టేబుల్ సమావేశంలో సూచించారు. ప్రస్తుత భారత్ ప్రభుత్వం దేశ వృద్ధికి సంబంధించి అంతర్జాతీయ పరిశ్రమ భాగస్వామ్యం కోసం తగిన వ్యూహ రచన చేస్తున్నట్లు వివరించారు. మహమ్మారి వంటి సవాళ్ల సమయంలోనూ దేశాభివృద్ధే లక్ష్యంగా సంస్కరణల బాటన నడిచిందన్నారు.

ఆడి క్యూ3 మోడళ్ల ధర పెంపు



న్యూఢిల్లీ: లగ్జరీ కార్ల తయారీలో ఉన్న జర్మనీ సంస్థ ఆడి క్యూ3, క్యూ3 స్పోర్ట్‌బ్యాక్ మోడళ్ల ధరను 1.6 శాతం వరకు పెంచుతోంది. మే 1 నుంచి సవరించిన ధరలు అమలులోకి వస్తాయని కంపెనీ మంగళవారం ప్రకటించింది. దిగుమతి సుంకం, తయారీ ఖర్చుల పెరుగుదల ప్రభావాన్ని భర్తీ చేయడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించింది. కంపెనీ ఇప్పటికే ఏప్రిల్ 1 నుంచి క్యూ8 సెలబ్రేషన్, ఆర్ఎస్5, ఎస్5 మోడళ్ల ధరను 2.4 శాతం వరకు అధికం చేసింది. వివిధ స్థాయిలలో వ్యయ భారాన్ని గ్రహించడానికి ప్రయత్నించినప్పటికీ ప్రస్తుత పరిస్థితుల్లో ధరల పెరుగుదల తప్పనిసరి అయిందని ఆడి ఇండియా హెడ్ బల్బీర్ సింగ్ థిల్లాన్ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

12-4-2023	
విశాఖ	420-00
చిత్తూరు	428-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	385-00
విజయవాడ	385-00
రిటైల్ ధర (డజను)	66.00
11-4-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	360-00
వరంగల్	362-00
రిటైల్ ధర	4.20

ఏడో రోజూ ఆగని దూకుడు

- బ్యాంకింగ్, ఫైనాన్స్, ఐటీ షేర్లకు డిమాండ్
- నెలరోజుల గరిష్టానికి సూచీలు
- 60 వేల పైకి సెన్సెక్స్
- 17,700 ఎగువకు నిఫ్టీ



ముంబై: దలాల్ స్ట్రీట్‌లో ఏడోరోజూ బుల్ దూకుడు కొనసాగింది. నాలుగో క్వార్టర్ కార్పొరేట్ ఆర్థిక ఫలితాలు మెరుగ్గా నమోదు కావచ్చనే విశ్వాసం, విదేశీ పెట్టుబడులు వెల్లువలా కొనసాగడం సెంటిమెంట్‌ను బలపరిచాయి. అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న సానుకూల సంకేతాలు కలిసొచ్చాయి. ఈ పరిణామాలతో మంగళవారం సెన్సెక్స్, నిఫ్టీలు నెలరోజుల గరిష్టం వద్ద ముగిశాయి. గడిచిన నాలుగు నెలలో సూచీలు వరుసగా ఏడు రోజుల ర్యాలీ చేయడం ఇదే తొలిసారి. మెటల్, బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించగా.., ఐటీ, రియల్టీ, వినిమయ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. విస్తృత స్థాయి మార్కెట్లోనూ చిన్న, మధ్య తరహా షేర్లను కొనేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపారు. దీంతో బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 0.62%, 0.50శాతం చొప్పున పెరిగాయి. మొత్తం రూ. 343 కోట్ల షేర్లను కొని విదేశీ ఇన్వెస్టర్లు ఎనిమిదో రోజూ నికర కొనుగోలుదారులుగా నిలిచారు. దేశీయ ఇన్వెస్టర్లు రూ.264 కోట్ల షేర్లు కొన్నారు. డాలర్ మారకంలో రూపాయి విలువ పదమూడు పైసలు స్వల్పంగా బలహీనపడి 82.12 వద్ద స్థిరపడింది. కేంద్ర బ్యాంకులు వడ్డీరేట్ల పెంపు సైకిల్‌ను ఆపేయొచ్చనే అంచనాలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో ట్రేడయ్యాయి. ఆసియాలో చైనా మినహా అన్ని మార్కెట్లు ఒకటిన్నర శాతం పెరిగాయి. యూరప్ మార్కెట్లు ఒకశాతం ర్యాలీ చేశాయి.

లాభ, నష్టాల మధ్య ట్రేడింగ్...

ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం స్వల్ప లాభాలతో మొదలయ్యాయి. సెన్సెక్స్ 183 పాయింట్ల లాభంతో 60వేల స్థాయిపైన 60,029 వద్ద మొదలైంది. నిఫ్టీ 17వేల స్థాయిపైన 17,705 వద్ద ప్రారంభమైంది. వరుస అయిదు రోజుల ర్యాలీ నేపథ్యంలో గరిష్టాల వద్ద లాభాల స్వీకరణతో మిడ్‌సెషన్ కల్లా సూచీలు ఆరంభ లాభాల్ని కోల్పోయాయి. అయితే మిడ్‌సెషన్‌లో యూరప్ మార్కెట్ల సానుకూల ప్రారంభం ఇన్వెస్టర్లకు ఉత్సాహాన్నిచ్చింది. ఫైనాన్స్, బ్యాంకింగ్, మెటల్ షేర్లకు డిమాండ్ నెలకొనడంతో సూచీలు జోరు చివరి దాకా కొనసాగింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 60,268 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 311 పాయింట్ల లాభంతో 60,152 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 17,749 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని చేరింది. ఆఖరికి 98 పాయింట్లు బలపడి 17,722 వద్ద నిలిచింది.

ఏడురోజులు @ రూ.12.56 లక్షల కోట్లు

గడచిన ఏడు రోజుల్లో సెన్సెక్స్ 2,544(4.42%) ర్యాలీ చేయడంతో బీఎస్ఈలో మొత్తం రూ. 12.56 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. ఫలితంగా ఎక్స్ఛేంజీలో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ కంపెనీల మొత్తం విలువ రూ.265 కోట్లకు చేరింది. ఆసియా, యూరప్ మార్కెట్లలోని సానుకూలతలు సెన్సెక్స్ సూచీని 60వేల స్థాయిపైకి చేరేందుకు తోడ్పడ్డాయి. ఆర్‌బీఐ వడ్డీరేట్లలో ఎలాంటి మార్పు చేయకపోవడం, జీఎస్‌టీ వసూళ్లు గణనీయంగా పెరగడం, స్థూల ఆర్థిక గణాంకాలు మెప్పించడం తదితర అంశాలు సూచీల వరుసగా ర్యాలీకి అండగా నిలిచాయి'' అని కోటక్ సెక్యూరిటీస్ ఈక్విటీ రీసెర్చ్ హెడ్ శ్రీకాంత్ చౌహాన్ తెలిపారు.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- నాలుగో త్రైమాసిక ఆర్థిక ఫలితాల వెల్లడి(బుధవారం)కి ముందు టీసీఎస్ షేరు అమ్మకాల ఒత్తిడికి లోనైంది. బీఎస్ఈలో ఒకటిన్నర శాతం నష్టపోయి రూ.3214 వద్ద ముగిసింది.
- అడ్వాన్సులు 19% వృద్ధితో బ్యాంక్ ఆఫ్ బరోడా షేరు 3% బలపడి రూ.170.85 వద్ద స్థిరపడింది
- భారత్‌లో లిథియం అయాన్ బ్యాటరీల తయారీకి జపాన్‌కు చెందిన దిగ్గజ సంస్థ ఎయూ ఐయానిక్ సెల్యూషన్స్‌తో డీల్ కుదరడంతో నియోజెన్ కెమికల్స్ 15% బలపడి రూ.1619 వద్ద ముగిసింది.

ఏపీలో టెక్నో పెయింట్స్ ప్లాంట్లు



ఆకూరి శ్రీనివాస్ రెడ్డి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: పెయింట్స్ తయారీలో ఉన్న టెక్నో పెయింట్స్ రూ.46 కోట్లతో కొత్తగా మూడు ప్లాంట్లను ఈ ఏడాదే నెలకొల్పుతోంది. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, చిత్తూరుతోపాటు మధ్యప్రదేశ్‌లోని కట్నీ వద్ద ఇవి రానున్నాయి. ఈ కేంద్రాల్లో డ్రై సిమెంట్ పుట్టీ, టెక్చర్స్, ప్రైమర్స్, ఎమల్షన్స్ తయారు చేస్తారు. తొలి దశలో ఒక్కొక్క ప్లాంటు వార్షిక సామర్థ్యం 30,000 మెట్రిక్ టన్నులని టెక్నో పెయింట్స్‌ను ప్రమోట్ చేస్తున్న ఫార్చూన్ గ్రూప్ ఫౌండర్ ఆకూరి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. 'తెలంగాణ ప్రభుత్వం నుంచి మన ఊరు-మన బడి, మన బస్తీ-మన బడి కార్యక్రమంలో భాగంగా 26,065 పాఠశాలలకు రంగులు వేసే ప్రతిష్టాత్మక ప్రాజెక్టును చేపట్టాం. 2023లో దేశవ్యాప్తంగా రిటైల్‌లో విస్తరిస్తాం. విక్రయ కేంద్రాల్లో కలర్ బ్యాంక్స్ పరిచయం చేస్తాం. వీటితో వినియోగదారు కోరుకున్న రంగును వెంటనే అందించవచ్చు. 2022-23లో 100 శాతం వృద్ధి సాధించాం' అని వివరించారు.

భవిత

తెలంగాణ పదో తరగతికి సంబంధించిన స్టడీ మెటీరియల్, సిలబస్, మోడల్‌పేపర్స్, ప్రీవియస్ పేపర్స్, టెక్ట్స్‌బుక్స్, గైడెన్స్ మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు.

ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్ పాయింట్ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

జీజీహెచ్ గుంటూరులో వివిధ ఉద్యోగాలు

గుంటూరులోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్.. ఆల్కహాల్ అండ్ డ్రగ్ డి-అడిక్షన్ సెంటర్‌లో ఒప్పంద ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.» **మొత్తం పోస్టుల సంఖ్య:** 4

» **పోస్టుల వివరాలు:** మెడికల్ ఆఫీసర్ (సైకియాట్రిస్ట్/ఎంబీబీఎస్ డాక్టర్)-01, కౌన్సిలర్-02,అకౌంటెంట్ కమ్ క్లర్క్-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి ఎంబీబీఎస్, డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి. **వయసు:** 42 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** విద్యార్హతలో సాధించిన మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును రిజిస్టర్ పోస్టు లేదా వ్యక్తిగతంగా సూపరింటెండెంట్ కార్యాలయం, గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్, గుంటూరు చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 15.04.2023.
» **వెబ్‌సైట్:** www.guntur.ap.gov.in

మేడ్చల్ జిల్లా డీహెచ్‌ఈడబ్ల్యూలో వివిధ పోస్టులు

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా మహిళ, శిశు, దివ్యాంగ, వయోవృద్ధుల సంక్షేమ శాఖ.. ఒప్పంద ప్రాతిపదికన డిస్ట్రిక్ట్ హబ్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్ (డీహెచ్‌ఈడబ్ల్యూ) డొమెస్టిక్ వయోలెన్స్ సెల్(మేడ్చల్)లో వివిధ ఉద్యోగాల భర్తీకి మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 05
» **పోస్టుల వివరాలు:** ఎక్స్‌పర్ట్(ఫైనాన్షియల్ లిటరసీ)-01, అకౌంట్స్ అసిస్టెంట్-01, ఎంటీఎస్-01, డిస్ట్రిక్ట్ మిషన్ కోఆర్డినేటర్-01, జెండర్ స్పెషలిస్ట్-01.
» **అర్హత:**పదో తరగతి,సంబంధిత విభాగంలో డిగ్రీ, డిప్లొమా ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 21నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం, డబ్ల్యూసీడీ అండ్ ఎస్సీ, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, కలెక్టరేట్ కాంప్లెక్స్, రూమ్ నెం.జీ1, అంతాయిపల్లి గ్రామం, శామీర్‌పేట్ మండలం, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 20.04.2023.
» **వెబ్‌సైట్:** www.wdcw.tg.nic.in

డీఎంహెచ్‌వో, ఖమ్మం జిల్లాలో సపోర్ట్ ఇంజనీర్ పోస్టులు

ఖమ్మం జిల్లా వైద్యారోగ్య అధికారి కార్యాలయం .. ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన సపోర్ట్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 05
» **అర్హత:** బీఈ, బీటెక్(సీఎస్ఈ,ఐటీ,ఈసీఈ)లేదా ఎంసీఏతోపాటు నాలుగేళ్ల పని అనుభవం ఉండాలి. **వయసు:**18నుంచి 44ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.35,000 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** విద్యార్హతలో సాధించిన మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ఖమ్మంలోని జిల్లా వైద్యారోగ్య అధికారి కార్యాలయం చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 15.04.2023.
» **వెబ్‌సైట్:**www.khammam.telangana.gov.in

సంగారెడ్డి జిల్లా ఈఎస్ఐలో 16 పోస్టులు

హైదరాబాద్‌లోని ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్..ఒప్పంద ప్రాతిపదికన సంగారెడ్డి జిల్లాలోని ఈఎస్ఐ హాస్పిటల్/ఈఎస్ఐ డిస్పెన్సరీల్లో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 16
» **పోస్టుల వివరాలు:** సివిల్ అసిస్టెంట్ సర్జన్-08, డెంటల్ అసిస్టెంట్ సర్జన్-01, ఫార్మాసిస్ట్-07.
» **అర్హత:** ఎంబీబీఎస్, బీడీఎస్, డీఫార్మసీ.
» **వేతనం:** నెలకు సీఏఎస్/డీఏఎస్ రూ.58,850, ఫార్మాసిస్ట్ పోస్టులకు రూ.31,040.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జాయింట్ డైరెక్టర్ (మెడికల్), ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్, హైదరాబాద్, ఐదో అంతస్తు, హాస్టల్‌బిల్డింగ్, ఈఎస్ఐ హాస్పిటల్, సనత్ నగర్, నాచారం, హైదరాబాద్ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 13.04.2023
» **వెబ్‌సైట్:** https://sangareddy.telangana.gov.in

విజయనగరం జిల్లా కోఆపరేటివ్ బ్యాంక్‌లో 20 అసిస్టెంట్ మేనేజర్ పోస్టులు

విజయనగరం జిల్లా కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ లిమిటెడ్(డీసీసీబీ).. అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 20
» **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి 65శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ లేదా 55 శాతం మార్కులతో బీకాం ఉత్తీర్ణులై ఉండాలి. పీజీ(ఎకనామిక్స్, స్టాటిస్టిక్స్), కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుంది. ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తుకు అర్హులు.
» **వయసు:** 01.01.2023 నాటికి 18 నుంచి 20 ఏళ్ల మధ్య ఉండాలి. » **వేతనం:** నెలకు రూ.26,080 నుంచి రూ.57,860 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తు, రిజిస్ట్రేషన్‌కు చివరితేది:** 15.04.2023.
» **వెబ్‌సైట్:**www.dccbvizianagaram.com

ఎంపీసీతో.. కొలువులు ఇవిగో!

ఇంటర్మీడియెట్ ఎంపీసీ ఉత్తీర్ణులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు అనేకం అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) నిర్వహించే సీహెచ్ఎస్ఎల్, రైల్వేలో గ్రూప్ సీ ఉద్యోగాలు, యూపీఎస్సీ ఎన్‌డీఏ ద్వారా త్రివిధ దళాల్లో ఆఫీసర్ కొలువులు, ఆర్మీలో టెక్నికల్ ఎంట్రీ స్కీమ్, కోస్ట్ గార్డులో జాబ్స్, రాష్ట్రాల స్థాయిలో పోలీస్ కానిస్టేబుల్ తదితర కొలువులు సొంతం చేసుకోవచ్చు. ఇటీవల ఇంటర్ పరీక్షలు రాసిన విద్యార్థుల కోసం ఎంపీసీతో ఉద్యోగాల వివరాలు..



ఎస్ఎస్‌సీ.. సీహెచ్ఎస్ఎల్

- ఇంటర్మీడియెట్ అర్హతతో స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నిర్వహించే కంబైన్డ్ హయ్యర్ సెకండరీ లెవల్(సీహెచ్ఎస్ఎల్) ఎగ్జామ్‌కు పోటీపడొచ్చు. దీనిద్వారా కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పలు శాఖల్లో ఎల్‌డీసీ, జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్, పోస్టల్ అసిస్టెంట్, సార్టింగ్ అసిస్టెంట్, డేటాఎంట్రీ ఆపరేటర్ వంటి పలు ఉద్యోగాలకు నియామకాలు చేపడతారు. టైర్-1, టైర్-2 పేరుతో రెండు దశల్లో పరీక్ష ఉంటుంది.
- టైర్-1 దశలో..200 మార్కులకు నిర్వహించే పరీక్షలో..ఇంగ్లిష్ లాంగ్వేజ్, జనరల్ ఇంటెలిజెన్స్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, జనరల్ అవేర్‌నెస్‌ల్లో ఒక్కో విభాగం నుంచి 25 ప్రశ్నలు చొప్పున మొత్తం వంద ప్రశ్నలు ఉంటాయి.
- టైర్-1లో మెరిట్ జాబితాలో నిలిచిన వారికి టైర్-2 పరీక్ష నిర్వహిస్తారు. ఈ పరీక్షను రెండు సెషన్‌లు, మూడు సెక్షన్లు, ప్రతి సెక్షన్‌లో రెండు మాడ్యూల్స్ విధానంలో నిర్వహిస్తారు. సెషన్-1లో సెక్షన్-1లో మ్యాథమెటికల్ ఎబిలిటీస్ (30 ప్రశ్నలు-90 మార్కులు), రీజనింగ్ అండ్ జనరల్ ఇంటెలిజెన్స్(30 ప్రశ్నలు-90 మార్కులు), సెక్షన్-2లో ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రహెన్షన్(40 ప్రశ్నలు-120 మార్కులు), జనరల్ అవేర్ నెస్(20 ప్రశ్నలు-60 మార్కులు), సెక్షన్-3లో మాడ్యూల్-1లో కంప్యూటర్ నాలెడ్జ్ (15 ప్రశ్నలు-45 మార్కులు), సెషన్-2లో సెక్షన్-3లో మాడ్యూల్-2లో స్కిల్ టెస్ట్/టైపింగ్ టెస్ట్ నిర్వహిస్తారు.
- వివరాలకు వెబ్‌సైట్: www.ssc.nic.in

ఆర్ఆర్‌బీ..టెక్నికల్ ఉద్యోగాలు

ఇంటర్ అర్హతతో ఇండియన్ రైల్వేలోని గ్రూప్-సి ఉద్యోగాలను దక్కించుకోవచ్చు. ఇందుకోసం సెంట్రలైజ్డ్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ విడుదల చేస్తారు. కేవలం ఇంటర్‌తోనే కాకుండా పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా అర్హతతోనూ గ్రూప్-సి ఉద్యోగాల భర్తీ చేపడతారు. అసిస్టెంట్ లోకోపైలట్, టెక్నీషియన్ గ్రేడ్-3 పేరుతో పలు టెక్నికల్ విభాగాల్లో సబార్డినేట్ సర్వీస్ ఉద్యోగాలు గ్రూప్-సి పరిధిలోకి వస్తాయి. ఇంటర్మీడియెట్ అర్హతతో ట్రాఫిక్ అసిస్టెంట్, అకౌంట్స్ అసిస్టెంట్ కమ్ టికెట్ క్లర్క్, అకౌంట్స్ క్లర్క్ కమ్ టైపిస్ట్, జూనియర్ క్లర్క్ కమ్ టైపిస్ట్, జూనియర్ టైమ్ కీపర్ వంటి నాన్ టెక్నికల్ ఉద్యోగాలకు పోటీ పడొచ్చు.

- అసిస్టెంట్ లోకోపైలెట్, టెక్నీషియన్ పోస్టులకు ఉమ్మడిగా రెండు దశల్లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) ఉంటుంది.
- మొదటి దశలో జనరల్ అవేర్‌నెస్(40 ప్రశ్నలు), మ్యాథమెటిక్స్(30 ప్రశ్నలు), జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ (30 ప్రశ్నలు) విభాగాల్లో మొత్తం వంద మార్కులకు ఆన్‌లైన్ పరీక్ష జరుగుతుంది.
- మొదటి దశ పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా రెండో దశకు ఎంపిక చేస్తారు. రెండో దశలో జనరల్ అవేర్‌నెస్(50 ప్రశ్నలు), మ్యాథమెటిక్స్(35 ప్రశ్నలు), జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్(35 ప్రశ్నలు) విభాగాల్లో 120 ప్రశ్నలు ఉంటాయి.
- వివరాలకు వెబ్‌సైట్: https://indianrailways.gov.in/

త్రివిధ దళాల్లో కొలువులు వయా ఎన్‌డీఏ

- ఇంటర్మీడియెట్ అర్హతతో త్రివిధ దళాల్లో(ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్) పర్మనెంట్ కమిషన్ ర్యాంకుతో కొలువులు సొంతం చేసుకునే అవకాశం ఉంది. దీనికి మార్గం.. యూపీఎస్సీ నిర్వహించే నేషన్ డిఫెన్స్ అకాడమీ(ఎన్‌డీఏ)ఎగ్జామినేషన్. ఈ పరీక్షలో విజయం ద్వారా ఇండియన్ ఆర్మీ, ఎయిర్ ఫోర్స్, నేవల్ అకాడమీల్లో శిక్షణకు ఎంపికైతే.. కొలువుతోపాటు డిగ్రీ సర్టిఫికెట్ కూడా లభిస్తుంది. ఆర్మీ కేడెట్స్‌గా శిక్షణ పూర్తి చేసుకున్న వారికి బీఎస్సీ/బీఏ; నేవల్, ఎయిర్‌ఫోర్స్ కేడెట్‌గా శిక్షణ పొందిన వారికి బీటెక్‌తోపాటు పర్మనెంట్ కమిషన్డ్ ర్యాంకు హోదాతో త్రివిధ దళాల్లో కెరీర్ ప్రారంభమవుతుంది.
- ఎన్‌డీఏ నియామక ప్రక్రియ రెండు దశల్లో జరుగుతుంది. తొలిదశలో 900 మార్కులకు రాత పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో నిర్దేశిత కటాఫ్ మార్కులు పొందిన వారికి తదుపరి దశలో ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ విభాగాల ఆధ్వర్యంలోని సర్వీస్ సెలక్షన్ బోర్డులు మరో 900 మార్కులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయి. వీటిలో విజయం సాధించిన వారికి ఆయా అకాడమీల్లో క్యాడెట్ ట్రైనీలుగా అవకాశం కల్పిస్తారు.
- వివరాలకు వెబ్‌సైట్: www.upsc.gov.in

ఆర్మీ.. 10+2 టెక్నికల్ ఎంట్రీ స్కీమ్

- ఇంటర్ అర్హతతో అందుబాటులో ఉన్న మరో చక్కటి అవకాశం.. ఇండియన్ ఆర్మీలోని 10+2 టెక్నికల్ ఎంట్రీ స్కీమ్. ఇంటర్మీడియెట్ ఎంపీసీ గ్రూప్‌తో ఉత్తీర్ణత సాధించి.. జేఈఈ-మెయిన్‌లో ర్యాంకు పొందిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. వీరికి ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఎంపికైన అభ్యర్థులకు త్రివిధ దళాలకు చెందిన మిలటరీ అకాడమీలలో శిక్షణ ఇస్తారు. ఈ శిక్షణ పూర్తి చేసుకుంటే..ఎలక్ట్రానిక్స్, టెలికమ్యూనికేషన్స్, మెకానికల్, నావల్ ఆర్కిటెక్చర్, మెరైన్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లలో బీటెక్ డిగ్రీతోపాటు పర్మనెంట్ కమిషన్డ్ ర్యాంకుతో కెరీర్ ప్రారంభించొచ్చు. వీటికోసం ఇండియన్ ఆర్మీ, నేవీలు వేర్వేరుగా నోటిఫికేషన్లు విడుదల చేస్తాయి.

త్రివిధ దళాల్లో అగ్నివీర్

- ఇంటర్మీడియెట్ అర్హతతో త్రివిధ దళాల్లో అగ్నిపథ్ స్కీమ్ ద్వారా చేపడుతున్న అగ్నివీర్ నియామకాలకు పోటీపడొచ్చు. అగ్నివీర్ టెక్నికల్ పోస్టులను ఇంటర్ ఎంపీసీ ఉత్తీర్ణులతో భర్తీ చేస్తున్నారు. ఇందుకోసం రాత పరీక్ష నిర్వహిస్తారు. ఇంగ్లిష్, సైన్స్, మ్యాథమెటిక్స్, జనరల్ అవేర్‌నెస్ విభాగాల నుంచి 25 ప్రశ్నలు చొప్పున అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు చొప్పున 100 మార్కులకు పరీక్ష ఉంటుంది.
- నేవీలో.. అగ్నివీర్ ఎస్ఎస్ఆర్ (సీనియర్ సెకండరీ రిక్రూట్) పేరుతో.. ఇంటర్మీడియెట్ (ఎంపీసీ/బైపీసీ) తత్సమాన కోర్సు అర్హతగా నేవీలోని పలు విభాగాల్లో నియామకాలను ఖరారు చేస్తారు. ఇంటర్మీడియెట్‌లో ఎంపీసీ, బైపీసీ గ్రూప్ ఉత్తీర్ణతను అర్హతగా నిర్దేశించారు. ఎంపిక ప్రక్రియలో భాగంగా తొలిదశలో రాత పరీక్ష, మలిదశలో దేహ దారుఢ్య పరీక్షలు నిర్వహిస్తారు. రాత పరీక్ష.. నాలుగు విభాగాల్లో(ఇంగ్లిష్, సైన్స్, మ్యాథమెటిక్స్, జనరల్ అవేర్‌నెస్) వంద మార్కులకు ఉంటుంది. ప్రతి విభాగం నుంచి 25 ప్రశ్నలు అడుగుతారు.
- ఎయిర్‌ఫోర్స్‌లోనూ అగ్నివీర్ వాయు పేరిట టెక్నికల్ విభాగాల్లో ఎంపీసీ అర్హతతో ఉద్యోగాలను భర్తీ చేస్తున్నారు.

ఇండియన్ కోస్ట్ గార్డ్

- ఇంటర్మీడియెట్, పదో తరగతి అర్హతతో సుస్థిర కొలువు అందించే వేదిక.. ఇండియన్ కోస్ట్ గార్డ్. తీరగస్తీ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఇండియన్ కోస్ట్‌గార్డ్‌లో ఇంటర్మీడియెట్ అర్హతతో నావిక్ జనరల్ డ్యూటీ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవచ్చు.
- రాత పరీక్ష, ఫిజికల్ టెస్ట్, మెడికల్ టెస్ట్‌లలో నైపుణ్యం ఆధారంగా ఎంపిక చేస్తారు. ఎంపికైన వారికి ఐఎన్ఎస్ చిల్కాలో ప్రాథమికంగా శిక్షణ ఇస్తారు. ఇది విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి నియామకాలు ఖరారు చేస్తారు.
- వివరాలకు వెబ్‌సైట్: https://joinindiancoastguard.gov.in

రాష్ట్ర స్థాయిలో.. పోలీస్ కానిస్టేబుల్స్

రాష్ట్ర స్థాయిలో ఇంటర్మీడియెట్ అర్హతతో పోలీస్ కానిస్టేబుల్ పోస్టులు అందుబాటులో ఉంటాయి. కానిస్టేబుల్ పోస్టులకు మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. తొలి దశలో ప్రిలిమినరీ రాత పరీక్ష, రెండో దశలో ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, మూడో దశలో మెయిన్ ఎగ్జామినేషన్ ఉంటాయి.

తొలిదశ ప్రిలిమినరీ రాత పరీక్ష 200 మార్కులకు ఉంటుంది. ఇందులో నిర్దిష్ట కటాఫ్ మార్కులు పొందిన వారికి ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహిస్తారు. వీటిలో సత్తా చాటిన వారికి చివరగా మెయిన్ పరీక్ష 200 మార్కులకు ఉంటుంది. ఈ మూడు దశల్లోనూ విజేతలుగా నిలిచిన వారికి కానిస్టేబుల్‌గా కొలువు సొంతమవుతుంది.

సాక్షి మీడియా ఆధ్వర్యంలో ఎంసెట్, నీట్ విద్యార్థులకు మాక్‌టెస్టులు..

సాక్షి ఎడ్యుకేషన్: ఎక్కువ మంది విద్యార్థుల లక్ష్యం.. ఇంజనీరింగ్, లేదా మెడిసిన్. అధికశాతం మంది తల్లిదండ్రులు తమ పిల్లలకు ఉజ్వల భవిష్యత్‌ను అందించే ఇంజనీరింగ్/మెడికల్ కోర్సుల్లో చేర్పించాలని కోరుకుంటున్నారు. అందుకు ఖర్చులకు వెనుకాడకుండా పిల్లలను కోచింగ్‌లో చేర్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఉన్న మెడికల్ కళాశాలల్లో ప్రవేశానికి నిర్వహించే నీట్.. అలాగే తెలుగు రాష్ట్రాల్లో ఇంజనీరింగ్/అగ్రికల్చర్ తదితర కోర్సుల్లో అడ్మిషన్లు కల్పించే ఎంసెట్‌కు లక్షల మంది విద్యార్థులు సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు చేయూతనిచ్చేలా నిపుణుల ఆధ్వర్యంలో ఎంసెట్, నీట్ పరీక్షలకు సాక్షి మాక్‌టెస్టులు నిర్వహించనుంది. టెక్నాలజీ పార్టనర్‌గా మై ర్యాంక్ వ్యవహరిస్తోంది.

మూడు టెస్టులు.. మూడు రోజులు.. ఎప్పుడంటే?

పరీక్షకు కొద్ది రోజుల ముందు వాస్తవ పరీక్షలాంటి వాతావరణంలో జరిగే సాక్షి మాక్ టెస్టులు రాయడం ద్వారా విద్యార్థులు తమ ప్రిపరేషన్ స్థాయిని అంచనా వేసుకుని, ప్రిపరేషన్‌ను మరింత మెరుగుపరచుకోవచ్చు. ఆసక్తి గల అభ్యర్థులు https://www.arenaone.in/mock ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.350/–. రిజిస్ట్రేషన్‌కు ఏప్రిల్ 25 చివరి తేదీ. రిజిస్టర్ చేసుకున్న ఈమెయిల్‌కు పరీక్షకు సంబంధించిన హాల్ టికెట్ నెంబర్ వస్తుంది. ఒక్కో స్ట్రీమ్‌కు (ఇంజనీరింగ్, అగ్రికల్చర్, నీట్) మూడు టెస్టులు ఉంటాయి. ఈ పరీక్షలను మే 2, 3, 4 తేదీల్లో నిర్వహించనున్నారు. ఈ పరీక్షలను మీ యూజర్ నేమ్ హాల్ టికెట్ నెంబర్ (యూజర్ నేమ్), ఫోన్ నెంబర్ (పాస్‌వర్డ్)తో ఆ మూడు రోజుల్లో ఎప్పుడైనా లాగిన్ అయ్యి రాసుకోవచ్చు. అలాగే పరీక్ష ముగిసిన వెంటనే మీ స్కోర్‌ను కూడా చూసుకోవచ్చు. మాక్ పరీక్షలను https://sakshimocktest.myrank.co.in వెబ్‌సైట్‌లో నిర్వహిస్తారు. టెస్టుకి సంబంధించిన కీ ని 5న ఇదే వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చు. పూర్తి వివరాలకు సంప్రదించాల్సిన నెంబర్లు: 95055 14424, 96660 13544, 96665 72244.

మే రెండో వారంలో ఇంటర్ ఫలితాలు

పూర్తి కావచ్చిన మూల్యాంకనం

సాక్షి, హైదరాబాద్: వచ్చే నెల రెండో వారంలో ఇంటర్ పరీక్ష ఫలితాలు వెల్లడించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఒకవేళ ఆలస్యమైతే మూడో వారం ఫలితాలు ఇవ్వొచ్చని బోర్డ్ అధికారులు తెలిపారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు చెందిన దాదాపు 9 లక్షలకుపైగా విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రాశారు. మొత్తం 60 లక్షల జవాబు పత్రాలను అధ్యాపకులు మూల్యాంకన చేయాల్సి ఉంటుంది. రాష్ట్ర వ్యాప్తంగా 15 మూల్యాంకన కేంద్రాల్లో ఇప్పటికే ఈ ప్రక్రియ మొదలైంది. ఒక్కో అధ్యాపకుడు రోజుకు 30 సమాధాన పత్రాలకు మూల్యాంకన చేస్తున్నారు. ఎగ్జామినర్, చీఫ్ ఎగ్జామినర్, సబ్జెక్టు నిపుణుడు, స్క్రూటినైజర్ ... ఇలా నాలుగు దశల్లో మూల్యాంకనను పరిశీలించిన తర్వాత మార్కులు బోర్డ్‌కు చేరుతాయి. బోర్డ్‌లో క్రాస్ వెరిఫికేషన్ చేపట్టి తర్వాత డీ కోడింగ్ చేసి, సీజీజీకి డేటాను పంపుతారు. ఈ ప్రక్రియ వేగంగా సాగుతోందని ఇంటర్ పరీక్షల విభాగం అధికారి జయప్రదాభాయ్ తెలిపారు.

టీఆర్ఆర్ మెడికల్ కాలేజీ ఎంబీబీఎస్ సీట్ల రెన్యువల్

సాక్షి, హైదరాబాద్: మెదక్ జిల్లా పటాన్‌చెరులోని టీఆర్ఆర్ మెడికల్ కాలేజీలో 150 ఎంబీబీఎస్ సీట్లను రెన్యువల్ చేస్తూ ఎన్ఎంసీ ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు కాలేజీ డీన్‌కు లేఖ రాసింది. 2023–24 వైద్య విద్యా సంవత్సరంలో వాటిని భర్తీ చేసుకోవచ్చని స్పష్టం చేసింది. ఇది ఏడాది వరకే పరిమితమని పేర్కొంది.

కొత్తగా మూడు ప్రైవేట్ మెడికల్ కాలేజీలకు అనుమతి...

ఈ ఏడాది రాష్ట్రంలో మూడు కొత్త ప్రైవేటు మెడికల్ కాలేజీలకు ఎన్ఎంసీ అనుమతించింది. హైదరాబాద్‌లోని అరుంధతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ కాలేజీ, సీఎంఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, వరంగల్‌లోని ఫాదర్ కొలంబో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కాలేజీలు కొత్తగా అందుబాటులోకి రానున్నాయి. ఒక్కో కాలేజీలో 150 ఎంబీబీఎస్ సీట్లు 2023–24 వైద్య విద్యా సంవత్సరం నుంచి అందుబాటులోకి వస్తాయి. వరంగల్‌లోని ప్రతిమ రిలీఫ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో ప్రస్తుతం వంద సీట్లు ఉండగా, ఈ ఏడాది మరో 50 సీట్లకు అనుమతిచ్చింది. ఆర్‌వీఎం మెడికల్ కాలేజీలో 150 సీట్లు ఉండగా, మరో వంద సీట్లకు అనుమతిచ్చింది.

నిధులు సీసీఎస్‌లో జమ చేయండి

- సొంత అవసరాలకు వాడుకోవద్దు
- ఆర్టీసీకి హైకోర్టు ఆదేశం
- సొసైటీ కోలుకోలేని నష్టాల్లో ఉందని హితవు



సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ సిబ్బంది వేతనం నుంచి ప్రతి నెలా తీసుకున్న నిధులను ఉద్యోగుల సహకార పరపతి సంఘానికి (సీసీఎస్) జమ చేయాలని.. యాజమాన్యం వాటిని తన సొంత అవసరాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ వాడుకోకూడదని హైకోర్టు ఆదేశించింది. సొసైటీ తీవ్రమైన కష్టాలను ఎదుర్కొంటోందని, కోలుకోలేని నష్టాల్లో ఉందని గుర్తుంచుకోవాలని ఆర్టీసీ ఎండీ, చీఫ్ మేనేజర్‌కు స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఈ నెల 18కి వాయిదా వేసింది. సీసీఎస్‌కు జమ చేయాల్సిన నిధులను ఆర్టీసీ సొంతానికి వాడేసుకోవడంతో వడ్డీ సహా రూ.900 కోట్ల బకాయిలు ఏర్పడ్డాయి. ఫలితంగా ఉద్యోగులకు ఈ సంఘం ద్వారా మంజూరు చేయాల్సిన రుణాలు ఆగిపోయాయి. దీంతో బకాయిల్లో కొంత మొత్తం చెల్లించాలని ఆ సంఘం ఆర్టీసీని కోరుతున్నా స్పందన రాలేదు. దీంతో హైకోర్టును ఆశ్రయించింది. దీనిపై మంగళవారం న్యాయమూర్తి జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి విచారణ చేపట్టారు.

ప్రతినెలా జీతాల నుంచి కట్ చేస్తున్నా..

సీసీఎస్ తరఫున న్యాయవాది ఏకే జయప్రకాశ్‌రావు వాదనలు వినిపించారు. 'ఉద్యోగుల నుంచి ప్రతి నెలా నిధులు సేకరిస్తున్నారు. సిబ్బంది జీతాల నుంచి కట్ చేసిన మొత్తాన్ని సీసీఎస్ ఖాతాలో జమ చేయాల్సి ఉంది. కానీ ఆర్టీసీ వాటిని సొంతానికి వాడుకుంటోంది. ఇది సరికాదు. ఆ నిధులన్నీ సీసీఎస్ ఖాతాలో జమ చేసేలా ఆదేశాలు జారీ చేయాలి..'అని కోరారు. ఆర్టీసీ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. నిధుల విడుదల విషయంలో ప్రభుత్వంతో సంస్థ ఎండీ చర్చలు జరుపుతున్నారని చెప్పారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి.. ప్రతినెలా సీసీఎస్ ఖాతాల్లో నిధులు జమ చేయాలని ఆదేశించారు.

కార్మిక శాఖకు నోటీసులు

ఆర్టీసీ గుర్తింపు సంఘానికి ఎన్నికల నిర్వహణపై కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ కార్మిక అధికారులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. గుర్తింపు సంఘం ఎన్నికలు వెంటనే నిర్వహించేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ హైకోర్టును ఆశ్రయించింది. కార్మిక శాఖ ముఖ్య కార్యదర్శి, కార్మిక శాఖ కమిషనర్, ఆర్టీసీ ఎండీతో పాటు పలువురిని ప్రతివాదులుగా చేర్చింది. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నందా మంగళవారం విచారణ చేపట్టారు. అనంతరం ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ, విచారణను ఈ నెల 17వ తేదీకి వాయిదా వేశారు.

ఆర్టీసీకి శ్రీవారి దర్శన టికెట్ల కోటా తగ్గింపు

వెయ్యి నుంచి నాలుగొందలకు..

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ బస్సుల్లో తిరుమల తిరుపతికి వెళ్లే భక్తులకు జారీచేసే స్వామివారి దర్శన టోకెన్ల కోటా భారీగా తగ్గింది. ఇప్పటి వరకు టీఎస్ ఆర్టీసీకి రోజుకు వెయ్యి టోకెన్లు జారీ చేస్తూ రాగా ఇప్పుడా సంఖ్య 400కు కుదించారు. ఆర్టీసీ బస్సుల్లో తిరుమలకు వెళ్లే భక్తులు కోరుకుంటే, బస్సు టికెట్‌తోపాటు రూ.300 విలువైన స్వామివారి దర్శన టోకెన్‌ను గత ఏడాది నుంచి అందించేలా ఏర్పాట్లు చేశారు. అప్పట్లో కోవిడ్ ఆంక్షల నేపథ్యంలో మిగిలిపోయిన దివ్యదర్శనం టోకెన్లలో కొన్నింటిని టీఎస్ఆర్టీసీకి జారీ చేశారు. అయితే ఇప్పుడు మళ్లీ కాలినడక భక్తులకు పూర్తిస్థాయిలో దివ్యదర్శన టోకెన్లను పునరుద్ధరించినందున తమకు జారీ చేసే టోకెన్లను వెయ్యి నుంచి 400కి టీటీడీ తగ్గించినట్టు ఆర్టీసీ అధికారులు వెల్లడించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.